
సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


‘ప్రతి పల్లెలోనూ అందరికీ గ్యాస్ సరఫరా, ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా నా ధ్యేయం’

పేజీలు: 16+16+40 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 6.00 | సంపుటి: 10 సంచిక: 349

ఆదివారం 11-3-2018

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

SUNDAY Special



బంగ్లాదేశ్ సంచలనం

- స్పోర్ట్స్‌లో



రివాల్వర్ రాణి

- ఫ్యామిలీలో

‘స్ఫూర్తి సభ’ భగ్నం!


శనివారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు పెడుతున్న పోలీసులు

ట్యాంక్‌బండ్‌పై మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభను అడ్డుకున్న పోలీసులు

- హైదరాబాద్‌వ్యాప్తంగా భారీ బందోబస్తు..
- వాహనాల రాకపోకలపై నిషేధం
- ముందస్తు అరెస్టులు.. గృహ నిర్బంధాలు
- శుక్రవారం రాత్రే కోదండరాం ఇంటి వద్ద పోలీసుల మోహరింపు.. అరెస్టు సమయంలో హైడ్రామా
- సీపీఐ కార్యాలయం వద్దే చాడ, నేతల అరెస్టులు
- జిల్లాల నుంచి వస్తున్న వారిని శివార్లలోనే అడ్డగింత
- నిరంకుశ పాలనకు ఇది నిదర్శనం: కోదండరాం
- కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఇంత నిర్బంధమా?

- 2లో

‘రాజ్యసభ’... రసవత్తరం

రాష్ట్రంలో 3 సీట్లకు ఎన్నిక అనివార్యమైతే 23న పోలింగ్

- పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు సంకటం
- చట్టపరమైన చిక్కులు అధిగమించేదెలా..?
- కాంగ్రెస్ పోటీ ప్రకటనతో కేసీఆర్ అప్రమత్తం
- ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపై న్యాయ నిపుణులతో చర్చలు
- టీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించిన మజ్లిస్
- మిగిలిన పార్టీల వైఖరిపై నెలకొన్న ఆసక్తి



సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో రాజ్యసభ ఎన్నికలు రసవత్తరంగా మారుతున్నాయి. రాష్ట్రంలోని మూడు ఖాళీలకు ఎన్నికలు అనివార్యమైతే ఈ నెల 23న పోలింగ్ జరగనుంది. ఎమ్మెల్యేలు ఓటర్లుగా ఉన్న రాజ్యసభ ఎన్నికల్లో ప్రస్తుతమున్న ఎమ్మెల్యేల బలం ప్రకారం మూడు స్థానాలు టీఆర్ఎస్ ఖాతాలోనే పడనున్నాయి. ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్నిబట్టి రాజ్యసభ ఎన్నికలు ఇప్పటిదాకా ఏకగ్రీవం కావడం సంప్రదాయంగా వస్తోంది. ప్రస్తుతం టీఆర్ఎస్‌కు అధికారికంగా 65 మంది ఎమ్మెల్యేలు ఉండగా కాంగ్రెస్, టీడీపీ, వైఎస్సార్ కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఐ నుంచి కలిపి 25 మంది దాకా ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లోకి ఫిరాయించారు. ఒక్కో అభ్యర్థి గెలవడానికి కనీసం 30 ఓట్లకు తగ్గకుండా రావాలి. సాధారణ పరిస్థితుల్లో టీఆర్ఎస్‌కు సొంతంగా గెలుచుకున్న ఎమ్మెల్యేలు ఉంటే పోటీ పెద్ద విషయం కాదు. కానీ రాజ్యసభ ఎన్నికల్లో ప్రత్యేకమైన ఎన్నికల ప్రక్రియ ఉండటం, రాజ్యసభ ఎన్నికలకు పోటీ పెడుతున్నామని కాంగ్రెస్ ప్రకటించిన నేపథ్యంలో సీఎం కేసీఆర్ అప్రమత్తమయ్యారు.

ఓపెన్ బ్యాలెట్ ద్వారా ఎన్నికలు...

రాజ్యసభకు ఓపెన్ బ్యాలెట్ ద్వారా ఎన్నికలను నిర్వహిస్తారు. పోలింగ్ సందర్భంగా బూత్ వద్ద ఉన్న పార్టీల పోలింగ్ ఏజెంటుకు ఎమ్మెల్యేలు తాము వేసే ఓటును చూపించాల్సి ఉంటుంది. పార్టీ విప్‌ను ఉల్లంఘించి మరో పార్టీ అభ్యర్థికి వేసే ఓటు చెల్లకపోయే ప్రమాదముంది. పార్టీ విప్‌ను ఉల్లంఘించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటుకు అవకాశం లేదని న్యాయ నిపుణులు చెబుతున్నారు. దీంతో స్థూలంగా రాజ్యసభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై న్యాయ నిపుణులతో కేసీఆర్ లోతుగా చర్చిస్తున్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో ఎలాంటి వ్యూహం అనుసరిస్తే రాజ్యసభ ఎన్నికల్లో ఇబ్బందులు రాకుండా

మిగతా 2వ పేజీలో ▶

థర్డ్ కాదు... ఫస్ట్ ఫ్రంటే

కేంద్రంలో ప్రత్యామ్నాయ కూటమిపై మంత్రి కేటీఆర్

- సమాఖ్య స్ఫూర్తిని ప్రతిబింబించేలా కొత్త ప్రత్యామ్నాయం అవసరం
- అందుకు కేసీఆర్ శ్రీకారం చుట్టారు
- వచ్చే ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌లకు పూర్తి మెజారిటీ సాధ్యం కాదు
- బలమైన ప్రాంతీయ పార్టీలదే హవా
- ఢిల్లీలో 51వ స్కోచ్ సమ్మిట్‌కు హాజరు

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేయాలనుకుంటున్న కూటమిని థర్డ్ ఫ్రంట్ అనాల్సిన అవసరం లేదని, దాన్నే ఫస్ట్ ఫ్రంట్ అనొచ్చని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కె. తారక రామారావు పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలనను అందించలేని కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా సమాఖ్య స్ఫూర్తిని ప్రతిబింబించేలా మరో కూటమి రావాల్సిన అవసరం ఉందని గుర్తించి ఆ దిశగా ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుగా చర్చకు శ్రీకారం చుట్టారన్నారు. ముందుముందు ఈ ఫ్రంట్ ఎలా ఏర్పాటవుతుందన్నది వేచిచూడాల్సి ఉందని, దీనిపై దేశవ్యాప్తంగా విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. శనివారం ఢిల్లీలో ప్రారంభమైన 51వ స్కోచ్ సమ్మిట్‌లో పాల్గొన్న అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.



ప్రజాకాంక్షలు నెరవేర్చడంలో కాంగ్రెస్, బీజేపీ విఫలం...

వచ్చే సాధారణ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పూర్తి మెజారిటీ సాధించే పరిస్థితులు లేని నేపథ్యంలో బలమైన ప్రాంతీయ

మిగతా 2వ పేజీలో ▶

ఏప్రిల్ 1 నుంచి ఈ-వే బిల్లు అమలు

- జీఎస్టీ రిటర్నులకు జూన్ వరకు ప్రస్తుత విధానమే
- అక్టోబర్ 1 కల్లా రిఫండ్‌లకు ఈ–వ్యాలెట్
- జీఎస్టీ మండలి నిర్ణయాలు
- విలేకరుల సమావేశంలో అరుణ్ జైట్లీ వెల్లడి

- వివరాలు 5లో



వెనుకబడిన జిల్లాలకు బాసటగా..

వాటి అభివృద్ధికి పాటుపడి సామాజిక న్యాయం దిశగా అడుగులు వేద్దాం

పార్లమెంటు, అసెంబ్లీల చట్టసభ్యుల సదస్సులో ప్రధాని మోదీ

రాజకీయాలే సర్వస్వంగా భావించే రోజులు ఇప్పుడు లేవు

నిధులు కాదు.. పాలనా వైఫల్యాల వల్లే వెనుకబాటుతనం

- వివరాలు 5లో

రేపటి నుంచి అసెంబ్లీ

- తొలి రోజు ఉభయ సభల సంయుక్త సమావేశం
- ఉదయం 10 గంటలకు గవర్నర్ ప్రసంగం
- మధ్యాహ్నం బీఏసీ భేటీ.. అసెంబ్లీ నిర్వహణ రోజుల ఖరారు
- 15న రాష్ట్ర వార్షిక బడ్జెట్.. నేడు టీఆర్ఎస్ఎల్పీ భేటీ
- సభా వ్యూహంపై దిశానిర్దేశం చేయనున్న సీఎం



- 6లో

18 నుంచి భద్రాచలంలో తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు

మంత్రులు తుమ్మల, ఇంద్రకరణ్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 1 వరకు శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. ఎర్రమంజిల్ ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవం, శ్రీరామ మహాపట్టాభిషేకోత్సవంపై తెలుగు, హిందీ భాషల్లో రూపొందించిన పోస్టర్లు, ఆహ్వాన పత్రికలను మంత్రులిద్దరూ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఈనెల 26న శ్రీ సీతారాముల తిరుకల్యాణోత్సవానికి ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి సతీ సమేతంగా పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారని తెలిపారు. 27న శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి పర్యవేక్షణలో మహాపట్టాభిషేకోత్సవం, రథోత్సవం జరుగుతాయన్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పాల్గొంటారని, వీటి నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ప్రభాకర్ శ్రీనివాస్, ఖమ్మం డీసీసీబీ చైర్మన్ మువ్వనేని విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏఈ.. అయోమయమోయీ

ట్రాన్స్‌కో పోస్టుల భర్తీలో గందరగోళం

- స్థానికేతరులంటూ పెద్ద సంఖ్యలో అభ్యర్థుల దరఖాస్తుల తిరస్కరణ
- రాష్ట్ర అభ్యర్థులకు అందని హాల్‌టికెట్లు
- తెలంగాణవాసులైనా వేర్వేరు ప్రాంతాల్లో చదువులే కారణం
- ఫిర్యాదు చేసిన వారికే ప్రత్యేకంగా హాల్‌టికెట్ల జారీ
- పరీక్ష నేడే.. కొందరికి ఇంకా అందని హాల్‌టికెట్లు

16 లో

Dwaraka

పారాలింపిక్స్‌లో ఆల్పైన్ స్కీయింగ్, బయాథ్లాన్, క్రాస్ కంట్రీ స్కీయింగ్, పారా ఐస్ హాకీ, స్నో బోర్డింగ్, వీల్ చెయిర్ కర్లింగ్ వంటి క్రీడలు ఉంటాయి.





మగ్దూంభవన్ వద్ద సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు



ట్యాంక్‌బండ్ సమీపంలో పీవోడబ్ల్యూ, న్యూడెమోక్రసీ నేతలు సంధ్య, అనురాధ, సరళలను అడ్డుకుంటున్న పోలీసులు



విమలక్కను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

'స్ఫూర్తి సభ' భగ్నం!

ట్యాంక్‌బండ్‌పై మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభను అడ్డుకున్న పోలీసులు • ట్యాంక్‌బండ్, పరిసర ప్రాంతాలు దిగ్బంధం

- ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం: కోదండరాం
- రాష్ట్ర సమస్యలపై ఢిల్లీలో ధర్నా చేస్తామని కేసీఆర్ అంటారు..
- ఇక్కడ అలాంటి స్వేచ్ఛ మాకూ ఉందని గుర్తు లేదా.. అని నిలదీత
- ఈ అప్రజాస్వామిక వైఖరిని కోర్టులోనే తేల్చుకుంటామని వెల్లడి
- కేసీఆర్ నిర్బంధాలతో ఏం సాధిస్తారు: చాడ
- నైతిక విజయం టీజేఏసీ, సీపీఐ, ప్రజా సంఘాలదేనని వ్యాఖ్య



తార్నాకలోని నివాసం వద్ద కోదండరాంను అరెస్టు చేసి తీసుకెళుతున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్:

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఊపునిచ్చిన 'మిలియన్ మార్చ్'ను, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గుర్తు చేసుకోవడానికి.. తెలంగాణ జేఏసీ చేపట్టిన మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభను పోలీసులు భగ్నం చేశారు. శనివారం ఉదయం నుంచే ట్యాంక్‌బండ్‌ను, పరిసర ప్రాంతాలను పూర్తిగా స్వాధీనంలోకి తీసుకున్నారు. సాయంత్రం వరకు వాహనాల రాకపోకలను కూడా నిషేధించారు. టీజేఏసీ చైర్మన్ కోదండరాం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్‌లతోపాటు టీజేఏసీ నాయకులు, కార్యకర్తలు, సీపీఐ, న్యూడెమోక్రసీ, అరుణోదయ, పీవోడబ్ల్యూ, తదితర వామపక్ష ప్రజాసంఘాలకు చెందిన వందలాది మంది నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభకు తరలివస్తున్న వారిని హైదరాబాద్ శివార్లలోనే అదుపులోకి తీసుకున్నారు.

ముళ్ల కంచెలు.. బారికేడ్లు..

మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభకు ప్రభుత్వం అనుమతి నిరాకరించడం, అయినా సభ జరిపి తీరుతామని టీజేఏసీ, సీపీఐ, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, తెలంగాణ ప్రజాఫ్రంట్, అరుణోదయ తదితర పార్టీలు, ప్రజాసంఘాలు ప్రకటించడంతో పోలీసులు భారీగా మోహరించారు. ట్యాంక్‌బండ్‌పైకి ఎవరూ వెళ్లకుండా మార్గాలన్నింటినీ మూసేశారు. అన్ని చోట్లా ఇనుప కంచెలు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. ట్యాంక్‌బండ్‌కు ఇరువైపులా లిబర్టీ, ఇందిరాపార్కు, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు, సుందరయ్య విజ్ఞాన కేంద్రం తదితర ప్రాంతాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

దూసుకొచ్చిన ఉద్యమకారులు

పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినా.. పలువురు టీజేఏసీ నాయకులు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు, పీవోడబ్ల్యూ సంధ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి అనురాధ, పీవోడబ్ల్యూ నగర అధ్యక్షురాలు సరళ తదితరులు ట్యాంక్‌బండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వరకు చేరుకున్నారు. అది గమనించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. దీంతో తీవ్రస్థాయిలో వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. ఇదే సమయంలో మరో వైపు నుంచి పీడీఎస్‌యూ విద్యార్థులు ట్యాంక్‌బండ్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారందరినీ అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. టీజేఏసీ హైదరాబాద్ అధ్యక్షుడు సత్యంగౌడ్, న్యూడెమోక్రసీ రాయల వర్గ నాయకురాలు రమ, ఎస్ఎల్ పద్మ, అరుణ తదితరులను తెలుగు తల్లి విగ్రహం వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఇక టీజేఏసీ స్ఫూర్తి సభకు మద్దతు ప్రకటించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను పోలీసులు గృహనిర్బంధం చేశారు. అక్కడికి వచ్చిన ఎమ్మార్పీఎస్, ఇతర ప్రజా సంఘాల నేతలను అరెస్టు చేశారు.

కోదండరాం నివాసం వద్ద హైడ్రామా

టీజేఏసీ మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభకు ప్రభుత్వం అనుమతి నిరాకరించడంతో.. పోలీసులు శుక్రవారం రాత్రి నుంచే టీజేఏసీ చైర్మన్ కోదండరాం ఇంటిని చుట్టుముట్టారు. పరిసర ప్రాంతాల్లో మోహరించారు. కోదండరాంను కలసి స్ఫూర్తి సభకు వెళ్లేందుకు అక్కడికి వచ్చిన జేఏసీ నాయకులు, విద్యార్థి నాయకులను అరెస్టు చేశారు. ఇక మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో కోదండరాంను అరెస్టు చేసేందుకు హైడ్రామా నడిపించారు. కోదండరాం నివాసం పక్కనే ఉన్న మరో ఇంట్లోకి వెళ్లిన పోలీసులు.. అక్కడి నుంచి కోదండరాం ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో పోలీసులను దారి మళ్లించేందుకు టీజేఏసీ కార్యకర్త ఒకరు కోదండరాం ఇంటి ప్రహరీ గోడ దూకి వెళుతున్నట్టుగా పారిపోయారు. అది చూసి హైరానా పడిన పోలీసులు.. ఆయనను పట్టుకునేందుకు పరుగులు తీశారు. అయితే పోలీసుల తీరుపై మండిపడిన కోదండరాం.. పలువురు జేఏసీ నాయకులతో కలసి తన ఇంటికి తాళం వేసుకుని స్వీయ నిర్బంధం ప్రకటించుకున్నారు. కానీ మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇంట్లోంచి బయటకు రావడంతో అరెస్టు చేశారు.

నిరంకుశ పాలనకు నిదర్శనమిది

కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతోందని టీజేఏసీ చైర్మన్ కోదండరాం మండిపడ్డారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. అప్రజాస్వామికంగా నిర్బంధిస్తూ, అరెస్టులు చేస్తున్నారని పేర్కొన్నారు. పాలకుల వైఖరిని కోర్టులోనే తేల్చుకుంటామని చెప్పారు. కోదండరాం అరెస్టుకు ముందు తన నివాసంలో, అరెస్టు తర్వాత బొల్లారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ''మేమే తెలంగాణ తెచ్చినం, మా ఇష్టమున్నట్టుగా పాలన సాగిస్తాం..అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రజలపై ఇంత నిర్బంధమా.? 2011లో ఎన్ని ఆంక్షలున్నా మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేశాం. తెలంగాణ వచ్చాక ప్రభుత్వమే మిలియన్ మార్చ్ స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఇంతకాలం ఎదురు చూశాం. ఆ దిశగా ప్రభుత్వం స్పందించకపోవడంతోనే.. మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభను ఏర్పాటు చేశాం. కానీ ప్రభుత్వం ఈ స్ఫూర్తి సభకు అనుమతి నిరాకరించడం నిరంకుశ పాలనకు నిదర్శనం..''అని కోదండరాం మండిపడ్డారు. మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభ సీఎం కేసీఆర్‌కు ఇష్టం లేదని, అందుకే రెండు రోజుల నుంచి ముందస్తు అరెస్టులు చేశారని చెప్పారు. వేల మంది నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేశారని.. అప్రజాస్వామికంగా కొనసాగుతున్న అరెస్టులపై కోర్టును ఆశ్రయిస్తామని, పాలకుల వైఖరిని కోర్టులోనే తేల్చుకుంటామని చెప్పారు.

మాకూ అలాంటి స్వేచ్ఛ ఉంది

సీఎం కేసీఆర్ తొలి నుంచీ తనను ప్రశ్నించే వారిపట్ల నిరంకుశ వైఖరిని ప్రదర్శిస్తున్నారని కోదండరాం ఆరోపించారు. రాష్ట్ర సమస్యలపై ఢిల్లీలో ధర్నా చేసేందుకు సీఎం కేసీఆర్‌కు ఎలాంటి స్వేచ్ఛ ఉందో.. స్ఫూర్తి సభలో పాల్గొనేందుకు తమకూ అలాంటి స్వేచ్ఛ ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబించడం సరికాదన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గుర్తు చేయడానికి తాము తలపెట్టిన స్ఫూర్తి సభ విజయవంతమైందన్నారు. 2011లో తనను అరెస్టు చేసి బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారని, ఇప్పుడూ అక్కడికే తీసుకొచ్చారని గుర్తు చేసుకున్నారు.

రాష్ట్రంలో నియంత పాలన: చాడ

రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నియంత పాలన సాగిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. మిలియన్ మార్చ్ స్ఫూర్తి కార్యక్రమంలో పాల్గొనేందుకు ట్యాంక్‌బండ్‌కు బయలుదేరిన ఆయనను.. పార్టీ కార్యాలయం మగ్దూంభవన్ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా కేసీఆర్ వ్యవహరిస్తున్నారని.. అక్రమ అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. టీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ఈ నిర్బంధాలతో ఏం సాధిస్తారని కేసీఆర్‌ను ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది సీపీఐ కార్యకర్తలను ముందస్తు అరెస్టులు చేశారని.. వారికి రాత్రి నుంచి తిండి కూడా పెట్టకుండా బాధ పెట్టారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అవసరమైన సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఇప్పుడు అవసరం లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్బంధం విధించినా.. నైతికంగా సీపీఐ టీజేఏసీలే గెలిచాయని వ్యాఖ్యానించారు.



తనను అరెస్టు చేయడంపై పోలీసులను నిలదీస్తున్న సీపీఐ ఏపీ కార్యదర్శి రామకృష్ణ

నన్నెందుకు అరెస్టు చేశారు?

పోలీసులను నిలదీసిన సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

శనివారం మగ్దూంభవన్ వద్ద సీపీఐ నేతలు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఏదో పని నిమిత్తం కార్యాలయానికి వచ్చిన సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను కూడా అరెస్టు చేశారు. దీంతో ఆయన పోలీసులను నిలదీశారు. ''మా పార్టీ ఉమ్మడి కార్యాలయం ఇక్కడే ఉంది. ఓ పని నిమిత్తం నేను ఇక్కడికి వచ్చాను. నన్నెందుకు అరెస్ట్ చేస్తున్నారు..''అని రామకృష్ణ ప్రశ్నించారు. ప్రజల ఆకాంక్షలతో వచ్చిన తెలంగాణలో పోలీసు నిర్బంధం ఇంతగా ఉండడం విచారకరమని వ్యాఖ్యానించారు. కాగా.. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా కల్పించాలంటూ పెద్ద ఉద్యమం జరుగుతోందని.. దేశంలోని పలు పార్టీలు కూడా మద్దతిస్తున్నాయని రామకృష్ణ తెలిపారు. టీడీపీ ఎన్డీయేతో ఉన్న బంధాన్ని పూర్తిగా తెంచుకుని బయటకు వచ్చి.. హోదాపై పోరాటం చేయాలని పేర్కొన్నారు.

'రాజ్యసభ'... రసవత్తరం

▶ మొదటి పేజీ తరువాయి



ఉంటాయనే దానిపై మార్గాలను అన్వేషిస్తున్నారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేల సంకటం...

రాజ్యసభ ఎన్నికల్లో ఓపెన్ బ్యాలెట్ విధానం ఫిరాయింపు ఎమ్మెల్యేలలో ఆందోళన కలిగిస్తోంది. కాంగ్రెస్, టీడీపీ నుంచి ఎక్కువ ఫిరాయింపులు ఉండటం, కాంగ్రెస్ పోటీలో ఉన్న నేపథ్యంలో ఆ పార్టీ విప్‌ను అనివార్యంగా జారీ చేస్తుంది. టీడీపీ ఎమ్మెల్యేల విషయంలోనూ పలు ఇబ్బందులు ఉన్నాయి. టీడీఎల్పీ విలీనం అయినట్టుగా స్పీకర్ కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. అయినా సాంకేతికంగా ఈ విలీనం ప్రకటన చెల్లదని టీడీపీ వాదిస్తోంది. బీఎస్పీ నుంచి పెద్దగా సాంకేతిక ఇబ్బందులు ఏమీ ఉండకపోవచ్చు. కాకుంటే సీపీఐ నుంచి తీవ్రమైన ప్రతిఘటన ఉండే అవకాశముంది. మిగిలిన ఫిరాయింపుదారుల విషయంలో ఇంకా అస్పష్టత నెలకొంది. రాజ్యసభ ఎన్నికల విషయంలో టీడీపీ వైఖరి ఏమిటనేది ఇంకా తేలలేదు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించినా టీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించినా టీడీపీ తీసుకునే నిర్ణయం కూడా రాజ్యసభ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉందని అంటున్నారు. ఇప్పుడు ఏ పార్టీ ఎవరికి మద్దతు ప్రకటిస్తుందో అనే అంశాన్ని బట్టి భవిష్యత్తు రాజకీయ సమీకరణాలు కూడా ఉంటాయనేది తేలనుంది. మరోవైపు రాజ్యసభ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తామని మజ్లిస్ ప్రకటించింది. ఏడుగురు ఎమ్మెల్యేల బలమున్న మజ్లిస్ ఎమ్మెల్యేల మద్దతు టీఆర్ఎస్‌కు ఈ సమయంలో కీలకంగా ఉపయోగపడనుంది.

శ్రీవారి ఆలయానికి హెర్బల్ సొబగులు

రాతి ప్రాకారాలు, మండపాలు సహజత్వం కోల్పోకుండా హెర్బల్ మిశ్రమాలతో మెరుగులు

సాక్షి, తిరుమల: కోట్లాది మంది భక్తుల కొంగుబంగారమైన తిరుమలేశుని ఆలయాన్ని మరింత శోభాయమానంగా తీర్చిదిద్దడానికి అధికారులు సిద్ధమయ్యారు. సంప్రదాయ హెర్బల్ మిశ్రమాలతో ఆలయ ప్రాకారాలను, మండపాలకు మెరుగులు దిద్దుతున్నారు. ఆలయ రాతి ప్రాకారాలు, రాతి మండపాల్లో పేరుకుపోయిన దుమ్ము, ధూళి, మసి, పాచిని పోగొట్టి నిర్మాణాలకు సహజత్వం, వన్నె తీసుకొచ్చేలా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శ్రీకారం చుట్టింది.

మసిబారిన రాతి నిర్మాణాలు

శ్రీవారి ఆలయంలో ధూపదీప హారతి, అఖండ దీపారాధనలతో రాతి ప్రాకారాలు, మండపాలు పొగ, మసి అంటుకుని నల్లబారాయి. వీటితోపాటు వాతావరణ పరిస్థితులతో పాచి, దుమ్ము చేరింది. ఫలితంగా రాతి నిర్మాణాల రూపం మారి శిల్ప సౌందర్యం కళ తప్పింది.

తమిళనాడు ఆలయాల్లో హెర్బల్ క్లీనింగ్

తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం అక్కడి ఆలయాల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఆలయ రాతి ప్రాకారాలు, మండపాలకు సహజత్వాన్ని తీసుకొచ్చేందుకు సంప్రదాయ వనమూలికలు, విత్తనాల ఔషధ మిశ్రమాలను వినియోగిస్తోంది. ఇటీవల టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ శ్రీరంగం క్షేత్రాన్ని సందర్శించారు. అక్కడ చేపట్టిన హెర్బల్ క్లీనింగ్‌ను పరిశీలించి టీటీడీ ఆలయాల్లోనూ ప్రవేశపెట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ హెర్బల్ క్లీనింగ్ విధానాన్ని ముందు తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో చేపట్టగా మంచి ఫలితాలు వచ్చాయి. దీంతో శ్రీవారి ఆలయంలోనూ అమలుకు శ్రీకారం చుట్టారు. తొలుత మహాద్వారం ఎడమవైపున పనులు చేపట్టి హెర్బల్ మిశ్రమ లేపనంతో శుద్ధి చేశారు. నీటితో కడిగి, మళ్లీ లేపనం చేశారు. దీంతో రాతి ప్రాకారం సహజత్వంతో శోభాయమానంగా కనిపిస్తోంది.

ఆలయ భద్రతకు టీటీడీ ప్రాధాన్యత

తిరుమల ఆలయ ప్రాకారాలు, గోపురాల స్థితిగతులు అధ్యయనం చేసేందుకు టీటీడీ అధిక ప్రాధాన్యత ఇచ్చింది. మాజీ ఈవో ఏపీవీఎన్ శర్మ నేతృత్వంలో చెన్నై జియోమెరైన్ సంస్థ నిపుణుడు సీవీ ప్రసాద్, ఐఐటీ ప్రొఫెసర్ నరసింహారావు ఆధ్వర్యంలోని బృందాలు తిరుమల ఆలయాన్ని సందర్శించాయి. గ్రౌండ్ పెనిట్రేషన్ రోటరీ డ్రిల్లింగ్ యంత్రంతో 10 మీటర్ల లోతులో ఆలయ అంతర పొరల్లోని మట్టిని సేకరించి పరిశీలించారు. పలుచోట్ల భూమి పొరల్లోని లీకేజీలను గుర్తించి గ్రౌటింగ్ పద్ధతిలో సిమెంట్, రసాయన పదార్థాలను పంపి సరిచేశారు.

థర్డ్ కాదు... ఫస్ట్ ఫ్రంటే

▶ మొదటి పేజీ తరువాయి

పార్టీలు తమ హవా కొనసాగించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు ఎన్నో అవకాశాలు ఇచ్చారని, అయితే ఆ రెండు పార్టీలు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. దేశంలో ఒకవైపు విద్యుత్ మిగులు ఉందని చెబుతూనే మరోవైపు ఎన్నో గ్రామాలకు విద్యుత్ సదుపాయం లేదన్నారు. దేశవ్యాప్తంగా వివిధ నదుల్లో 75 వేల టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నా వ్యవసాయానికి నీరందే పరిస్థితి లేదన్నారు. బహుముఖ పార్టీ వ్యవస్థ ఉన్న భారత్‌లో కేవలం రెండు పార్టీల మధ్యే ఎన్నికలను పోటీగా భావించడం సరికాదన్నారు. గత 70 ఏళ్లలో కాంగ్రెస్, బీజేపీలు కేంద్రంలో అధికారంలో ఉండి రాష్ట్రాలపై చేసిన పెత్తనంపై విస్తృత చర్చ జరగాలన్నారు. కేంద్రం గత నాలుగేళ్లలో తెలంగాణకు ఇచ్చిన రూ. 81 వేల కోట్లు కూడా కేంద్ర వాటా కింద ఇచ్చినదేనని, ఒక్క రూపాయి కూడా అదనంగా ఇవ్వలేదన్నారు. కనీసం విభజన చట్టంలోని హామీలను సైతం కేంద్రం అమలు చేయలేకపోయిందని విమర్శించారు. దీనిపై ప్రధాని, కేంద్ర మంత్రులను ఎన్నిసార్లు కలసి విన్నవించినా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. రాష్ట్రాలు బలంగా ఉంటేనే దేశం పురోగతి సాధిస్తుందన్న విషయాన్ని పట్టించుకోకుండా కేంద్రం సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోందని కేటీఆర్ విమర్శించారు.

ఎన్డీయేలో మిగిలేది బీజేపీయే...

ఎన్డీయే కూటమి నుంచి మిత్రపక్షాలు ఒక్కొక్కటిగా బయటకు వెళ్లిపోతున్న నేపథ్యంలో ఆ కూటమిలో చివరకు మిగిలేది ఒక్క బీజేపీయేనని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాష్ట్రాలపై పెత్తనం చెలాయించాలని చూస్తున్న కేంద్రం వైఖరికి నిరసనగా ఎన్డీయే నుంచి ఇప్పటికే శివసేన వైదొలగిందని, హామీలు అమలు చేయలేదని టీడీపీ కూడా కేంద్ర మంత్రులను ఉపసంహరించుకుందన్నారు. ఇక ఎన్డీయేలో ఏమాత్రం ప్రభావం చూపలేని అకాలీదళ్ లాంటి పార్టీలు మాత్రమే ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రత్యామ్నాయ కూటమి అవసరం ఎంతైనా ఉందని గ్రహించి కేసీఆర్ ఈ విషయంలో ముందుకు సాగుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు.

మూడు 'ఐ'లు... అభివృద్ధి మంత్రాలు..

రాష్ట్రాల పటిష్టతపై ఆధారపడ్డ దేశాభివృద్ధికి మూడు 'ఐ'లు ఎంతో ప్రాధాన్యం కలిగి ఉన్నాయని కేటీఆర్ తెలిపారు. స్కోచ్ 51వ సమ్మిట్‌లో ఆయన ప్రసంగిస్తూ.. ఇన్‌క్లూజివ్ గ్రోత్ (సమ్మిళిత వృద్ధి), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ (మౌలిక సదుపాయాల అభివృద్ధి), ఇన్నోవేషన్ (సృజనాత్మక ఆవిష్కరణ) అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇదే మంత్రాన్ని అనుసరించి అన్ని రంగాల్లో వృద్ధి సాధిస్తోందన్నారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్, రైతులకు వ్యవసాయ పెట్టుబడి, మెరుగైన పారిశ్రామిక విధానంతో కేసీఆర్ పాలన అందిస్తున్నారని కేటీఆర్ చెప్పారు.



సాఫ్రిన్ సంస్థ ప్రతినిధులతో మంత్రి కేటీఆర్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కేంద్ర మంత్రి సురేశ్‌ప్రభు

సాఫ్రిన్ ఏరోస్పేస్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూ...

స్కోచ్ సమ్మిట్‌లో భాగంగా భారత్, ఫ్రాన్స్‌ల మధ్య జరిగిన భాగస్వామ్య ఒప్పందాల సమావేశంలో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. విమానాల్లో ఎలక్ట్రికల్ పరికరాలు తయారీ చేసే సాఫ్రిన్ ఏరోస్పేస్ సంస్థతో ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అవగాహనా ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. కేంద్ర మంత్రులు సురేశ్ ప్రభు, ఆర్.కె. సింగ్, మంత్రి కేటీఆర్ సమక్షంలో సాఫ్రిన్ సంస్థ సీఈవో, ఐటీశాఖ కార్యదర్శి జయేశ్ రంజన్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. సాఫ్రిన్ సంస్థ ఇక నుంచి హైదరాబాద్ వేదికగా తన ఉత్పత్తులను ప్రారంభించనుంది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని పారిశ్రామిక ప్రాంతంలో సాఫ్రిన్ సంస్థ పరిశ్రమ ఏర్పాటు చేయనుందని మంత్రి కేటీఆర్ మీడియాకు తెలిపారు.

ఇదం జగత్



వెళ్తారట గానీ... జెడ్ సెక్యూరిటీ కల్పించమంటున్నార్సార్!

సాక్షి
రాష్ట్రీయం
నల్లగొండ
ఆదివారం । మార్చి । 11 । 2018

అంతకుముందు రకరకాల స్థాయిల్లో జరిగినప్పటికీ.. అధికారికంగా తొలి పారా ఒలింపిక్స్ 1960లో రోమ్‌లో జరిగాయి.



నావ.. మునగదిక..!



ఇలాంటి షిప్ ముందే తయారై ఉంటే 'టైటానిక్' మునగకపోయి ఉండేదేమో..! 'టైటానిక్' అనే ఓ అద్భుతమైన సినిమా వచ్చి ఉండకపోవచ్చేమో..! ఇలా ఎందుకు అంటున్నామంటే.. ఈ ఫొటోలో ఉన్న షిప్ పేరు 'థండర్ చైల్డ్'. సముద్రాల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు మనుషులను వెతికి ప్రాణాలు కాపాడేందుకు దీన్ని వినియోగిస్తారు. దీని ప్రత్యేకత ఏంటంటే ఇది నీటిలో అస్సలంటే అస్సలు మునగదు. ఆఖరికి బోల్తా కొట్టినా కూడా నీటిలో మునిగిపోదు! అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించేందుకు వీలుగా ఐర్లండ్ నేవీ ఈ షిప్‌ను తయారు చేసింది. సేఫ్ హెవెన్ మెరైన్ అనే ఐరిష్ కంపెనీ దీన్ని అభివృద్ధి పరిచింది. ఇది సముద్రంలో గంటకు 62 మైళ్ల వేగంతో దూసుకుపోగలదు. 10 మంది ప్రయాణించేందుకు వీలున్న ఈ షిప్‌ను సముద్రంలోని బలమైన ఆటుపోటులను తట్టుకునేలా తయారు చేశారు. ఇందులోని కేబిన్ లోపల ఎప్పుడూ గాలి నింపి మునిగిపోకుండా చేశారు. అంటే ఒక రకంగా మన టైర్లలో ఎప్పుడూ గాలి ఉండాలి కదా అలా అన్నమాట.

తిప్పాడు.. రికార్డు కొట్టాడు



చిన్నప్పుడు సైకిల్ టైర్‌ను నడుం చుట్టూ తిప్పుతూ ఆటలు ఆడిన విషయం గుర్తు ఉండే ఉంటుంది. అలాంటి రింగును హూలా హూప్ అంటారు. టీవీల్లో, సర్కస్‌ల్లో కొందరు ఇలా తిప్పుతూ ఉండటం కూడా చూసే ఉంటారు. అలాగే దీన్ని నడుం చుట్టూ తిప్పుతూ జపాన్‌కు చెందిన ఓ వ్యక్తి గిన్నిస్ రికార్డు సాధించాడు. యుయా యమడా అనే ఆయన వీధుల్లో ఇలాంటి ఫీట్లు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. అతడిని అందరూ 'హూప్ మ్యాన్' అని ముద్దుగా పిలుచుకుంటారు. ఇటీవల 5.14 మీటర్ల (16 అడుగుల 10 అంగుళాల) వ్యాసం ఉన్న పెద్ద రింగును అవసరం ఉన్న మూడు కన్నా ఎక్కువ సార్లు నడుం చుట్టూ తిప్పుతూ ఈ రికార్డు సాధించాడు. ఇది అనుకున్నంత సులువైన పనేం కాదు.. గిన్నిస్ బుక్ నిర్వాహకులు పెట్టిన ఎన్నో కఠినమైన నిబంధనలను దాటుకుని వెళ్లాలి. రికార్డు సాధించడం యమడాకు తొలిసారేం కాదు.. ఇప్పటికే ఓ సారి 4.93 మీటర్లున్న రింగును తిప్పు తూ ప్రపంచ రికార్డు సాధించాడు. అయితే ఆ తర్వాత ఆశ్రిత ఫర్మన్ అనే వ్యక్తి 5.04 మీటర్లతో రికార్డు తిరగరాశాడు. ఈ రికార్డును ఎలాగైనా దాటేయాలనే సంకల్పంతో గతేడాది నుంచి శ్రమించిన యమడా.. ఎట్టకేలకు అనుకున్నది సాధించాడు.

'పెట్టీ'దారుల పీచమణిచేస్తారు!

ఆధార్ ఆధారంగా 'ఉల్లంఘనుల'గుర్తింపు

- పదేపదే పోలీసులకు పట్టుబడితే ఇక జైలుకే..
- ప్రత్యేక యాప్ రూపొందించిన నగర పోలీసులు
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలుకు నిర్ణయం



నిర్దేశించిన సమయంలో దుకాణాలు, వ్యాపార సంస్థలు మూసేయాల్సిందే. అయినా తెరిచే ఉంటాయి..

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నిషేధం.. అయినా వైన్ షాపుల పక్కన కానిచ్చేస్తుంటారు..

ముందస్తు అనుమతి లేనిదే ఎలాంటి నిరసనలు చేపట్టకూడదు.. అయినా రోడ్లకు అడ్డం పడుతుంటారు..

రహదారులు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించడం తీవ్ర ఉల్లంఘనే. అయితేనేం ఎక్కడికక్కడ ఇదే సీన్..

సాక్షి, హైదరాబాద్

..ఇవన్నీ చిన్న విషయాలుగానే కనిపించినా.. వీటి వల్ల ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ప్రతి నగరం, పట్టణంలో తరచూ వెలుగులోకి వచ్చే ఈ తరహా వ్యవహారాలను పోలీసు పరిభాషలో పెట్టీ, న్యూసెన్స్ కేసులుగా పిలుస్తుంటారు. ఇతరులకు ఇబ్బందికరంగా ఉన్నా వీరిపై భారత శిక్షాస్మృతి(ఐపీసీ) కింద కేసు నమోదు చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడానికి అవకాశం లేదు. దీంతో ఈ తరహా నేరాల కట్టడికి రాష్ట్ర పోలీసు విభాగం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఆధార్ ఆధారం గా పని చేసే ఈ యాప్ పేరు 'ఈ–పెట్టీ కేస్'.

స్థానిక చట్ట పరిధిలోకి మాత్రమే..

పెట్టీ, న్యూసెన్స్ కేసులపై ఫిర్యాదు వచ్చినా, పోలీసుల కంటపడినా కఠినంగా వ్యవహరించే అవకాశం ఉండేది కాదు. దీంతో నగర పోలీసు చట్టాలు, టౌన్ యాక్ట్‌లను అనుసరించి జరిమానా విధించి పంపేసేవారు. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు పదేపదే రెచ్చిపోతున్నట్లు పోలీసు విభాగం గుర్తించింది. ఇలాంటి వారికి చెక్ పెట్టడానికి 'ఈ–పెట్టీ కేస్'యాప్ రూపొందించింది. న్యూసెన్స్‌కు పాల్పడే వారు ఒక్కో సందర్భంలో ఒక్కో ప్రాంతంలో రెచ్చిపోతున్నారు. అలాంటి సమయాల్లో ముందస్తు అరెస్టులు, లేదా అదుపులోకి తీసుకోవడం వంటివి చేస్తున్న స్థానిక పోలీసులు.. సొంత పూచీకత్తుపై లేదా నామమాత్రపు జరిమానా విధించి వదిలిపెడుతున్నారు. ఎవరిపై చర్యలు తీసుకున్నారనే అంశం ఆ పోలీసుస్టేషన్ రికార్డులకే పరిమితమవుతోంది. దీంతో ఇలాంటి వారు పదేపదే చెలరేగిపోతున్నా కఠిన చర్యలు కరువయ్యాయి.

హైదరాబాద్‌లో ఈ-పెట్టీ కేస్ యాప్ పనితీరు ఇలా..

నమోదు చేసిన ఈ–పెట్టీ కేసులు:	25,322
కోర్టులో నిరూపితమైనవి:	21,360
కేవలం జైలు శిక్ష పడినవి:	1,306
జైలుతో పాటు జరిమానా:	1,038
కేవలం జరిమానా పడినవి:	19,016

ఇలాంటి వారికి చెక్ చెప్పడానికి 'ఈ–పెట్టీ కేస్'యాప్‌ను గతేడాది నగర పోలీసులు డిజైన్ చేశారు. క్షేత్రస్థాయిలో ఉండే పోలీసు అధికారుల ట్యాబ్‌లతో అనుసంధానించి ఉండే సర్వర్‌లో దీన్ని నిక్షిప్తం చేయడంతో ట్యాబ్‌లను అందుబాటులోకి తెచ్చారు. దీంతో పబ్లిక్ న్యూసెన్స్ చేస్తూ పట్టుబడిన, ముందస్తు అరెస్టు అయిన, సమయం మించి దుకాణాలు తెరిచి ఉన్న, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న తదితర ఉల్లంఘనలకు పాల్పడిన వారి పూర్తి వివరాలతో పాటు ఆధార్ నంబర్‌ను ట్యాబ్ ద్వారా సేకరిస్తారు. ఈ డేటాబేస్ అన్ని ఠాణాలకు చెందిన ట్యాబ్‌లతో అనుసంధానించి ఉన్న నేపథ్యంలో ఓ వ్యక్తి, కొందరు వ్యక్తులు పదేపదే ఈ తరహా నేరాల్లో ఉన్న విషయాన్ని యాప్ గుర్తించి అధికారులకు తెలుపుతుంది. దీని ఆధారంగా వారిని ఆధారాలతో కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించడానికి ఆస్కారం ఏర్పడింది. ఇలాంటి ఉల్లంఘనల్ని తీవ్రంగా పరిగణిస్తున్న న్యాయస్థానాలు ఒక రోజు నుంచి పక్షం రోజుల వరకు జైలు శిక్షలు విధించాయి. ఫలితంగా ఈ తరహా నేరాలు చాలా వరకు తగ్గాయి. 'ఈ–పెట్టీ కేస్'నగరంలో సక్సెస్ కావడంతో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి నిర్ణయించారు. ప్రస్తుతం ప్రయోగాత్మక దశలో ఉన్న ఈ యాప్‌ను ఈ నెలాఖరుకు డీజీపీ ఆవిష్కరించనున్నారు.

పేర్ల నమోదుతో పాటు ఆధార్ సంఖ్య..

టీచర్లకు ప్రమోషన్లలో రిజర్వేషన్ కల్పించాలి: జాజుల

సాక్షి, హైదరాబాద్ : ఉపాధ్యాయులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించేవిధంగా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. దీనిపై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని, ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే బిలు పెట్టేవిధంగా చూడాలని కోరారు. శనివారం ఇక్కడ తెలంగాణ రాష్ట్ర బీసీ ఉపాధ్యాయ సంఘం (బీసీటీయూ)లో బీసీ ఉపాధ్యాయుల ఫోరం విలీనమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 57 లక్షల మంది ఉద్యోగుల్లో బీసీ ఉద్యోగులు ఐదు లక్షల మంది మాత్రమే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 56 శాతం జనాభా ఉన్న బీసీలు ఉద్యోగరంగంలో 8 శాతం మాత్రమే ఉండటమేమిటని ప్రశ్నించారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించకపోవడంతో నష్టం జరుగుతోందని అన్నారు. సీపీఎస్ విధానం బడుగు, బలహీన వర్గాల ఉద్యోగులకు శాపంగా మారిందని విచారం వ్యక్తం చేశారు. పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే సంయుక్త సమావేశం నిర్వహించాలని, లేనిపక్షంలో మరో 'సకల జనుల సమ్మె'కు ఉద్యోగులు సిద్ధం కావాల్సి వస్తుందని అన్నారు. బీసీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి సురేశ్ మాట్లాడుతూ ఏకీకృత సర్వీసులోని అడ్డంకులు తొలగించి ప్రమోషన్లతో కూడిన బదిలీలను ఈ వేసవి సెలవుల్లో చేపట్టాలని డిమాండ్ చేశారు. గిరగాని శ్రీనివాస్‌గౌడ్‌ను బీసీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా నియమించారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయండి: కొండ దేవయ్య

హైదరాబాద్: మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతీ సంవత్సరం బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయించాలని తెలంగాణ మున్నూరుకాపు అసోసియేషన్స్ జేఏసీ అధ్యక్షుడు కొండ దేవయ్య ప్రభుత్వాన్ని కోరారు. శనివారమిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ .. జనాభాలో 20 శాతం ఉన్న మున్నూరుకాపులను ప్రభుత్వం విస్మరించడం సరికాదన్నారు. అన్ని కులాలకు కేటాయించినట్టే తమ కులానికీ 10 ఎకరాల స్థలం, 20 కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు నిండిన రైతులకు ప్రతీ నెల 3వేల పెన్షన్, మున్నూరుకాపు పేద మహిళలకు డబుల్‌బెడ్‌రూం ఇండ్లు, భూమిలేని పేద రైతులకు 3 ఎకరాల భూమి ఇవ్వాలన్నారు. తమ జేఏసీ ఆధ్వర్యంలో 31 జిల్లాల్లో నిర్వహిస్తోన్న కుటుంబ సమగ్ర సర్వే పూర్తయిన వెంటనే ఐదు లక్షల మందితో 'మున్నూరుకాపుల మహా సింహగర్జన'బహిరంగ సభ నిర్వహిస్తామని వెల్లడించారు. సమావేశంలో మహిళా విభాగం అధ్యక్షురాలు అల్లాడి గీతారాణి, మహేందర్ కుమార్, బండి పద్మ, పుంజాల అనురాధ, బుక్క వేణుగోపాల్, చలిమెల ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

జల విద్యుత్ ప్రాజెక్టులు జెన్‌కోకే ఇవ్వండి

జీవో 21ను సవరించండి.. ప్రభుత్వానికి నీటిపారుదల శాఖ లేఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్త జల విద్యుదుత్పత్తి ప్రాజెక్టుల నిర్మాణ బాధ్యతలు తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో)కే తిరిగి అప్పగించాలని ప్రభుత్వానికి నీటిపారుదల శాఖ లేఖ రాసింది. గోదావరి నదిపై జల విద్యుదుత్పత్తి ప్రాజెక్టుల నిర్మాణ బాధ్యతలు నీటిపారుదల శాఖకు అప్పగిస్తూ 2010 మార్చి 11న ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు (జీవో 21)ను పునః సమీక్షించాలని కోరింది. బహుళార్థక ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో డ్యాంలు, జెన్‌కో ఆధ్వర్యంలో జల విద్యుదుత్పత్తి కేంద్రాలు నిర్మించడం ఆనవాయితీ. జల విద్యుదుత్పత్తి కేంద్రాల నిర్మాణం, డిజైన్ల రూపకల్పన, నిర్వహణలో జెన్‌కోకు విస్తృత అనుభవం ఉంది. అయితే గోదావరిపై కొత్త జల విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టేందుకు ఉమ్మడి రాష్ట్రంలో జారీ చేసిన ఉత్తర్వులు జెన్‌కో అడ్డుగా మారాయి. దీంతో పాత ఉత్తర్వులు సవరించి తుపాకులగూడెం జల విద్యుత్ కేంద్రం నిర్మాణ పనులు అప్పగించాలని జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు గతంలో ప్రభుత్వానికి లేఖ రాశారు. లేఖపై నీటిపారుదల శాఖ అభిప్రాయాన్ని ప్రభుత్వం కోరగా ఆ శాఖ ఈఎన్‌సీ సానుకూలంగా స్పందించారు. జల విద్యుత్ కేంద్రాల నిర్మాణ పనులను జెన్‌కోకు అప్పగించే విధంగా సత్వరంగా ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వానికి లేఖ రాశారు.

పూర్తయిన దిగువ జూరాల..

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత జెన్‌కో ఆధ్వర్యంలో దిగువ జూరాల, పులిచింత జల విద్యుత్ కేంద్రాల నిర్మాణ పనులు చేపట్టగా ఇప్పటికే దిగువ జూరాల ప్రాజెక్టు నిర్మాణం పూర్తయింది. పులిచింతల విద్యుదుత్పత్తి కేంద్రం పనులూ చివరి దశలో ఉన్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే జెన్‌కో చేతిలో జల విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి సంబంధించిన పనులండవు. మరోవైపు దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా గోదావరిపై తుపాకులగూడెం వద్ద బ్యారేజీతో పాటు 240 (10''24) మెగావాట్ల జల విద్యుదుత్పత్తి కేంద్రం నిర్మించాలని డీపీఆర్‌లో వ్యాప్కో సంస్థ సిఫార్సు చేసింది. తమ్మిడిహెట్టి, ఎల్లంపల్లి, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల, దుమ్ముగూడెం రిజర్వాయర్ల పనులూ జరుగుతుండటంతో వాటికి అనుసంధానంగా జల విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి ఉన్న అవకాశాలపైనా ప్రభుత్వం అధ్యయనం జరుపుతోంది. జీవో సవరిస్తే కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు జెన్‌కోకు వీలవుతుంది.

ప్రతి పెళ్లీ నమోదు కావాల్సిందే

- గ్రామాల్లో పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు
- అందుబాటులో దరఖాస్తులు.. ఫ్లెక్సీలతో ప్రచారం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జరిగే ప్రతి పెళ్లిని చట్ట ప్రకారం నమోదు చేసేందుకు పంచాయతీరాజ్ శాఖ చర్యలు చేపట్టింది. అన్ని గ్రామాల్లో కచ్చితంగా వివాహాలను నమోదు చేసేలా ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం అన్ని జిల్లాల పంచాయతీ అధికారులకు పంచాయతీరాజ్ కమిషనర్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. వీటికి అనుగుణంగా పంచాయతీలకు డీపీవోలు సర్క్యులర్ పంపారు. వివాహాల నమోదుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. 'పంచాయతీల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి. మహిళా, శిశు సంక్షేమ శాఖ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసి అందుబాటులో ఉంచాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలి. మీ–సేవ కేంద్రాల్లోనూ దరఖాస్తు ప్రకియ పూర్తి చేసేలా ఏర్పాట్లు చేయాలి'అని సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

దశాబ్దాలు గడుస్తున్నా..

బాల్య వివాహాలను అరికట్టడం, వివాహానికి చట్టబద్ధత కల్పించేందుకుగాను కేంద్ర ప్రభుత్వం మ్యారేజెస్ రిజిస్ట్రేషన్ యాక్ట్‌ను తీసుకొచ్చింది. ఆ చట్టం ప్రకారం ప్రతి పెళ్లిని తప్పనిసరిగా రిజిస్టర్ చేయాలి. కానీ చట్టం అమల్లోకి వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా వివాహాల నమోదులో ఆశించిన పురోగతి లేదు. ఇప్పటివరకు వివాహాల రిజిస్ట్రేషన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనో.. తహసీల్దార్ కార్యాలయాల్లోనో నమోదయ్యేవి. తాజాగా పంచాయతీ స్థాయిలో ధ్రువీకరిస్తే సరిపోతుందని ప్రభుత్వం నిబంధనలు సడలించింది. అయినా పెద్దగా పురోగతి లేకపోవడంతో వివాహాల రిజిస్ట్రేషన్‌తో అనేక రకాల ఉపయోగాలున్నాయని ప్రచారం చేస్తూ గ్రామాల్లో నమోదు పెంచాలని పంచాయతీరాజ్ శాఖ చర్యలు చేపట్టింది.

రాష్ట్రంలో 2014 సెప్టెంబర్ – 2017 డిసెంబర్ మధ్య రిజిస్టరైన పెళ్లిళ్లు

కేటగిరీ	రిజిస్ట్రేషన్లు
ఓసీ	2,829
బీసీ	1,23,461
ఎస్సీ	72,043
ఎస్టీ	41,840
మైనారిటీ	69,164

పదో తరగతి పరీక్షలకు ఇంగ్లిష్ మీడియం వారే అధికం

5.03 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు

- అందులో 3.12 లక్షల మంది ఇంగ్లిష్ మీడియం వారే
- 15వ తేదీ నుంచి పరీక్షలు.. విద్యాశాఖ ఏర్పాట్లు
- నిర్ణీత సమయం తరువాత ఐదు నిమిషాలే గ్రేస్ పీరియడ్

సాక్షి, హైదరాబాద్

ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు ఆంగ్ల మాధ్యమ విద్యార్థులే అధికంగా హాజరు కానున్నారు. ఈ పరీక్షలకు మొత్తంగా 5,38,867 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. అందులో రెగ్యులర్ విద్యార్థులు 5,03,117 మంది హాజరు కానుండగా, ప్రైవేటు విద్యార్థులు 35,750 మంది హాజరు కానున్నారు. వీరు కాకుండా 20,838 మంది వొకేషనల్ విద్యార్థులు పరీక్షలు రాసేందుకు పరీక్ష ఫీజు చెల్లించారు. ఇక 5,03,117 మంది రెగ్యులర్ విద్యార్థుల్లో 3,12,535 మంది ఇంగ్లిష్ మీడియం వారే ఉండటం గమనార్హం.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి..

వచ్చే నెల 2 వరకు జరిగే పరీక్షల నిర్వహణకు రాష్ట్ర వ్యాప్తంగా 2,542 పరీక్షా కేంద్రాలను ప్రభుత్వ పరీక్షల విభాగం ఏర్పాటు చేసింది.



ఇందులో 26 సమస్యాత్మక కేంద్రాలతో పాటు మరో 405 పరీక్షా కేంద్రాల్లో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది.

5 నిమిషాలు గ్రేస్ పీరియడ్

పదో తరగతి పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు జరుగనున్నాయి. విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అర గంట ముందు నుంచే అనుమతిస్తారు. అయితే నిర్ణీత సమయం 9:30 గంటల తరువాత 5 నిమిషాల వరకే విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. ఒక్క నిమిషం నిబంధనను తాము పెట్టలేదని, అయితే 5 నిమిషాల తరువాత మాత్రం అనుమతించబోమని వెల్లడించారు.

పరీక్షలకు హాజరయ్యే రెగ్యులర్ విద్యార్థులు (వివిధ మాధ్యమాల్లో..)

మాధ్యమం	అభ్యర్థులు
తెలుగు	1,78,901
ఇంగ్లిష్	3,12,535
ఉర్దూ	11,038
హిందీ	370
మరాఠీ	189
కన్నడ	77
తమిళం	07

మొత్తం విద్యార్థులు	5,38,867
రెగ్యులర్ విద్యార్థులు	5,03,117
ప్రైవేటు విద్యార్థులు	35,750
వొకేషనల్ విద్యార్థులు	20,838

బత్తాయి చేదు.. టమాటా కుదరదు!

రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటులో సవాళ్లు

- ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై అధ్యయనం అవసరం
- పరిశ్రమల శాఖ ముసాయిదా విధానపత్రం నిలుపుదల





సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రంలో పండించే బత్తాయిలో కొంత చేదుదనం ఉంటుంది. అలాంటి బత్తాయిని ప్రాసెసింగ్ చేసి పల్ప్ వంటి అనుబంధ ఉత్పత్తులు తయారు చేసి నిల్వ ఉంచడం సాధ్యంకాని పని. ఇక టమాటా కూడా అలాంటిదే. రాష్ట్రంలో పండించే టమాటాలు ప్రాసెసింగ్‌కు పనికిరావు. వాటి ద్వారా టమాటా సాస్ వంటివి తయారు చేయలేం. ఎంతో పేరున్న బంగినపల్లి మామిడి సహా ఇతర రసాలతో అనుబంధ ఉత్పత్తులు తయారు చేయలేం. మిర్చి, పసుపు తదితరాల ద్వారా అనుబంధ ఉత్పత్తులు తయారు చేయడం సాధ్యం కాదు. అందుకు అవి పనికి రావు'అని ఉద్యాన నిపుణులు తేల్చి చెబుతున్నారు. దీంతో ప్రతీ నియోజకవర్గానికి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఎలా ఏర్పాటు చేయగలమనే సందేహం వ్యవసాయ శాఖ అధికారులను పట్టిపీడిస్తోంది. ఇటీవలి మంత్రివర్గ ఉపసంఘ సమావేశంలో.. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు సంబంధించి పరిశ్రమల శాఖ ముసాయిదా విధాన పత్రాన్ని సమర్పించింది. అయితే ఆ విధాన పత్రం రాష్ట్ర పరిస్థితులకు తగినట్లు లేదని వ్యవసాయ శాఖ తేల్చిచెప్పడంతో అందులో మార్పులు చేయాలని, మరింత అధ్యయనం అవసరమని నిర్ధారణకు వచ్చారు. ప్రాసెసింగ్ యూనిట్లు లేని చోటే ఏర్పాటు చేసేలా ప్రోత్సాహకాలు ఉండాలని, అందుకు తగ్గట్లుగా పారిశ్రామిక వేత్తలకు వెయిటేజీ ఇవ్వాలని వ్యవసాయ శాఖ ప్రతిపాదించింది. ప్రాసెసింగ్ యూనిట్లతో రైతుకు ప్రయోజనం కలుగుతుందా లేదా అనే అంశాన్ని ఆధారం చేసుకొనే ఏర్పాటు చేయాలని సూచించింది.

మార్చాల్సిందే..

రాష్ట్రంలో ఆహార పంటలు అవసరానికి మించి పండుతుండటంతో వాటిని మార్కెటింగ్ చేసుకోలేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అన్ సీజన్‌లో కిలో రూ.100 వరకు ఉండే టమాటా సీజన్‌లో రూపాయికి పడిపోతున్న పరిస్థితి ఉంది. మిర్చి ధర కూడా క్వింటా రూ.12 వేలు పలకాల్సింది పోయి రూ.3–4 వేలకు పడిపోతోంది. కంది, పెసర వంటి పప్పుధాన్యాలకూ మద్దతు ధర దొరకడం లేదు. ఈ నేపథ్యంలో విరివిగా వ్యవసాయ ఆధారిత ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. మరోవైపు రాష్ట్రంలోని పంట రకాల ఆధారంగా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసే పరిస్థితి కనిపించడం లేదని వ్యవసాయ శాఖ భావిస్తోంది. ఉదాహరణకు పంజాబ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో పండించే టమాటా రకమే సాస్‌కు పనికొస్తుంది. మన రకం టమాటా పనికిరాదు. కాబట్టి మన వద్ద ఉన్న పంట రకాలను మార్పు చేయాల్సిన అవసరం ఉందని అధికారులు చెబుతున్నారు. అంటే టమాటా, బత్తాయి, మిర్చి, మామిడి వంటి రకాలను మార్చాలి. అలా చేస్తేనే ప్రాసెసింగ్ యూనిట్ల వల్ల ప్రయోజనం.

తాజా ఆహారమంటేనే ఇష్టం

ఇక దేశంలో ప్రజలు తాజా ఆహారాన్నే ఇష్టపడుతుంటారు. నిల్వ చేసిన పదార్థాలకు పెద్దగా ఆదరణ ఉండదు. కాబట్టి ప్రాసెసింగ్ యూనిట్లు ఏమేరకు లాభదాయకంగా ఉంటాయన్న అనుమానాలున్నాయి. అలాగే వ్యవసాయ పంటలు రెండు సీజన్లలోనే పండుతాయి. ఏడాది పొడవునా ఉండవు. కాబట్టి కేవలం సీజన్లలోనే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నడుస్తాయి. కాబట్టి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తారా అనే అనుమానాలూ ఉన్నాయి. దీంతో ప్రాసెసింగ్ యూనిట్లను ఎలా ముందుకు తీసుకెళ్లాలో అధ్యయనం చేయాలని వ్యవసాయ శాఖ వర్గాలు ప్రభుత్వానికి నివేదించాయి.

సాక్షి
నల్లగొండ
ఆదివారం | మార్చి | 11 | 2018
www.sakshi.com

సంక్షోభంలో న్యాయ వ్యవస్థ

మాణిక్ సర్కార్ (మాజీ సీఎం)
రాయని డైరీ

4

మాధవ్ శింగరాజు

ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. త్రిపుర కొత్త సీఎం విప్లవ్ కుమార్ కుదురుగా ఒకచోట కూర్చోకుండా డయాస్ మీద లెఫ్ట్ నుంచి రైట్‌కి, రైట్ నుంచి లెఫ్ట్‌కి కలియదిరుగుతున్నాడు.

నవ్వుతున్నాడు. నమస్తే పెడుతున్నాడు. ఎవరైనా అడ్డొస్తే, వాళ్లని చూసీ నవ్వుతున్నాడు, నమస్తే పెడుతున్నాడు. అంతే తప్ప 'తప్పుకోండి' అని మాత్రం అనడం లేదు. అలా నవ్వుతూ, నమస్తే పెడుతూ తప్పించడం బాగుంది!

డయాస్ మీద నేనూ ఓ పక్కగా కూర్చొని ఉన్నాను. నా పక్కనే లెఫ్ట్‌లో అద్వానీ, రైట్‌లో మురళీమనోహర్ జోషీ కూర్చొని ఉన్నారు. అద్వానీ పక్కన రాజ్‌నాథ్ సింగ్ ఉన్నారు.

ఇంకో వరుసలో నరేంద్ర మోదీ, అమిత్‌షా, రామ్ మాధవ్ ఉన్నారు. వాళ్ల వెనకే బీజేపీ రాష్ట్రాల సీఎంలు ఉన్నారు.

బీజేపీ వాళ్లను అంత దగ్గరగా చూడ్డం అదే మొదటిసారి నాకు!

విప్లవ్ కుమార్ మేమున్న వరుస వైపు వస్తున్నాడు. నవ్వుకుంటూ, నమస్తే పెట్టుకుంటూ వస్తున్నాడు. నెక్స్ట్ అతడు అద్వానీకి, జోషీకీ, రాజ్‌నాథ్‌కీ నమస్తే పెడతాడనుకున్నాను. కానీ నాకు



పెట్టాడు!

జోషీ ఆకాశంలోకి, అద్వానీ అగాధంలోకి, రాజ్‌నాథ్.. ఆకాశానికీ, అగాధానికీ మధ్య ఉన్న ఏదో స్పేస్‌లోకి ముఖం తిప్పుకుని కూర్చున్నారు. అందుకే విప్లవ్ కుమార్ నాకు నమస్తే పెట్టి ఉంటాడనుకున్నాను.

నమస్తే పెట్టాక, సడన్‌గా కిందికి వంగాడు విప్లవ్ కుమార్. జోషీకీ, అద్వానీకీ, రాజ్‌నాథ్‌కీ పాదాభివందనం చేయబోతున్నాడని అనుకున్నాను. కానీ నాకు చేశాడు!

జోషీ, అద్వానీ, రాజ్‌నాథ్‌ల ముఖాలు అందుబాటులో లేకపోవచ్చు, వాళ్ల పాదాలైతే అందుబాటులోనే ఉన్నాయి కదా! మరి నాకెందుకు పాదాభివందనం చేసినట్లు?!

"నన్ను దీవించండి మాణిక్‌జీ" అన్నాడు విప్లవ్‌కుమార్.

భుజాలు పట్టుకుని పైకి లేపాను.

"నాకు మీ బ్లెస్సింగ్ కావాలి మాణిక్‌జీ" అన్నాడు మళ్లీ.

"నేనేమి ఇవ్వగలను విప్లవ్. ఇరవై ఏళ్లుగా నేను ఏమీ ఇవ్వలేదనే కదా నిన్ను ఎన్నుకున్నారు త్రిపుర ప్రజలు" అన్నాను.


"ఎప్పుడైనా నాకు డౌట్లు వస్తే మీకు ఫోన్ చేస్తాను మాణిక్‌జీ. అప్పుడు మీరు నా ఫోన్ లిఫ్ట్ చెయ్యాలి" అన్నాడు.

"డౌట్లు అడగాలనుకుంటే మీ మోదీజీ, మీ అమిత్‌జీ ఉన్నారు కదా" అన్నాను.

"వాళ్లే చెప్పారు మాణిక్‌జీ.. ముందుగా పెద్దల్ని గౌరవించాలని" అన్నాడు, మళ్లీ కాళ్ల మీద పడబోతూ.

వద్దొన్నాను.

బీజేపీలో ఇదొకటి బాగుంటుంది. ఫామ్‌లో లేని పెద్దల్ని గౌరవించడం!



జస్టిస్ ఎం.ఎన్. రావు

శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థల మధ్య మన రాజ్యాంగం సున్నితమైన సమతౌల్యం ఉండేటట్టు చేస్తుంది. ఇందులో ఏదీ ఒకదానిని ఒకటి అధిగమించకుండా చూస్తుంది. పార్లమెంట్ చట్టాలను రూపొందిస్తుంది. కార్యనిర్వాహక వ్యవస్థ అమలు చేస్తుంది. న్యాయ వ్యవస్థ ఆ చట్టాలను వ్యాఖ్యానిస్తుంది. బ్రిటిష్ ప్రభుత్వ విధానంలోని మంత్రిమండలి విధానాన్ని మనం స్వీకరించాం. అధికారాల విభజన, న్యాయ సమీక్ష వ్యవస్థను అమెరికా రాజ్యాంగం నుంచి తీసుకున్నాం. రాజ్యాంగం నాలుగో భాగంలో పొందుపరిచిన ఆదేశిక సూత్రాల ఆలోచన ఐరిష్ రాజ్యాంగం నుంచి తెచ్చుకున్నాం. వివిధ దేశాల రాజ్యాంగాలను పరిశీలించిన తరువాత, మన దేశ సామాజిక, మత పరిస్థితులను; అవిద్య, దారిద్ర్యం వంటి అంశాలను అన్వయించుకుంటూ మన రాజ్యాంగ నిర్మాతలు ఒక విస్తృత రాజ్యాంగాన్ని అందించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ సభ సలహాదారు బీఎన్ రావు, ముసాయిదా సంఘం అధ్యక్షుడు, భారతజాతి రాజ్యాంగ పితగా గౌరవించే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ల సేవలను స్మరించుకోవాలి.

న్యాయవ్యవస్థ స్వాతంత్య్రాన్ని పరిరక్షించేందుకుగాను న్యాయమూర్తుల నియామకం గురించి రాజ్యాంగ పరిషత్‌లో కొన్ని అభిప్రాయాలు వ్యక్తమైన సంగతి ఆసక్తికరంగా ఉంటుంది. ఉన్నత న్యాయస్థానాలలో జరిగే నియామకాలు భారత ప్రధాన న్యాయమూర్తి సమ్మతితో జరగాలన్నది అందులో ఒకటి. కానీ దీనిని డాక్టర్ అంబేడ్కర్ చాలా గట్టిగా నిరాకరించారు. ప్రధాన న్యాయమూర్తి చాలా సమర్థుడైన వ్యక్తేనని నేను వ్యక్తిగతంగా భావిస్తున్నప్పటికీ, ఆయనకు కూడా మనుషులందరికీ ఉండే భావాలే ఉంటాయని అంబేడ్కర్ అభిప్రాయపడ్డారు. భారత ప్రధాన న్యాయమూర్తి నియామకాన్ని మూడింట రెండువంతుల సభ్యుల అంగీకారం ద్వారా జరగాలని, ఆ అధికారాన్ని పార్లమెంట్‌కు కట్టబెట్టాలంటూ మరొక ప్రతిపాదన కూడా వచ్చింది. దీనిని కూడా అంబేడ్కర్ నిరాకరించారు. రాజకీయ ఒత్తిళ్లు, రాజకీయ కారణాలు ఆ అధికారాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉందని అంబేడ్కర్ విశ్లేషించారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తి తొలగింపు విధానం గురించి ఆర్టికల్ 124(4) వివరిస్తుంది. దీనినే అభిశంసన అని పిలుస్తారు. ఇందుకు పార్లమెంట్ ఉభయ సభలలో మూడింట రెండువంతులకు తగ్గకుండా సభ్యుల మద్దతు ఉండాలి. అలాగే ఓటింగ్ తప్పనిసరి. అనుచిత ప్రవర్తన, అసమర్థత కారణాలుగా వారిని తొలగించడానికి అవకాశం ఉంది. హైకోర్టులలో న్యాయమూర్తుల నియామకాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఆ రాష్ట్ర గవర్నర్, న్యాయమూర్తిని నియమిస్తున్న ఆ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించిన తరువాత రాష్ట్రపతి చేపడతారు. హైకోర్టు న్యాయమూర్తి తొలగింపు విధానం కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించే తీరులోనే ఉంటుంది. దీని గురించి ఆర్టికల్ 217(1) వివరిస్తుంది.

సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల తొలగింపు కోసం 1968లో పార్లమెంట్ న్యాయమూర్తుల దర్యాప్తు చట్టాన్ని ఆమోదించింది. ఈ చట్టం పరిధిలో 1969లో వారి తొలగింపు విధివిధానాలను రూపొందించింది. వందమంది లోక్‌సభ సభ్యులు, లేదా 50 మంది రాజ్యసభ సభ్యులు స్పీకర్ లేదా చైర్మన్‌ల వద్ద తొలగింపు కోసం తీర్మానాన్ని ప్రతిపాదించవచ్చు. పరిశీలన తరువాత ఆ తీర్మానాన్ని ఆమోదించవచ్చు లేదా తిరస్కరించవచ్చు. ఆ తీర్మానాన్ని కనుక ఆమోదిస్తే ఈ అంశాన్ని ముగ్గురు సభ్యులతో కూడిన ఒక సంఘానికి నివేదిస్తారు. ఇందులో ఒక సభ్యుడిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తుల నుంచి ఎంపిక చేస్తారు. ఒకరు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల నుంచి ఎంపిక చేస్తారు. రాజ్యాంగ నిపుణుడని స్పీకర్ లేదా చైర్మన్ భావించిన వ్యక్తిని మూడో సభ్యునిగా ఎంపిక చేస్తారు. ఈ సంఘం దర్యాప్తు పూర్తి చేసి, నివేదిక సమర్పించిన తరువాత సదరు న్యాయమూర్తి దోషి అని తేలితే అప్పుడు తొలగింపు తీర్మానాన్ని పరిగణనలోనికి తీసుకుంటారు.

అయితే ఈ పద్ధతి పూర్తిగా నిష్ఫలమైనదని గతానుభవం రుజువు చేసింది. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరువాత రెండు సందర్భాలలో మాత్రమే న్యాయమూర్తులను అభిశంసించాలని కోరడం జరిగింది. వారు– సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి. రామస్వామి, కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సౌమిత్రా చటర్జీ. ఇందులో జస్టిస్ రామస్వామి మీద ప్రవేశపెట్టిన తొలగింపు తీర్మానం వీగిపోయింది. కాంగ్రెస్ పార్టీ ఓటింగ్‌కు గైర్హాజరు కావడమే ఇందుకు కారణం. ఇక లోక్‌సభ ఓటింగ్‌కు చేపట్టడానికి ముందే జస్టిస్ సౌమిత్రా చటర్జీ పదవికి రాజీనామా చేశారు.

కేశవానందభారతి వర్సెస్ కేరళ ప్రభుత్వం (ఏఐఆర్ 1973 ఎస్‌సీ 1461) కేసులో స్వతంత్ర న్యాయవ్యవస్థ రాజ్యాంగ మౌలిక లక్షణాలలో ఒకటని 13 మంది సభ్యుల ధర్మాసనం తేల్చి చెప్పింది. న్యాయమూర్తుల నియామకంలో ప్రతిభ కాకుండా మిగిలిన అంశాలు నిర్వహించిన పాత్ర అప్రాధాన్యమైనదని చెప్పలేం. కొన్ని కేసులలో రాజకీయ ప్రమేయం, ప్రాంతీయ, మతపరమైన మనోభావాలు ప్రధానంగా ప్రభావం చూపాయి. ప్రఖ్యాత భారత రాజ్యాంగ వ్యాఖ్యాత గ్రన్‌విల్లే ఆస్టిన్ కూడా నియామకాలలో పైకి చెప్పని ఉద్దేశాలు ఉన్నాయనే చెప్పారు. కోర్టులలో కేసులు పేరుకు పోవడానికి కారణం తృప్తికరంగా లేని న్యాయమూర్తుల నియామకం కారణమని ఎంసీ సెతల్వాడ్ నాయకత్వంలోని మొదటి లా కమిషన్, భారత మాజీ అటార్నీ జనరల్ అభిప్రాయం. ఇలాంటి లోపాలు ఉన్నప్పటికీ న్యాయ వ్యవస్థ ఒడిదుడుకులకు లోను కాలేదు. కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థల మధ్య వైరుధ్యం పొడసూపినా, లేదా కార్యనిర్వాహక శాఖలోనే అంతర్గత విభేదాలు వచ్చినప్పటికీ వివాదాలు బయటకి పొక్కలేదు. ఇలాంటి చిన్న చిన్న విభేదాలను ఆ విధానం తనలోనే దాచేసుకుంది.

న్యాయమూర్తుల నియామకం విధానం 1950 నుంచి 1993 వరకు తృప్తికరంగానే సాగింది. ఈ కాలంలో భారత ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయానికి ఆమోదం లభించని సందర్భాలు ఏడు కనిపిస్తాయి. సుప్రీంకోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1993 (4) ఎస్‌సీసీ 441) కేసులో జస్టిస్ ఏ ఎం అహ్మదీ ఇచ్చిన మైనారిటీ తీర్పులో ఇందుకు సంబంధించిన గణాంకాలు కనిపిస్తాయి. ఈ కేసునే సెకెండ్ జడ్జస్ కేసు అని పేర్కొంటూ ఉంటారు. జస్టిస్ జేఎస్ వర్మ వివరించిన మేరకు, ఈ తీర్పు ప్రకారం మెజారిటీ విశ్లేషించినదేమిటంటే, న్యాయమూర్తిగా నియమించడానికి సిఫారసు చేయదలిచిన వ్యక్తులలో ప్రతికూల లక్షణాలు ఉంటే వాటిని ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకువెళ్లడమనే పాత్రకు మాత్రమే కార్యనిర్వాహక వ్యవస్థ పరిమితం కావాలి. దీనితో కార్యనిర్వాహక వ్యవస్థ పాత్ర నిష్ఫలమైంది. కొలీజియం న్యాయమూర్తుల నియామకంలో చట్టబద్ధమైన అధికారం కలిగిన సంస్థ అయింది. కొలీజియం సిఫారసులను కొట్టివేసే అధికారం ఏ కోర్టుకు లేదు. కొలీజియం సిఫారసుల మేరకు నియామకాలు జరపడానికే న్యాయ సమీక్షకు ఉన్న అధికారం పరిమితమైంది. న్యాయమూర్తుల నియామకంలో మంత్రి మండలి రాష్ట్రపతికి సలహా ఇవ్వడం కూడా లాంఛనంగా మారింది. కొలీజియం సిఫారసులను కార్యనిర్వాహక వ్యవస్థ రాష్ట్రపతికి తెలియ చేస్తే ఆయన నియామకాలు చేపడతారు.

ఇందులో ఆశ్చర్యకరమైన అంశం ఏమిటంటే సెకెండ్ జడ్జస్ కేసులో మెజారిటీ తీర్పును రచించిన జస్టిస్ జేఎస్ వర్మ తరువాత తన అభిప్రాయం మార్చుకున్నారు. న్యాయమూర్తుల నియామకాలను జాతీయ జ్యుడీషియల్ కమిషన్ చేపట్టాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఉప రాష్ట్రపతి/ప్రధాని/ భారత ప్రధాన న్యాయమూర్తి తదితరులు ఇందులో సభ్యులుగా ఉండాలని ఆయన చెప్పారు.

అసలు ఎలాంటి న్యాయమూర్తులు దేశానికి కావాలి? రాజ్యాంగ పరిషత్‌లో ప్రసంగించినప్పుడు నెహ్రూ, ఆ న్యాయమూర్తులు అత్యంత విజ్ఞానవంతులు కావాలని అభిప్రాయపడ్డారు. ప్రతి ప్రజాస్వామిక దేశంలోను పాలన పాలించే వారి అనుమతితో సాగుతుంది. అమెరికాలో న్యాయమూర్తుల నియామకానికి సెనేట్ ఆమోదం అనివార్యం. కానీ ఇక్కడ కార్యనిర్వాహక వ్యవస్థ పూర్తిగా దూరంగా ఉండిపోయింది. దీనితో జవాబుదారీ తనం గురించిన ప్రశ్న తలెత్తింది. పార్లమెంట్ చేసిన నేషనల్ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ చట్టం, 2014 దీని ఫలితమే. దీనిని సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఐదుగురు సభ్యుల ధర్మాసనంలో నలుగురు వ్యతిరేకించారు. న్యాయమూర్తుల నియామకంలో న్యాయవ్యవస్థదే పై చేయి అన్న సంగతి సెకెండ్ జడ్జస్ కేసుతోనే నిర్ధారణ అయిందని నాటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖేహర్, జస్టిస్ గోయెల్, జస్టిస్ మదన్ బి లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్ మెజారిటీ తీర్పులో పునరుద్ఘాటించారు.




కొలీజియం పని విధానాన్ని మెరుగు పరచడానికి తీసుకోవలసిన చర్యల గురించి ఆలోచించవలసిందని కోరుతూ 16–12–2015న రాజ్యాంగ ధర్మాసనం ఒక ఆదేశాన్ని జారీ చేసింది. సీనియర్ న్యాయవాదులు, న్యాయ నిపుణుల సలహాలను కూడా కోరారు. ఈ సలహాలను గ్రంథస్థం చేయడానికి ఒక సంఘాన్ని కూడా నియమించారు. న్యాయమూర్తుల నియామకంలో కొలీజియం ఈ వాస్తవాలను పరిగణనలోనికి తీసుకోవాలని భావించారు. అవి– అర్హత ప్రమాణం, నియామక విధానంలో పారదర్శకత, సరైన విధాన అవగాహన నిర్వహణకు ఒక సచివాలయం ఏర్పాటు. అయితే కొలీజియం వ్యవహార సరళి, ఉన్నత న్యాయస్థానాలలో న్యాయమూర్తుల నియామకం గురించి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఆ కొలీజియం సభ్యుడు, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ జె. చలమేశ్వర్ భారత ప్రధాన న్యాయమూర్తికి సెప్టెంబర్, 2016లో ఒక లేఖ రాశారు. దేశంలో సాగుతున్న పాలన, శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థల మధ్య రాజ్యాంగం నిర్దేశించిన సున్నిత సమతౌల్యం మీద అది చూపుతున్న ప్రభావం గురించి కొన్ని సంక్లిష్ట ప్రశ్నలను ఆ లేఖ లేవనెత్తింది. పత్రికలలో వెలుగు చూసిన మేరకు ఆ లేఖలో ఆయన కొలీజియం పద్ధతి పారదర్శకంగా లేదని పేర్కొన్నారు. అయితే ఆ న్యాయమూర్తి లేవనెత్తిన అంశాలను పరిష్కరించారో లేదో మాత్రం తెలియదు. కొలీజియం వ్యవహారాలేవీ ప్రజలకు తెలియవు. ఆఖరికి కొలీజియంలో సభ్యులు కాని ఉన్నత న్యాయమూర్తులకు కూడా అక్కడ జరిగిన చర్చల వివరాలు తెలియవు.

సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయమూర్తులు, కొలీజియంలో కూడా సభ్యులు అయిన జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగొయ్, జస్టిస్ మదన్ బి లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్‌లు 12–1–2018న విలేకరుల సమావేశంలో గళం విప్పడం దేశంలో సంచలనమైంది. ఈ నలుగురిలో సీనియర్ చలమేశ్వర్ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఇందులో జస్టిస్ గొగొయ్ తరువాత భారత ప్రధాన న్యాయమూర్తి అయ్యే అవకాశాలు ఉన్నవారు. ఆ నలుగురు రెండు మాసాల క్రితం ప్రధాన న్యాయమూర్తికి ఉమ్మడిగా రాసిన లేఖ ప్రతిని కూడా విలేకరులకు అందించారు. కొలీజియం వ్యవస్థలోని దోషాల గురించి ఆ లేఖలో పేర్కొన్నారు. ఎలాంటి సహేతుకత లేకుండా కేసులను ధర్మాసనాలకు కేటాయిస్తున్న తీరును గురించే వారు ప్రధానంగా లేఖలో ఆరోపణలు చేశారు. ఆ తరువాత కూడా కొన్ని పరిణామాలు జరిగాయి. సీపీఐ నాయకుడు డి. రాజా వెళ్లి చలమేశ్వర్‌ను ఆయన నివాసంలో కలుసుకోవడం గురించి కొన్ని పత్రికలు విమర్శించాయి. ఆ తరువాత అసలు న్యాయవ్యవస్థను అపఖ్యాతి పాలు చేయడానికి కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయంటూ ఆరెస్సెస్ కార్యకర్త ఒకరు పత్రికా ప్రకటన ఇచ్చారు. ఇంకా సీపీఎం నాయకుడు యేచూరి ఉన్నత న్యాయస్థానంలో పనితీరు దిగజారడం, న్యాయమూర్తుల మధ్య విభేదాల గురించి గళమెత్తడంతో అసలు ప్రధాన న్యాయమూర్తి మీద అభిశంసన తీసుకురావడానికి సంకేతమనే అనుమానాలు కలిగించింది.

(27–1–2018న హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ మేధావుల ఫోరమ్ సభలో చదివిన ఉపన్యాసం)

వ్యాసకర్త హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి

ఆరెస్సెస్ యూనిఫాంలో ఆర్మీ మాజీ చీఫ్



కరణ్ థాపర్

తటస్థత అత్యవసరమైన షరతుగా ఉండే, అత్యున్నత రాజ్యాంగ పదవులను గతంలో అలంకరించినవారు తమ పదవీ విరమణ అనంతర ప్రవర్తన సమాజానికి పంపుతున్న సందేశం గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదా? తమ ఈ ప్రవర్తన.. వారు గతంలో నాయకత్వం వహించిన సంస్థ గురించి ఇబ్బందికర ప్రశ్నల్ని లేవనెత్తే అవకాశం ఉందని వీరు మరిచిపోతున్నారా? లేదా వారు దేన్నీ లెక్కపెట్టదల్చుకోవడం లేదా?

దాదాపు 42 ఏళ్లపాటు సైన్యంలో పనిచేసి దాని చీఫ్ స్థాయికి ఎదిగిన జనరల్ వి.కె. సింగ్ గురించే నేను ప్రత్యేకించి దీన్ని రాస్తున్నాను. ప్రస్తుతం భారత విదేశాంగ సహాయ మంత్రి జనరల్ సింగ్ ఆర్ఎస్ఎస్ యూనిఫారం ధరించి ఆ సంస్థ సభ్యుల మధ్యలో ఉన్నట్లు చూపుతున్న ఫొటోలు ఇటీవల విస్తృతంగా పంపిణీ అయ్యాయి. నాతోపాటు, మన సైన్యం లౌకికవాదాన్ని పరిరక్షించాలనుకుంటున్న చాలామందికి అవి దిగ్భ్రాంతి కలిగించాయి. లౌకికవాదం ఆర్ఎస్ఎస్ గౌరవించే సిద్ధాంతం కాదనుకోండి.

భారతదేశంలోని ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, బౌద్ధులు, పార్సీలు, జైనులు వంటి విభిన్న మతాల ఉనికిని గుర్తించకుండా వారందరూ హిందువులే అని ఆరెస్సెస్ ప్రకటిస్తుండగా, మరోవైపున ప్రతి వైయక్తిక మతాన్ని కూడా మన సైన్యం ప్రగాఢంగా గౌరవిస్తోంది. తమ తమ స్వభావాన్ని అనుసరించి భారత సైనిక రెజిమెంట్లు తమ సొంత పూజా మందిరాలు, మసీదులు, గురుద్వారాలు, చర్చిలను కలిగివున్నాయి. ఆయా రెజిమెంట్లలో మౌల్వీలు, పండిట్లు, గ్రంథిలు, పూజారులు కూడా ఉండటం విశేషం. నిజానికి ఒక సైనిక విభాగంలో నిర్దిష్ట మతానికి చెందిన 120 మంది సైనికులు ఉన్నట్లయితే, వారి మతానికి చెందిన గురువు తప్పకుండా ఆ రెజిమెంట్‌లో ఉంటారు.

ఆర్మీ కమాండింగ్ ఆఫీసర్లు అన్ని మతాల ఉత్సవాల్లో పాల్గొంటుంటారు. ఈద్ సందర్భంగా వారు టోపీని ధరిస్తుంటారు. దీపావళి నాడు టిక్కాను, గురుపౌర్ణమి నాడు తలపాగాను ధరిస్తారు. నిజానికి, రెజిమెంటల్ పండిట్ లీవులో ఉన్నట్లయితే జన్మాష్టమి కార్యక్రమాన్ని ఒక మౌల్వీ నిర్వహించే ఏకైక చోటు మన సైన్యమే అని చెప్పాలి. ఇవేవీ ఆర్ఎస్ఎస్ విషయంలో వాస్తవం కాదు. నిజానికి ఆ సంస్థ దీనికి పూర్తిగా భిన్నంగా ఉంటుంది. అలాంటప్పుడు ఒక మాజీ సైనికాధిపతి ఇలాంటి సంస్థను కౌగలించుకోవడం అంటే దానర్థం ఏమిటి? సైనిక సర్వీసులో ఉన్న కాలంలో తాను ఆరెస్సెస్ రహస్య సభ్యుడిగా ఉండేవారా? మతపరమైన తటస్థతకు సంబంధించి సైన్యం సూత్రబద్ధతపై తన నిబద్ధత బూటకమైనదేనా? మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, సైన్యానికి తెలియకుండానే ఇతర ఆరెస్సెస్ మద్దతుదారులు కూడా సైనిక ముసుగులో దాగి ఉంటున్నారా?

తాను ఇటీవలివరకు పనిచేసిన సంస్థ పట్ల ఒక ఆర్మీ మాజీ అధిపతి ఇలాంటి ప్రశ్నలు రేకెత్తడానికి వీలు కల్పించాడంటే ఇది భ్రమలు తొలిగిపోతున్న దానికంటే ఎక్కువేనని చెప్పాల్సి ఉంటుంది. ఇది తీవ్ర విచారకరమైంది. ఆయన తాను ధరించిన

ఆదిత్య హృదయం



యూనిఫారంకు తగిన అర్హుడు కాదని ఇది సూచిస్తుంది. పైగా ఆర్మీ చీఫ్‌గా తాను పొందిన గౌరవానికి కూడా తానేమాత్రం అర్హుడు కాదని దీనర్థం.

ఏమైనప్పటికీ జనరల్ సింగ్ మాత్రమే దీనికి మినహాయింపు కాదు. పదవీ విరమణ చేసిన తర్వాత రాజకీయాల్లోకి అడుగుపెట్టి కేబినెట్ మంత్రులుగా మారిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్లు కూడా మనకున్నారు. అయినా సరే సీఈసీగా తన తటస్థతకు, తాను పనిచేసిన అత్యున్నత సంస్థ తటస్థతకు సంబంధించి లేవనెత్తుతున్న ప్రశ్నల గురించి మాజీ సీఈసీ ఎమ్ ఎస్ గిల్ ఏమాత్రం ఆందోళన కనబరుస్తున్నట్లు లేదు. రాజ్యసభలో పక్షపాతంతో కూడిన రాజకీయ సభ్యత్వాన్ని స్వీకరించడమే కాకుండా, పార్టీ క్రమశిక్షణకు కూడా లోబడిన భారతీయ ప్రధాన న్యాయమూర్తులను కూడా మనం కలిగివున్నాం. అయినప్పటికీ సుప్రీంకోర్టు, న్యాయవ్యవస్థలపై ఇలాంటి పదవులు కలిగించే సందేహాల గురించి రంగనాథ మిశ్రా లెక్కచేయనట్లుగానే కనపడుతోంది.

దారితప్పి వక్రమార్గంలో నడుస్తున్న మన సైనిక జనరల్ ఒక అప్రతిష్ఠాకరమైన సంప్రదాయంలో భాగమనిపిస్తోంది. చివరకు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్స్.. ఎంపీలుగానూ, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు లోక్‌సభ స్పీకర్లుగా లేక గవర్నర్లుగా మారుతుండటం కూడా దీంట్లో భాగమే.

ఇలాంటి ప్రతి సందర్భంలోనూ వ్యక్తులు లాభపడుతుండవచ్చు కానీ సంస్థలు నష్టపోతున్నాయి. అంతకు మించి సామాజిక విలువలను, ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తున్న మన నైతికతకు మరింత నష్టం కలుగుతోంది. స్వార్థ ప్రయోజనాల సాధన కోసం ఔచిత్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నప్పుడు భారత్ అనే భావననే అది దిగజార్చివేస్తుంది. మన ఆర్మీ చీఫ్‌లు, న్యాయమూర్తుల చేతుల్లోనే ఇది జరుగుతున్నప్పుడు క్షమాపణ చెప్పినంత మాత్రాన సరిపోదు. కానీ, ఇలాంటి బాపతు వ్యక్తులు తాము చేస్తున్న పనులకు గానూ కనీసం పశ్చాత్తాపమైనా చెందుతున్నారా అనేదే సందేహం.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు
ఈ–మెయిల్ : karanthapar@itvindia.net

కొండను తవ్వి ఎలుకను కూడా పట్టకపోతే ఎలా?

భారత్‌లో నిఘా సంస్థలు 'చేసింది కొంత కూసేది మాత్రం చాలా' అనే రకంగా ఉంటున్నాయి. అరెస్టులు చేస్తారు, సంచలన వార్తలు వ్యాపింప చేస్తారు. మరిన్ని సాక్ష్యాధారాలు కావాలి కాబట్టి నిందితులను మరికొన్ని రోజులు కస్టడీలోకి తీసుకోవాలని న్యాయస్థానానికి విన్నవిస్తారు. భారీ స్థాయి కుంభకోణాలు ఇలాగే మరుగున పడుతుంటాయి. అంతా ముగిశాక కోర్టు తగిన సాక్ష్యాధారాలు లేవని, సీబీఐ చేసిన నిర్ధారణలు అతిశయించాయని చెబుతూ కేసు కొట్టివేస్తుంది. 2జీ స్కామ్‌లో జరిగిన ప్రహసనం ఇదే మరి.

అవలోకనం



ఆకార్ పటేల్

సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్... నేరాలకు వ్యతిరేకంగా పనిచేసే మన అత్యున్నత సంస్థ. అమెరికాకు చెందిన ఎఫ్‌బీఐలాగా, సీబీఐ కూడా నిర్దిష్టమైన అంశాలను పరిష్కరించే లక్ష్యంతో ఏర్పడింది. కమ్యూనిజం పని పట్టేందుకు ఎఫ్‌బీఐని ప్రారంభించగా, అవినీతి నివారణకు సీబీఐని నెలకొల్పారు.

కానీ, సీబీఐ వాస్తవానికి ఎంత సమర్థత కలిగి ఉంది? వార్తల్లో ప్రత్యేకంగా ఏదైనా నిలిచిన ప్రతిసారీ 'కేసును సీబీఐకి అప్పగించాలి' అనే డిమాండును మనం తరచుగా వింటూంటాం. దేశంలోని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలకు నివేదించే పోలీసు శాఖలా కాకుండా సీబీఐ ఒక కేంద్ర సంస్థగా కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తుంటుంది. నేడు ఎఫ్‌బీఐ ఉగ్రవాదంపై, మరెన్నో విషయాలపై పనిచేస్తోంది. సీబీఐ కూడా పలు విభిన్న నేరాలపై తలపడుతోంది. సీబీఐ ఎలాంటి కేసులపై పని చేయాలి? ఇది స్పష్టం కావడం లేదు. అది దేనిమీదైనా పని చేయవచ్చు.

అది హత్య కావచ్చు, ఎందుకంటే టీవీ వార్తల్లో పెద్ద ఘటనగా నిలిచింది కాబట్టి (ఆరుషి కేసు లేదా షీనా హత్య ఘటన) సీబీఐ చేపడుతుంది. కుంభకోణాలకు (2జి స్కామ్, నీరవ్ మోదీ కుంభకోణం) సంబంధించిన వివిధ సమస్యలను అది చేపట్టవచ్చు. లేదా ప్రభుత్వ అవినీతిపై విచారణను కూడా అది చేపట్టవచ్చు.

సీబీఐలో దాదాపు 6,000 మంది పనిచేస్తుంటారు. ఈ ప్రతిష్ఠాత్మక సంస్థ నుంచి జాతి పొందుతున్నదేమిటి అని ప్రశ్నించుకుంటే ఉపయోగకరమైనది చాలా తక్కువే అని సమాధానం వస్తుంది. నేర నిర్ధారణలో సీబీఐ విజయాల శాతం 2005లో 65.6 శాతం, 2006లో 72.9 శాతం, 2007లో 67.7 శాతంగా ఉండగా 2009లో 64.4 శాతంగా నమోదైంది. ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వ హయాంలో 2014లో సీబీఐ నేర నిర్ధారణ రేటు 69.02గా ఉండగా, 2015లో 65.1 శాతం, 2016లో 66.8 శాతంగా నమోదైనట్లు 2017లో కేంద్ర ప్రభుత్వం లోక్ సభలో ప్రకటించింది. కానీ ఈ శాతాలు, సంఖ్యలు పక్కతోవ పట్టిస్తున్నాయి.

'కర్బింగ్ కరప్షన్ ఇన్ ఆసియన్ కంట్రీస్ : యాన్ ఇంపాజిబుల్ డ్రీమ్?' అనే పుస్తకంలో రచయిత జాన్ ఎస్‌టి కీవాహ్.. సీబీఐ డేటా గురించి భారతీయ రచయిత ఎస్ఎస్ గిల్ రాసిన దాన్ని ఉల్లేఖించారు. 'ఘోరమైన నేరాలకు సంబంధించి 30 కేసులు, చిన్నపాటి దొంగతనాలకు సంబంధించి 70 కేసులు ఉన్నప్పుడు.. దొంగతనం కేసుల్లో 60 శాతం మేరకు నేర నిర్ధారణ చేయగలిగినప్పుడు మొత్తం



నేరాల్లో 60 శాతం నేరాలను నిర్ధారించినట్లు చెప్పుకోవడం వంచన మాత్రమే'.

ఆయన ఉల్లేఖనలకు అర్థం ఏమిటి? అవినీతి ఆరోపణలపై సీబీఐ ఎయిమ్స్ సిబ్బందిని అరెస్టు చేసింది అనే శీర్షికతో మార్చి 8న ఒక రిపోర్టు వచ్చింది. పెండింగ్ బిల్లులను పరిష్కరించడానికి సివిల్ వర్క్స్ కాంట్రాక్టర్ నుంచి రూ. 19,500లు లంచం డిమాండు చేసి తీసుకుంటుండగా కె.డి. బిస్వాల్ అనే వ్యక్తిని పట్టుకున్నామన్నది ఆ వార్తా నివేదిక సారాంశం. బిస్వాల్ ఎయిమ్స్‌లో ఒక అసిస్టెంట్ ఇంజనీర్. సీబీఐ నిందితుడి నివాసం, కార్యాలయంలో కూడా శోధించిందట. సీబీఐ నుంచి మనం ఆశించవలసింది ఇలాంటి పనులేనా? విజిలెన్స్ కమిషనర్ ఆర్. శ్రీ కుమార్ కథనం ప్రకారం పెద్ద పెద్ద నేరాలకు సంబంధించి సీబీఐ కేవలం 3.96 శాతం నేరాలను మాత్రమే నిర్ధారిస్తున్నట్లు తెలుస్తోంది.

సీబీఐలో మరొక సమస్య సంస్థాగత వంచన. సీబీఐ వ్యవస్థాపక డైరెక్టర్ డీపీ కోహ్లీ 55 ఏళ్ల క్రితం తన టీమ్‌తో ఏం చెప్పారో చూద్దాం. 'సమర్థత, సమగ్రత విషయంలో ప్రజలు మీనుంచి అత్యున్నత ప్రమాణాలను ఆశిస్తున్నారు. ఆ నమ్మకం మీరు కొనసాగించాలి. కఠిన శ్రమ, నిష్పాక్షికత, సమగ్రత అనేది సీబీఐ లక్ష్యం : మీ సమస్త కార్యాచరణను ఇదే మార్గనిర్దేశనం చేయాలి. సర్వ కాలాల్లో, సకల పరిస్థితుల్లోనూ మీరు విధి పట్ల విశ్వాసం అన్నిటికంటే ముందువరుసలో ఉంచాలి'.

కానీ సీబీఐ ఈ అత్యున్నత ప్రమాణాలను అందుకోలేకపోయింది. నిజానికి, ఇది సమస్యలో భాగమే కానీ పరిష్కారంలో భాగం కాదు. 'స్కామ్: ఫ్రమ్ హర్షద్ మెహతా టు గ్లోబల్ ట్రస్ట్ బ్యాంక్' అనే తమ పుస్తకంలో దేబాషిస్ బోస్, సుచేతా దలాల్ ఇలా రాశారు: 'సత్వరం పరిశోధన పూర్తి చేసి నేరారోపణ పత్రాన్ని దాఖలు చేయడానికి బదులుగా సీబీఐ ప్రభుత్వ చేతిపనిముట్టుగా వ్యవహరిస్తూ, ప్రమోషన్ రాని కారణంగా సీబీఐ జాయింట్ డైరెక్టర్ కె. మాధవన్ రాజీనామా చేశారు, మాదక ద్రవ్యాల వ్యాపారంలో హర్షద్ మెహతా పెట్టుబడులు పెట్టాడు వంటి వార్తలను వండి వడ్డిస్తూ పోయింది. పైగా సంయుక్త పార్లమెంట్ కమిటీకి కీలక సమాచారం ఇవ్వకుండా పదే పదే తొక్కిపెడుతూ వచ్చింది.

కుంభకోణాలకు పాల్పడిన వారి విదేశీ ఖాతాలపై దర్యాప్తు చేయాలని తానిచ్చిన సూచనను పెడచెవినపెట్టారంటూ మాధవన్ జేపీసీకి చెప్పడం నాటి సీబీఐని, దాని చీఫ్‌ని ఇబ్బందిపెట్టింది. ఆ తర్వాతే సీబీఐ 1993 ఫిబ్రవరి 14 ఆదివారం రాత్రి ప్రభుత్వ వార్తా సంస్థలైన దూరదర్శన్, పీటీఐ, యూఎన్ఐ వంటి వాటికి నివేదిస్తూ, హర్షద్ మెహతా బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసినట్లు ప్రకటించింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దీనిపై స్విస్ అధికారులను సంప్రదించి, సీబీఐ చేసిన ప్రకటన వాస్తవం కాదని తేల్చేసింది. దీంతో సీబీఐ మళ్లీ మరొక ముతక ప్రయత్నం చేస్తూ హర్షద్ ఖాతాల్లో కొన్నింటిని అంతకుముందే స్తంభింపచేశామని, తర్వాత వాటిపై ఆంక్షలు ఎత్తివేశామని ప్రకటించింది. ఇది కూడా అబద్ధమేనని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పేర్కొంది.

ఈరోజుకీ సీబీఐ పనివిధానం ఇలాగే కొనసాగుతోంది. భారత్‌లో చట్టాన్ని అమలు చేసే సంస్థలు– 'చేసింది కొంత కూసింది మాత్రం చాలా' అనే రకంగా ఉంటున్నాయి. అరెస్టులు చేస్తారు, సంచలన వార్తలు వ్యాపింప చేస్తారు. మరిన్ని సాక్ష్యాధారాలు కావాలి కాబట్టి నిందితులను మరికొన్ని రోజులు కస్టడీలోకి తీసుకోవాలని సీబీఐ న్యాయస్థానానికి విన్నవిస్తుంటుంది. భారీ స్థాయి కుంభకోణాలు ఇలాగే మరుగున పడుతుంటాయి. అంతా ముగిశాక కోర్టు తగిన సాక్ష్యాధారాలు లేవని, సీబీఐ చేసిన నిర్ధారణలు అతిశయించాయని చెబుతూ కేసు కొట్టివేస్తుంది. 2జి స్కాంలో జరిగిన ప్రహసనం ఇదే మరి. పాఠకులు ఇప్పుడు గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఒకటుంది. సీబీఏ కేసును ఛేదించిందంటూ ఈసారి కూడా వార్తా పత్రికలు, టీవీ చానల్స్ మోత మోగిస్తాయని వారు గుర్తుంచుకోవాలి మరి.

వ్యాసకర్త కాలమిస్టు, రచయిత


అమ్మకపు విలువ

గాంధీజీ సంతకంతో ఉన్న ఒక ఫొటోను ఈ మధ్య అమెరికాకు చెందిన ఆర్ ఆర్ ఆక్షన్ కేంద్రం వేలం వేసింది. దీనితో పాటు అక్టోబర్1, 1879న కారల్ మార్క్స్ రాసిన ఒక ఉత్తరాన్ని కూడా వేలం వేశారు. రెండూ అరుదైన వస్తువులే. 1930లో రౌండ్ టేబుల్ సమావేశాలకు లండన్ వెళ్లినప్పుడు మదన్‌మోహన మాలవీయతో కలసి, గాంధీజీ వ్యాహ్యాళికి వెళ్లినప్పుడు తీసిన చిత్రమది. మాలవీయ గాంధీజీ కంటే ముందే జాతీయ కాంగ్రెస్ నాయకుడు. దీని మీద గాంధీ ఫౌంటెన్ కలంతో ఎంకె గాంధీ అని సంతకం చేశారు. ఈ ఫొటోను 42,000 అమెరికన్ డాలర్లకు వేలం పాడుకున్నారు. కొలెట్ డాబ్సన్ అనే రాడికల్ ఇంగ్లిష్ సంపాదకుడికి మార్క్స్ 'రివల్యూషన్' పుస్తకాలు పంపమని లండన్ నుంచి రాసిన లేఖ. దీనిని 53,509 డాలర్లకు పాడుకున్నారు. ఆ ఇద్దరి విశేషాలు నేటికీ అమ్మకపు విలువ కలిగి ఉన్నాయన్నమాట.

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి బ.నవమి ఉ.8.58 వరకు, తదుపరి దశమి, నక్షత్రం మూల ఉ.7.01 వరకు తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం ఉ.5.17 నుంచి 7.01 వరకు, తిరిగి సా.5.40 నుంచి 7.27 వరకు దుర్ముహూర్తం సా.4.29 నుంచి 5.17 వరకు అమృతఘడియలు తె.4.23 నుంచి 6.05 వరకు.

నమాజ్ వేళలు



ఫజర్	:	5.16
జొహర్	:	12.26
అసర్	:	4.45
మగ్రీబ్	:	6.25
ఇషా	:	7.37

సూర్యోదయం : 6.18
సూర్యాస్తమయం : 6.01
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

వెనుకబడిన జిల్లాలకు బాసటగా..


పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో మాట్లాడుతున్న మోదీ. చిత్రంలో సుమిత్రా, తంబిదురై తదితరులు

వాటి అభివృద్ధికి పాటుపడి సామాజిక న్యాయం దిశగా అడుగులు వేద్దాం

- పార్లమెంటు, అసెంబ్లీల సభ్యుల సదస్సులో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: అత్యంత వెనకబడ్డ జిల్లాల అభివృద్ధికి పాటుపడటం సామాజిక న్యాయం దిశగా అడుగులు వేయడమేనని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆ క్రమంలో దేశంలోని 115 వెనకబడ్డ జిల్లాల అభివృద్ధి కోసం చట్ట సభ్యులు కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయాలే సర్వస్వంగా భావించే ఒకప్పటి పరిస్థితి ఇప్పుడు లేదని, ప్రజలకు సాయపడేందుకు వచ్చామా? లేదా అన్నదే ముఖ్యమన్నారు. శనివారం పార్లమెంటు సెంట్రల్ హాలులో నిర్వహించిన 'వియ్ ఫర్ డెవలప్‌మెంట్' సదస్సులో కేంద్ర మంత్రులు, ఎంపీలు, రాష్ట్రాలకు చెందిన శాసన సభ్యుల్ని ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. 'పిల్లలంతా స్కూళ్లకు వెళ్లినప్పుడు అన్ని ఇళ్లకు విద్యుత్ సరఫరా ఉన్నపుడు మాత్రమే సామాజిక న్యాయం దిశగా అడుగులు వేసినట్లుగా భావించాలి. అభివృద్ధిలో వెనకబాటుకు నిధులు లేదా వనరుల కొరతో కారణం కాదు.. పాలనా లోపాల వల్లే ఆ పరిస్థితి కొనసాగుతోంది. అభివృద్ధికి కావాల్సినవి సుపరిపాలన, సమర్థవంతంగా పథకాల అమలు, అంకితభావంతో కార్యక్రమాల్ని నిర్వహించడమే' అని మోదీ పేర్కొన్నారు. 'ఒక ఇంట్లో లేక ఊరిలో విద్యుత్ ఉండి పక్కింట్లో, గ్రామంలో లేకపోతే వారూ కరెంటు పొందేలా చూడాలని సామాజిక న్యాయం మనకు బోధిస్తుంది' అని చెప్పారు. 'మీరు అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా... ప్రజలకు సాయం చేసేందుకు వచ్చారా? లేదా? అన్నదే అసలు సంగతి. ఎన్ని ఆందోళనలు చేశారు... ఎన్ని సార్లు మీరు జైలు కెళ్లారు? అనేవి 20 ఏళ్లక్రితం ప్రాముఖ్యంగా ఉండేవి. ఇప్పుడు పరిస్థితి మారింది' అని చెప్పారు. తమ ప్రాంతాల్లో అభివృద్ధి లక్ష్యాల్ని పూర్తి చేసే దిశగా చట్టసభ్యులు పనిచేయాలని మోదీ కోరారు. మళ్లీ మళ్లీ చట్టసభలకు ఎన్నికయ్యే వారిని రాజకీయాలకు అతీతంగా ఓటర్లు చూస్తారని చెప్పారు.

ఏడాది కష్టపడితే మెరుగైన ఫలితాలు

దేశంలోని వెనకబడ్డ 115 జిల్లాల్లో అభివృద్ధి సాధించినప్పుడే సామాజిక న్యాయం దిశగా అడుగులు వేసినట్లని ప్రధాని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో చట్టసభ్యులు నిజాయతీగా ఒక ఏడాది పనిచేస్తే.. గొప్ప మార్పు సాధించవచ్చని, మానవ అభివృద్ధి సూచీలో భారత్ పైకి ఎగబాకుతుందని చెప్పారు. సులువుగా ఫలితాలు రాబట్టేందుకే ప్రభుత్వాలు మొగ్గుచూపుతాయని, అందుకే అభివృద్ధి చెందిన జిల్లాల్లో మరింత మెరుగైన ప్రదర్శన ఉంటే.. వెనకబడిన జిల్లాలు మరింత దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే వాటిని వెనకబడ్డ జిల్లాలుగా కాకుండా అభివృద్ధిని ఆకాంక్షించే జిల్లాలుగా కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. ఈ 115 జిల్లాలకు కలెక్టర్లుగా యువ ఐఏఎస్‌లను నియమించాలని మోదీ కోరారు. 'ఆ జిల్లాల అధికారులతో సమావేశమైనప్పుడు.. వారిలో 80 శాతం 40 ఏళ్లు పైబడ్డ వారే ఉండడం చూసి ఆశ్చర్యపోయాను. మామూలుగా జిల్లా కలెక్టర్ వయసు 27–30 మధ్యలో ఉంటుంది' అని అన్నారు.

సుపరిపాలనతోనే అభివృద్ధి

అందుబాటులో ఉన్న వనరులు, శ్రమశక్తిని వాడుకుని అంకితభావంతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. సుపరిపాలన ప్రాముఖ్యత గురించి చెపుతూ.. పేద ప్రాంతాల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం సరిగా అమలు కాలేదని, ధనిక ప్రాంతాల్లో సమర్థంగా అమలైందని.. సుపరిపాలన వల్లే అది సాధ్యమైనట్లు గుర్తించానని ప్రధాని చెప్పారు. పార్లమెంటు సెంట్రల్ హాలులోనే జవహర్ లాల్ నెహ్రూ, బీఆర్ అంబేద్కర్, సర్దార్ పటేల్ తదితరులు రాజ్యాంగాన్ని సిద్ధం చేశారన్న విషయాన్ని మోదీ గుర్తు చేసుకుంటూ.. అదే హాలులో చట్ట సభ్యులు దేశాభివృద్ధి కోసం సంఘీభావంగా హాజరుకావడాన్ని ఆయన ప్రశంసించారు. వివిధ పార్టీలకు చెందిన పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు అభివృద్ధి అంశంపై కలిసి కూర్చోవడం రాష్ట్రాల సమాఖ్య స్ఫూర్తికి సజీవ నిదర్శనమని పేర్కొన్నారు. చట్ట సభ్యులు రాష్ట్ర యంత్రాగానికి చేయూతగా ఉండాలని ఆకాంక్షించారు.



ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన బాధితుల శరీరంలోకి అధిక శాతంలో ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన రక్తం ఎక్కించడం ప్రమాదకరమైందని శాస్త్ర వేత్తలు హెచ్చరిస్తు న్నారు. దుష్ప్రభావాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని చెబుతున్నారు.

ఏప్రిల్ 1 నుంచి ఈ-వే బిల్లు అమలు



న్యూఢిల్లీ: అంతర్రాష్ట్ర సరకు రవాణా కోసం ఎలక్ట్రానిక్-వే బిల్లును వచ్చే నెల 1 నుంచి తప్పనిసరి చేయాలని వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) మండలి నిర్ణయించింది. పన్ను రిటర్నుల విధానాన్ని మరింత సరళీకరించడంపై సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో జీఎస్టీ మండలి ప్రస్తుత విధానాన్నే మరో 3 నెలలు పొడిగించినట్లు ఆర్థిక మంత్రి జైట్లీ చెప్పారు. వాణిజ్య సంస్థలు ప్రతినెలా జీఎస్టీఆర్-3బీ, జీఎస్టీఆర్-1 అనే 2 రకాల రిటర్నులు ఇస్తున్నాయి. వీటిని సరళీకరించి ఒకే రిటర్ను పత్రాన్ని ఇచ్చే విధానాన్ని తీసుకురావాలని భావించామనీ, సభ్యుల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడంతో ఆ నిర్ణయం వాయిదా పడిందని జైట్లీ చెప్పారు. దీంతో ప్రస్తుతం ఉన్న రిటర్నుల విధానాన్నే జూన్ వరకు పొడిగించినట్లు ఆయన వెల్లడించారు. కాగా, అంతర్రాష్ట్ర రవాణా కోసం ఈ-వే బిల్లును ప్రభుత్వం ఫిబ్రవరి 1నే అమలు చేయగా ఆ వ్యవస్థలో లోపాలు తలెత్తి సరిగ్గా పనిచేయకపోవడం తెలిసిందే. దీంతో తప్పులను సరిదిద్ది అంతర్రాష్ట్ర సరకు రవాణా కోసం ఏప్రిల్ 1 నుంచి ఈ-వే బిల్లులను మళ్లీ తప్పనిసరి చేయాలని జీఎస్టీ మండలి నిర్ణయించింది. ఒకే రాష్ట్రంలో రవాణాకు కూడా ఈ-వే బిల్లులను దశల వారీగా తప్పనిసరిచేస్తామనీ, ఇందుకోసం రాష్ట్రాలను నాలుగు భాగాలుగా విభజిస్తామని జైట్లీ తెలిపారు. జూన్ 1 నాటికి అన్ని రాష్ట్రాల్లోనూ ఈ-వే బిల్లుల వ్యవస్థ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందన్నారు. ఏప్రిల్ 15న తొలిదశను అమలు చేస్తామనీ, ఆ రాష్ట్రాలేవో ఏప్రిల్ 7న ప్రకటిస్తామని ఆయన తెలిపారు. అలాగే ఎగుమతిదారులకు జీఎస్టీ కింద రీఫండ్‌లు చెల్లించేందుకు ఈ-వాలెట్‌ను అక్టోబరు 1 నాటికి అందుబాటులోకి తెస్తామని చెప్పారు.

అమెరికాలో కాల్పుల్లో ముగ్గురి మృతి

లాస్‌ఏంజిలస్: అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో ఓ సైనిక చికిత్సాలయంలోకి చొరబడిన దుండగుడు ముగ్గురు మహిళలను తుపాకీతో కాల్చి చంపి ఆ తర్వాత తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. దుండగుడు మాజీ సైనికుడని సమాచారం. స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం ఉదయం నాపా వ్యాలీలో ఉన్న 'వెటరన్స్ హోమ్ ఆఫ్ కాలిఫోర్నియా' చికిత్సాలయంలోకి ప్రవేశించిన దుండగుడు అక్కడి ఏడుగురు మహిళలను బందీలుగా చేసుకున్నాడు. తర్వాత నలుగురిని వదిలేశాడు. సాయంత్రం భద్రతా దళాలు అతను దాక్కొన్న గదిలోకి వెళ్లగా ముగ్గురు మహిళల, అతని మృతదేహాలున్నాయి. వారిని తుపాకీతో కాల్చి తర్వాత అతనూ ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. అతను అదే చికిత్సాలయంలో మానసిక రుగ్మతలకు చికిత్స చేయించుకునేవాడని స్థానిక పత్రిక పేర్కొంది. కాగా, అనూహ్య దాడులను ఎదుర్కొనేందుకు ఫ్లోరిడాలోని పాఠశాలల్లో శిక్షణ పొందిన సిబ్బందికి ఆయుధాలు ఇవ్వడానికి సంబంధించిన బిల్లును చట్టంగా మార్చారు. తుపాకులు కొనడానికి కనీస అర్హత వయసును 18 నుంచి 21 పెంచారు.

హిమాలయాలకు రజనీకాంత్



సాక్షి, చెన్నై: సినీ నటుడు రజనీకాంత్ మరోసారి హిమాలయాల బాటపట్టారు. శనివారం చెన్నై నుంచి విమానంలో సిమ్లాకు బయలుదేరారు. ఆధ్యాత్మిక పర్యటనకు రజనీకాంత్ శ్రీకారం చుట్టడంతో తమిళ సంవత్సరాదిన కొత్త రాజకీయ పార్టీ ప్రకటన ఖాయమని పరిశీలకులు భావిస్తున్నారు. తాను ఏ కార్యక్రమం తలపెట్టినా ముందుగా హిమాలయాలకు వెళ్లి బాబా ఆశీస్సులు పొందే రజనీ ఇప్పుడు కూడా అదే ఉద్దేశంతో హిమాలయ పర్యటనకు వెళ్లినట్లు సమాచారం. పర్యటనలో భాగంగా సిమ్లాకు, తర్వాత ధర్మశాల, రిషికేశ్‌లకు వెళ్లనున్నారు. రాజకీయ పార్టీ ఏర్పాటులో భాగంగా బాబా ఆశీస్సుల కోసం వెళ్తున్నారా అని చెన్నైలో మీడియా ప్రశ్నించగా, 'ఇప్పుడెందుకు ఆ ప్రశ్న' అని దాట వేశారు.

సురేశ్ ప్రభుకు విమానయాన శాఖ

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి సురేశ్ ప్రభుకు అదనంగా పౌరవిమానయాన మంత్రిత్వశాఖ బాధ్యతలను శనివారం ప్రభుత్వం అప్పగించింది. విమానయాన శాఖా మంత్రిగా పనిచేస్తున్న టీడీపీ ఎంపీ అశోక్ గజపతిరాజు రాజీనామాను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదించిన మరుసటి రోజే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రధాని మోదీ సలహా మేరకు రాష్ట్రపతి కోవింద్ పౌరవిమానయాన శాఖ అదనపు బాధ్యతలను సురేశ్ ప్రభుకు అప్పగించారని రాష్ట్రపతిభవన్ అధికార ప్రతినిధి ఓ ప్రకటనలో తెలిపారు.

ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శిగా భయ్యాజీ

నాగ్‌పూర్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) ప్రధాన కార్యదర్శిగా సురేష్ భయ్యాజీ జోషి మరోసారి ఎన్నికయ్యారు. శనివారం ఇక్కడ జరిగిన సంఘ్ సమావేశంలో ఆయన మరో దఫా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆర్‌ఎస్‌ఎస్ ప్రచార్ ప్రముఖ్ మన్మోహన్ వైద్య తెలిపారు. దేశ వ్యాప్తంగా ఉన్న సంఘ్ ఆఫీస్ బేరర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని వివరించారు. 2009 నుంచి ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న భయ్యాజీ జోషి తాజా ఎన్నికతో 2021 వరకు పదవిలో ఉంటారు. జోషితో పాటు కర్ణాటక, ఏపీ, తెలంగాణ ఆర్‌ఎస్‌ఎస్ వ్యవహారాలను పర్యవేక్షించే నాగరాజ్ క్షేత్రీయ సంఘ్ సంచాలక్‌గా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

హీరోయిన్ సింధు మీనన్‌పై చీటింగ్ కేసు



సాక్షి, బెంగళూరు: 'చందమామ' ఫేం, హీరోయిన్ సింధు మీనన్‌పై చీటింగ్ కేసు నమోదైంది. నకిలీ పత్రాలు సమర్పించి రుణం పొందడంతో పాటు ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు సింధు మీనన్‌తో పాటు ఆమె ముగ్గురు సోదరులపై బెంగళూరు ఆర్‌ఎంసీ యార్డ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జ్యుబిలెంట్ మోటార్స్ వర్క్స్ ప్రై.లి. సంస్థ పేరుతో ఆర్‌ఎంసీ యార్డ్‌లోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ నుంచి మీనన్ రూ.36 లక్షలు రుణం తీసుకున్నారు. ఆమె రుణం కోసం సమర్పించిన పత్రాలు నకిలీవని గుర్తించిన బ్యాంక్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చీటింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు మీనన్‌ను అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించినా.. ఆమె విదేశాల్లో ఉండటంతో వీలుకాలేదు. మీనన్ సోదరుడు కార్తికేయన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బంధం బలపడేలా..

ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్, ప్రధాని మోదీ చర్చలు

- భారత్–ఫ్రాన్స్ మధ్య 14 ఒప్పందాలు
- రాఫెల్ యుద్ధ విమానాల డీల్ వివరాలు వెల్లడించని ప్రభుత్వం


ఢిల్లీలో ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్, రాష్ట్రపతి కోవింద్ దంపతులతో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: భారత్–ఫ్రాన్స్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు బలపడే దిశగా ఇరు దేశాలు అడుగులు వేశాయి. అత్యంత కీలకమైన రక్షణ, భద్రత, అణు ఇంధనం, రహస్య సమాచార రక్షణతో పాటు మొత్తం 14 అంశాలపై భారత్–ఫ్రాన్స్ కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఇండో–పసిఫిక్ రీజియన్‌లో సహకారాన్ని విస్తృతం చేయాలని, ఉగ్రవాదం కట్టడికి ఉమ్మడి చర్యలను పెంచాలని నిర్ణయించాయి. శనివారం ఢిల్లీలో ప్రధాని మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్ మధ్య ద్వైపాక్షిక చర్చల తర్వాత ఇరు దేశాల ఉన్నతాధికారులు ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఒప్పందాల్లో సాయుధ దళాల పరస్పర సహకారం, రహస్య సమాచార రక్షణ, జైతాపూర్ అణు విద్యుత్ ప్రాజెక్టు, రైల్వేలు, సౌరశక్తి, సముద్రతీర అవగాహన, మాదక ద్రవ్యాల నియంత్రణ మొదలైనవి ఉన్నాయి. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి జరిగిన వేల కోట్ల రూపాయల విలువైన ఒప్పందం వివరాలను భారత్ వెల్లడించలేదు. 2016లో భారత్–ఫ్రాన్స్ మధ్య 36 రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం విలువ సుమారు రూ.58 వేల కోట్లు. ఒప్పందానికి సంబంధించిన వివరాలు వెల్లడించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. మోదీ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం కంటే దీని విలువ తక్కువే ఉంటుందని ఆరోపించింది. మరోవైపు సాయుధ దళాల పరస్పర సహకార ఒప్పందం ప్రకారం ఒకరి మిలిటరీ బేస్‌లను మరొకరు వాడొచ్చు.

అత్యంత నమ్మకమైన రక్షణ భాగస్వామి ఫ్రాన్స్

అనంతరం సంయుక్తంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రధాని మోదీ, మాక్రాన్ మాట్లాడారు. 'మా రక్షణ సహకారం పటిష్టమైనది. భారత్‌కు అత్యంత నమ్మకమైన రక్షణ భాగస్వామి ఫ్రాన్స్' అని మోదీ అన్నారు. ఇరు దేశాల సాయుధ దళాల మధ్యా పరస్పర లాజిస్టిక్ సహకారం రక్షణ సంబంధాల్లో కొత్త శకమన్నారు. ప్రాంతీయ సుస్థిరత, శాంతికి హిందూ మహా సముద్రం కీలకపాత్ర పోషించనుందని స్పష్టం చేశారు.

రక్షణ సంబంధాల్లో నూతన శకం..

స్కార్పీన్ జలాంతర్గాముల ప్రాజెక్టు, ఫైటర్ జెట్ల ఒప్పందం నేపథ్యంలో ఇరుదేశాల మధ్యా రక్షణ సంబంధాల్లో నూతన శకం ఆరంభమైందని మాక్రాన్ అన్నారు. యుద్ధ విమానాల ఒప్పంద పురోగతిని తాము స్వయంగా పర్యవేక్షిస్తానని, ఈ ప్రాజెక్టు కొనసాగాలని తాము భావిస్తున్నామని, ఇరు దేశాలకు లబ్ధి చేకూర్చే దీర్ఘకాలిక ఒప్పందం ఇదని చెప్పారు. భారత్ తమ మొదటి వ్యూహాత్మక భాగస్వామి కావాలని ఆశిస్తున్నట్టు చెప్పారు. సముద్ర తీరాలు ఆధిపత్యపోరాటానికి వేదికలు కాదని, పరోక్షంగా చైనాను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఏటా రక్షణ రంగానికి సంబంధించి మంత్రుల స్థాయిలో చర్చలు జరపాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. రక్షణ మంత్రి సీతారామన్, ఫ్రాన్స్ రక్షణ మంత్రి పార్లే చర్చించారు

ట్రంప్ సరైనోడు కాదు!

ప్రశ్నించే గొంతుక లేకుండా చేస్తున్నారు

- ప్రపంచం భారత్ నాయకత్వాన్ని కోరుకుంటోంది: హిల్లరీ



ముంబై: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆ స్థానానికి అర్హుడు కాదని, గత ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా పోటీచేసిన హిల్లరీ క్లింటన్ విమర్శించారు. ట్రంప్ గెలుస్తారని ఎవరూ అనుకోలేదన్నారు. పారిస్ ఒప్పందంపై సంతకాల విషయంలో అన్ని దేశాలను ఒప్పించటంలో భారత్ పెద్దన్నపాత్ర పోషించిందని ప్రశంసించారు. ముంబైలో ఇండియాటుడే సదస్సు – 2018లో పాల్గొన్న క్లింటన్.. ట్రంప్ పాలన తీరు, అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం, అంతర్జాతీయంగా పెరుగుతున్న భారత ప్రాభవం వంటి పలు అంశాలపై ఆసక్తికర అంశాలు వెల్లడించారు. రష్యా తీరును అంతర్జాతీయ సమాజం ముందు తీవ్రంగా వ్యతిరేకించినందునే.. పుతిన్‌కు తానంటే వ్యక్తిగతంగా నచ్చదని హిల్లరీ పేర్కొన్నారు. దీని కారణంగానే.. 2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తనకు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల ద్వారా దుష్ప్రచారం చేశారన్నారు. తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయటంలో సామాజిక మాధ్యమం ఓ ఆయుధంలా మారిందని.. ఇది సమాజంలో సామరస్యాన్ని దెబ్బతీస్తుందని హిల్లరీ అభిప్రాయపడ్డారు. భారత సమాజంలోనూ విభేదాలు సృష్టించేందుకు ఈ మాధ్యమం ద్వారా ఎవరైనా ప్రయత్నించే అవకాశం ఉందన్నారు.

అమెరికాలో ప్రజాస్వామ్యం లేదు

అమెరికా అధ్యక్ష స్థానానికి ట్రంప్ సరైన వ్యక్తి కాదన్నారు. అధ్యక్ష ఎన్నికల్లో తన ప్రచారం సంప్రదాయపద్ధతిలో జరిగిందని.. ముఖ్యమైన అంశాలను స్పృశించానన్నారు. అయితే.. ట్రంప్ ప్రచారం ఓ టీవీ రియాల్టీ షోలా ప్రహసనంగా సాగిందన్నారు. 2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తనదే విజయమని భావించానని హిల్లరీ తెలిపారు. అమెరికాలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన అవసరముందన్నారు. అమెరికాలో ప్రశ్నించే గొంతుకలకు స్థానం లేకుండా చేస్తున్నారన్నారు. ప్రజలు ఒకరిపై ఒకరు విషం చిమ్ముకునేందుకు సామాజిక మీడియానే కారణమవుతోందన్నారు.

భారత్ నాయకత్వాన్ని కోరుతున్నారు..

అంతర్జాతీయంగా భారత ప్రాభవం పెరుగుతోందని.. ప్రపంచ వ్యాప్తంగా శాంతి వెల్లివిరియటంలో భారత్ పాత్ర కీలకం కానుందని హిల్లరీ తెలిపారు. పారిస్ పర్యావరణ ఒప్పందం నుంచి ట్రంప్ బయటకు రావటాన్ని విమర్శించిన హిల్లరీ.. అమెరికాకు ఇది అత్యంత అవమానకరమన్నారు. అమెరికా తప్పుకున్నప్పటికీ.. ఈ ఒప్పందంపై అందరినీ ఒప్పించటంలో భారత్ పోషించిన పాత్ర అభినందనీయమన్నారు. ప్రతి ఒక్క దేశంతో మాట్లాడి.. వివరాలను అర్థం చేయించారని భారత్ ప్రభుత్వాన్ని ప్రశంసించారు. 'పర్యావరణాన్ని దోచుకోవటం సరికాదు. దీన్ని కాపాడుతూనే ప్రపంచం లబ్ధి పొందాలి' అని పారిస్ ఒప్పందం సమయంలో మోదీ వ్యాఖ్యలను క్లింటన్ గుర్తుచేశారు. ప్రపంచంలో పర్యావరణ మార్పుపై భారత నాయకత్వాన్ని ప్రపంచం కోరుకుంటోందన్నారు.

జాతీయ క్యారియర్‌గా ట్రూజెట్

మరో 20 రూట్లలో విమాన సేవలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హైదరాబాద్ కేంద్రంగా రెండున్నరేళ్ల కిందట ప్రాంతీయ విమానయాన సంస్థగా సేవలు ఆరంభించిన ట్రూ జెట్.. జాతీయ స్థాయి సంస్థగా ఆవిర్భవిస్తోంది. టర్బో మేఘా ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఈ సంస్థ... తాజాగా మరో 20 రూట్లలో విమాన సేవలు ఆరంభించేందుకు అనుమతులు సాధించినట్లు ప్రకటించింది. ప్రాంతీయంగా కనెక్టివిటీకి ఉద్దేశించిన ఉడాన్ పథకం రెండో దశ కింద ఈ 20 రూట్లలో తాము లైసెన్సులు పొందినట్లు టర్బో మేఘా ఎయిర్‌వేస్ హెడ్ (కమర్షియల్ విభాగం) సెంథిల్ రాజా తెలియజేశారు. కొత్త రూట్లలో అహ్మదాబాద్ – పోర్‌బందర్, జైసల్మేర్, నాసిక్, జల్గామ్, గౌహతి– కుచిహార్, బర్నపూర్, తేజు, తేజపూర్ తదితరాలున్నాయి. ''ఇప్పటిదాకా ట్రూజెట్ ద్వారా 10 లక్షల మంది ప్రయాణించారు. తాజా రూట్లతో పశ్చిమ, తూర్పు తీరంతో పాటు ఈశాన్య భారత్‌లో కూడా సేవలు విస్తరించినట్లు అవుతుంది. ఈ నెల 25న చెన్నై–సేలం రూట్‌లో విమాన సేవలు ప్రారంభిస్తున్నాం. ప్రమోషనల్ ఆఫర్‌గా టికెట్‌ను రూ.599కే ఆఫర్ చేస్తున్నాం'' అని రాజా వివరించారు. ఇంజినీరింగ్, కన్‌స్ట్రక్షన్ దిగ్గజం 'మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్(ఎంఈఐఎల్)లో టర్బోమేఘా ఎయిర్‌వేస్ భాగంగా ఉంది.

మరో ఏడు విమానాల కొనుగోలు..

ట్రూజెట్‌కు ప్రస్తుతం 5 విమానాలున్నాయి. వీటితో 13 ప్రాంతాలకు రోజుకు 32 సర్వీసులు నడుపుతోంది. త్వరలోనే మరో ఏడు విమానాలను సమకూర్చుకోనున్నట్లు రాజా చెప్పారు. ప్రస్తుతం హైదరాబాద్, ముంబై, చెన్నై, బెంగళూరు, ఔరంగాబాద్ రూట్లతో పాటు ఉడాన్ స్కీమ్ కింద కడప, ఔరంగాబాద్, మైసూరు ప్రాంతాలకు సర్వీసులు నడుపుతున్నట్లు తెలియజేశారు. ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రంగా రోజూ సుమారు 2 వేల మందిని వివిధ ప్రాంతాలకు చేరుస్తున్నట్లు తెలియజేశారు.

సీఎఫ్‌ఎంతో స్పైస్‌జెట్ భారీ డీల్

గురుగ్రామ్: విమానయాన సేవల సంస్థ స్పైస్‌జెట్ తాజాగా జెట్ ఇంజిన్ల తయారీ సంస్థ సీఎఫ్‌ఎం ఇంటర్నేషనల్‌తో 12.5 బిలియన్ డాలర్ల ఒప్పందం కుదుర్చుకుంది. లీప్ 1బీ ఇంజిన్ల కొనుగోలు, సర్వీసులకు ఈ డీల్ ఉపయోగపడనుంది. ప్రస్తుతం తమ విమానాల్లో ఉపయోగిస్తున్న సీఎఫ్‌ఎం56 కన్నా లీప్–1బీ ఇంజిన్లు సమర్థమంతంగా ఉండగలవని స్పైస్‌జెట్ చైర్మన్ అజయ్ సింగ్ తెలిపారు. ప్రస్తుతం 38 పైచిలుకు 'సీఎఫ్‌ఎం56–7బి' ఇంజిన్ల ఆధారిత బోయింగ్ '737' రకం విమానాలు స్పైస్‌జెట్ ఉపయోగిస్తోంది.

కాలునే దిండుగా..

యూపీలో డాక్టర్ల నిర్వాకం



ఝూన్సీ: ఉత్తరప్రదేశ్‌లో వైద్యుల నిర్లక్ష్యం మరోసారి బట్టబయలైంది. ఝూన్సీ పట్టణంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి కాలును తొలగించిన వైద్యులు.. ఆ కాలును తలగడగా వినియోగించి మరోసారి అమానవీయంగా వ్యవహరించారు. క్యాజువాలిటీ వార్డ్‌లో స్ట్రెచర్‌పై పడుకున్న రోగి.. ఆయన తలగడగా తొలగించిన కాలున్న వీడియోను ఓ స్థానిక టీవీ ప్రసారం చేసింది. దీంతో ఈ ఆసుపత్రి డాక్టర్ల తీరుపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఓ స్కూలు బస్సుకు క్లీనర్‌గా పనిచేస్తున్న వ్యక్తిని.. శనివారం బస్సు ప్రమాదంలో కాలు విరగటంతో హుటాహుటిన ఝూన్సీ ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. అయితే ఇన్‌ఫెక్షన్ శరీరమంతా వ్యాపించకుండా ఉండేందుకు డాక్టర్లు వెంటనే కాలు తీసేశారు. అనంతరం, బెడ్‌పై కాకుండా స్ట్రెచర్‌పైనే ఆ వ్యక్తికి చికిత్సనందించిన డాక్టర్లు.. ఆ వ్యక్తికి ఆయన కాలునే తలగడగా పెట్టారు. దీన్ని స్థానిక మీడియా బయటపెట్టడంతో ఈ విషయం ప్రభుత్వ ఉన్నతాధికారుల వరకూ వెళ్లింది. దీనిపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. అయితే, తొలగించిన కాలు ఎలా గదిలోకి వచ్చిందో తెలియదని డాక్టర్లంటున్నారు. ఈ ఘటనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు ఆసుపత్రిలోనే కాలు తొలగించామని, లోపలకు ఎలా వచ్చిందో తెలియదని చెబుతుండగా.. ప్రమాదం జరిగిన చోటే కాలు తెగిపోయిందని, కుటుంబ సభ్యులు దీన్ని తీసుకొచ్చి ఉంటారని మరికొందరంటున్నారు. అయితే.. ఈ ఆసుపత్రిలో స్వీపర్లు, వార్డ్‌బాయ్‌లే చిన్న చిన్న సర్జరీలు చేస్తున్నారనే ఆరోపణలు వినబడుతున్నాయి.

'మహా' మార్చ్

నాసిక్ నుంచి 30 వేల మంది రైతుల పాదయాత్ర

- రేపు అసెంబ్లీ ముట్టడికి సన్నాహాలు


థానెలో నినాదాలిస్తూ ముందుకు కదులుతున్న వేలాదిమంది రైతులు

ముంబై: చరిత్రలో రైతు ఉద్యమాలు ఎన్నో చూశాం. కానీ రికార్డు స్థాయిలో వేలాది మంది అన్నదాతలు 180 కి.మీ మేర పాదయాత్ర చేపట్టడం బహుశా ఇదే తొలిసారేమో! ఇప్పుడు మహారాష్ట్రలో జరుగుతోంది ఇదే. రుణ మాఫీ అమలు సహా ఇతర సమస్యలు పరిష్కరించాలని సుమారు 30 వేల మంది రైతులు మార్చి 6న నాసిక్ నుంచి ముంబైకి మహా యాత్రగా బయల్దేరారు. మార్గ మధ్యలో వారికి థానె, పాల్ఘడ్ తదితర జిల్లాల రైతులు జతకలిశారు. 12న ర్యాలీ ముంబై చేరుకునే సరికి రైతుల సంఖ్య 70 వేలకు పెరగొచ్చు. అదే రోజు రాష్ట్ర అసెంబ్లీని ముట్టడించే వీలుంది. భారతీయ కిసాన్ సభ ఈ పోరాటానికి నేతృత్వం వహిస్తోంది. ముంబై–ఆగ్రా జాతీయ రహదారి మీదుగా మార్చ్ కొనసాగుతోంది. రైతులు భోజనాలు, నిద్ర లాంటి అవసరాలను రోడ్లపైనే తీర్చుకుంటున్నారు. ఈ మహా పాదయాత్రలో మహిళా రైతులు, 90 ఏళ్లకు పై బడిన వృద్ధులు కూడా ఉన్నారు.

అసంతృప్తిని రగిల్చిన పంట నష్టం..

ఈ ఏడాది అకాల వర్షాలు రైతన్నలను నిండా ముంచాయి. పింక్ బాల్ వార్మ్ చీడ పత్తి పంటను దెబ్బతీసింది. ఫిబ్రవరిలో కురిసిన వడగళ్ల వానలకు లక్షలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. 19 జిల్లాల్లో రబీ పంట తుడిచిపెట్టుకుపోయింది. ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు చూస్తూ ఉంది. గత ఏడాది మహారాష్ట్ర సర్కార్ రూ. 34 వేల కోట్ల రుణాల మాఫీకి హామీ ఇచ్చినా అది క్షేత్రస్థాయిలో సరిగా అమలు కాలేదు. దీంతో అన్నదాతల్లో అసంతృప్తి కట్టలు తెంచుకుని ఉద్యమానికి దారి తీసింది.

ఆగని ఆత్మహత్యలు..

రుణ మాఫీ పథకం అమలులో ప్రభుత్వం వైఫల్యం చెందడం వల్ల రైతుల ఆత్మహత్యలు ఆగలేదు. గత ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు 1753 మంది రైతన్నలు బలవన్మరణానికి పాల్పడ్డారు. విదర్భ, మరఠ్వాడ, నాసిక్ ప్రాంతాల్లో ఎక్కువ మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. మరోవైపు, రైతులకు చేయాల్సినదంతా చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. 35 లక్షల 68 వేల మంది రైతులకు లబ్ధి చేకూరేలా రుణమాఫీ పథకం కింద ఇప్పటివరకు రూ. 13, 782 కోట్లు విడుదల చేశామని తెలిపింది. రైతు సమస్యల పరిష్కారానికి రూ. 2,400 కోట్ల ఆర్థిక సాయం కోరగా కేంద్రం నుంచి స్పందన రాలేదు.

రైతుల డిమాండ్లు ఇవీ..

- ఫడ్నవీస్ సర్కార్ ఇచ్చిన మాట నిలబెట్టుకొని రైతు రుణాలన్నీ మాఫీ చేయాలి
- విద్యుత్ బిల్లుల్ని రద్దు చేయాలి
- స్వామినాథన్ కమిటీ సిఫారసులన్నీ అమలు చేయాలి
- కనీస మద్దతు ధరతో రైతులకు ఒరిగేదేమీ లేదు. చట్టబద్ధమైన ధరను కల్పించాలి.
- అకాల వర్షాలు, పింక్ బాల్ వార్మ్ కారణంగా పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం పెంచాలి
- బుల్లెట్ రైళ్లు, సూపర్‌హైవేలు వంటి అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో పంటభూముల్ని బలవంతంగా స్వాధీనం చేసుకోవడాన్ని నిలిపివేయాలి.


తొలి వింటర్ పారా ఒలింపిక్స్ 1976లో స్వీడన్‌లో జరిగాయి.



పని చేయలేదని పనిపట్టారు..!



ప్రజాప్రతినిధి అంటే మన కోసం మనం ఎన్నుకున్న వ్యక్తి. అలాంటి వ్యక్తి మన కోసం పనిచేయకపోతే.. తన పనితీరు మనకు నచ్చకపోతే.. ఏం చేస్తారు.. ఆ.. ఏముంది చేసేందుకు.. మన ఖర్మ అని నోరు మూసుకుని కూర్చోవడం తప్ప.. అనుకుంటాం కదా..! కానీ బొలీవియాలోని బ్యూనవెంచురా అనే మున్సిపాలిటీలో ప్రజలు మాత్రం అలా చేతులు ముడుచుకుని కూర్చోరు. ప్రజా సేవలో కాస్త అలసత్వం ప్రదర్శించినా నిలదీయడమే కాదు.. వారికి తెలిసొచ్చేలా బుద్ధి చెబుతారు. అక్కడి మేయర్ జావియర్ డెల్గడో తన విధుల్లో అలసత్వం ప్రదర్శించినందుకు తగిన శాస్తి చేశారు అక్కడి ప్రజలు. ఆ మేయర్ కాలును ఓ స్తంభానికి గంటపాటు కట్టేశారు. దీనివల్ల వారి అసంతృప్తి సదరు ప్రజాప్రతినిధికి తెలిసి మరుసటి రోజు నుంచి ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేస్తాడని వారి ఆశ. అక్కడ ప్రభుత్వం నిర్మించిన ఓ బ్రిడ్జి ప్రారంభోత్సవానికి వెళ్లిన జావియర్‌కు అక్కడి జనం షాక్ ఇచ్చారు. అయితే తన రాజకీయ ప్రత్యర్థులు పన్నిన కుట్ర అని, ప్రజలకు సేవ చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నానని జావియర్ చెబుతున్నాడు. ఇంకో విషయం ఏంటంటే తమ ప్రజాప్రతినిధులు అందిస్తున్న సేవలతో అసంతృప్తి కనుక ఉంటే ప్రజలు ఇలా శిక్ష విధించవచ్చని అక్కడి రాజ్యాంగం కూడా హక్కును ప్రసాదించింది.



ఈటల జోలికొస్తే ప్రజలే బుద్ధి చెబుతారు

రేవంత్‌రెడ్డికి టీఎంఆర్‌పీఎస్ హెచ్చరిక

హైదరాబాద్: అణగారిన కులాల ప్రతినిధి, మంత్రి ఈటల రాజేందర్ జోలికొస్తే రేవంత్‌రెడ్డికి అణగారిన కులాల ప్రజలే బుద్ధి చెబుతారని టీఎంఆర్‌పీఎస్ ప్రతినిధులు హెచ్చరించారు. శనివారం విద్యానగర్‌లోని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు యాతాకుల భాస్కర్ మాదిగ, జాతీయ ప్రధాన కార్యదర్శి మేడి పాపయ్య మాదిగ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ మాట్లాడారు. కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి పనిగట్టుకొని అణగారిన వర్గాలనే టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. రేవంత్ గతంలో కడియం శ్రీహరి, ఎమ్మెల్యే వీరేశంలను.. ఇప్పుడు ఈటలను విమర్శిస్తున్నారన్నారు. మంత్రి ఈటలను యావత్తు తెలంగాణ అణగారిన వర్గాల ప్రతినిధిగా తాము భావిస్తున్నమన్నారు. ఈటలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మాదిగ మహిళా సమాఖ్య జాతీయ అధ్యక్షురాలు ఆకారపు రుక్కమ్మ మాదిగ, రాష్ట్ర అధ్యక్షురాలు బాలమణి మాదిగ, నాయకులు సునీల్ మాదిగ, కొల్లూరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

✦ నేడే రెండో విడత పల్స్ పోలియో

36,55,204 మంది పిల్లలకు చుక్కలు: లక్ష్మారెడ్డి

సాక్షి, హైదరాబాద్: రెండో విడత పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం (11న) నిర్వహించనున్నట్లు వైద్యారోగ్య మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 36,55,204 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని సంకల్పించామని, 22,768 పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. అలాగే 737 ట్రాన్సిట్ కేంద్రాల ద్వారా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రధాన కూడళ్లలో కేంద్రాలను సిద్ధం చేశామని తెలిపారు. 787 మొబైల్ టీం.. 2,280 మంది రూట్ సూపర్‌వైజర్స్, 8,711 మంది ఏఎన్‌ఎంలు, 27,045 మంది ఆశా వర్కర్లు, 32,082 మంది అంగన్‌వాడీ వర్కర్లు కలిపి మొత్తంగా 95,500 మంది సిబ్బంది పాల్గొననున్నారని పేర్కొన్నారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.

✦ కాంగ్రెస్ అసమర్థ పార్టీ: ఎ.జీవన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ అసమర్థ రాజకీయ పార్టీ అని ఆర్మూరు ఎమ్మెల్యే ఎ.జీవన్‌రెడ్డి విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. బస్సు యాత్ర పేరుతో 40 మంది దొంగలు నోటికొచ్చినట్టుగా మాట్లాడారని, అది తుస్సు యాత్ర అని విమర్శించారు. ఎక్కడ వారపు అంగడి ఉంటే, అక్కడ బస్సు యాత్రను ప్లాన్ చేసుకున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి మానసిక పరిస్థితి బాగా లేకే మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌పై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. బస్సు యాత్రలో 40 మంది కాంగ్రెస్ నేతలు ఉంటే 33 మంది సీఎం అభ్యర్థులేనని ఎద్దేవా చేశారు. రైతులకు పెట్టుబడి సాయం అందిన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఉనికే ఉండదని జోస్యం చెప్పారు.

రేపటి నుంచి అసెంబ్లీ



తొలి రోజు ఉభయ సభల సంయుక్త సమావేశం

- ఉదయం 10 గంటలకు గవర్నర్ ప్రసంగం
- మధ్యాహ్నం బీఏసీ భేటీ.. అసెంబ్లీ నిర్వహణ రోజుల ఖరారు
- 15న రాష్ట్ర వార్షిక బడ్జెట్ ● నేడు టీఆర్‌ఎస్‌ఎల్పీ భేటీ
- సభలో అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం చేయనున్న సీఎం

సాక్షి, హైదరాబాద్: తొమ్మిదో విడత అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం పది గంటలకు సభ మొదలవుతుంది. బడ్జెట్ సమావేశాలు కావటంతో తొలి రోజున ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ప్రసంగిస్తారు. శాసనసభ, శాసనమండలి సభ్యులు అసెంబ్లీలోనే సమావేశమవుతారు. గవర్నర్ ప్రసంగాన్ని ఆమోదించేందుకు రాష్ట్ర కేబినెట్ ఒకటీ రెండు రోజుల ముందు సమావేశమవటం ఆనవాయితీ. కానీ గతేడాది రాష్ట్ర ప్రభుత్వం ఫైలు సర్క్యులేషన్ విధానంలోనే గవర్నర్ ప్రసంగానికి ఆమోదం తెలిపింది. దీంతో ఈ ఏడాదీ అదే తరహాలో ఆమోదం తెలిపే అవకాశాలున్నాయి.

15న ఐదో బడ్జెట్!

తొలి రోజు గవర్నర్ ప్రసంగం అనంతరం 12 గంటలకు బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) సమావేశం ఏర్పాటు చేశారు. అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహిస్తారనేది ఇందులో నిర్ణయిస్తారు. ఇప్పటికే ఖరారు చేసిన దాని ప్రకారం 15వ తేదీన 2018–19 రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెడుతున్న ఐదో బడ్జెట్ కావటం, సాధారణ ఎన్నికలకు ముందు ఇదే ఆఖరి పూర్తిస్థాయి బడ్జెట్ కావటంతో అసెంబ్లీ సమావేశాలు ఈసారి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ప్రభుత్వం ఐదోసారి కూడా మరో భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. బడ్జెట్ కసరత్తుపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు స్వయంగా ఆర్థిక శాఖ అధికారులతో ఇప్పటికే సమీక్షలు జరిపారు. మరోవైపు టీఆర్‌ఎస్ అధినేతగా అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై మంత్రులకు దిశానిర్దేశం చేశారు. ఆదివారం సాయంత్రం తెలంగాణ భవన్‌లో టీఆర్‌ఎస్ శాసనసభా పక్ష సమావేశం ఏర్పాటు చేశారు. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహాలను పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వివరించనున్నారు. ఇప్పటికే రాజ్యసభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటం, ఇటీవల ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుపై కేసీఆర్ ప్రకటన చేసిన నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. రాష్ట్ర రాజకీయాలపై జాతీయ స్థాయిలో చర్చ జరుగుతున్న సమయంలో ప్రవేశపెడుతున్న బడ్జెట్ కావటంతో సహజంగానే అన్ని పార్టీలు ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించనున్నాయి.

కౌన్సిల్ భవనం అప్పగించిన ఏపీ

రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు ఏపీ ప్రభుత్వం తమ అధీనంలో ఉన్న శాసనమండలి భవనాన్ని తెలంగాణకు అప్పగించింది. ఈ మేరకు రెండు రాష్ట్రాల అసెంబ్లీ కార్యదర్శులు జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయి. విభజన తర్వాత రెండు రాష్ట్రాలకు సరిపడే భవనాలు లేకపోవటంతో అసెంబ్లీ ప్రాంగణంలో ఉన్న భవనాలను రెండు రాష్ట్రాలు పంపిణీ చేసుకున్నాయి. సమైక్య రాష్ట్రంలో కౌన్సిల్ సమావేశాలు జరిగిన భవనాన్ని ఏపీ కౌన్సిల్‌కు అప్పగించగా, అక్కడి సమావేశ మందిరమైన జూబ్లీహాల్‌ను తెలంగాణ కౌన్సిల్‌గా మార్చారు. అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. తాజాగా ఏపీ తమ కౌన్సిల్ భవనాన్ని అప్పగించటంతో.. తెలంగాణ కౌన్సిల్‌ను అందులోకి మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలిరోజున ఉభయ సభల సంయుక్త సమావేశం అనంతరం మంగళవారం నుంచి కౌన్సిల్ సమావేశాలను అందులోనే నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది.

అమిత్‌షాను హరీశ్ కలవలేదా?

- ఇప్పుడూ బీజేపీతో హరీశ్ సన్నిహితుల మంతనాలు: రేవంత్
- టీఆర్‌ఎస్‌లో ఉంటే ఆయన రాజకీయంగా చావడం ఖాయం
- ఈటల అవినీతిని నిరూపిస్తానని స్పష్టం



సాక్షి, హైదరాబాద్: 'కేసుల భయమో, రాజకీయంగా బతకాలనో బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షాను మంత్రి హరీశ్‌రావు కలిసింది నిజం కాదా? ఆ సమావేశం గురించి చెప్పనందుకే అప్పటి ఇంటెలిజెన్స్ అధికారిని సీఎం కేసీఆర్ బదిలీ చేసింది నిజం కాదా? కేసీఆర్, కేటీఆర్ తప్ప టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలనంతా తీసుకొచ్చి కాంగ్రెస్‌లో విలీనం చేస్తానని హరీశ్ ఒప్పందం చేసుకుంది నిజం కాదా?' అని కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. టీఆర్‌ఎస్‌లోనే ఉంటే హరీశ్ రాజకీయంగా చావడం ఖాయమని.. కేసీఆర్, కేటీఆర్ ఆయన్ను రాజకీయాల్లో చంపేస్తారని హెచ్చరించారు. అసెంబ్లీ ఆవరణలో శనివారం రేవంత్ విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పుడు కూడా ఓ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శితో హరీశ్ సన్నిహితులు చర్చలు జరుపుతున్నారని చెప్పారు. టీఆర్‌ఎస్‌లో అవమానాలతో ద్వితీయ శ్రేణి నాయకుడిగా హరీశ్ కొనసాగుతున్నారని, ఇప్పటిదాకా ఆయన చేసిన పాపమే ఇప్పుడు వెంటాడుతోందని విమర్శించారు. ఈటల రాజేందర్‌ను శాసనసభాపక్ష నేతగా చేసినందుకు తిరుగుబాటు యత్నం చేసిన చరిత్ర హరీశ్‌దని దుయ్యబట్టారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారమని హరీశ్ ఎవరికి వివరణ ఇస్తున్నారని ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్‌లను మభ్యపెట్టడానికే ఆయన వివరణ ఇస్తున్నారని.. తనపై కేసీఆర్ దాడి చేయిస్తారన్న భయంతోనే ఆ వివరణ ఇచ్చినట్లు ఉందని అభిప్రాయపడ్డారు. టీఆర్‌ఎస్ చీలడం వంద శాతం ఖాయమని రేవంత్ చెప్పారు.

చర్చకు రండి..


మంత్రి ఈటల అవినీతికి సంబంధించిన పూర్తి ఆధారాలు తన వద్ద ఉన్నాయని, ఆయన అవినీతిని నిరూపిస్తానని రేవంత్ సవాల్ చేశారు. కొత్త జిల్లాలు ప్రకటించిన తర్వాత పాత జిల్లాల పేరుతో రేషన్ కార్డులు ముద్రించారని, అవి నిరుపయోగంగా పడి ఉన్నాయన్నారు. వాటికి సంబంధించిన బిల్లులు గుంటూరుకు చెందిన ప్రింటరుకు చెల్లించడంలో ఈటల జోక్యం చేసుకున్నారని, దీనివల్ల పౌరసరఫరాల సంస్థ అప్పుల్లో కూరుకుపోయిందని చెప్పారు. ఆ బిల్లుల విషయంలోనే మంత్రి ఈటల, కమిషనర్ మధ్య వివాదం తలెత్తిందన్నారు. ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమని.. అసభ్య పదజాలంతో నోరు పారేసుకోకుండా చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు.

కేసీఆర్‌ను మించిన పెత్తందారున్నారా?

బీజేపీకి గుణపాఠం చెబుతామనడం హాస్యాస్పదం: కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: 'దేశంలో పెత్తందార్ల పార్టీ ఏదైనా ఉందంటే అది టీఆర్‌ఎస్సే. కేసీఆర్‌ను మించిన పెత్తందారు ఇంకెవరూ ఉండరు' అని బీజేఎల్పీ నేత కిషన్‌రెడ్డి విమర్శించారు. బీజేపీకి గుణపాఠం చెబుతామని టీఆర్‌ఎస్ అనడం హాస్యాస్పదమని, హామీలు అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచినందుకు కేసీఆర్‌కే గుణపాఠం చెప్పాలన్నారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ.. 'దళితుడిని సీఎం చేస్తానని తనే గద్దెనెక్కినందుకు, సొంత నియోజకవర్గంలోనైనా రైతుల ఆత్మహత్యలు నివారించనందుకు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి తూట్లు పొడుస్తున్నందుకు, ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తున్నందుకు, ఉద్యోగాల ఖాళీలు భర్తీ చేస్తానని మాట తప్పినందుకు, ధర్నాలు, ర్యాలీలు, అణచివేస్తున్నందుకు, గిట్టుబాటు ధర కోసం ఆందోళన చేసిన రైతులను జైలుకు పంపినందుకు' కేసీఆర్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. లేని సమస్యలు సృష్టించి పార్లమెంటును టీఆర్‌ఎస్ అడ్డుకుంటోందన్నారు. మజ్లిస్ ఎంపీతో కలసి పార్లమెంటులో టీఆర్‌ఎస్ ఎంపీలు ధర్నా చేయడం చూస్తే, వెనక మజ్లిస్ హస్తం ఉందని తేలిందన్నారు. 'మీకు దురద పెడితే ఒవైసీ, కేసీఆర్ ఒకరికొకరు గోక్కోండి, కానీ బీజేపీ వచ్చి గోకాలని డిమాండ్ చేయటం సరికాదు' అని ఎద్దేవా చేశారు.



పేదవాడి ప్రాణాలు గాలిలో దీపాలేనా?

చంద్రబాబు పాలనలో అధోగతి పాలైన ఆరోగ్యశ్రీ పేదవాడి ప్రాణాలను కాపాడలేకపోతోంది. ఈ రోజు కూడా వేటపాలెంలో సోదరి మహబీ ఆవేదన నా మనసును కదిలించింది. మగ దిక్కు లేని ఆ అక్క బీడీ కర్మాగారంలో పనిచేస్తూ ముగ్గురు పిల్లలను పోషించుకుంటోంది. బతకడానికి, కుటుంబాన్ని బతికించడానికి సరిపడా గుండె ధైర్యం అయితే కూడగట్టుకుంది కానీ, కాలు విరిగిన కొడుక్కు వైద్యం చేయించలేని పరిస్థితి ఆమెను కుంగదీస్తోంది. చేతిలో చిల్లిగవ్వ లేని ఆ తల్లి 'ఆరోగ్యశ్రీ అప్పటిలా ఉంటే బాగుండేదయ్యా'అని చెప్పింది. నాలుగేళ్లుగా రేషన్ కార్డు కోసం కాళ్లు అరిగేలా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదని వాపోయింది. కుటుంబ పరిస్థితి చెప్పి సాయం చేయమన్నా.. ఏ జన్మభూమి కమిటీ గోడు ఆలకించలేదని తెలిపింది. వాళ్లనో, వీళ్లనో బతిమిలాడి గుంటూరు సర్కార్ ఆస్పత్రిలో వైద్యం చేయించినా... కొడుకు కాలికి మళ్లీ వాపొస్తోందట. రెక్కాడితే కానీ డొక్కాడని ఆ కుటుంబం దాదాపు పది నెలలుగా నరకయాతన అనుభవిస్తోంది. ఇలాంటి దీనగాథే మరొకటి అంబేడ్కర్ నగర్‌లో నా దృష్టికొచ్చింది. వినోద్, జయ దంపతులు పుట్టెడు దుఃఖంతో కష్టాలు చెప్పుకున్నారు. కూలి పనితో పట్టెడు మెతుకులు తింటున్న ఆ దంపతుల ఒక్కగానొక్క కొడుక్కు కొన్ని నెలలుగా జ్వరం వస్తోందట. విరామమెరుగకుండా పీడించే ఆ జ్వరానికి కారణాలు తెలుసుకోవడానికే రూ.లక్షకు పైగా ఖర్చు పెట్టారట. వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో గుండె పగిలే నిజం తెలిసిందన్నారు. కొడుక్కు బ్లడ్ కేన్సర్ అని తేలడంతో ఆ కుటుంబం దిక్కులేనిదైంది. వారి మనోధైర్యం పూర్తిగా దెబ్బతింది. కూతవేటు దూరంలో రాష్ట్ర రాజధాని ఉన్నా... అక్కడి ప్రభుత్వ ఆస్పత్రుల్లో కేన్సర్‌కు చికిత్స లేదట. పోనీ ప్రైవేటు ఆస్పత్రులకు వెళదామంటే రూ.8 లక్షలు అవుతుందట. ఆరోగ్యశ్రీలో అరకొర నిధులు మాత్రమే ఇస్తున్నారని, మిగతా డబ్బు తెచ్చుకుంటేనే పూర్తి వైద్యం చేస్తామంటున్నారని కన్నీటిపర్యంతమయ్యారు. మనసుకు చాలా బాధనిపించింది. అంధకారం అలముకున్న ఆ చిన్న జీవితానికి వెలుగునిచ్చేది ఎవరు? ఇలాంటి బాధితుల కన్నీళ్లు తుడవటమే లక్ష్యంగా ఆరోగ్యశ్రీకి పూర్వ వైభవం తేవాలన్నదే నా తపన. అందుకే రూ.1,000 దాటిన ఏ వైద్యాన్ని అయినా ఆరోగ్యశ్రీ పరిధిలోకి తేవాలని సంకల్పించాను.

చీరాలలో పాదయాత్ర చేస్తున్నప్పుడు.. నాగరికతకే వన్నె తెచ్చిన చీరాల చేనేత ప్రాభవం పూర్తిగా కనుమరుగవుతుండటం బాధనిపించింది. మగ్గం విడిచి మట్టి పని కోసం పరుగులు పెడుతున్న నేతన్న దయనీయ పరిస్థితి చూసి జాలేస్తోంది. ఇప్పటిదాకా ఎంతోమంది నేతన్నలు నన్ను కలిశారు. చంద్రబాబు వచ్చాకే తమ పరిస్థితి తారుమారైందని బాధగా చెప్పారు. నిజమే.. నేతన్నను చంద్రబాబు సర్కార్ నిలువెల్లా దగా చేసింది. హిందూపురంలో పాదయాత్ర ప్రారంభించిన తొలిరోజే చంద్రబాబు వాళ్ల బతుకులు మారుస్తానని హామీ ఇచ్చాడు. మగ్గం పక్కనే నేత కార్మికుడితో ఫొటోకు పోజులిచ్చి ప్రచారం చేసుకున్నాడు. ఆయన అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అయింది. ఇప్పటికీ రుణమాఫీ లేదు.. సబ్సిడీలూ లేవు. పావలా రుణాల మాట దేవుడెరుగు.. ఆర్టిజన్ కార్డులున్నా బ్యాంకు లోన్లు రావు. ఇచ్చిన హామీలకు దిక్కులేదు. నరాల పోగులు లాగి బట్టలు నేస్తున్నా వాటిని కొనేందుకు ప్రభుత్వ ప్రోత్సాహమే కరువైంది. ఆదుకోవాల్సిన సర్కార్ నయవంచన చేసింది. చితికిన చేనేతల వెన్నుతట్టి ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. ఆగిపోయిన జీవన నాడిని కొత్త ఊపిరితో బతికించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకే వాళ్ల కష్టాల్లో పాలుపంచుకుంటున్నాను. అధికారంలోకి వస్తే పరిస్థితిని మార్చాలనే నా సంకల్పం మరింత దృఢపడింది.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. మన రాష్ట్రంలో అత్యాధునిక వైద్యం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకమునుపే హైదరాబాద్‌లో ఆరోగ్యశ్రీ సేవలను తొలగించడంలో ఆంతర్యమేమిటి? మీ పాలనలో పేదవాడి ప్రాణాలు గాలిలో దీపాలేనా?

వై.ఎస్. జగన్.

తేలని 'పంచాయతీ'!

గడువు లోపు గ్రామ పంచాయతీ ఎన్నికలు కష్టమే

- కొలిక్కిరాని కొత్త పంచాయతీలు ● మారుతున్న మార్గదర్శకాలతో ఆలస్యం
- రిజర్వేషన్ల పరిస్థితీ అంతే.. ఎటూ తేల్చని ప్రభుత్వం
- ముంచుకొస్తున్న పాలక వర్గం గడువు

సాక్షి, హైదరాబాద్: గ్రామ పంచాయతీ ఎన్నికలు సకాలంలో జరిగే పరిస్థితి కనిపించడం లేదు. కొత్త పంచాయతీల ఏర్పాటు, వార్డుల పునర్విభజన విషయంలో ప్రభుత్వం జాప్యం చేస్తుండటమే ఇందుకు కారణమవుతోంది. మరోవైపు పంచాయతీ ఎన్నికలను గడువు లోపు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. తాత్కాలిక షెడ్యూల్ ఖరారు చేసింది. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ప్రస్తుత పాలక వర్గాల పదవీకాలం ముగిసేలోపే ఎన్నికలు నిర్వహించాలి. ప్రస్తుత పాలక వర్గాల పదవీ కాలం జూలై 31తో ముగియనుంది. ఈ నేపథ్యంలో 3 నెలలు ముందుగా అంటే మే 31లోపే ఎన్నికలు నిర్వహించాలి. కాని ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు.

ఏర్పాటు కాని కొత్త పంచాయతీలు

తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చాలని, జనాభా ఆధారంగా కొత్త పంచాయతీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. కాని ఈ ప్రక్రియను ముగించే విషయంలో విఫలమవుతోంది. జిల్లాల నుంచి రోజూ కొత్తగా ప్రతిపాదనలు వస్తూనే ఉన్నాయి. దీంతో పంచాయతీల ఏర్పాటు ఎంతకీ ముగియడంలేదు. వార్డుల విభజన పూర్తి కావడం లేదు. ఈ రెండు పూర్తయితేనే రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేసే పరిస్థితి ఉంటుంది. రిజర్వేషన్లు నిర్ణయించిన తర్వాత పంచాయతీల జాబితాను ఎన్నికల సంఘానికి పంపిస్తుంది. అనంతరం ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహిస్తుంది. అయితే ప్రస్తుత పరి స్థితి చూస్తే గడువు లోపు ఎన్నికలు జరిగే పరి స్థితి లేదని స్పష్టమవుతోంది. ఇదే విషయాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం.. ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఇప్పటికే రూపొందించిన షెడ్యూల్ అమలు చేసే పరిస్థితి లేకపోవడంతో.. కొత్తది ఖరారు చేయాల్సి ఉంది.

రాష్ట్ర ఎన్నికల సంఘం తాత్కాలిక షెడ్యూల్

మార్చి 15	గ్రామ పంచాయతీల వారీగా ఓటర్ల జాబితా ప్రచురణ
ఏప్రిల్ 16	రిజర్వేషన్లు ఖరారు
ఏప్రిల్ 17	పోలింగ్ కేంద్రాల ప్రచురణ
మే నెలలో	ఎన్నికల నిర్వహణ

మారుతున్న ప్రతిపాదనలు

జనవరి 25 లోపే కొత్త గ్రామ పంచాయతీలపై అన్ని జిల్లాల అధికారులు.. పంచాయతీరాజ్ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు 30 జిల్లాల్లో 4,122 కొత్త పంచాయతీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్లు ప్రతిపాదనలు పంపారు. అందులో 1,879 సాధారణ ఆవాసాలు, 2,243 తండాలు ఉన్నాయి. అయితే పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి పదేపదే కొత్త మార్గదర్శకాలు వస్తుండటంతో అధికారులకు పాలుపోవడంలేదు. 500 జనాభా, 300 జనాభా ఇలా కొత్తగా ప్రతిపాదనలు పంపుతున్నారు. దీంతో స్పష్టత రావడంలేదు. రాష్ట్రంలో ప్రస్తుతం 8,684 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీరాజ్ శాఖ ప్రతిపాదనలపై ప్రభుత్వం ఆమోదం తర్వాత కొత్త పంచాయతీలు ఎన్నో తేలనున్నాయి.

బాబుకు ఆస్కార్ ఇవ్వొచ్చు

నాలుగేళ్లుగా మోసాలు, అబద్ధాలు, డ్రామాలు

- ప్రత్యేక హోదా విషయంలో మళ్లీ నాటకం
- చీరాల సభలో ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మండిపాటు
- ప్రజల మనోభావాలకు తలొగ్గి యూటర్న్ తీసుకున్నా చిత్తశుద్ధి కరువు
- కేంద్రంపై అవిశ్వాసం పెట్టరట.. మేము పెడితే మద్దతివ్వరట
- మంత్రులు రాజీనామా చేసినా, ఎన్‌డీఏ ప్రభుత్వంలో కొనసాగుతారట
- టీడీపీ మంత్రులు ఆనాడే రాజీనామా చేసి ఉంటే హోదా వచ్చి ఉండేది



శనివారం ప్రకాశం జిల్లా చీరాలలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న వైఎస్ జగన్

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి:

'ప్రత్యేక హోదా కోసం చంద్రబాబు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టరట.. పోనీ, మేము అవిశ్వాస తీర్మానం పెడితే మద్దతు ఇవ్వడానికి ముందుకు రారట.. హోదా కోసం నాలుగేళ్లుగా మనం పోరాటం చేస్తుంటే ఈ పెద్దమనిషి వెకిలిగా మాట్లాడారు. ఎట్టకేలకు ప్రజల సెంటిమెంట్ బలంగా ఉందని ప్లేటు మార్చారు కానీ చిత్తశుద్ధితో పోరాటం చేసేందుకు ముందుకు రారు. మంత్రులను మాత్రమే ఉపసంహరించుకుని, బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ కన్వీనర్‌గా కొనసాగుతారట. మళ్లీ మోసం.. ఈ పెద్దమనిషిని ఏమనాలి?' అని ఏపీ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా శనివారం 108వ రోజు ప్రకాశం జిల్లా చీరాలలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. నాలుగేళ్ల ప్రజలను మోసం చేసి ఇప్పుడూ మోసాలను కొనసాగిస్తున్న చంద్రబాబుకు ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని ఎద్దేవా చేశారు. జగన్ ఇంకా ఏం అన్నారంటే..

ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టారు

''ఉద్యోగాలు రావాలంటే ఏకైక మార్గం ప్రత్యేక హోదా ఒక్కటే. రాష్ట్రాన్ని విడగొట్టే సమయంలో ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని పార్లమెంట్ సాక్షిగా హామీ ఇచ్చారు. కానీ ఈ పెద్ద మనిషి దాన్నీ తాకట్టు పెట్టారు. హోదా ఉంటేనే ప్రత్యేక రాయితీలు వస్తాయి. అప్పుడే పరిశ్రమలు వస్తాయి. ఇన్‌కం ట్యాక్స్, జీఎస్టీ, కరెంటు రాయితీలు ఉంటాయి. అవి ఉంటే ఎవరైనా పరిశ్రమలో, హోటళ్లో, ఆస్పత్రులో పెడతారు. లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయి. లక్షలాది ఉద్యోగాలు వస్తాయి. అందుకే ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రత్యేక హోదా కావాలన్నాడు. ఆ తర్వాత ప్లేటు ఫిరాయించాడు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజిస్తున్నప్పుడు నాడు వెంకయ్య పార్లమెంట్‌లో పరిశ్రమలు కట్టడానికే మూడు, నాలుగేళ్ల పడుతుంది కనుక ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు.. పదేళ్లు కావాలన్నారు. ఇదే పెద్ద మనిషి చంద్రబాబు తిరుపతిలో నరేంద్ర మోదీ సమక్షంలో జరిగిన సభలో 15 ఏళ్లపాటు హోదా కావాలన్నారు. ప్రత్యేక హోదా ఇస్తామని ఆవేళ నరేంద్ర మోదీ కూడా అన్నారు. దానికి ఆశపడి గొప్పగా ఓట్లు వేశాం. కానీ ఇవాళ చంద్రబాబు వైఖరి చూస్తే నాకొకటి గుర్తుకు వస్తోంది. భారతదేశం నుంచి బ్రిటీష్ వాళ్లను వెళ్లగొట్టేందుకు మనం స్వాతంత్ర్య పోరాటం చేశాం. పోరాటం చివరి దశలో బ్రిటీష్ వాళ్లు.. పోరాటం చేసింది మీరు (భారతీయులు) కాదు, మేము చేసిన పోరాటం వల్లే మీకు స్వాతంత్ర్యం ఇస్తున్నామంటే ఏమంటాం? ఇవాళ చంద్రబాబు తీరు కూడా అలాగే ఉంది'' అని జగన్ అన్నారు.

మరిన్ని ఫొటోలు టాబ్లాయిడ్‌లో

హోదా కోసం పోరాడరట

నాలుగేళ్లుగా పూటకో మాట మాట్లాడిన చంద్రబాబు ప్రత్యేక హోదాపై ప్రజల సెంటిమెంట్ బలంగా ఉందని ప్లేట్ మార్చాడు. గతంలోనే అరుణ్‌జైట్లీ ప్రత్యేక హోదా ఇవ్వలేమని చెప్పారు. అదే మాట ఆయన ఇటీవల మళ్లీ చెబితే.. జైట్లీ అలా మాట్లాడటం అన్యాయం, తన మంత్రులను రాజీనామా చేయిస్తున్నానని చంద్రబాబు చెప్పారు. ఇదే రాజీనామాలు రెండేళ్ల క్రితం చేసి ఉంటే ఇప్పటికే ప్రత్యేక హోదా వచ్చేది. 2014 మార్చి 2న అప్పటి కేంద్ర కేబినెట్ మీటింగ్ పెట్టి ప్రత్యేక హోదా కోసం ప్లానింగ్ కమిషన్‌కు పంపించారు. ఆ తర్వాత సీఎం అయిన చంద్రబాబు ఆ తీర్మానాన్ని పట్టించుకోలేదు. కేంద్రంతో అధికారాన్ని పంచుకున్నారు. ప్రత్యేక హోదా కోసం నేను 8 రోజులు నిరాహార దీక్ష చేస్తే ఇదే పెద్దమనిషి నరేంద్ర మోదీ వస్తున్నారంటూ తెల్లవారుజామున దీక్షను భగ్నం చేయించి పోరాటాన్ని నీరు గార్చారు. ఇలాంటి పెద్దమనిషి ఇవాళ మళ్లీ మోసం చేస్తున్నారు. రాష్ట్రానికి చెందిన 25 మంది ఎంపీలు ఒక తాటిపై నిలబడి అవిశ్వాసం పెడితే కేంద్రం దిగి రాదా? అప్పటికీ దిగిరాకపోతే 25 మంది ఎంపీలు రాజీనామా చేస్తే కేంద్రం దిగి వస్తుంది. అలా చేయడానికీ చంద్రబాబు ముందుకు రారట.

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
ఆదివారం ॥ 11-3-2018





అదిగో
ఆ పక్షిలాగా!

డబ్బుతోపాటు
ఆ రెండూ వస్తాయి

– సినిమా పేజీలో

రివాల్వర్ రాణి



సినీనటి మెహరీన్

మెహరీన్ గురి చూసి కొట్టిందంటే హిట్ మీద హిట్టే
ఇండస్ట్రీలో ఇప్పటిదాకా టార్గెట్ మిస్ కాలేదు
ఫ్యాన్స్ గుండెల్లోకి దూసుకెళ్లడంలో కూడా గురి తప్పలేదు
తెర మీద అందంగా కనపడటమే కాదు
సమాజం పట్ల లోతైన అవగాహన ఉన్న అమ్మాయి తను
ఒలింపిక్స్‌కి వెళ్లి షూటర్‌గా పేరు తెచ్చుకోవాలనుకుంది కానీ
సినిమా షూటింగ్స్‌కి గురి పెట్టింది ఈ రివాల్వర్ రాణి

- **క్వొశ్చన్స్ 'షూట్' చేస్తాం.. రెడీగా ఉన్నారా?**

ఓ యస్.. కమాన్ షూట్.

- **బ్యాగ్‌లో పిస్టల్ ఉందా?**

(నవ్వేస్తూ).. లేదు. మా కజిన్‌కి ఇచ్చేశాను. ఆ పిస్టల్‌తో తను నేషనల్స్‌కి వెళుతున్నాడు.

- **యాక్చువల్లీ మీరూ నేషనల్స్‌కి వెళ్లాల్సింది.. మిస్సయ్యారు కదా?**

అవును. సరిగ్గా ఎగ్జామ్స్ టైమ్. అందుకే మిస్సయ్యాను.

- **వెళ్లుంటే.. సినిమా షూటింగ్స్‌కి బదులు పిస్టల్ షూట్‌తో బిజీగా ఉండేవారేమో. ఒక్కసారి మీ 'పిస్టల్ షూటింగ్' గురించి షేర్ చేసుకుంటారా?**

చదువుతో పాటు ఆటల్లో కూడా ముందుండాలని మా అమ్మగారు అనేవారు. నచ్చిన స్పోర్ట్ ఏదైనా సెలెక్ట్ చేసుకోమన్నారు. నేను 'టామ్‌బాయ్' టైప్. టాయ్ గన్స్‌తో ఆడుకునే దాన్ని. అమ్మాయిలకు నచ్చేవి ఏవీ నాకు పెద్దగా నచ్చదు. ఫర్ ఎగ్జాంపుల్ లిప్‌స్టిక్స్, నెయిల్ పాలిష్ వంటివి నచ్చవు. గన్స్ మీద ఉన్న ఇంట్రెస్ట్‌తో 'ఎయిర్ పిస్టల్' షూటింగ్ నేర్చుకుంటానన్నా. మా అమ్మగారు సరే అన్నారు. పిస్టల్ షూట్ అంటే గురి తప్పకూడదని స్పెషల్‌గా చెప్పక్కర్లేదు. దానివల్ల నాకు లైఫ్‌లోనూ ఫోకస్ పెరిగింది.

- **పిస్టల్‌ని కజిన్‌కి ఇచ్చారు. ప్రాక్టీస్ మానేశారా?**

పంజాబ్ వెళ్లినప్పుడు షూటింగ్ రేంజ్‌కి వెళతాను. కాసేపు ప్రాక్టీస్ చేస్తాను.

- **బాగుంది.. ఆ షూటింగ్‌కి బ్రేక్ ఇచ్చినా కూడా మీ లైఫ్‌లో షూటింగ్ కంటిన్యూ అవుతోంది..**

(నవ్వేస్తూ) కరెక్టేనండి. 'షూటింగ్' అనే వర్డ్‌కి నా లైఫ్‌లో ఏదో తెలియని ఎటాచ్‌మెంట్ ఉంది. అప్పుడేమో గన్‌తో ఇప్పుడేమో సినిమా షూటింగ్‌తో. నాకు స్పోర్ట్స్ అంటే ఇష్టం ఉన్నప్పటికీ అదే ప్రొఫెషన్ అవ్వాలనుకోలేదు. రకరకాలు చేయాలని ఉండేది. అది ఒక్క సినిమా వల్లే కుదురుతుంది. వేరే ఏదైనా చేస్తే నేను మెహరీన్‌గానే ఉండాలి. అదే సినిమా అయితే మహాలక్ష్మిలా పల్లెటూరి అమ్మాయి ('కృష్ణగాడి వీర ప్రేమగాథ') అవ్వొచ్చు. మేఘనలా మోడరన్ గాళ్ ('మహానుభావుడు').. రకరకాలుగా కనిపించొచ్చు. అందుకే 'ఐ లవ్ సినిమా'.

- **'ఆడపిల్లవి.. పిస్టల్ షూటింగ్ వద్దు' అని మీ అమ్మగారు అనకపోవడం గ్రేటే?**

మా అమ్మగారు చాలా స్ట్రాంగ్ ఉమెన్ అండి. కూతురు కూడా అలానే ఉండాలనుకున్నారు. నా ఫ్రెండ్స్ అందరికీ మా అమ్మ రోల్ మోడల్. అమ్మలానే నేనూ స్ట్రాంగ్. లైఫ్‌లో ఎదురయ్యే ప్రతి సిచ్యువేషన్ మరింత స్ట్రాంగ్ చేస్తుందని నమ్ముతాను.

- **సో... 'గ్లామర్ ఇండస్ట్రీ'ని డీల్ చేయడం మీకు పెద్ద కష్టం కాకపోవచ్చు..**

ఇండస్ట్రీ కాదు మన లైఫే చాలా క్రిటికల్. ఎప్పుడేం జరుగుతుందో ఊహించలేం. పెద్ద కాంపిటీషన్. లైఫ్ మనకు చాలా టీచ్ చేస్తుంది. నేను ఆ ఫ్లోతో వెళ్లిపోతుంటాను.

- **మీరు యాక్ట్ చేసిన సినిమాలు దాదాపు హిట్ కాబట్టి 'లక్కీ లేడీ' అనే ట్యాగ్ వచ్చింది. ఎలా ఫీల్ అవుతున్నారు?**

దేవుణ్ణి బాగా నమ్ముతాను కాబట్టి ఇదంతా ఆయన ఇచ్చిందే అనుకుంటాను. నేను ఒకటి బలంగా నమ్ముతాను. మనం ఏదైనా కోరుకున్నాం అనుకోండి, అదే విషయాన్ని ఇంకెవరైనా మనకోసం కోరుకుంటే దేవుడు ఆ విషయాన్ని వెంటనే వింటాడని. నా మంచి కోరుకునేవాళ్లు చాలామంది ఉన్నారు కాబట్టే నేను సక్సెస్ అవ్వగలుగుతున్నాను.

- **ఓకే... ఉమెన్స్‌డే సందర్భంగా ఏదైనా కొత్త డెసిషన్స్ తీసుకున్నారా?**

ప్రతిరోజూ ఉమెన్స్‌డే అనే నమ్ముతాను. మా అమ్మగారు ఎప్పుడూ చెబుతుంటారు. హీరోలో 'హర్' ఉంటుంది. ఉమెన్ లేకుండా ఏదీ లేదని. ప్రపంచమే మహిళలది. మనం లేనిదే ఏదీ లేనప్పుడు మనం మన ఉమన్‌హుడ్‌ని ఎంజాయ్ చేయాలి. తలెత్తుకుని గర్వంగా బతకాలి. మనల్ని మనం రెస్పెక్ట్ చేసుకుని, మనల్ని మనం ప్రేమించుకుంటే ఏదైనా సాధించగలం అని నమ్ముతాను.

- **ప్రపంచమే మహిళలది అన్నారు. అలాంటి ప్రపంచంలో ప్రస్తుతం మహిళకు రక్షణ ఉందా?**

ఈ మధ్య జరుగుతున్న విషయాలు వింటుంటే చాలా బాధ అనిపిస్తుంటుంది. ఆడ, మగ అని తేడా గురించి వదిలేస్తే.. ఏ మనిషైనా బతకడానికి గాలి, నీరు, ఆహారం అవసరం. ఆడవాళ్లకు ఒకలా, మగవాళ్లకు ఒకలా లేదు కదా. ఏ శరీరానికైనా నొప్పి ఒకటే కదా. అది తెలిసి కూడా ఒక అమ్మాయిని వేధిస్తున్నాడంటే అతను మనిషి ఎలా అవుతాడు? అతడ్ని మనిషి అంటే.. మానవ జన్మని ఇన్‌సల్ట్ చేసినట్లే. ఆడవాళ్లపై లైంగిక దాడులు అమానుషం అంటే.. సిరియాలో ఆ చిన్నపిల్లలు ఏం చేశారని అలా చంపుతున్నారు. అది ఎంత దారుణం. ఈ దారుణాలు విన్నప్పుడు 'దేవుడా... శిక్షించకుండా ఉండకు' అనుకుంటుంటాను.

- **మొన్న శ్రీదేవిగారు చనిపోయినప్పుడు బోలెడన్ని సర్జరీల వల్ల అని, డైటింగ్ వల్ల అని.. ఇలా ఆవిడ మరణం గురించి కొందరు రకరకాలుగా మాట్లాడారు.. అది విన్నప్పుడు ఎలా అనిపించింది?**

నిన్నటిదాకా కనిపించిన మనిషి ఎప్పటికీ కనిపించే అవకాశం లేదు. ఆ మనిషి గురించి నాలుగు మంచి మాటలు మాట్లాడాలి కానీ చెడు ఎందుకు? చనిపోయినవాళ్ల గురించి తప్పుగా మాట్లాడటం అస్సలు కరెక్ట్ కాదు. ఈ భూమ్మీద బతికిన 54 ఏళ్లల్లో 50 ఏళ్లు మనల్ని ఎంటర్‌టైన్ చేశారు ఆవిడ. అలాంటి ఆవిడకు మనం గౌరవమైన నివాళి ఇవ్వాలి. ఆ సంగతలా ఉంచితే.. శ్రీదేవిగారిని చనిపోనివ్వనందుకు 'థ్యాంక్స్ టూ సినిమా.. అండ్ థ్యాంక్స్ టూ కెమెరా'. ఆమెను మళ్లీ మళ్లీ చూసుకునే అవకాశం కల్పించింది.

- **సెలబ్రిటీలు ఆనందంలో ఉన్నా, బాధలో ఉన్నా అవేం పట్టించుకోకుండా నెగటివ్‌గా మాట్లాడటానికి రెడీ అయిపోతారు. సో.. సెలబ్రిటీగా ఉండటం శాపం అని అనుకుంటారా?**

అస్సలు అనుకోను. అదో బ్లెస్సింగ్‌లా భావిస్తాను. ఎందుకంటే మమ్మల్ని ప్రేమించే వాళ్లు చాలామంది ఉంటారు ఇక్కడ. మాలాగా అవ్వాలనుకునే వాళ్లూ ఉంటారు. అందర్నీ ఎంటర్‌టైన్ చేయగలుగుతాం. మంచి ఉన్నప్పుడు చెడు ఉంటుంది. మంచిని మాత్రమే తీసుకుంటూ వెళ్లిపోవడమే.

- **సోషల్ మీడియాలో వచ్చే కాంప్లిమెంట్స్, క్రిటిసిజమ్ గురించి..**

సోషల్ మీడియా మమల్ని ఫ్యాన్స్‌కు దగ్గర చేస్తుంది. విమర్శలు ప్రతి చోటా ఉంటాయి. ప్రతి ఒక్కర్నీ మనం ఇంప్రెస్ చేయలేం. అందరూ మనల్ని ప్రేమించేలా కూడా ఉండలేం. మిమ్మల్ని ప్రేమించేవాళ్లను తిరిగి ప్రేమించాలి. హేట్ చేసేవాళ్లను కూడా లవ్ చేస్తే ఏదో రోజు వాళ్లు రియలైజ్ అవుతారు. సింపుల్.

- **క్యాస్టింగ్ కౌచ్ గురించి మీరు వినే ఉంటారు. మీకలాంటి ఎక్స్‌పీరియన్స్ ఏమైనా?**

నేను చాలా లక్కీ. అలాంటివి ఎప్పుడు నాకు ఎదురుపడలేదు. సొసైటీలో అన్ని రకాల మనుషులు ఉంటారు. అందుకే దేవుణ్ణి 'నన్ను చాలా జాగ్రత్తగా చూసుకో' అని ప్రార్థిస్తుంటా. ఐ లవ్ మై జాబ్. ఇష్టంగా సినిమాలు చేస్తున్నా.

- **మీరు సినిమాలను ప్రేమిస్తారు. మిమ్మల్ని చాలా మంది ప్రేమిస్తారు. మీ రిలేషన్‌షిప్ స్టేటస్ ఏంటి?**

నేను కెమెరాతో లవ్‌లో ఉన్నాను. కెమెరా ఈజ్ మై సోల్‌మేట్, కెమెరా ఈజ్ మై లవర్.

- **మీతో జీవితం పంచుకునే వ్యక్తిలో ఎలాంటి లక్షణాలు ఉండాలనుకుంటున్నారు?**

అర్థం చేసుకునేవాడు. పేరెంట్స్ వల్ల కాకుండా తనంతట తాను పేరు తెచ్చుకునేవాడు. మహిళలను గౌరవించేవాణ్ణి ఇష్టపడతా.

– డి.జి. భవాని

- **కాస్త సన్నబడ్డట్లున్నారు.. ఏదైనా క్యారెక్టర్ కోసమా? బొద్దుగా ఉన్నారని విమర్శలు వచ్చాయా?**

క్రిటిసిజమ్ కాదు. నేను ఎప్పుడూ వర్కౌట్స్ చేస్తూనే ఉంటాను. కొంచెం తగ్గితే బాగుంటుందనుకున్నా.. తగ్గాను. అంతే. డైట్, వర్కౌట్స్‌ని ప్రాపర్‌గా ప్లాన్ చేసుకున్నాను.

- **తెలుగు కొంచెం నేర్చుకున్నట్లున్నారు. ట్యూటర్‌ను పెట్టుకున్నారా?**

లేదు. మా టీమ్ అందరితోను తెలుగులో మాట్లాడుతున్నాను. అలా అలవాటైపోయింది.

- **మరి నెక్స్ట్ సినిమాకు డబ్బింగ్ చెప్పకుంటారా?**

అదే ఆలోచనలో ఉన్నాను. కచ్చితంగా తెలుగులో డబ్బింగ్ చెప్పుకుంటాను.

- **ప్రస్తుతం ఏం సినిమాలు చేస్తున్నారు ?**

గోపిచంద్‌తో పంతం'. విజయ్ దేవరకొండతో తెలుగు, తమిళ భాషల్లో 'నోటా' అనే సినిమా చేస్తున్నాను.

- **మీకు డ్రీమ్ ప్రాజెక్ట్ ఏదైనా ఉందా?**

'బాహుబలి'లో దేవసేన లాంటి క్యారెక్టర్ చేయాలని ఉంది. అనుష్కగారంటే నాకు చాలా ఇష్టం. ఎప్పుడైనా అలాంటి పాత్‌బ్రేకింగ్ సినిమా చేసే అవకాశం వస్తే నా అంత ఆనందపడేవాళ్లు ఉండరేమో. అలాగే రాజమౌళిగారి లాంటి దర్శకులతో వర్క్ చేయాలన్నది నా డ్రీమ్.

- **దేవసేన గుర్రపు స్వారీ చేసింది.. మీరు?**

కొంచెం కొంచెం వచ్చు. అలాంటి క్యారెక్టర్ వస్తే ఫుల్‌గా నేర్చుకుంటా. కొత్త విషయాలు నేర్చుకోవడం నాకు ఇష్టం.

- **ఇంతకీ ఆ కొంచెం గుర్రపు స్వారీ ఎప్పుడు నేర్చుకున్నారు?**

మా ఫ్యామిలీ గుర్రాలను పెంచుతారు. అలా కొంచెం నేర్చుకున్నాను

- **ట్రెడిషనల్‌తో పాటు గ్లామర్ రోల్స్ కూడా చేస్తారా?**

ట్రెడిషన్, గ్లామరస్.. ఏ రోల్ అయినా నాకు ఓకే. మంచి సినిమాలో భాగం అవ్వాలని మాత్రం అనుకుంటాను.

చెట్టు నీడ

ఆ చెత్త మన మీద పడినప్పుడు

ఒక యువకుడు ఒక పనిమీద అర్జెంటుగా వెళ్లాలి. క్యాబ్ మాట్లాడుకున్నాడు. డ్రైవర్ చిరునవ్వుతో లోపలికి స్వాగతించాడు. తన ఫోన్‌లో మెసేజెస్ చూసుకుంటూనే ప్రయాణం సాగిస్తున్నాడు యువకుడు. అతడు హడావుడిగా వున్నాడు. ఇంతలో సడెన్ బ్రేక్‌తో క్యాబ్ ఆగింది. ఇంకొంచెమైతే వీళ్ల క్యాబ్‌ను ఎదురు కారు ఢీకొట్టేదే. యువకుడు గాబరాగా బయటకు చూశాడు. ఆ ఢీకొట్టిన కారతను వీళ్ల వైపే వస్తూ అరవడం మొదలుపెట్టాడు, 'ఎక్కడ డ్రైవింగ్ నేర్చుకున్నా'వంటూ. దానికి క్యాబ్ డ్రైవర్ చిరునవ్వు నవ్వుతూ చేయివూపాడు. యువకుడు విస్తుపోయాడు. 'తప్పు అతడిది, పైగా నీ మీద అరుస్తున్నాడు. అయినా నువ్వు ఇంత కామ్‌గా ఎలా ఉండగలుగుతున్నావు?' అని క్యాబ్ డ్రైవర్‌ను అడిగాడు.

> **ఇంకొంచెమైతే వీళ్ల క్యాబ్‌ను ఎదురు కారు ఢీకొట్టేదే. యువకుడు గాబరాగా బయటకు చూశాడు.**

డ్రైవర్ నవ్వి, 'సర్, మీకో విషయం చెప్పనా! చాలామంది జనం చెత్తలారీల్లాంటివారు. కాకపోతే వాళ్లు చెత్తను తమ తలల్లో మోస్తూ తిరుగుతుంటారు. వాళ్ల నిరాశ, కోపం, అసహనం... అన్నీ విపరీతంగా పోగైపోయాకా, ఎక్కడో చోట వాటిని పారబోయాలి కదా! అలా కొన్నిసార్లు వాళ్లు మన మీద వేస్తారు. అందుకే మనం దాన్ని వ్యక్తిగతంగా తీసుకోకూడదు. బదులుగా ఒక చిరునవ్వు నవ్వేసి, చేయి ఊపేసి, వాళ్లు త్వరగా బాగైపోవాలని కోరుకోవాలి' అని బదులిచ్చాడు.

డ్రైవర్ చెప్పిన తర్కం యువకుడికి నచ్చింది. తన హడావుడి తగ్గింది. 'థాంక్యూ సర్, ఒక మంచి పాఠం చెప్పినందుకు' అని షేక్‌హ్యాండ్ ఇచ్చాడు.

పవర్ గర్ల్

మిస్టర్ కేరళ



బాడీ బిల్డింగ్, మజిల్ టోనింగ్, వెయిట్ ట్రైనింగ్... ఇవన్నీ మగవాళ్లకు పరిమితమైన కీర్తి కిరీటాలుగానే ఉండేవి డెబ్బైలలో. వీటన్నిటి మీదా 'పురుషులకు మాత్రమే' అనే కనిపించని రాజముద్ర ఒకటి ఉండేది. క్రమంగా ఒక్కో ముద్రా చెరిగిపోతోంది. ఈ కేరళ అమ్మాయి కూడా అలాంటి ఒక ముద్రను చెరిపేసింది. 'మిస్టర్ కేరళ' పురస్కారాన్ని అందుకుంది!

మజీజియా భానుకి 23 ఏళ్లు. కోళికోడ్ జిల్లా, ఓర్కాట్టెరి గ్రామంలో ఉంటుంది వీళ్ల కుటుంబం. డెంటల్ కోర్సులో అండర్ గ్రాడ్యుయేషన్ చేసింది భాను. కుటుంబంలో ఎవరూ బాడీ బిల్డర్లు లేరు. 'జస్ట్ ఆసక్తి కలిగింది, పేరెంట్స్ గో ఎహెడ్' అన్నారు. టైటిల్ గెలుచుకున్నాను' అని నవ్వుతూ అంటోంది భాను. కోచ్ దగ్గర శిక్షణ ఏమీ తీసుకోకుండానే గత ఏడాది జిల్లా స్థాయి పోటీల్లో గెలిచింది. రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధమయ్యే క్రమంలో కోచ్ దగ్గర మెళకువలు నేర్చుకుంది. అయితే ఆమె రాష్ట్రస్థాయి చాంపియన్ షిప్‌తో ఆగిపోవడం లేదు. ''జాతీయ స్థాయి పోటీలకూ సిద్ధమే'' అంటోంది. పవర్ లిఫ్టింగ్ పోటీలలో కూడా భానుకు అనేక అవార్డులు వచ్చాయి. పోటీల కోసం ఇస్లాం సంప్రదాయాన్ని తానేమీ ధిక్కరించడం లేదని, మత విశ్వాసాలను గౌరవిస్తూ ఒంటి నిండా దుస్తులు ధరిస్తున్నాననీ కూడా చెబుతోంది మజీజియా భాను. అయితే, మహిళా విజేతకు 'మిస్టర్ కేరళ' అనే టైటిల్ ఇవ్వడంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఉమెన్ కేటగిరీ బాడీ బిల్డింగ్ పోటీలలో గెలిచిన మహిళకు.. 'మిస్టర్ కేరళ' అనే టైటిల్‌ని ఇవ్వడం మహిళలను కించపరచడమేనని స్త్రీవాదులు కొందరు అంటున్నారు.

> **"బాడీ బిల్డింగ్ పోటీల కోసం నేనేమీ ఇస్లాం సంప్రదాయాలను ధిక్కరించడం లేదు. మత విశ్వాసాలను గౌరవిస్తూ, ఒంటి నిండా దుస్తులు ధరించి మాత్రమే బరిలోకి దిగుతున్నాను" అంటోంది మజీజియా భాను.**

– మంజీర

ఈ పాటకు ట్యూన్ తెలుసా?



కట్‌చేయ్...దాచేయ్...

పల్లవి :
నిన్నలా నిన్నలా చూసానే
కల్లలో కల్లలో దాచానే
రెప్పలే వెయ్యనంతగా కనుల పండగే
నిన్నలా నిన్నలా చూసానే
అడుగులే తడబడె నీ వల్లే
గుండెలో వినపడిందిగా ప్రేమ చప్పుడె
నిను చేరి పోయె నా ప్రాణం
కోరెనెమో నిన్నే ఈ హృదయం
నా ముందుందే అందం నాలో ఆనందం
నన్ను నేనె మరచిపోయెలా ఈ క్షణం

ఈ వర్షానికి స్పర్శుంటె నీ మనసే తాకేనుగా
ఈ యదలోని పేరే పలికేలె ఇవాలే ఇలా
॥ ఈ వర్షానికి॥

చరణం:
తొలి తొలి ప్రేమె దాచే ఇలా
చిరు చిరు నవ్వే ఆపేయ్‌కిలా
చలి చలి గాలే వీచేంతలా
మరి మరి నన్నే చేరిందలా
నిను నీ నుంచి నువ్వు బైటకు రానివ్వు
మబ్బు తెరలు తెంచుకున్న జాబిలమ్మలా

ఈ వర్షానికి స్పర్శుంటె నీ మనసే తాకేనుగా
ఈ యదలోని పేరే పలికేలె ఇవాలే ఇలా
॥ ఈ వర్షానికి॥

చిత్రం : తొలిప్రేమ ; రచన : శ్రీమణి
సంగీతం : తమన్ ; గానం: అర్మన్ మాలిక్, తమన్

https://youtu.be/IMAUNvSYs_Q

కట్‌చేయ్...దాచేయ్...

జ్ఞానుకో సుడోకు

	2	5			1		3	
4	7		9					5
				4	5		7	
3	4		8			5		2
			5		4			
7		8			2		9	4
	9		1	7				
5					3		1	9
	1		6			7	4	

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3x3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

8	7	5	4	3	9	1	2	6
2	6	4	8	7	1	9	5	3
9	1	3	2	5	6	7	8	4
1	5	8	3	4	2	6	9	7
4	2	7	6	9	5	8	3	1
6	3	9	1	8	7	2	4	5
5	8	2	7	1	4	3	6	9
7	9	6	5	2	3	4	1	8
3	4	1	9	6	8	5	7	2

సెల్ఫ్ చెక్

ఇతరుల మీద వాలిపోతుంటారా?



ఎవరైనా కలుపుగోలుతనంతో అందరినీ నవ్విస్తూ, ఉల్లాసంగా గడపటం వరకు ఉంటే బాగుంటుంది. పరిచయాలను మిస్‌యూజ్ చేస్తూ పబ్బం గడుపుకుంటే అలాంటివారిపై సరైన అభిప్రాయం ఏర్పడదు. కొందరు స్నేహం పేరుతో ఇతరులమీద ఆధారపడాలనుకుంటారు. వారి జేబులోని డబ్బు ఖర్చు చేయకుండా ఇతరులతో వారి అవసరాలను తీర్చుకోవాలనుకుంటారు. ఇలాంటి లక్షణానికి మీరు దూరంగా ఉంటున్నారా?

1. అత్యవసరాల్లో కూడ మీ డబ్బు ఖర్చు కాకూడదనుకుంటారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
2. ఎక్కువ ఆశపరులుగా ఉంటారు. మాటకారితనంతో అందరినీ మీవైపు తిప్పుకోవాలనుకుంటారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
3. హోటల్‌కు వెళ్లినప్పుడు స్నేహితులు బిల్లు కట్టేదాకా అలానే చూస్తుంటారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
4. సాధ్యమైనంత వరకు అన్నీ తేరగా పొందాలనుకుంటారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
5. మీ బ్యాంకు లావాదేవీల వివరాలు ఎవరికీ తెలియకుండా జాగ్రత్త పడతారు. అదే సమయంలో మీ దగ్గరవారివి తెలుసుకుంటారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
6. ఏదైనా రంగంలో మీ స్నేహితులు పెట్టుబడిపెట్టిన తర్వాత (లాభాలు వస్తుంటేనే) దానిలో భాగస్వాములు కావాలనుకుంటారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
7. ఇతరుల డబ్బును (మీరు సంపాదించనిది) గొప్పకోసం సులభంగా దానం చేస్తారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
8. కష్టపడకుండా, పెట్టుబడి లేకుండా ఆదాయం ఎలా వస్తుందో మార్గాలు వెతుకుతారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
9. స్నేహితులు/తెలిసినవారు ఆఫర్ చేయకుండానే వారి ఖాతాలో మీకు కావలసింది తీసుకుంటారు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐
10. స్నేహితులు బాధ పడుతున్నా, మీపై చులకనభావం కలుగుతున్నా, మీ ప్రవర్తన మార్చుకోరు.
   ఎ. కాదు ☐ బి. అవును ☐

'బి' లు ఏడు దాటితే ఇతరుల నుంచి మీకు కావలసింది ఫ్రీగా పొందాలనుకుంటారు. కష్టపడకుండా అన్నీ కావాలనుకుంటారు. ఇలాంటి అలవాటుతో చిక్కులు వస్తాయని తెలుసుకోండి. 'ఎ' లు 'బి' ల కన్నా ఎక్కువగా వస్తే ఉన్నదానితో తృప్తి చెందుతారు. ఇతరులను ఏదీ ఆశించరు.



● మహేశ్‌బాబు

ఫుల్ క్లారిటీ

మహేశ్‌బాబు నెక్ట్స్ సినిమా స్టోరీలైన్ మరెక్కడి నుంచో ఇన్‌స్పైర్ అయి, తీసుకున్నారన్న గాసిప్‌రాయుళ్ల కథనాలకు ఫుల్‌స్టాప్ పెట్టారు దర్శకుడు వంశీ పైడిపల్లి. మహేశ్‌బాబు హీరోగా ఆయన దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనుంది. ''ఈ సినిమా కాన్సెప్ట్‌ను ఆస్ట్రేలియా సిరీస్‌ల నుంచి తీసుకున్నారని, ఈ మూవీ స్టోరీ లైన్ ఎవరో న్యూజిలాండ్ రైటర్ రాశారని ఏవేవో వార్తలు వినిపిస్తున్నాయి. ఇలా స్ప్రెడ్ కాకుండా, ఫ్యాన్స్ కన్‌ఫ్యూజ్ అవ్వకుండా, ఈ వార్తలపై దయచేసి క్లారిటీ ఇవ్వండి'' అని ఓ అభిమాని దర్శకుడు వంశీ పైడిపల్లిని ట్విట్టర్‌లో అడిగాడు. ఈ విషయంపై దర్శకుడు వంశీ పైడిపల్లి స్పందించారు. ''అవన్నీ తప్పులే. ఆ వార్తల్లో నిజం లేదు. మహేశ్‌బాబు హీరోగా నేను తీయబోయే సినిమా మరెక్కడి నుంచో ఇన్‌స్పైర్ అయ్యింది కాదు'' అని పేర్కొన్నారు వంశీ పైడిపల్లి. సో.. ఈ సినిమాపై ఫుల్ క్లారిటీ వచ్చింది. ఇదిలా ఉంటే.. గతంలో కూడా ఈ సినిమాకు 'కృష్ణా ముకుందా మురారి, హరేరామ హరేకృష్ణ' అనే టైటిల్స్‌ను అనుకుంటున్నారన్న వార్తలను వంశీ పైడిపల్లి ఖండించిన విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ఏప్రిల్‌లో స్టార్ట్ కానుందని సమాచారం. ఇందులో పూజా హెగ్డే కథానాయికగా నటించనున్నారు.

డబ్బుతో పాటు ఆ రెండూ వస్తాయి

''ఏదైనా ఫీల్డ్‌లో పని చేస్తే కేవలం జీతం మాత్రమే వస్తుంది. కానీ సినిమా పరిశ్రమలో అదనంగా పేరు, ప్రేమ రెండూ వస్తాయి'' అంటున్నారు అనుష్క. ఈ బెంగళూరు బ్యూటీ ఇండస్ట్రీలోకి వచ్చి దాదాపు పన్నెండేళ్లు అవుతోంది. ఈ సందర్భంగా సినిమాతో తనకున్న అనుబంధం గురించి ఆమె మాట్లాడుతూ – ''నటిగా ఉన్నందుకు చాలా హ్యాపీగా ఫీల్ అవుతున్నాను. ఎందుకంటే మా మీద అమితమైన ప్రేమ, ఆప్యాయతలను కురిపిస్తుంటారు అభిమానులు. సినిమా మా జాబ్. మా బెస్ట్ ఇవ్వడానికి రాత్రీ పగలు కష్టపడతుంటాం. సినిమాలను అందరూ ఇష్టపడుతుంటారు. 'సినిమా బావుంది, మీరు బాగా చేశారు' అని అభినందిస్తే మేం చాలా ఖుషీగా ఫీల్ అవుతాం. సినిమా నాకు చాలా ఇచ్చింది. అందుకే కళామతల్లికి, అభిమానులకు రుణపడి ఉంటాను'' అన్నారు అనుష్క.



● అనుష్క

మీరు సూపర్ అండీ



● సమంత

సమంత ఎలా ఉంటారు? కాసేపు ఎండలో తిరిగితే కందిపోయేంత సుకుమారంగా కనిపిస్తారు. అలాంటి సుకుమారి గేదెలను మేపటానికి వెళ్లారు. రాళ్ల పొయ్యి మీద గొట్టంతో ఊదుతూ వంట చేశారు. మాసిన బట్టలను రేవులోకి తీసుకెళ్లి ఉతికారు. పుల్లల మోపును నెత్తిన పెట్టుకొని కష్టపడ్డారు. ఇదంతా దేనికోసం అంటే 'రంగస్థలం' సినిమా కోసం. సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా రూపొందిన ఈ సినిమాలో సమంత పల్లెటూరి అమ్మాయి రామలక్ష్మిగా కనిపించనున్నారు. సాధారణంగా హీరోయిన్స్ ఎక్కువగా గ్లామర్ రోల్స్‌కే పరిమితమైనప్పటికీ ఎప్పుడైనా డీ– గ్లామరైజ్డ్ రోల్ వస్తే వెంటనే ఒప్పేసుకుంటారు. రామలక్ష్మి పాత్ర గురించి సుకుమార్ చెప్పగానే సమంత ఎంతో ఎగ్జైట్ అయ్యి, గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ క్యారెక్టర్ కోసం ఎంత కష్టపడటానికైనా ఆమె వెనకాడలేదు. గేదెలను పీచుతో శుభ్రం చేయటం, పుల్లల మోపును మోసుకెళ్లటం, చెరువులోకి దిగి బట్టలు జాడించటం వంటివి చేశారు. ఓ అభిమానికి ఇవన్నీ సమంత స్వయంగా చేసిందా? అని డౌట్ వచ్చింది? ఆ డౌట్‌ను ఈ బ్యూటీ దగ్గర ఎక్స్‌ప్రెస్ చేశాడు. ''అవును. నేను నిజంగానే గేదెలకు స్నానం చేయించా'' అని ఆ అభిమానికి రిప్లై ఇచ్చారు సమంత. వెంటనే అతను 'ఎంతైనా మీరు సూపర్ అండీ' అని కితాబులిచ్చేశాడు.

పెద్దపులితో చిందులు

'నువ్వు పెద్దపులి.. నువ్వు పెద్దపులి.. నెక్కినావమ్మ' అంటూ గండిపేట మైసమ్మ పై సాగే పాటను వింటే ఎవ్వరికైనా సరే పూనకం రావల్సిందే. ఇప్పుడు అదే జానపద గేయాన్ని నితిన్ కొత్త చిత్రం 'ఛల్ మోహన రంగ' కోసం రీ–క్రియేట్ చేశారు. ఈ పాటను వరంగల్‌లోని వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజ్‌లో విడుదల చేశారు. ''హీరో ఇంట్రడక్షన్‌లో వచ్చే ఈ సాంగ్‌లో పెద్దపులితో చిందులు వేయనున్నారు నితిన్. ఈ పాటలోని ఎనర్జీ ఏమాత్రం తగ్గకుండా సంగీత దర్శకుడు తమన్ ఫోక్ ఇన్‌స్ట్రుమెంట్స్‌తో ట్యూన్ చేశారు. సాహితీగారు అదే స్థాయిలో సాహిత్యం అందించారు. లేటెస్ట్ సెన్సేషన్ రాహుల్ సిపిలిగంజ్ అద్భుతంగా ఆలపించారు'' అని చిత్ర బృందం పేర్కొంది. ఇది నితిన్‌కు 25వ సినిమా కావడం, త్రివిక్రమ్ కథ అందించటం విశేషం. కృష్ణ చైతన్య దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాను శ్రేష్ఠ మూవీస్, పవన్ కళ్యాణ్ క్రియేటీవ్ వర్క్స్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.



● నితిన్

అందమైన సమ్మోహనం



● అదితీరావ్, సుధీర్‌బాబు

సుధీర్‌బాబు, అదితీ రావ్ హైదరి జంటగా మోహనకృష్ణ ఇంద్రగంటి రూపొందిస్తున్న ప్రేమకథా చిత్రం 'సమ్మోహనం'. శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాను జూన్ 15న విడుదల చేస్తున్నట్టు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా మోహనకృష్ణ మాట్లాడుతూ – ''ఈ కొత్తతరం ప్రేమకథలో రొమాన్స్, వినోదం రెండూ ఉంటాయి. టైటిల్‌కు తగ్గట్టుగానే సినిమా అంతా ఫీల్ క్యారీ అయ్యి, సమ్మోహనంగా ఉంటుంది''అన్నారు. ''ఈ నెల 21 నుంచి హిమాచల్ ప్రదేశ్, ముంబైలో షూటింగ్ జరుపుతాం. దాంతో సినిమా పూర్తవుతుంది. సంగీత ప్రాధాన్యం ఉన్న చిత్రమిది'' అన్నారు నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్.

అర్హులకు న్యాయం చేస్తాం

- ఎన్.శంకర్



● ఎన్.శంకర్, రవికుమార్ చౌదరి, అడ్డాల శ్రీకాంత్

''సాధ్యంకాని హామీలను ఇవ్వడం నాకు ఇష్టం లేదు. కొంత కాలంగా దర్శకుల సంఘంలో అవినీతి పెరిగిపోయింది. అనర్హులు చిత్రపురి కాలనీలో గృహాలను సొంతం చేసుకున్నారు. మా కమిటీ ఎన్నికైతే అర్హులకు న్యాయం చేసి గృహ వసతి కల్పిస్తాం. దర్శకుల సంక్షేమానికి కృషి చేస్తా'' అన్నారు దర్శకుడు ఎన్.శంకర్. 2018 సంవత్సరానికి గాను తెలుగు డైరెక్టర్స్ ఫిల్మ్ అసోసియేషన్‌కు ఆదివారం హైదరాబాద్‌లో ఎన్నికలు నిర్వహించబోతున్నారు. ఈ సందర్భంగా శనివారం తన మద్దతుదారులతో సమావేశాన్ని నిర్వహించారు దర్శకుడు ఎన్.శంకర్. ఆయన మాట్లాడుతూ–''తొలుత ఈ ఎన్నికల్లో పోటీ చేయవద్దని అనుకున్నాను. కానీ..'మనం చాలా సంక్షోభంలో ఉన్నాం. మీరొచ్చి గట్టెకించాలి' అని చాలా మంది సన్నిహితులు నన్ను కోరడంతో ఒప్పుకున్నాను.ప్రతి ఒక్కరు విచక్షణతో ఆలోచించి ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుకుంటున్నాను ''అన్నారు. ''దర్శకుల సంఘానికి ఎన్.శంకర్ పూర్వవైభవాన్ని తీసుకొస్తారనే నమ్మకం ఉంది'' అన్నారు తమ్మారెడ్డి భరద్వాజ. ఎన్.శంకర్ ప్యానెల్ నుంచి జి. రాం ప్రసాద్, కాశీవిశ్వనాథ్, ఎ.ఎస్. రవికుమార్ చౌదరి, ఎస్వీ భాస్కరరెడ్డి, కట్టా రంగారావు, ఎమ్.ఎస్. శ్రీనివాస్, ఎన్.గోపిచంద్, డివీ రాజు, శ్రీకాంత్ అడ్డాల, అనిల్ రావిపూడి, ప్రియదర్శిని, జి.గంగాధర్, చంద్రకాంత్ రెడ్డి, కృష్ణబాబు, రామకోటేశ్వరరావు, అంజిబాబు, మధుసూధన్ రెడ్డి పోటీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ కృష్ణారెడ్డి, బి.గోపాల్, ప్రేమ్‌రాజ్, వీరశంకర్, శ్రీవాస్, కొదండరామిరెడ్డి, ధవళ సత్యం తదితరులు పాల్గొన్నారు.

పిశాచి, పిజ్జా చిత్రాల్లా...

కార్తీక్, నిరంజన జంటగా సాయి సత్యం దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రం '465' అదే పేరుతో తెలుగులో విడుదల కానుంది. లక్ష్మీ వాసంతి ప్రొడక్షన్ పతాకంపై అడ్డాల వెంకట్రావ్, ఎ.టి. కృష్ణన్ ఈ చిత్రాన్ని తెలుగులోకి అనువదిస్తున్నారు. ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ – ''తమిళంలో ఈ చిత్రం ఘనవిజయం సాధించింది. 'పిశాచి, పిజ్జా' చిత్రాల్లా ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. హరర్, సస్పెన్స్ ఎలిమెంట్స్‌తో సాగే థ్రిల్లర్. శశాంక్ వెన్నలకంటి రాసిన సంభాషణలు చిత్రానికి హైలెట్. త్వరలో టీజర్ లాంచ్‌ను, సినిమా విడుదలను ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు. సంగీతం: రవి చంద్రన్, సహ నిర్మాత: ఎస్.కె.రఫీ.



● కార్తీక్, నిరంజన

చల్ చల్ గుర్రం



● రవిశంకర్

'బొమ్మాళి నిన్ను వదలా...' అంటూ 'అరుంధతి' సినిమాలో సోనూసూద్ పాత్రకు డబ్బింగ్ చెప్పిన రవిశంకర్ ఫస్ట్ టైమ్ గాయకుడిగా మారారు. నిరూప్ భండారి, అవంతికా శెట్టి జంటగా అనూప్ భండారి రూపొందించిన కన్నడ, తెలుగు ద్విభాషా చిత్రం 'రాజరథం'. ఈ సినిమాలోని మూడవ పాట 'చల్ చల్ గుర్రం'ను రిలీజ్ చేశారు చిత్రబృందం. ''సినిమాలో తాను పోషించిన 'అంకుల్' పాత్ర కోసం రవిశంకర్ ఈ పాటను పాడారు. పాటను మహాబలేశ్వర్, పూణే వంటి అందమైన ప్రదేశాల్లో షూట్ చేశాం. సైడ్ కార్ ఉండే స్కూటర్ పాటకు ప్రధాన ఆకర్షణగా ఉండటమే కాకుండా, మనల్ని పాత జ్ఞాపకాల్లోకి తీసుకువెళ్తుంది. రామజోగయ్య శాస్త్రిగారి సాహిత్యం వీనుల విందుగా ఉంటుంది'' అని పేర్కొన్నారు చిత్రబృందం. ఈ సినిమా మార్చి 23న విడుదల కానుంది.

పరి పరిశోధన


వానొచ్చినా కరెంటు పుట్టించే సోలార్ ప్యానెల్!

సూర్యుడు వెలుగులు చిమ్ముతున్నప్పుడు మాత్రమే కాకుండా.. వాన చినుకులు పడుతున్నప్పుడూ విద్యుత్తు ఉత్పత్తి చేయగల సరికొత్త సోలార్ ప్యానెల్స్‌ను చైనా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అభివద్ధి చేశారు. ఏసీఎస్ నానో జర్నల్ తాజా సంచిలో ప్రచురితమైన పరిశోధన వ్యాసం ప్రకారం.. ఈ హైబ్రిడ్ సోలార్ ప్యానెల్‌లో సాధారణ సిలికాన్ సోలార్‌సెల్స్‌తోపాటు ట్రైబోఎలక్ట్రిక్ నానో జనరేటర్లు ఉంటాయి. సిలికాన్ సెల్స్ సూర్యుడి వెలుతురును విద్యుత్తుగా మార్చేస్తే.. నానో జనరేటర్లు యాంత్రిక శక్తిని విద్యుత్తుగా మారుస్తాయి. వాన చినుకులు ఈ ప్యానెల్‌పై పడినప్పుడు ఈ జనరేటర్లు వాటి ద్వారా అందే యాంత్రిక శక్తిని విద్యుత్తుగా మారుస్తాయి. ఇలా రెండు రకాలుగా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును జత చేసేందుకు ఒకే ఎలక్ట్రోడ్‌ను వాడటం ఇందులోని విశేషం. నానో జనరేటర్‌కు, సోలార్ సెల్‌కు మధ్య ఉండే ఈ ఎలక్ట్రోడ్ సోలార్ సెల్‌కు రక్షణ కవచంగానూ ఉపయోగపడుతుందని తద్వారా దాని సామర్థ్యం తగ్గకుండా ఉంటుందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త తెలిపారు. అంతేకాకుండా ఈ ఎలక్ట్రోడ్ కాంతి ఎక్కువగా బయటకు వెళ్లకుండా అడ్డుకుని విద్యుదుత్పత్తిని పెంచుతుందని వివరించారు.



ఆ బ్యాక్టీరియాతో మధుమేహులకు మేలు!

పీచుపదార్థాలను పేగుల్లో పులిసిపోయేలా చేసే బ్యాక్టీరియాతో మధుమేహులకు ఎక్కువ లాభం చేకూరుతుందని రట్గర్స్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అంటున్నారు. వేర్వేరు రకాల పీచుపదార్థాలను తీసుకోవడం ద్వారా ఈ రకమైన బ్యాక్టీరియా పేగుల్లో వృద్ధి చెందేలా చేసుకోవచ్చునని.. తద్వారా రక్తంలో గ్లూకోజ్ మోతాదులను నియంత్రణలో ఉంచుకోవచ్చునని వారు అంటున్నారు. ఆరేళ్లపాటు కొంతమంది ఆహారపు అలవాట్లను.. వారు తీసుకునే పీచుపదార్థాలను పరిశీలించడం ద్వారా తాము ఈ అంచనాకు వచ్చినట్లు ఈ పరిశోధనలకు నేతృత్వం వహించిన శాస్త్రవేత్త లిపింగ్ ఝూవ్ తెలిపారు. పేగుల్లో మనం తినే ఆహారంలోని పీచుపదార్థాలు, కార్బోహైడ్రేట్లను బ్యాక్టీరియా చిన్నచిన్న ముక్కలుగా చేస్తుందని.. ఈ క్రమంలో ఏర్పడే షార్ట్ చెయిన్ ఫ్యాటీ యాసిడ్లు పేగు గోడలకు చేరి వాపు/మంటలను తగ్గిస్తాయి. ఈ రకమైన ఫ్యాటీ యాసిడ్లు తక్కువైనప్పుడు మధుమేహం వంటి వ్యాధులు వస్తాయని ఇప్పటికే కొన్ని పరిశోధనలు రుజువు చేసిన నేపథ్యంలో తాజా అధ్యయనానికి ప్రాధాన్యం ఏర్పడింది. సాధారణ ఆహారం తీసుకునే వారితో పోలిస్తే... వేర్వేరు రకాల పీచు పదార్థాలు ఆహారం రూపంలో తీసుకునే వారి రక్తంలో గ్లూకోజ్ మోతాదు నియంత్రణలో ఉన్నట్లు తెలిసింది. దాదాపు పన్నెండు వారాలపాటు సాగిన ఈ అధ్యయనంలో మూడు నెలల గ్లూకోజ్ మోతాదులను లెక్కించారు.



బంగారం, టైటానియంతో అంధత్వానికి చెక్?

అంధత్వంతో బాధపడుతున్న వారికి ఎంతో కొంత స్థాయిలో చూపు కల్పించేందుకు శాస్త్రవేత్తలు ఇప్పటికే అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. చైనాలోని యూనివర్శిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు తాజాగా చేసిన పరిశోధనల్లో పాక్షిక విజయం సాధించారు కూడా. బంగారం, టైటానియం వంటి లోహాలతో చూపు కోల్పోయిన ఎలుకలు మళ్లీ చూడగలిగేలా చేశారు వీరు. కళ్లల్లో కాంతికి స్పందించే కొన్ని ప్రత్యేక భాగాలు ఉంటాయి. వీటిని ఫొటో రిసెప్టర్లు అంటారు. కొన్ని ఎలుకల్లో జన్యుమార్పుల తద్వారా ఈ ఫొటో రిసెప్టర్లు క్రమేపీ నాశనమయ్యేలా చేసి వీరు కొన్ని పరిశోధనలు చేశారు. నాశనమైన ఫొటో రిసెప్టర్ల స్థానంలో బంగారం, టైటానియం నానో తీగలతో చేసిన ఫొటో రిసెప్టర్లను అమర్చినప్పుడు ఆ ఎలుకలు మళ్లీ కొన్ని రంగులను చూడగలిగినట్లు ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త ఒకరు చెప్పారు. అంతేకాకుండా లోహపు ఫొటో రిసెప్టర్లు కలిగి ఉన్న ఎలుకలు వెలుతురుకు స్పందించడం మొదలుపెట్టాయని.. ఎనిమిది వారాల తరువాత కూడా ఎలాంటి దుష్ప్రభావాలూ కనిపించలేదని వివరించారు. రెటినైటిస్ పిగ్మెంటోసా, మాక్యులర్ డిజనరేషన్ వంటి కంటివ్యాధులకూ ఈ పరిశోధన ద్వారా మెరుగైన చికిత్స అందించేందుకు వీలుందని నిపుణుల అంచనా.



ధర్మజిజ్ఞాస

పెళ్లి అయిన వెంటనే సత్యనారాయణ వ్రతం చేయిస్తారెందుకు?



వ్రతాలలో సత్యనారాయణస్వామి వ్రతానికి ఎంతో విశిష్టత వుంది. అనేక కష్టాల నుంచి ... నష్టాల నుంచి ... బాధల నుంచి బయటపడేసే శక్తి ఈ వ్రతానికి వుంది. ఒక్కమాటలో చెప్పాలంటే, జీవితమనే సముద్రంలో కష్టాల సుడిగుండంలో చిక్కుకున్న వాళ్లని క్షేమంగా తీరానికి చేర్చే నావలా సత్యనారాయణస్వామి వ్రత ఫలితం పనిచేస్తుంది.

తొలిసారిగా కొత్తకోడలు తమ ఇంట్లో అడుగుపెట్టిన సందర్భంగా, అత్తగారింటి వాళ్లు నూతన దంపతులతో సత్యనారాయణస్వామి వ్రతం చేయించడం ఆచారంగా వస్తోంది. ఎక్కడో కొంతమంది తప్ప చాలామంది ఈ ఆచారాన్ని పాటిస్తూ వుంటారు. సత్యనారాయణ వ్రతం చేసుకోకపోతే దోషంగా భావిస్తుంటారు. త్రిమూర్తుల ఏకరూపంగా సత్యనారాయణస్వామి ఈ భూమిపై ఆవిర్భవించాడని పురాణాలు చెబుతున్నాయి.

అసాధారణమైన శక్తిని కలిగిన ఈ స్వామిని పూజించడం వలన త్రిమూర్తులను ప్రత్యక్షంగా సేవించిన ఫలితం దక్కుతుందని విశ్వసిస్తుంటారు. పెళ్లితో ఒక్కటైన నూతన దంపతులు కొత్త జీవితాన్ని ఆరంభిస్తారు. వాళ్ల జీవన ప్రయాణం ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సుఖసంతోషాలతో సాగేలా ఆశీస్సులు అందజేయమని, త్రిమూర్తి స్వరూపుడైన సత్యనారాయణస్వామిని వేడుకుంటూ ఈ వ్రతాన్ని చేయిస్తూ వుంటారు.

ఇక ఈ వ్రతానికి తమ గ్రామస్తులను ఎక్కువగా పిలుస్తూ వుంటారు. తమ గ్రామానికి కొత్తగా వచ్చిన కోడలు పిల్లను చూడాలని అక్కడి స్త్రీలు ఆతృత పడుతుంటారు. సత్యనారాయణస్వామి వ్రతానికి వచ్చిన వాళ్లు ఆ కోడలు పిల్లను చూడటం జరుగుతుంది. ఈ కారణంగా వాళ్లందరితో ఆ కోడలికి పరిచయం ఏర్పడటం వలన, ఆ తరువాత చాలా తొందరగా వాళ్లతో కలిసిపోతుంది. తనకి ఆ ఊరు కొత్త అనే విషయాన్ని కొద్ది రోజుల్లోనే మరిచిపోతుంది...

ఓం నమో సత్యదేవాయ నమః

మీకు తెలుసా?



- దీపారాధనకు ఒక కుంది మాత్రమే వాడినపుడు మూడు వత్తులు వేయాలి.
- కొబ్బరికాయను నీళ్ళతో కడిగి కొట్టడం చాలా తప్పు, కొబ్బరికాయను పీచు ఒలిచివేశాక నీళ్ళతో కడగరాదు..
- కొబ్బరికాయ కొట్టాక వెనుకవైపు పీచు తీయాలనే నియమం కూడా తప్పనిసరి కాదు. శుభ్రత కోసం పీచు తీయవచ్చు, తీయకపోతే దోషం లేదు..
- గృహప్రవేశ కాలంలో గాని, ఏడాదిలోపు గాని ఆ ఇంట మణిద్వీప పారాయణం చేయడం మంచిది. ఇది వాస్తుదోషాలను పరిహరిస్తుంది..
- దీపాలు పెట్టేవేళ తలదువ్వుకోరాదు

కాసుకో సుడోకు

8	7	5	4		9		2	
	6		8			9		
				5			8	4
		8	3					7
4	2	7				8	3	1
6					7	2		
5	8			1				
		6			3		1	
	4		9		8	5	7	2

నిబంధనలు

ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

4	9	7	3	8	2	6	1	5
1	3	2	4	5	6	8	7	9
8	6	5	1	7	9	4	2	3
9	7	3	8	2	4	5	6	1
5	1	8	6	9	3	2	4	7
2	4	6	7	1	5	9	3	8
3	8	9	2	4	7	1	5	6
7	2	1	5	6	8	3	9	4
6	5	4	9	3	1	7	8	2

అతిథి దేవోభవ

అతిథిపూజకు ప్రేమే పుష్పం



కుచేలుడు పరమ దరిద్రుడు. బ్రహ్మజ్ఞాని. ఒక్క కాసుదొరికితే పదివేల కాసులని మురిసిపోతాడు. ఉంటే తింటాడు. లేకపోతే మానేస్తాడు. ఎప్పుడూ బ్రహ్మానందంలో ఉండేవాడు. ఒకనాడు భార్య ...''ఏమండీ, కృష్ణుడు మీకు స్నేహితుడు కదా, ఒక్కసారి ఆయనను దర్శించుకుంటే మన దరిద్రం తీరిపోతుందికదా !' అంది. అక్కడికి వెడితే కృష్ణుడికి అతిథి అవుతాడు కుచేలుడు. ''నీ సలహా మంచిదే. కానీ స్నేహితుడి దగ్గరకు వెడుతూ ఏమీ పట్టుకెళ్ళకుండా ఎలా..ఏదయినా ఉందా...అయినా నీ పిచ్చికానీ నేను వెడితే మన దరిద్రం పోయేంత ఐశ్వర్యం ఇస్తాడా !!!'' అని కుచేలుడు అన్నాడు.

కలలోసయితం భగవంతుని పేరెత్తని వాడికి కూడా ఆపదవచ్చినపుడు తలచుకోగానే వచ్చి రక్షించే స్వభావం ఉన్నవాడు కదా ఈశ్వరుడు ! అటువంటివాడు నిత్యం భగవంతుని నమ్ముకుని ఉండే మీ కోర్కె తీర్చడా.. వెళ్ళండి'' అని భార్య చెప్పింది.

కుచేలం అంటే చిరిగిన బట్ట. ఆయన ఒంటిమీద ఉన్న బట్టకన్నా దానికి కన్నాలు ఎక్కువ. ఇంట్లో ఉన్న అటుకులను ఆ చినుగుల ఉత్తరీయంలోనే మూటగట్టుకుని కుచేలుడు ద్వారకా నగరంలో కృష్ణుడి నివాసం వద్దకు చేరుకున్నాడు. సాక్షాత్ లక్ష్మీదేవి అవతారమైన రుక్మిణితో కలిసి కృష్ణుడు హంసతూలికా తల్పంమీద ఉన్నాడు. బయట సేవకులు కుచేలుడిని ఆపి ఎవరి కోసం వచ్చావు, ఎవరుకావాలని అడుగుతున్నారు. కృష్ణుడు తన ప్రియస్నేహితుడని కలిసిపోదామని వచ్చానని చెప్పాడు. 'ఎలా వీలవుతుంది ! ఇప్పుడు ఆయన రుక్మిణీదేవితో ఆంతరంగిక మందిరంలో ఉన్నారు. ఇప్పుడు కలిసే అవకాశం లేదు'అని వాళ్ళంటున్నారు.

దూరంనుంచి కృష్ణుడు కుచేలుడిని చూసి గుర్తుపట్టిఒక్కసారిగా మంచం మీదినుంచి దూకి పరుగుపరుగున వచ్చి ఆప్యాయంగా కౌగిలించుకుని 'ఎన్నాళ్ళకొచ్చావోయ్, మిత్రమా..'అంటూ తీసుకెళ్ళి తన శయ్యామందిరంలోని హంసతూలికాతల్పంమీద కూర్చోబెట్టాడు. అతిథి సత్కారం ఎలా చేయాలో కృష్ణభగవానుడు మనకు నేర్పాడు.

అలా కూర్చోబెట్టి'రుక్మిణీ ! అలా చూస్తావేం. ఇతను బ్రహ్మవేత్త, నా బాల్యమిత్రుడు– కుచేలుడు. బంగారు చెంబుతో నీళ్ళు తీసుకురా'..అని చెప్పి పళ్ళెం పెట్టి అందులో కుచేలుడి పాదాలుంచి రుక్మిణీ దేవి బంగారు కలశంతో నీళ్ళు పోస్తుంటే కడిగి అలా కడిగిన నీటిని పరమ భక్తితో తన తలమీద చల్లుకున్నాడు. పళ్ళెం తీసేసి తన ఉత్తరీయంతో పాదాలు తుడిచి, ఒళ్లంతా గంధం రాసి, విసెన కర్రతో విసిరి, మంచి ధూపం వేసి, హారతిచ్చాడు. 'మిత్రమా! ఎన్నాళ్ళకొచ్చావ్, మనిద్దరి గురుకులవాసం గుర్తుందా..' అంటూ పాతజ్ఞాపకాలు గుర్తుచేస్తూ మంచి భోజనం పెట్టి కాళ్ళొత్తి పక్కన కూర్చుని నాకోసం ఏదో తెచ్చి ఉంటావంటూ చొరవగా వెతికి ఉత్తరీయానికి వేలాడుతున్న అటుకులను తీసి గుప్పెడు నోట్లో వేసుకుని 'చాలా బాగున్నాయి' అంటూ పరమ ప్రీతితో వాటిని పరపర నమిలి తినేసాడు. మరో పిడికెడు తీసుకుని నోట్లో వేసుకోబోతుండగా రుక్మిణీదేవి వారించింది. ఇప్పటికే ఇవ్వాల్సిన ఐశ్వర్యమంతా ఇచ్చేసారు. రెండో గుప్పిటతో మిమ్మల్నీ నన్నూ సమర్పించుకుంటారని వారించింది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అదీ అతిథి పూజంటే. ఇంటికొచ్చినవాడు ఏమిచ్చాడన్నది కాదు ప్రధానం, ఇంటికొచ్చినవాడిపట్ల నీవెలా ప్రవర్తించావన్నది ముఖ్యం. అన్నీ పెట్టక్కర్లేదు, అన్నీ చేయక్కర్లేదు. ఎంత ప్రేమతో నీవు మాట్లాడిపంపించావన్నదికూడా అతిథి పూజే. అతిథిరూపంలో వచ్చినవాడికి నీకున్న వాటిని పెట్టి ప్రీతితో సేవించగలగాలి. వచ్చినవాడు ఈశ్వరుడు అన్నభావనతో, ఆ ప్రేమతో, ఆదరబుద్ధితో చేయాలి.

ఉపశమనం

పీడకలలు రాకుండా ఉండాలంటే...



ఎలాంటి ఆర్థిక సమస్యలూ, ఆరోగ్య సమస్యలూ లేకున్నా, ఒక్కోసారి ఏ అర్ధరాత్రి వేళలోనో గాఢనిద్రలో వచ్చే పీడకలలకు ఉలిక్కిపడి హఠాత్తుగా మేలుకుంటారు. ఇక ఆ తర్వాత నిద్రపట్టడమే గగనమవుతుంది. పీడకలలు ఇబ్బంది పెట్టకుండా ఉండాలంటే...

- మీకు అనుకూల నక్షత్రం చూసుకుని, ఏదైనా మంగళవారం రోజున మొదలుపెట్టి హనుమాన్ చాలీసా లేదా ఆంజనేయ దండకం పఠించండి. ప్రతిరోజూ నిత్య పూజలో భాగంగా ఈ పఠనం సాగించండి.
- మహామృత్యుంజయ యంత్రాన్ని తాయెత్తులో భద్రపరచి, దానిని ఏదైనా శనివారం రోజున నల్లదారంతో మెడలో ధరించండి.
- ఉదయం, సాయంత్రం ఇంట్లో గుగ్గిలంతో ధూపం వేయండి. ప్రతిరోజూ నిత్యపూజలో భాగంగా దేవీ ఖడ్గమాలా స్తోత్రాన్ని పఠించండి.
- పీడకలలకు పెద్దలే ఉలిక్కిపడతారు. పిల్లలకు ఇలాంటి అనుభవం ఎదురైతే మరింతగా భయాందోళనలు చెందుతారు. అలాంటప్పుడు పిల్లల తల వద్ద చిన్న పటిక ముక్కను ఉంచి వారిని నిద్రపుచ్చండి. వారు నిద్రలోకి జారుకుంటుండగా ఆంజనేయ దండకాన్ని పఠించండి.
- పిల్లలు పీడకలలో ఇబ్బంది పడుతుంటే, ఏదైనా మంగళవారం రోజున ఆంజనేయుడి ఆలయంలో అర్చన జరిపించండి. సంజీవని పర్వతం మోస్తున్నట్లుగా ఉండే ఆంజనేయుని వెండి లాకెట్‌ను పిల్లల మెడలో వేయండి.

- పన్యాల జగన్నాథదాసు

వేదకాలం

జ్ఞానసముపార్జనలో నారీ రత్నాలు

నిర్వహణ: డి.వి.ఆర్. భాస్కర్


వేదకాలం నుంచి...
స్త్రీలు విజ్ఞాన సముపార్జనలో ముందున్నారు...
వేదాధ్యయనం చేశారు...
వేదాంత చర్చలో పాల్గొన్నారు...

మండన మిశ్రుని భార్య ఉభయభారతి పాండిత్యంలోను, వేదాంతంలోను అగ్రస్థానాన నిలబడింది. జగద్గురు ఆది శంకరాచార్యులకు, తన భర్త మండన మిశ్రునికి మధ్య జరిగిన వాదనకు న్యాయనిర్ణేతగా నిలిచింది ఉభయభారతి. ఈ సంఘటనకు వేల సంవత్సరాల క్రితమే అంటే వేదకాలంలో... గార్గి అనే మహిళ వేదాలను ఔపోసన పట్టినట్లు తెలుస్తోంది. ప్రపంచంతో మానవ సంబంధం గురించి గార్గి విస్తృతంగా చర్చించింది. ఆమె పేరు మీద గార్గి గోత్రం కూడా ఏర్పడింది.

గార్గి వచక్నువు కుమార్తె. వచక్నువు అంటే నిర్భయంగా మాట్లాడగలిగే వ్యక్తి అని అర్థం. తండ్రి నుంచి గార్గికి నిర్భయంగా, నిస్సందేహంగా మాట్లాడే శక్తి అలవడింది. హిందూ సంప్రదాయంలో మహిళల గొప్పదనాన్ని గురించి ఉదహరించేటప్పుడు గార్గి పేరును తప్పనిసరిగా ప్రస్తావిస్తారు. యాజ్ఞ్యవల్క్యునితో వాదనకు దిగి, అతడి పాండిత్యానికి తల వంచింది.

విదేహరాజు అయిన జనకమహారాజు రాజసూయ యాగం నిర్వహించిన సందర్భంలో వివిధ దేశాల రాజులతో పాటు పండితులు కూడా హాజరయ్యారు. వచ్చిన పండితులందరినీ చూసి సంతోషంతో, అందరికంటె ఉన్నతుడిని ఎంపిక చేయాలనుకుని, చర్చ గోష్ఠి ఏర్పాటు చేశాడు. యాజ్ఞవల్క్యునితో వాదించడానికి





ఎవ్వరూ సాహసించలేకపోయారు. యాజ్ఞవల్క్యునితో వాదన చేస్తానని సవాలు విసిరింది గార్గి. చివరి వరకు వాదన చేస్తుంది. చివరలో యాజ్ఞవల్క్యుడు వాదనకు పరిసమాప్తి చెబుతాడు. ఈ వాదనలో గెలిచిన యాజ్ఞ్యవల్కునికి మహారాజు వెయ్యి గోవులు, పదివేల బంగారు నాణాలు బహూకరించారు. బహుమానాన్ని తిరస్కరించి యాజ్ఞవల్క్యుడు అడవులకు తన భార్య మైత్రేయితో కలిసి వెళ్లిపోతాడు. ఆవిడ కూడా భర్తతో సమానంగా చదువుకుంది. గార్గి చిన్నతనం నుంచే వేద పరిజ్ఞానం పెంచుకుంది. తన పరిజ్ఞానంతో పురుషులను అధిగమించింది. అపారమైన, అపరిమితమైన వేదాంత పరిజ్ఞానాన్ని సముపార్జించింది. వేదాలతో పాటు ఉపనిషత్తుల మీద కూడా పట్టు సాధించింది గార్గి. పురుషులతో చర్చల్లో పాల్గొనేది. కుండలినీ శక్తిని సాధించింది. విద్యావ్యాప్తి కోసం ఎంతో పాటు పడింది. ఛాందోగ్యోపనిషత్తులో సైతం గార్గి ప్రస్తావన ఉంటుంది. బ్రహ్మవాదిని అయిన గార్గి, ఋగ్వేదంలో అనేక ఋక్కులను రచించింది. మిథిలా నగర మహారాజైన జనకుని కొలువులో కొలువుతీరిన నవరత్నాలలో గార్గి కూడా ఉంది.

మైత్రేయి: ఋగ్వేదంలో వెయ్యి దాకా ఋక్కులు ఉన్నాయి. ఇందులో 10 ఋక్కులను... యోగిని, వేదాంతి అయిన మైత్రేయికి అంకితం చేశారు. ఆమె తన భర్త అయిన యాజ్ఞవల్క్యుని వ్యక్తిత్వాన్ని, ఆధ్యాత్మిక ఆలోచనలను, జ్ఞానాన్ని వికసింపచేయడానికి కృషి చేసింది. ఉపనిషత్తుల్లో గార్గి పేరుతో పాటు మైత్రేయి పేరు కూడా ప్రసిద్ధిగా వినిపిస్తుంది.

అగస్త్యుని భార్య లోపాముద్ర. భార్యాభర్తల మధ్య నిత్యం జరిగే జ్ఞాన చర్చకు సంబంధించిన అంశాలు ఋగ్వేదంలో ఉన్నాయి.

- డా. వైజయంతి

పుస్తకం

ప్రాచీన విజ్ఞాన ఘనతను కీర్తించే గ్రంథాలు



పురాణాల్లో సైన్స్, జనవరి ఫస్ట్ వర్సెస్ ఉగాది, శ్రీకృష్ణగీత, పురాణగాథల్లో సైన్స్ అద్భుతాలు, ధర్మసందేహాలు– ధార్మిక సమాధానాలు, సులభ శైలిలో వేదవిజ్ఞానం, హిందూ పండుగల్లో సైన్స్... భారతీయ శంఖారావం' పరంపరలో ఇలా వరుసబెట్టి పుస్తకాలను వెలువరిస్తూ వస్తున్న పోలిశెట్టి సోదరుల తాజాపుస్తకం 'ప్రాచీన హిందూ విజ్ఞాన ఘనత'. ఇందులో భూమి గుండ్రంగా ఉందనే విషయాన్ని కనిపెట్టిందీ, కాంతివేగాన్ని, టెలిస్కోప్‌ను కనుగొన్నదీ, ఖగోళశాస్త్ర రహస్యాలను కనుగొన్నదీ కూడా ప్రాచీన భారతీయులేనంటారు. 'ఇంద్రుడి కథల్లో సైన్స్' అనే మరో పుస్తకంలో ఇంద్రుడి గురించి సమాజంలో చెలామణిలో ఉన్న అపోహలెన్నింటినో తొలగిస్తూ, ఇంద్రుడెవరు, ఎక్కడుంటాడు... వంటివాటిని సోదాహరణంగా వివరించారు. విజ్ఞానదాయకం, ఆసక్తికరమైన ఈ రెండు పుస్తకాలూ కలిపి రూ. 125.

ప్రతులకు: పోలిశెట్టి బ్రదర్స్
17–3–6, గొరీకోనేరు వద్ద,
పెద్దాపురం–533 437. సెల్: 99890 89156

బౌద్ధవాణి

ధ్యానసాధన... జ్ఞాన శోధన

తన మార్గం తప్పి, తన నైపుణ్యాన్ని, తెలివితేటల్ని మరో దారిలోకి మళ్లించిన ఒక భిక్షువుకి బుద్ధుడు సరైన ప్రబోధం చేసి, సరైన దారిలోకి తెచ్చిన ఘటన ఇది.

ధనియుడు మంచి నేర్పరి. మట్టితో అందమైన కుండలు మలచగల నిపుణులు. అతను బుద్ధుని ప్రబోధం విని, భిక్షువుగా మారాడు. ధర్మసాధన కోసం ధ్యానాన్ని అభ్యసించడం కోసం ఒక మారుమూల ప్రాంతానికి వెళ్లాడు. ధ్యానసాధన సాగిస్తున్నాడు.

ఒకరోజున అతను తన కుటీరంలో లేని సమయంలో, సమీప గ్రామంలోని ప్రజలు ఒక శవాన్ని ఆ ప్రాంతానికి తెచ్చారు. వర్షం పడటం వల్ల వారికి ఎండుకట్టెలు కనిపించక ధనియుని పర్ణశాలను పీకి, శవాన్ని తగులబెట్టి వెళ్లిపోయారు. ఆ తర్వాత ధనియుడు వచ్చి, 'గడ్డిపాక' ఉంది కాబట్టి ఇలా చేశారు. అదే రాతి కట్టడం ఉంటే చేయలేరు కదా!' అనుకొని, మట్టితో ఇటుకరాళ్లు మలిచి, వాటితో గంట ఆకారంలో గట్టి నివాసాన్ని నిర్మించుకున్నాడు. దీనికోసం ఏడు నెలలు వెచ్చించాడు. ఈ విషయం తెలిసి, బుద్ధుడు అక్కడికి వచ్చి–

''ధనియా! నీ కుటీర నిర్మాణం చాలా బాగుంది. గట్టిది. అందమైనది. విలువైనది. కానీ నీవు దీనికోసం అంతకంటే విలువైన సమయాన్ని వెచ్చించి, ధ్యానసాధన పోగొట్టుకున్నావు. ధ్యానం, జ్ఞానం ఈ కుటీరం కంటే అందమైనవి. గట్టివి. ఉపయోగకరమైనవి. నీలో నైపుణ్యాన్ని ఇలా వృథా చేసుకున్నావు. మనం జ్ఞానసాధనలోనే సమయాన్ని వినియోగించుకోవాలి. ప్రజల దుఃఖాన్ని నిరోధించే పనిలోనే నిరంతరం ఉండాలి. మనం తల



దాచుకోవడానికి ఇలాంటి అధునాతన నిర్మాణాలు అవసరం లేదు. సమయానికి మించిన సంపద లేదు. జ్ఞానానికి మించిన గొప్ప నివాసం లేదు. నీ నైపుణ్యాన్ని జ్ఞానశోధన కోసం, జ్ఞాన సాధన కోసం ఉపయోగించు'' అని చెప్పాడు.

తాను భిక్షువుగా రాణించాలంటే జ్ఞానసాధనే ముఖ్యం అని తెలుసుకున్న ధనియుడు, ఆనాటినుండి ధ్యానసాధనలో, జ్ఞానసముపార్జనలో మేటిగా నిలిచాడు.


- డా. బొర్రా గోవర్ధన్

సువార్త

పరిస్థితిని మార్చే ప్రార్థన

పరమ దుర్మార్గులు, క్రూరులు అయిన నీనెవె ప్రజలకు దుర్గతి కలుగబోతోందని ప్రకటించి పరివర్తన చెందేందుకు దేవుడు వారికొక అవకాశమిద్దామనుకున్నాడు. వారికి ఈ విషయం ప్రకటించే బాధ్యతను యోనా అనే ప్రవక్తకిచ్చాడు, అయితే యోనా అవిధేయుడై నీనెవెకు కాకుండా తర్షీషు అనే చోటికి పారిపోయేందుకు ఓడలో ప్రయాణమయ్యాడు. నీనెవె లోని లక్షా ఇరవై వేలమంది ఉజ్జీవానికి దేవుడు సంకల్పిస్తే, ఆ సంకల్పాన్ని నిర్వీర్యం చేసేందుకు ఒక వ్యక్తి ప్రయత్నిస్తే దేవుడూరుకుంటాడా? యోనా ఓడ భయంకరమైన తుఫానులో చిక్కుకుంది. ఆ విపత్తు యోనా అవిధేయతకు దేవుడు చూపిస్తున్న ఉగ్రత అని తెలుసుకున్న మిగతా ప్రయాణికులు, యోనాను సముద్రంలోకి విసిరేశారు. అక్కడ దేవుడు నియమించిన ఒక మహా మత్స్యం, యోనాను మింగగా, మూడు రోజులపాటు యోనా దాని గర్భంలో మోకరించి పాశ్చ్యాత్తాప ప్రార్థన చేశాడు. తాను నీనెవెకు వెళ్తానని మొక్కుబడి కూడా చేశాడు. అప్పుడు దేవుడాజ్ఞ ఇయ్యగా మత్స్యం అతన్ని ఒడ్డున కక్కి వేసింది. వెంటనే యోనా నీనెవె పట్టణానికి వెళ్లి దేవుని మాటలు ప్రకటించగా, అంతటి దుర్మార్గులూ అనూహ్యంగా సాధువులైపోయి, ఉపవాసప్రార్థనలు చేసి తమ దుర్మార్గతను వదిలేశారు. అంతకాలం దుర్మార్గత అనే దుర్గంధంతో నిండిన నీనెవె పట్టణం, దేవుని ప్రేమ, క్షమ అనే అద్భుతమైన పరిమళంతో నిండిపోయింది. నరకం ఒక్కసారిగా పరలోకంగా మారితే ఎలాఉంటుందో నీనెవెలో ప్రత్యక్షంగా యోనాకు అనుభవమైంది.

రగిలే ఒక నిప్పురవ్వే, ఉవ్వెత్తున లేచే మహా జ్వాలను సృష్టిస్తుంది.. తాను మారి ఉజ్జీవించబడితేనే విశ్వాసి తానున్న సమాజాన్ని మార్చి ఉజ్జీవింప చేయగలడు. దేవుడెవరో ఎరుగని లక్షా ఇరవైవేల మంది నీనెవె ప్రజలను మార్చడం కన్నా, తానెన్నుకున్న, తన సొంతవాడైన యోనాప్రవక్తను మార్చడానికే దేవుడు ఎక్కువగా శ్రమించవలసి వచ్చింది. అంతటి దుర్మార్గులైన నీనెవె ప్రజలూ ఒక్క ప్రసంగంతోనే తాము చేసేది తప్పని తెలుసుకున్నారు. కాని దేవునికెంతో సన్నిహితుడై వుండీ, ఆయన ఆజ్ఞకు వ్యతిరేకంగా పోవడం తప్పని యోనాకు అనిపించలేదు. అయితే నీనెవె ప్రజల దుర్మార్గత అయినా, యోనా చూపించిన అవిధేయత అయినా, దేవుని దృష్టిలో పాపమే!! నాలాంటి పవిత్రుడు నీనెవె ప్రజలవంటి దుర్మార్గుల వద్దకు పోవడమేమిటి? అనుకున్నాడు యోనా. నువ్వూ, నీనెవె ప్రజలూ సమాన పాపులే అన్నాడు దేవుడు. పాపాల్లో చిన్నవి, పెద్దవి అని లేవు. దేవుని దృష్టిలో ఎంతదైనా, ఏదైనా పాపం పాపమే. పాపి దాని నుండి విడుదల కావల్సిందే. దుర్మార్గులైన పాపులు, ఆంతర్యంలో పాపంతో నిండినా పైకెంతో పరిశుద్ధంగా నటించే వేషధారులు... అంతా దేవుని దృష్టిలో సమానమే. అయితే దేవుడు అందరినీ సమానంగా ప్రేమిస్తున్నాడు. అందుకే దేవుడు నీనెవె ప్రజలనూ వదులుకోలేదు, యోనాను కూడా వదులుకోలేదు. మిమ్మల్ని, నన్నూ వదులుకోడు. యోనా ప్రార్థన అతని జీవితాన్ని, నీనెవె ప్రజల ఉపవాస ప్రార్థన వారందరి జీవితాల్ని మార్చింది. కోరికలు తీర్చే ప్రార్థనలు కాదు, జీవితాల్ని మార్చుకునే ప్రార్థనలు ఈ లెంట్‌లో చేద్దాం.



- రెవ.డా.టి.ఏ.ప్రభు కిరణ్

ఇస్లాం వెలుగు

మనకు లేకున్నా ఇతరులకు పెట్టడమే త్యాగం

ఒకసారి ముహమ్మద్ ప్రవక్త మహనీయులు సహచరులతో కలసి కూర్చుని ఉన్నారు. అంతలో ఒక వ్యక్తి అక్కడికొచ్చాడు. ''అయ్యా.. నేను చాలా బాధల్లో ఉన్నాను. ఆకలి దహించి వేస్తోంది. తినడానికి ఏమైనా పెట్టండి'' అని అభ్యర్థించాడు. ప్రవక్తవారి ఇంట ఆ సమయాన ఏమీ లేకపోవడంవల్ల, సహచరుల్ని సంప్రదించారు. అప్పుడు వారిలో అబూతల్ హా అనే ఒక సహచరుడు అతన్ని వెంటబెట్టుకొని ఇంటికి తీసుకెళ్ళాడు. ''ఈరోజు మనం ఒక మనిషికి ఆతిథ్యం ఇవ్వాలి. తినడానికి ఏమైనా ఉందా?'' అని భార్యను అడిగారు. ''అయ్యో... పిల్లల కోసమని ఉంచిన కాస్తంత అన్నం తప్ప మరేమీ లేదు కదండీ'' అని దిగులుగా చెప్పింది శ్రీమతి.

''అయితే ఒకపని చేయి. పిల్లకు ఏదో ఒక వంక చెప్పి భోజనం పెట్టకుండా నిద్రపుచ్చు. పిల్లలు పడుకోగానే భోజనం వడ్డించు. ఆకలితో ఉన్న అతిథితో పాటు నేను కూడా భోజనానికి కూర్చుంటాను. తరువాత నువ్వు దీపం సరి చేస్తున్నట్లు చేసి దాన్ని ఆర్పేసెయ్. కాసేపటి దాకా నువ్వు 'అయ్యయ్యో.. దీనికేమయిందీ..' అనుకుంటూ దాన్ని సరి చేస్తునే ఉండు. ఆ సమయంలో నేను అతిథికి వడ్డిస్తూ, నేను కూడా తింటున్నట్లుగా నటిస్తాను. చీకట్లో మనం తిన్నదీ లేనిదీ అతనికి తెలియకుండా ఉంటుంది''అన్నారు.




శ్రీమతి అలాగే చేసింది. ఈ విధంగా భోజనానికి అందరూ కూర్చున్నారు. కాని అతిథి మాత్రమే భోంచేశాడు. పిల్లలతో సహా భార్యాభర్తలిద్దరూ ఆ రాత్రి పస్తులే ఉన్నారు. తెల్లవారి ఉదయం యధాప్రకారం అబూతల్ హా (ర)ముహమ్మద్ ప్రవక్త(స)వద్దకు వెళ్ళారు. అప్పుడు ప్రవక్త మహనీయులు ఆయన్ను అభినందిస్తూ 'అల్లాహ్ కు తన భక్తుడు అబూతల్ హా అన్సారీ, ఆయన శ్రీమతి ప్రవర్తన ఎంతగానో నచ్చింది. అల్లాహ్ అమితంగా సంతోషించాడు' అని శుభవార్త వినిపించారు.

ముహమ్మద్ ప్రవక్తవారి బోధనలు, శిక్షణ, సహచర్యం ఆయనగారి అనుచరుల్లో ఎంతటి దయాగుణాన్ని, త్యాగనిరతిని జనింపజేశాయో ఈ సంఘటన ఒక సజీవ సాక్ష్యంగా మనకు కనిపిస్తోంది. మనం, మన అవసరాలకంటే పరుల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. దాన్ని మాత్రమే త్యాగం అనవచ్చు. మనకు పనికి రానిది, మిగిలిపోయింది, సద్దిలాంటివి ముష్టిగా పడేసి ఏదో చేసేశాం అనుకుంటే అంతకంటే మూర్ఖత్వం మరేమీ ఉండదు.

పేదసాదలను కసురుకోకూడదు. చులకనగా చూడకూడదు. చేతనైతే ఉన్నంతలోనే ఎంతో కొంత సాయం చేయాలి. లేదంటే మౌనంగా ఉండాలి. దైవాన్నిప్రార్థించాలి. యాచించే స్థితినుండి రక్షించి, అందరికీ మంచి స్థితిని ప్రసాదించమని దైవాన్ని వేడుకుంటూ ఉండాలి.

- ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

సినిమా
నల్లగొండ
ఆదివారం
11-3-2018
సాక్షి ఫ్యామిలీ


● ధనుష్

నార్త్ చెన్నై కుర్రాడి కథ

'ఆడుకలమ్' వంటి సెన్సేషనల్ హిట్ తర్వాత దర్శకుడు వెట్రిమారన్, హీరో ధనుష్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా 'వడ చెన్నై'. మూడు పార్ట్స్‌గా రూపొందుతున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఇందులో నేషనల్ లెవల్ క్యారమ్ ప్లేయర్ క్యారెక్టర్‌లో కనిపించనున్నారు ధనుష్. నార్త్ చెన్నైలో 35 సంవత్సరాల కాలంలో జరిగిన సంఘటనల సమాహారంగా ఈ సినిమా ఉంటుందని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రంలో ఐశ్వర్య రాజేశ్, ఆండ్రియా హీరోయిన్లుగా కనిపించనున్నారు. సంతోశ్ నారాయణ్ సంగీతం సమకూరుస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్, ధనుష్, వెట్రిమారన్‌లు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'బెస్ట్ డైరెక్టర్, స్క్రీన్ ప్లే, హీరో' విభాగాల్లో నేషనల్ అవార్డ్ సాధించిన 'ఆడుకలమ్' సినిమా తర్వాత ఆ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కాబట్టి అంచనాలు భారీగా పెట్టుకున్నారు ధనుష్ అభిమానులు.

థియేటర్స్ క్లోజ్!

● షూటింగ్స్ బంద్ ● వేడుకలు లేవ్

తమిళనాడులో ఈ నెల 16నుంచి థియేటర్స్‌ను క్లోజ్ చేస్తున్నట్లు తమిళ్ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ తెలిపింది. ఈ బంద్ గురించిన మీటింగ్ చెన్నైలో జరిగింది. విశాల్, ప్రకాశ్‌రాజ్, నిర్మాత కదిరేశన్ తోపాటు పలువురు సినీప్రముఖులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కేవలం థియేటర్స్‌ను మూయడం మాత్రమే కాదు షూటింగ్స్‌ని కూడా ఆపేయాలని నిర్ణయించుకున్నారని సమాచారం. అలాగే, ఎలాంటి సినీ వేడుకలు జరపకూడదని కూడా నిర్ణయించారట. ''నిర్మాతల శ్రేయస్సు కొరకు కొన్ని డిమాండ్స్ చేస్తున్నాం. ఇవి పరిష్కారం అయ్యేవరకు సినిమా షూటింగ్‌లను కూడా నిలిపి వేయదలచాం'' అని నిర్మాతల మండలి పేర్కొంది. ప్రొడ్యూసర్ కౌన్సిల్‌తో పాటు, తమిళ్‌నాడు థియేటర్స్ అసోసియేషన్ కూడా కొన్ని డిమాండ్స్ చేసింది. ''విజువల్ ప్రింట్ ఫీజును నిర్మాతలు (యూఎఫ్‌ఓ, క్యూబ్) డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్‌కు చెల్లించరు. ఫిల్మ్ స్టార్ వేల్యూను అనుసరించి టిక్కెట్ ధరల్లో మార్పులు ఉండాలి. ఆన్‌లైన్ టిక్కెట్ చార్జీలను తగ్గించాలి. కంప్యూటరైజ్డ్ టిక్కెట్ బుక్కింగ్ సౌకర్యాన్ని అన్ని థియేటర్స్‌లో ఏర్పాటు చేయాలి. స్మాల్ స్కేల్ మూవీస్ రిలీజ్‌కు వెసులుబాటు కలిగించాలి'' అని మరికొన్ని డిమాండ్స్ చేస్తున్నారు. తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి, డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్‌తో జరిపిన చర్చలు తాత్కాలికంగా సఫలం కావడంతో బంద్ విరమించిన విషయం తెలిసిందే. ఇప్పుడు తమిళ చిత్రసీమ బంద్‌కి పిలుపునిచ్చింది. ఈ నెల 16 లోపు తమ డిమాండ్స్‌ను అంగీకరిస్తే నిర్మాతల మండలి, థియేటర్స్ అసోసియేషన్ బంద్‌ను విరమించుకోవాలని అనుకుంటున్నారు.





● మోహన్‌లాల్

సమ్‌థింగ్ స్పెషల్

అస్సలు అనిపించదు. జస్ట్... గెస్ కూడా చేయలేం.. మోహన్‌లాల్ ఏజ్‌ని. అంతలా ఆయన 'ఒడియన్' సినిమా కోసం స్పెషల్ ట్రైనింగ్ తీసుకుని ఆల్మోస్ట్ 20 కేజీల బరువు తగ్గారు. ఇంతగా కష్టపడి యంగ్ లుక్‌లోకి వచ్చారంటే.. సినిమాలో సమ్‌థింగ్ స్పెషల్ ఏదో ఉండే ఉంటుంది. అదేంటో సిల్వర్ స్క్రీన్‌పై చూడడానికి మరెంతో టైమ్ లేదు. ఎందుకంటే 'ఒడియన్' సినిమా ఫైనల్ షెడ్యూల్ స్టార్టైపోయింది. మోహన్‌లాల్, మంజు వారియర్, ప్రకాశ్ రాజ్ ముఖ్య తారలుగా నటిస్తోన్న ఈ చిత్రాన్ని నూతన దర్శకుడు శివకుమార్ మీనన్ తెరకెక్కిస్తున్నారు. ఆల్రెడీ ఎంతో పేరు తెచ్చుకున్న ఆర్టిస్టులు ఓ కొత్త దర్శకుణ్ణి నమ్మి అవకాశం ఇచ్చారంటే కథలో మంచి దమ్ము ఉండి ఉంటుందని ఊహించవచ్చు. మేజికల్ థ్రిల్లర్‌గా 1950–2000 టైమ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాను ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారు. కొన్ని రోజుల క్రితం ఈ సినిమాలో మోహన్‌లాల్ లుక్‌ను విడుదల చేశారు. తాజాగా మరో లుక్‌ను రిలీజ్ చేశారు మోహన్‌లాల్.

సదరన్ స్పైస్

ఆరుగురు హీరోయిన్లు... ఒక హీరో


● శివరాజ్‌కుమార్

ఏకంగా ఆరుగురు గోపికలతో స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నారు స్టార్ హీరో శివరాజ్‌కుమార్. సుదీప్, శివరాజ్ కుమార్, అమీ జాక్సన్ ముఖ్య తారలుగా ప్రేమ్ దర్శకత్వంలో సీఆర్ మనోహర్ నిర్మిస్తోన్న మల్టీస్టారర్ మూవీ 'ది విలన్'. ఆల్రెడీ సుదీప్ వంతు టాకీపార్ట్ కంప్లీట్ అయ్యింది. ఇప్పుడు శివరాజ్ కుమార్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఇందులో భాగంగానే.. అదిరిపోయే లెవల్‌లో శివరాజ్‌కుమార్‌పై ఓ ఇంట్రడక్షన్ సాంగ్‌ను ప్లాన్ చేశారు ప్రేమ్. ఈ సాంగ్‌లోనే ఆరుగురు హీరోయిన్లు కనిపిస్తారట. ఆల్రెడీ రచితా రామ్, శ్రద్ధా శ్రీనాథ్, రాధికా చేతన్‌లను ఈ సాంగ్ కోసం ఎంపిక చేశారని శాండిల్‌వుడ్ సమాచారం. మరో ముగ్గురి ఎంపిక జరుగుతోందట. అంతేకాదు.. ఈ సినిమాలో బాలీవుడ్ బాద్షా షారుక్‌ఖాన్ ఓ గెస్ట్ రోల్ చేస్తున్నారట. ఇంకో ఇంట్రెస్టింగ్ విషయం ఏంటంటే.. ఇందులో టాలీవుడ్ హీరో శ్రీకాంత్ విలన్ రోల్ చేస్తున్నారు. 'ది విలన్' మూవీ చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. వేసవిలో సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నారు.


● నయనతార

ఎంతవరకో?

'డోర, మాయ, ఆరమ్' వంటి లేడీ ఓరియంటెడ్ సినిమాల్లో నటించిన నయనతార మరో లేడీ ఓరియంటెడ్ మూవీకి రెడీ అయ్యారు. 'కోకో' (కోలమావు కోకిల) పేరుతో రూపొందుతున్న ఈ సినిమాకి నూతన దర్శకుడు నెల్సన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇది పూర్తి స్థాయి డార్క్ కామెడీ జానర్‌లో సాగుతుందని సమాచారం. లైకా ప్రొడక్షన్ నిర్మిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ సంగీత దర్శకుడు. 'ఆరమ్' వంటి సీరియస్ డ్రామా తర్వాత కామెడీతో వస్తున్నారు నయనతార. ఉమెన్స్ డే సందర్భంగా ఈ సినిమాలోని ఫస్ట్ సాంగ్ 'ఎదువరయో..' (ఎంతవరకో అని అర్థం)ను రిలీజ్ చేశారు. దర్శకుడు గౌతమ్ మీనన్, రచయిత వివేక్ కలిసి రచించిన ఈ పాటను సియన్ రోల్డన్‌తో కలిసి గౌతమ్ మీనన్ పాడటం విశేషం.

పదేళ్ల తర్వాత...


● సుదీప్

...కలం పట్టి కథ రాశారట హీరో సుదీప్. 'కోటిగొబ్బ 3' కోసమే ఆయన కలం పట్టారు. 'కోటిగొబ్బ' ఫస్ట్ పార్ట్ (2001)లో సీనియర్ నటుడు విష్ణువర్ధన్ నటించారు. 2016లో వచ్చిన సెకండ్ పార్ట్‌లో సుదీప్ నటించారు. మూడో భాగంలోనూ ఆయనే హీరో. నటించడంతో పాటు కథ కూడా అందిస్తున్నారు. దాదాపు పదేళ్ల క్రితం స్వీయదర్శకత్వంలో తాను నటించి, రూపొందించిన 'జస్ట్ మాత్ మాతల్లి' సినిమా కోసం కథ అందించారు సుదీప్. మళ్లీ ఇన్నేళ్లకు తనలోని రచయితను బయటికి తీశారు. 'కోటిగొబ్బ' రెండో పార్ట్‌ను నిర్మించిన సూరప్ప బాబునే మూడో పార్ట్‌ను నిర్మిస్తున్నారు. శివకార్తీక్ అనే కొత్త దర్శకుడు ఈ సినిమాతో పరిచయం కానున్నారు. ఈ సినిమా కోసం సుదీప్ భారీ స్థాయిలో రెమ్యునరేషన్ పుచ్చుకోనున్నారని శాండిల్‌వుడ్ టాక్. సుదీప్ లుక్ కూడా రిలీజైంది. ఈ సినిమాను క్రిస్మస్‌కు రిలీజ్ చేయాలనుకుంటున్నారు. సుదీప్, సూరప్ప బాబు కాంబినేషన్‌లో వచ్చిన రెండో పార్ట్ హిట్ సాధించింది. ఈ నేపథ్యంలో ఈ మూడోపార్ట్‌పై అంచనాలు ఉన్నాయి.


● అమలాపాల్

కల నిజమైంది


● పృథ్వీరాజ్

ప్రముఖ మలయాళ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ మాతృభాషలో మాత్రమే కాదు తమిళ్, హిందీ భాషల్లోనూ నటించి, మంచి పేరు తెచ్చుకున్నారు. అంతేకాదు.. గాయకుడిగా కూడా మలయాళంలో పేరుంది. ఇప్పుడు మరో కొత్త అడుగు వేశారాయన. సినీ నిర్మాతగా మారారు. 'పృథ్వీరాజ్ ప్రొడక్షన్ హౌస్'ను స్టార్ట్ చేసినట్లు ఆయన ప్రకటించారు. ''మా కొత్త కలను నిజం చేసుకోవడానికి నేను, నా భార్య సుప్రియ ఏడాది నుంచి కష్టపడుతున్నాం. పృథ్వీరాజ్ ప్రొడక్షన్ హౌస్‌ను స్టార్ట్ చేశామని చెప్పడానికి ఆనందపడుతున్నాను. ప్రొడక్షన్ హౌస్‌ను స్టార్ట్ చేయడానికి సంవత్సరం టైమ్ ఎందుకు పట్టింది? సమ్‌థింగ్ స్పెషల్‌గా ఏం చేయబోతున్నాం? అనే మరికొన్ని ప్రశ్నలకు త్వరలోనే మేము అనౌన్స్ చేయబోయే ప్రాజెక్ట్స్ ద్వారా సమాధానాలు దొరుకుతాయి. నా వంతుగా మలయాళ ఇండస్ట్రీకి ఏదో ఒకటి చేయాలనుకుంటున్నాను. న్యూ ప్రొడక్షన్ హౌస్‌ను స్టార్ట్ చేసే క్రమంలో వ్యాపారవేత్త షాజి నడేశన్, కెమెరామేన్ సంతోష్ శివన్ ఎంతో సహకరించారు. నేను నిర్మాతగా బుడి బుడి అడుగులు వేయాలనుకున్నప్పుడు నా వేలు పట్టుకుని, నేను ప్రొడక్షన్ హౌస్ ప్రకటించేవరకూ ఈ ఇద్దరూ నాతో ఉన్నారు. వారికే కాదు సినిమా అంటే ఏంటో నేను తెలుసుకునే ప్రయాణంలో నాకు తోడుగా ఉండి, సహకరించిన అందరికీ ధన్యవాదాలు'' అని అన్నారు పృథ్వీరాజ్.



అదిగో ఆ పక్షిలాగా...

ట్రెడిషనల్ రోల్స్‌తో పాటు గ్లామరస్ రోల్స్‌తో ఇన్ని రోజులు అభిమానులను అలరించిన అమలా పాల్ ఇప్పుడు యాక్షన్ గాళ్‌లా కనిపించనున్నారు. 'అదో అంద పరవై పోల' (అదిగో ఆ పక్షి లాగా..' అని అర్థం) అనే సినిమాలో ఆమె పూర్తి స్థాయి యాక్షన్ ఓరియంటెడ్ రోల్ చేస్తున్నారు. సినిమాకు సంబంధించిన ఆమె అగ్రెసివ్ లుక్.. ఇప్పటివరకూ కనిపించిన అమలా పాల్ వేరు.. ఇప్పుడు కనిపించబోతున్న అమలా పాల్ వేరు అనేలా ఉంది. ఇందులో ఫారెస్ట్‌లో చిక్కుకుపోయిన అమ్మాయిగా కనిపించనున్నారు అమలా పాల్. సినిమాలో ఎక్కువ పోర్షన్‌ను కేరళ, ఆంధ్ర, తమిళనాడులోని దట్టమైన ఫారెస్ట్ ఏరియాలో షూట్ చేయడానికి ప్లాన్ చేశారు చిత్రబృందం. ప్రస్తుతం తమిళనాడులో షూటింగ్ చేస్తున్నారట. ''ఫారెస్ట్‌లో హీరోయిన్ ఎలాంటి సిచ్యూవేషన్స్ ఎదుర్కొంది? వాటిని ధైర్యంగా అడ్డుకొని.. అందులోంచి ఎలా బయటపడింది? అనే కథాంశంతో రూపొందిన ఈ సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకుంటుంది'' అని పేర్కొన్నారు దర్శకుడు వినోథ్ కేఆర్. సెంచరీ ఇంటర్నేషనల్ బ్యానర్ పై జోన్స్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

కొత్త గెటప్ గురూ


● పునీత్ రాజ్‌కుమార్

కొత్త గెటప్‌లో కనిపించేందుకు రెడీ అవుతున్నారు కన్నడ స్టార్ పునీత్ రాజ్‌కుమార్. ఎందుకంటే ఆయన హీరోగా నటించనున్న కొత్త సినిమా కోసం. పవన్ వడియార్ దర్శకత్వంలో రాక్‌లైన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై పునీత్ రాజ్‌కుమార్ హీరోగా ఓ సినిమా రూపొందుతోంది. ఈ సినిమాలో అలనాటి కన్నడ స్టార్ సరోజా దేవి కీలక పాత్రలో కనిపించనున్నారట. పునీత్ తండ్రి రాజ్‌కుమార్ సరసన హిట్ మూవీస్‌లో నటించారు సరోజా దేవి. ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్స్‌కు స్కోప్ ఉండగా, ప్రియాంక జవాల్కర్‌ను ఒక హీరోయిన్‌గా తీసుకోవాలని చిత్రబృందం ఆలోచిస్తుదంట. తెలుగులో విజయ్ దేవరకొండ హీరోగా రూపొందుతోన 'టాక్సీవాలా' చిత్రంలో ప్రియాంకనే కథానాయిక అన్న విషయం తెలిసిందే.


● వరలక్ష్మి

స్పెషల్ బర్త్ డే

'ఇది నా స్పెషల్ బర్త్ డే' అంటున్నారు వరలక్ష్మి శరత్ కుమార్. ఎందుకంత స్పెషల్? అని అడిగితే 'ఈ బర్త్ డేకు సేవ్ శక్తి అని బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించడం, విజయ్ మురుగదాస్ నెక్ట్స్ సినిమాలో యాక్ట్ చేసే అవకాశం రావడం' అని అంటున్నారు. విషయం ఏంటంటే.. వరలక్ష్మి నిర్వహించిన బ్లడ్ క్యాంప్‌లో దాదాపు 270 మంది పాల్గొని బ్లడ్ డొనేట్ చేశారట. ఇక మురుగదాస్ డైరెక్షన్‌లో ఆమె చేయబోతున్న విషయానికి వస్తే.. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇందులో వరలక్ష్మి ఓ కీ రోల్ ప్లే చేస్తుందని ఆమె బర్త్ డే సందర్భంగా సన్ పిక్చర్స్ అనౌన్స్ చేసింది. ఈ రెండు విషయాలు తనకు చాలా ఆనందాన్ని ఇచ్చాయని, అందుకే ఈ బర్త్ డే స్పెషల్ అని వరలక్ష్మి పేర్కొన్నారు. ఇదిలా ఉంటే వరలక్ష్మి డైరీ ఈ ఇయర్ మొత్తం ఫుల్ బిజీ. సుమారు 7 సినిమాల్లో యాక్ట్ చేస్తున్నారామె. అందులో ఒకటి తండ్రి శరత్‌కుమార్‌తో చేస్తోన్న 'పాంబన్' ఒకటి. తండ్రీకూతురు ఫస్ట్ టైమ్ స్క్రీన్ షేర్ చేసుకుంటున్న చిత్రం ఇది.

సాక్షి పెళ్ళిచూపులు
ఆదివారం 11-3-2018

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



మాదిగ 28Y/5'10"/B.Tech / MBA/ SBI / Mngr / 70,000/-PM / వెల్ సెటిల్డ్ అయిన వరుడికి వధువు కావలెను. Ph: 8142220475 [HA-454]

కుల పట్టింపులేదు 28Y/5'8"/MBA / Asst Mngr in Andhra Bank / 55,000/-PM / వెల్ సెటిల్డ్ అయిన వరుడికి వధువు కావలెను. Ph: 8142220817 [HA-454]

క్రిస్టియన్ మాల C. Govt. Scientist (DRDO) / 80,000/-PM / M.Tech / 5'9"/ ఎత్తు/ 29 సం॥ అబ్బాయికి తగిన అమ్మాయి కావలెను. 9642728299 [H-675555]

మాల M.Tech / C.Govt. సైంటిస్ట్/ (DRDO) /12 Lakhs PA / 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి వధువు కావలెను. 9703794175 [HA-16652]

రెడ్డి 30/5'9"/SAP/SWE/ 10 Lakhs PA / వరునికి తగిన వధువు కావలెను. 9160065919 [HA-16652]

కాపు 35 Age/ CNB /(P) జాబ్/ 20K గల అబ్బాయికి 1వ/విడో/డైవర్స్/లేట్ మ్యారేజ్/ 25-35 సం॥ల Age గల ఏ బాదరబందీ లేని OC/BC అమ్మాయి కావలెను. జాబ్ ఉన్నా OK. 8885674325/7396320144 డైరెక్ట్ [HA-16652]

క్రిస్టియన్, మాల 27/5'5"/ B.Tech / MS / Job / ఆస్తి కలిగిన వరునకు అందమైన Any డిగ్రీ చదివిన తెల్లని వధువు కావలెను. 9246331689/9398880714 [HA-675459]

కాపు/డైవర్సీ/35/5'9"/B.Tech/SWE/1L PM/వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ కలిగిన వరునికి తగిన వధువు కావలెను (కుల పట్టింపు లేదు) Ph: 7702274416, 9705345003. [H-675506]

పద్మశాలి/29/5'9"/B.Tech/ MBA/ SWE/1L PM/వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ కలిగిన వరునికి తగిన వధువు కావలెను Ph: 9951022798, 7673939882 [H-675506]

SC క్రిస్టియన్/29/5'9"/MBA/Manager/ 1L PM/వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ కలిగిన వరునికి తగిన వధువు కావలెను Ph: 9676968974, 8790246602. [H-675506]

వైశ్య/27/5'7"/క్లాత్ షో రూంలో మేనేజర్/50,000/- PM/గల వరునికి వధువు కావలెను. కట్నం ప్రసక్తి లేదు. Ph: 9440589634. [H-675314]

మాదిగ: B.Tech, (IIT), MBA (IIM), 5'8", 30Y, V. Fair, 5Cr, 1 లక్షల జీతంతో జాబ్ చేస్తున్న వరుని కొరకు (అర్జంట్)గా సంప్ర॥ ✆ 92485 37764, 90320 94810. [B-380]

SC, హిందూ, 5'11"/38, MS-US సిటిజన్ Diverse No Children వరుడికి S/W చేసిన హిందూ (Cast No Bar) వధువు కావలెను. నో బ్రోకర్స్. Ph : 89856 48575. [V- 681191]

క్రిష్టిమాదిగ/28Y/6"/M.Tech,PhD, 1L P.M. అందమైన వరుడికి MBBS/M.Tech/M.Pharm చదివిన, హైట్ గల అందమైన వధువు అర్జెంట్ గా కావలెను. (D) నో్బ్రోకర్స్. ✆ 89852 57657 [B-0938761]

వైశ్య, 50, డైవర్సీ గల వరుడికి వధువు కావలెను. కుల ప్రసక్తి లేదు. నెలకు 30,000/–సంపాదన (నోమీడియేటర్స్) డైరెక్ట్ పార్టీ సంప్ర॥ 7032511099 [G-50]

★

కాపు 34/6'0"/5 Crore Property / MBA (IT London) / 10 Lakh PA / States కు వెళ్ళుచున్న వరుడికి (కాపు/రెడ్డి) కులానికి చెందిన వధువు కావలెను. Ph: 9182692214 [H-704899]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015 Email: kcreddy43@gmail.com

వధువు కావలెను

Reddy/ B.Tech /MS/H1/USA/ V. smart/ 33/5'10'/' 105K / 60 Cr (Prop) * Cont: K.C. Reddy Mar Bur, B. Hills, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ (Late Marriage)B.Tech / MS/H1/ USA / 39/5'8"/ V. Smart / 100K / 3 Cr (Prop) * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ (Banglore) / Big - Business / V. Smart / 300 Cr + (Prop) / 28/6'/ B.Tech * Cont: K.C. Reddy Mar Bur, B. Hills, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ BE (Comp) / SWE/ Bang / 45 K / Month / Other Income / 1 L /M / 5 Cr Prop / 32/5'8" * Cont: K.C. Reddy Mar Bur, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ B.Tech / (MGIT) / MS/USA/ H1/V. Smart /100K / 30 Cr (Prop) / Hyd / 28/5'8"* Cont: K.C. Reddy Mar Bur, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ USA - Citizen / Rich/ V. Smart / 28/5'11"/B.S/ SWE * Cont: K.C. Reddy Mar Bur, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ B.Tech (JBIT) / MS / H1/USA/V. Smart / 180K / 10 Cr (Prop) / 30/5'10" * Cont: K.C. Reddy Mar Bur, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ (Export Business) / BE/ V. Smart / 31/5'10"/150 Cr (Prop) * Cont: K.C. Reddy Mar Bur, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ USA / Doc / MD/ 30/5'10" * 31 / 6' *30/5'7" * 27/5'8" * MS / 28/6' * Cont: K.C. Reddy Mar Bur, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ PG - Doc - India * MD / 27'5'7 1/2" * DM / 30/5'10" / 50 Cr * MS / 31/5'10" * DM / 29/5'11"/80 Cr * Cont: K.C. Reddy Mar Bur, Hyd. Ph: 9849321309/ 9347807015

వరుడు కావలెను

Reddy/ MBBS / 22/5'5'/30 Cr/V. Smart * 28/5'7"/100 Cr * Cont: K.C. Reddy Mar Bur, Banjara Hills, Hyd. Ph: 9849321309 / 9347807015

Reddy/ USA / H1/BE (BITS)/MBA / USA/ Beautiful/ 30/5'5"/ 200K / 15 Cr (Prop) * Cont: K.C. Reddy Mar Bur, Banjara Hills, Hyd. Ph: 9849321309 / 9347807015

Reddy/B.Tech /MS/H1/USA / Royal Family/ Most Beautiful / 26/5'3 1/2"/ 40 Cr (Prop) Cont: K.C. Reddy , Ph: 9849321309 / 9347807015

Reddy/BTech / Most Beautiful / 27/5'6"/ 100 Cr (Prop) / Hyd * Cont: K.C. Reddy Mar Bur, Banjara Hills, Hyd. Ph: 9849321309 / 9347807015

Reddy/BA/MBA (USA) / Most Beautiful / 30/5'2 1/2" /100 (Crores) (Prop)* Cont: K.C. Reddy Mar Bur, Banjara Hills, Hyd. Ph: 9849321309 / 9347807015

Reddy/B.Tech/ MBA / Very Good Business /MD to Company / 28/5'3"/ 20 Cr (Prop)/ Hyd* Cont: K.C. Reddy Marriage Bureau, Hyd. Ph: 9347807015

Reddy/B.Tech/ MS/ Now in Business /Father - Famous Builder / Hyd/ 28/5'3"/50 Cr + * Cont: K.C.Reddy, Hyd. Ph: 9849321309

Reddy/ USA / Res-Doc- Most Beautiful / 26/5'7"/Most Beautiful / 50 Cr (Prop) / Father - Cardiologist * Cont: K.C. Reddy, Hyd. Ph: 9347807015

Reddy/ MBBS/ PG - Doc/ (Der) 27 /5'5"/(Rich) * OBG / 28/5'8"/10 Cr * Cont: K.C. Reddy Mar Bur, Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/ B.Arc / 26/5'6"/Father - Big Business / 30 Cr (Prop) / Most Beautiful / * Cont: K.C. Reddy Mar Bur, Hyd. Ph: 9849321309/ 9347807015

[D-060]

Reddy 27/5'9"/10 Crore Property / (MBA / IIM) జాబ్ చేస్తున్న వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9182692214 [H-704899]

Reddy 26/5'11"/10 Cr Property / (US /MS) జాబ్ చేస్తున్న వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9182692214 [H-704899]

Reddy Gudati/30 Yrs/6'0"/5 Crore Property / MBA చదివి Business చేస్తున్న వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9182692214 [H-704899]

BC/ లేట్ మ్యారేజ్/34Y/ బిజినెస్ చేస్తున్న Fair, సాంప్రదాయ వరునికి వధువు కావలెను. 1st (or) 2nd (Ok) కుల పట్టింపులేదు (డైరెక్ట్) 7032000178 (నో బ్రోకర్స్) [H-704929]

రెడ్డి 28/6'1/ B.Tech / Group-1 / DSP వరుడుకు Group-1, డాక్టరు Well Settled వధువు కా॥, రెడ్డి /విడో/40/5'6"/BSc / 50,000/- వరుడుకు విడో/డైవర్స్ వధువు కా॥ M.S. Reddy సంప్ర॥ 7673940639 [H-704934]

కుల పట్టింపు లేదు/హిందు/డైవర్సీ/ 37/5'.8"/B.Tech/ తెలుగు/Job/ Well Settled వరునికి తగిన వధువు కావలెను. నో మీడియేటర్స్. Call: 9490177987. [K-907705]

వరుడు కావలెను



ముదిరాజ్ 26Y/5'4"/B.Tech / SWE / 60,000/-PM /(5 Cr ప్రాపర్టీ) ఏకైక పుత్రిక) వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. Ph: 8142220475 [HA-454]

కుల పట్టింపులేదు/రెండవ సంబంధం /24Y/ 5'4"/ B.Tech / SWE / 40 000/-PM (ఏకైక పుత్రిక ఇల్లరికం) వెల్‌సెటిల్డ్ అయిన వధువుకు వరుడు కావలెను. Ph: 8142220817 [HA-454]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Ongole, 26, 5'10", BE, MS (USA), Rich, Handsome, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి (Now-Hyd), BE, MBA, USA, 28, 5'11" 140 K, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, USA, 27, 6', 3 Crores, Software, H1, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Nalgonda, BE, MS, USA, 26, 5'10", 120 K, Rich, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE, MS USA, 26, 5'4", Software, H1, Rich, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 27, 5'3", 24 L P/A, Rich, Fair & Slim, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, (MS), 24, 5'5", Rich Family, Fair, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 25, 5'4", 85 K, H 1, USA, 4 Crores, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

AVINASH REDDY MARRIAGES
రెడ్డి USA Citizen, 24, 5'5", USA Med Programme (USMLE-1), Fair & Slim, వధువుకు MBBS Doctor వరుడు కావలెను.
690, Road No.3, Banjara Hills, (TV 9 : Opp Colony) Hyderabad
www.avinashreddy.com
98480 11818, 93933 11818

రెడ్డి BE, 29, 6', 100 K, SWE, 10 Crores, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Pune, 28, 5'10, MS, 25 L P/A, Handsome, 15 Crores, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, H1, 27, 5'9", 70 K, USA, 4 Crores, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Rayalseema, BE, MS USA, 28, 5'11", Software USA Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Residency Doctor, 29, 5'3", 3 Crores, USA, Fair & Slim, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Nizamabad, BE, MBA, 10 Crores, 23, 5'6", Fair, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Nellore 23, 5'4", BE Software Engineer, Fair & Slim, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, 28, 5'2", BE,MBA, Software 8.5 L P/A , Fair , Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818

LETTER

KAAKATEEYA.COM (మ్యారేజెస్)

గత 36 సంవత్సరాలుగా 5 రాష్ట్రాలలో 25 బ్రాంచీలతో అన్ని కులాల వారికి వేలాది సంబంధాలు కుదిర్చిన అగ్రగామి సంస్థ కాకతీయ.కామ్ H.O.: 101,102 విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక, అమీర్‌పేట్, హైదరాబాద్ –73. మరియు కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్, విజయవాడ, ఏలూరు, విశాఖపట్నం, ఒంగోలు, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, అనంతపురం, బెంగళూరు, చెన్నై, కోయంబత్తూరు, పాండిచ్చేరి
www.kaakateeya.com / 9390999 999

వధువు కావలెను

REDDY USA / 27/5.10/BE/MS/SWE/BLUE CROSS BLUE SHIELD/$120K * 26/5.9/ BE/MS/SWE/IBM/$120K * 28/6/BE/MS/ SWE/MICRO MAX/$108K * 9848944222

REDDY INDIA 27/5.8/BE(IIT)/ME/ SWE/ HCL/8 LAKHS P.A * 26/BE/ME/ SWE/PWC /7 LAKHS P.A * 26/6/BE/ME/ SWE/ CTS/6 LAKHS P.A * 9848031931

REDDY DOCTORS 28/6/MBBS/MS (ORTHOPEDICS)/50CR * 29/5.9/ MBBS/ MD (GENERAL MEDICINE)/ 30CR * 28/ 5.8/ MBBS/MS (OPTHAMOLOGY) *9177684466

KAPU USA 28/6/BE/MS /SWE /$108K * 28/BE/MS/SWE/$105K * 28/5.11/ BE/MS/SWE/$105K * 9618658877

KAPU INDIA29/5.9/BE/ME/ SWE/MNC /12LAKSHS P.A * 29/5.11/BE/ME/ SWE/ 11LAKHS P.A * 28/5.11/BE/ME /SWE/ MNC/9LAKHS P.A * 9704636633

KAPU DOCTORS 28/5.10/MBBS/ MD (GENERAL SURGEON) * 29/5.7/ MBBS/MD (RADIOLOGY) * 27/5.9/ BDS/MDS * 9966636222

INTERCASTE INDIA 29/5.11/BE/ME(IIT)/ SWE/ MERCK/12LAKHS P.A * 26/6/BE /ME/ SWE /NSPIRA /9LAKHS P.A * 29/5.8/BE/ME/SWE /VIRTUSA/7LAKHS P.A * 9346009348

INTERCASTE USA 28/5.11/BE/ MS/ SWE /$105K * 30/5.11/BE/ MS/ SWE/$115K * 30/6/BE/MS/ SWE/ $100K * 9704636633

INTERCASTE DOCTORS 27/5.11/MBBS/MD (PEDIATRICS)100CR * 30/6/MBBS/MS (ORTHOPEDICS)30CR * 29/5.7/MBBS/MD (RADIOLOGY) * 7702545670

REDDY DIVORCE 30/5.11/BE/MS/ SWE/ $100K * 31/5.10/BE/ME/SWE/ 5LAKHS P.A * 32/6/MBBS/ MD(RADIOLOGY) * 7680839333

వరుడు కావలెను

REDDY 21/5.5/BBM/ GOOD LOOKING /50 CR * 26/5.3/BE/ BUSINESS/35 CR * 27/5.5/BE/SWE/ 30 CR * 98485 66733

REDDY INDIA 24/5.4/BE/ME/ SWE /CISCO/14 LAK-PA * 27/5.5/BE/ME/ SWE/ IBM/14 LAK-PA * 25/5.5/BE/ MBA/ Analyst/ MNC/9 LAK-PA * 98483 37378

REDDY USA 25/5.5/BE/MS/ SWE /MNC/$ 90K-PA * 26/5.4/BE/ MS/SWE/ APEX /$80K-PA * 27/5.4/BE/MS/SWE/ MNC/$75 K-PA * 98481 23222

REDDY DOCTOR 26/5.4/MBBS/ MD (Pediatrics) * 25/5.3/MBBS/ MS (ENT) * 28/5.4/MBBS/MS (General Medicine) * 73373 20055

KAPU INDIA 26/5.6/BE/MBA/HR/ BAJAJ/ 14LAK-PA * 27/5.5/BE/ SWE/ INFOSYS/7 LAK-PA * 27/5.6/BE /MBA/SWE /FACE BOOK/5 LAK * 98485 35373

KAPU USA 27/5.3/BE/MS/SWE/ IBM/$ 80K-PA * 28/5.4/BE/MS/SWE /MNC/ $90K-PA * 27/5.4/BE/MS/ SWE/ AT&T/ $60 K-PA * 73373 20066

KAPU DOCTOR 28/5.4/MBBS/MS (Opthamology) * 28/5.2/NMBBS/MD (Anesthesiologist) *28/5.4/MBBS/ MS (ENT) * 99482 97222

CASTE NO INDIA 28/5.6/BE/MBA (IIM) /Consultant/MNC/24 LAK-PA * 28/5.4/BE/ MS/SWE/MNC/ 9 LAK-PA * 24/5.4/BE/ SWE/POLARIES/9 LAK-PM * 9177897788

CASTE NO BAR USA 27/5.4/BE/MS/ SWE/MNC/$ 90 K-PA * 27/5.6/BE/MS/ SWE/CISION/ $80 K-PA * 26/5.3/BE/MS /SWE/ BANK/ $ 60 K -PA * 70932 00777

CASTE NO BAR DOCTOR 27/5.5/ MBBS/ MS (ENT) * 27/5.2/MBBS/MD (General Medicine) * 26/5.3/MBBS/ DGO (Gynaecology) * 73373 20044

Letter

కాపు 26Y/5'4"/M.Tech / SWE / 60,000/-PM /(1 Cr ప్రాపర్టీ) వెల్ సెటిల్డ్ అయిన వధువుకి వరుడు కావలెను. Ph: 8142220475 [HA-454]

కుల పట్టింపులేదు 22Y/5'5"/B.Tech / Jr Asst. in Agriculture Dept / 25000/-PM /(2Cr ప్రాపర్టీ) వెల్‌సెటిల్డ్ అయిన వధువుకి వరుడు కావలెను. Ph: 8142220817 [HA-454]

రజక 30/5'3"/ BA, ENG /డిప్లమా in HR / Asst. Manager / ICICI బ్యాంక్‌లో పనిచేయు అందమైన అమ్మాయికి MBA/ B.Tech ఉద్యోగములో స్థిరపడిన సాంప్రదాయక కుటుంబపు అబ్బాయి కా॥ "శుభమస్తు" Hyd / 8790690309 [H-675555]

రెడ్డి/విడో 30/5'5"/ MBBS / Govt. డాక్టర్/ 60,000/- PM / 7 Cr / ఈ మధ్యనే భర్తను కోల్పోయిన వధువుకు కుల/ఆస్తి ప్రసక్తిలేని ఇల్లరికం వరుడు కావలెను (పిల్లలున్నా Ok) 9581426122 [H-675555]

కమ్మ/56/విడో/5'4"/ B.Com / Govt. VRS ((Postel) 60,000/- PM / సొంత ఇల్లు/ 5 Cr ప్రాపర్టీగల వధువుకు తగిన వరుడు కావలెను 8712344858 [H-675555]

పద్మశాలి/51/5'5"/విడో/ డిగ్రీ/ టైల్స్ బిజినెస్/ 1.5 L PM/ 4 Cr ప్రాపర్టీగల వధువుకు తగిన వరుడు కావలెను 8977771349 [H-675555]

రెడ్డి/విడో/29 Yrs/B.Tech / 22 కోట్ల ప్రాపర్టీ కలిగి పిల్లలులేని అందమైన ఒంటరి వధువుకు వరుడు కావలెను. (ఆస్తి, కుల, వయస్సు ప్రసక్తి లేదు) మీ ఫోటో, Details Whatsappలో send చేయండి. 7207214624 [H-675459]

బ్రాహ్మణ/23 /5'4"/10th * 20/5'3"/10th * 25/5'2"/10 th వధువులకు వరులు కావలెను. పూజారి అయినా OK. 7674078296/8106446865 [HA-16652]

రెడ్డి/45 /విడో/5'4"/పొల్యూషన్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ జాబ్ / 1 L PM / సొంత ఇల్లు & 35 ఎకరాల పొలం, వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. 7093665992 [HA-16652]

రెడ్డి/డైవర్స్/కుల, ధన ప్రసక్తిలేదు/ 14 కోట్ల ఆస్తి / వయస్సు 33 Y/ 5'6"/Qly: PG / అందమైన వధువుకు వరుడు కావలెను. 9515528286 [HA-16652]

చౌదరి/డైవర్స్/31 Y/ 5'3"/ ఫర్టిలైజర్ బిజినెస్/ 11 కోట్ల ప్రాపర్టీగల అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. 7659921467 [HA-675459]

నాయుడు/లేట్ మ్యారేజ్/ 30Y / 5'5"/ ఇండియన్ ఆయిల్ సబ్ డీలర్ / 13 కోట్ల ప్రాపర్టీగల అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. 8897900922 [HA-675459]

కుల పట్టింపులేదు/ 33Y / 5'3"/ డిగ్రీ/ బిజినెస్/ వెల్ సెటిల్డ్ /ఫెయిర్/ 10 కోట్ల ప్రాపర్టీగల అందమైన వధువుకు వరుడు కావలెను. సంప్ర॥ 7286031653 [HA-675459]

బ్రాహ్మణ/28 సం॥ /5'4"/ గార్గేయాసా గోత్రం/ B.Com Pvt. జాబ్/ రిక్రేర్‌మెంట్/ఎనీ వెల్ సెటిల్ ఫ్యామిలీ/ Pvt, Govt. జాబ్ & పురోహితం అయినా Ok. 7285997452/8187000164 [HA-675701]

కాపు/డైవర్సీ/28/5'4"/M.Sc/Employee/వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ కలిగిన వధువుకు తగిన వరుడు కావలెను. Ph:9705345003, 7702274416. [H-675506]

వైశ్య/24/5'4"/B.Tech/SWE/40K PM/ వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ కలిగిన వధువుకు తగిన వరుడు కావలెను. Ph:7673939882, 9951022798. [H-675506]

SC/25/5'4"/B.Tech/SWE/40K PM/ వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ కలిగిన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9676968974, 9951049449. [H-675506]

రెడ్డి/విడో/కుల, ఆస్తి పట్టింపు లేదు/8 కోట్ల ఆస్తి/29/5'2"/డిగ్రీ/నెలకు మంచి సంపాదన కలిగిన అందమైన వధువుకి ఇల్లరి కపు వరుడు కావలెను. Ph: 9581690158. [H-675314]

రెడ్డి/26/5'3"/B.Tech/SWE/8L PA/ అందమైన వధువుకి Software Job చేస్తున్న వరుడు కావలెను. (No మీడియేటర్స్) Ph: 7077077441. [H-675314]

రాజులు/విడో/40/Own రెస్టారెంట్/3L PM/ పొలాలు/10 కోట్ల ఆస్తి గల వధువుకి బిజినెస్ చూసుకొనే వరుడు కావలెను (నో మీడియేటర్స్) Ph: 9985035976, 8142079654. [H-675314]

లేట్ మ్యారేజ్/వైశ్య/38/5'3"/ Fair/B.Tech/ Own సూపర్ మార్కెట్/2L PM/ 2 అపార్ట్‌మెంట్స్/9 కోట్ల ఆస్తి గల వధువుకి బిజినెస్ చూసుకొనే వరుడు కావలెను Ph: 9703247793, 9703238657. [H-675314]

SC/మాల/హిందూ/25yrs/5'4"height/ B.Tech/SWE/Hyd/TCS-40P. Month/ చాలా అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 9705960270 [H-675314]

REDDY / B.Tech, MBA/25/ Very Fair వధువుకు Govt. SWE above 1 lakh, well settled, handsum, age 31 yrs below వరుడు కావలెను. ✆ 98666 47033 (Direct) [B-1008]

రెడ్డి,24,వెరీఫెయిర్, M.Tech, 32000pm, వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీ, 15Cr ఆస్తి ఉన్న వధువుకి వరుడు కావలెను. మనీ సపోర్ట్ ఇస్తా ము. కుల ప్రసక్తి లేదు. Ph:9704581769 [G-1837]

Asm/37/Govt/ Khula/ No issues/ Seeks 42/ Govt/ Pvt./ Divorce / Late Marriage / No issues / Cont: 9010966433 [H-54162]

★

Reddy/26/5'2"/Motati/ 50 Cr Property / (US/MS) చేసిన వధువుకి Well Settled Family కి చెందిన వరుడు కావలెను. Ph: 9182692214 [H-704899]

Reddy/Motati/27 Years /5'3"/5 Cr Property / MBA చదివిన వధువుకు Well Settled Familyకి చెందిన వరుడు కావలెను. Ph: 9182692214 '[H-704899]

వేదికలు



Specially Doct (3000 ప్రొఫైల్స్) MBBS / MD/ MS/DM/MCH/BDS/MDS & డా॥కి మాత్రమే 1వ/2వ/లేటు/ దేశ / విదేశ సంబంధాలు అన్ని కులములకు కుదుర్చబడును.9963632698 [H-675555]

ఆరాధ్య మ్యారేజెస్ 1వ/2వ/లేట్ మ్యారేజెస్ Any Caste డాక్టర్/PG/ Engg/ Govt./ Pvt/ డైవర్స్/ విడోస్ సంబంధాలు వధూవరులకు కుదర్చ బడును. Whatsap No. 9493735124 [H-675113]

రెండవ పెళ్ళి సంబంధాలు మాత్రమే వయస్సుతో నిమిత్తం లేకుండా అన్ని కులముల వారికి మంచిపేరు, సాంప్రదాయ పద్ధతి, సంపన్న మరియు ఇల్లరికం సంబంధాలు కలవు. 9581731331 [HA-675459]

150వ॥ అన్ని కులాల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి. info@rohinimarriages.com, ✆ 9849058673, 94418 29644, 94920 33897, 94407 85888 [B-1073]

నేడే JIO వివాహ వేదిక 30 వేలు ప్రొఫైల్స్‌తో 100 మంది Assioats తో అన్ని కులాలు వారికి www.jiomatrimony.in. 8885410555, 8555800692. event@jiomatrimony.in [R-857984]

ఫ్రీ రిజిస్ట్రేషన్ బ్రాహ్మణ మరియు అన్ని కులాల వధూవరులకు సువర్ణ అవకాశం. Just Call : bhavanimatrimony.com/ Ph: 9704656103, 9533608887 [HA-20093]

కావ్యశ్రీ మ్యారేజ్ బ్యూరో: 1వ, 2వ, లేట్ మ్యారేజెస్/ అన్ని కులముల వారికి డైవర్సీస్/ విడోస్/ విడోవర్స్, పెన్షనర్స్‌కు సంబంధములు త్వరగా కుదర్చబడును. స్త్రీలకు ఫ్రీ రిజి॥ 7286931144 [H-704201]

సూజిత్ మ్యారేజ్ బ్యూరో అన్ని కులాలవారికి వయస్సుతో నిమిత్తం లేకుండా వ్యక్తిగత శ్రద్ధతో సర్వీస్ చేస్తూ 1 నెలలో సంబంధం కుదర్చబడును. స్త్రీలకు ఫ్రీ. పు॥ సర్వీస్ చార్జ్ ఓన్లీ. 7893688483 [H-684995]

అన్ని కుల కులాంతర దేశ, విదేశ 1వ, 2వ, లేట్ ఉన్నత మధ్య తరగతి కుటుంబ సంబంధాలకై సంప్రదించండి. హేమ 7032252439 [HA-704707]

గంగపుత్రుల పెళ్ళి సంబంధాలకై శ్రీ గంగ భావాని గంగపుత్రుల వివాహ పరిచయాలు (అగ్ని కుల, క్షత్రియ, బెస్త, గూండ్ల, జాలరి, వాడ బలిజ & ఇతరత్రా) అంబర్‌పేట్. Hyd. 9000541008 [H- 684872]

★

శుభం గౌడ్స్ మ్యాట్రిమోని గౌడ్స్ వధూవరులకై దేశ, విదేశ 1వ, 2వ, డాక్టర్స్, ఇంజినీర్, PG డిగ్రీ సంబంధాలకై సంప్ర॥ B.S. గౌడ్, హైదరాబాద్. 9246214511 [H-684539]

ఇంకెన్నాళ్లీ వివక్ష..?

- మహిళల పట్ల చిన్నచూపు మారడం లేదు
- సరైన చట్టాలు రావాలి: శాంతాసిన్హా
- ప్రతి మహిళా చదువుకునేలా ఏర్పాటు చేయాలి



సాక్షి, హైదరాబాద్: అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తున్నప్పటికీ మహిళలపై వివక్ష కొనసాగడం బాధాకరమని మెగసెసె అవార్డు గ్రహీత, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ఉద్యమకారిణి ప్రొఫెసర్ శాంతాసిన్హా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా గాంధీభవన్‌లో టీపీసీసీ మహిళా విభాగం అధ్యక్షురాలు శారద ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'మహిళలకు పురుషులతో సమానమైన హక్కులు, అవకాశాలు లభించడం లేదు. ఆర్థిక, విద్యారంగాల్లో పురోగతితోనే సరైన సమానత్వం వస్తుంది. అందుకు మహిళలు విద్యావంతులు కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. స్త్రీలను కూలి పనికి, వ్యవసాయం, ఫ్యాక్టరీలలో, వివిధ రకాల ఉత్పత్తుల్లో లేని పనుల్లో వినియోగిస్తున్నారు. అక్కడ కూడా వివక్ష ఎదుర్కొంటున్నారు. సినిమాకే వెళ్లాలన్నా, బయటికి వెళ్లాలన్నా ఆంక్షలున్నాయి. బయటికి వెళితే అత్యాచారాలు జరుగుతాయని అనుమానించే చదువుకు దూరం చేసి, చిన్న వయసులోనే పెళ్లి చేస్తున్నారు. దీని కోసం చట్టాల్లో మార్పులు రావాలి. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే మహిళల సంక్షేమానికి, హక్కుల పరిరక్షణకు చట్టాలు వచ్చాయి. దేశంలో మహిళలకు కాంగ్రెస్ పార్టీ చేసిన మేలు ఇతర పార్టీలు చేయలేదు. చట్టంలో మార్పులు చేసి మహిళలు కచ్చితంగా చదువుకునేలా చర్యలు తీసుకోవాలి. పిల్లలు, మహిళల హక్కుల కోసం పోరాడాల'ని శాంతాసిన్హా పిలుపునిచ్చారు. టీపీసీసీ మహిళావిభాగం అధ్యక్షురాలు నేరెళ్ల శారద మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఒక్కటే మహిళలను గౌరవిస్తుందని, మిగతా పార్టీలలో వారి పట్ల చిన్నచూపు ఉందన్నారు. బీజేపీలో మహిళలకు గౌరవం, అవకాశం లేదని, మంత్రివర్గంలో ఒక్కరికి అవకాశం ఇవ్వలేదని విమర్శించారు.

'మేడారానికి' హోదా హుళక్కే!

సమ్మక్క–సారలమ్మ జాతరను జాతీయ ఉత్సవంగా పరిగణించలేమన్న కేంద్రం

- జాతరకు వస్తామని కేంద్ర మంత్రుల బృందం ప్రకటించినా స్పందన లేని రాష్ట్రం
- కనీస ఏర్పాట్లు చేయకుండా చేతులెత్తేసిన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ

సాక్షి, హైదరాబాద్

మేడారంలో జరిగే సమ్మక్క–సారలమ్మ జాతరకు జాతీయ హోదా అంశం మళ్లీ గల్లంతయ్యింది. ఈ ఉత్సవాన్ని జాతీయ పండుగగా గుర్తించలేమని కేంద్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. పార్లమెంట్ సభ్యులు అవంతి శ్రీనివాస్‌తో పాటు పలువురు తెలంగాణ ఎంపీలు అడిగిన ప్రశ్నకు కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ సహాయ మంత్రి జశ్వంత్‌సింగ్ బభోర్ ఇటీవల లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. మేడారం జాతరకు కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ రూ.2 కోట్లు ఇచ్చిందని, వచ్చేసారి ఈ నిధిని మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటామని మాత్రం పేర్కొన్నారు.

రాష్ట్ర యంత్రాంగం వైఫల్యం వల్లే..

సమ్మక్క–సారలమ్మ జాతరను రాష్ట్ర ఉత్సవంగా ప్రభుత్వం ప్రకటించింది. దాదాపు 28 ఏళ్లుగా ఈ ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లన్నీ రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహిస్తోంది. గిరిజనులు, ఆదివాసీలతో పాటు వివిధ వర్గాలకు చెందిన కోటి మందికి పైగా భక్తులు జాతరకు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. ఈ నేపథ్యంలో కుంభమేళా తర్వాత ఆ స్థాయిలో భక్తులు హాజరవుతున్న సందర్భంగా మేడారం జాతరకు జాతీయ ఉత్సవం ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈ అంశంపై కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ సైతం మొదట్లో సానుకూలంగా స్పందించింది. జాతరకు రావాలన్న రాష్ట్ర ఆహ్వానాన్ని సైతం అంగీకరించిన కేంద్ర బృందం, ఉత్సవాన్ని తిలకించేందుకు ఏర్పాట్లు చేయాల్సిందిగా సూచించింది. జాతర తీరును పరిశీలించి నిధులను ఖరారు చేస్తామని స్పష్టం చేశారు. అయితే కేంద్ర బృందం వచ్చే ముందు వరుసగా సమాచారం ఇచ్చినా రాష్ట్ర యంత్రాంగం స్పందించలేదు. వీవీఐపీ తాకిడి ఎక్కువగా ఉన్నందున రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కేంద్ర బృందం పర్యటనకు ఆసక్తి చూపలేదు. ఈ నేపథ్యంలో చివరి నిమిషంలో జాతరకు హాజరయ్యే నిర్ణయాన్ని మంత్రుల బృందం విరమించుకుంది.



మేడారం జాతర దృశ్యం (ఫైల్)

జాతీయ ఉత్సవమైతే...

మేడారం జాతరకు జాతీయ ఉత్సవ హోదా దక్కే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. గిరిజన సంక్షేమ శాఖ నిబంధనల్లో భాగంగా పది లక్షలకు పైగా గిరిజనులు హాజరయ్యే ఉత్సవానికి జాతీయ హోదా అర్హతలుంటాయి. కానీ సమ్మక్క–సారలమ్మ జాతరకు ఏకంగా కోటి మందికి పైగా హాజరవుతారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం సరైన విధంగా స్పందించకపోవడంతో దీనికి అవకాశం దక్కలేదు. ఈ ఉత్సవానికి జాతీయ హోదా దక్కితే నిధులు, నిర్వహణ అంతా కేంద్రం చూసుకోవడమే కాకుండా, జాతరకు మరింత ప్రచారం దక్కేదని గిరిజన మేధావులు అభిప్రాయపడుతున్నారు.

బీసీలకు సబ్‌ప్లాన్

ఆర్.కృష్ణయ్య డిమాండ్



సాక్షి, హైదరాబాద్: వచ్చే బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల కోట్లతో బీసీ ఉప ప్రణాళికను ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం నేత, టీటీడీపీ ఎమ్మెల్యే ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. గత డిసెంబర్‌లో బీసీల అభివృద్ధిపై చేసిన మేధోమథనం తీర్మానాల ప్రకారం 2018–19 బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. బీసీల అభివృద్ధి కోసం తక్షణమే రూ.10 వేల కోట్లు కేటాయించాలని శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో బీసీలకు 52% నిధులు కేటాయించాలని పేర్కొన్నారు. ఇంటర్ నుంచి పీజీ వరకు అన్ని కోర్సుల విద్యార్థులకు నెలకు రూ. 2000 ఉపకార వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేనైతే ఆ ప్రతిపాదనను చెత్తబుట్టలో పడేసేవాడిని

నోట్లరద్దుపై రాహుల్ గాంధీ వ్యాఖ్య

సింగపూర్: తాను గనుక ప్రధానమంత్రి అయి ఉండి ఉంటే నోట్ల రద్దు ప్రతిపాదనను చెత్తబుట్టలో విసిరేసే వాడినని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వం రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేయడం వల్ల ప్రజలకు ఏమాత్రం మేలు జరగలేదన్నారు. ఆగ్నేయాసియా పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం మలేసియా రాజధాని కౌలాలంపూర్ చేరుకున్నారు. అక్కడ ఆయన వివిధ వర్గాలకు చెందిన ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా... నోట్ల రద్దు ప్రతిపాదన వస్తే మీరు ఏం చేసి ఉండేవారని అడిగిన ప్రశ్నకు ఆయన పై విధంగా సమాధానం ఇచ్చారు.



వెల్దుర్తి..

వెయ్యేళ్ల కళాసృష్టి!

మట్టి తవ్వుతుంటే వెలుగు చూసిన కొత్త చరిత్ర



20 అడుగుల రాతి తోరణం..

పైభాగంలో దానికి ఆరు రంధ్రాలు.. వాటిద్వారా ప్రసరించే సూర్యకిరణాలు ప్రత్యేక రోజుల్లో నేరుగా దేవతామూర్తిపై ప్రసరించే ఏర్పాటు! కాకతీయుల కళా తోరణం కంటే పురాతనమైనదని అంచనా..

ఏడడుగుల విగ్రహం..

నాలుగు చేతులు, వాటిలో త్రిశూలం, ఖట్వాంగం, గద వంటి ఆయుధాలు.. ఓ కాలు నిటారుగా, మరోకాలు పైకెత్తి ఠీవీగా నిలబడ్డ రూపం.. ఆకృతిలో శివుడి రూపం.. కానీ ద్వారపాలక విగ్రహం.. ఇటీవల ఓ ఇంటి పని కోసం తవ్వుతుండగా బయటపడింది..

ఏదో పెద్ద దేవాలయానికి ముందు స్వాగతం పలుకుతున్నట్టు ఠీవి ఒలకబోస్తున్న ఈ నిర్మాణాలు ఏమిటి?

ఎవరు నిర్మించారు?

ఏదో గొప్ప చరిత్రకు ఆనవాళ్లా.. శిథిలమైపోయిన వైభవానికి నిదర్శనాలా.. వెయ్యేళ్ల కిందటివిగా నిపుణులు అంచనా వేస్తున్న ఈ నిర్మాణాలు మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలో ఉన్నాయి.

– సాక్షి, హైదరాబాద్



జైనుల శైలి ధ్వజ స్తంభ మండపం

భారీ ద్వారపాలకుడి విగ్రహం

ఇటీవల తోరణానికి సమీపంలో ఉన్న ఆలయానికి కుడివైపున తవ్వుతుండగా ఏడడుగుల ఎత్తున్న ద్వారపాలకుడి విగ్రహం బయటపడింది. పాదాలకు కడియాలు, నడుము దిగువన కీర్తిముఖం, పైన దట్టి, కుడి భుజం నుంచి వేసిన కలాల జంధ్యం, కంఠహారాలు, మూడో నేత్రం, కాకతీయ శైలి కిరీటం, దానిపై త్రిశూల ఆకృతి కనిపిస్తున్నాయి. ఇక ఈ ఆలయానికి సమీపంలోనే ఆంజనేయుడి ఆలయం, నాగశిల్పాలు, శిఖర మండపంలో గరుడ విగ్రహమున్న 20 అడుగుల ఎత్తైన రాతి ధ్వజ స్తంభం, 15 అడుగుల ఎత్తున్న విజయ స్తంభం, పది సోపానాలు, 16 స్తంభాల రంగ మండపంతో విఠలేశ్వర మందిరం, దశావతారాలు చెక్కిన 4 అడుగుల వైష్ణవ విగ్రహం.. ఇలా ఆలయాలు, విగ్రహాలు కనిపిస్తున్నాయి. అంటే ఈ చోటు ఏదో పెద్ద దేవాలయ సమూహం అయి ఉంటుందని చరిత్రకారులు అంచనా వేస్తున్నారు. కొన్ని చోట్ల ఆలయాలు, శిల్పాల్లో కాకతీయుల గుర్తులు కనిపిస్తున్నా.. కల్యాణి చాళక్యుల నాటి నిర్మాణాలు అయి ఉంటాయని భావిస్తున్నారు. ఇక్కడ తవ్వకాలు జరిపితే ఎన్నో కొత్త విశేషాలు బయటపడే అవకాశముంది.

ఔత్సాహిక పరిశోధకుల పరిశీలనలో..

వెల్దుర్తిలో ఉన్న రాతి తోరణం చాలా కాలంగా ఉన్నా దానిని ఇంతకాలంగా ఎవరూ పట్టించుకోలేదు. అయితే ఇటీవల అక్కడికి సమీపంలో ఏడడుగుల ఎత్తున్న ద్వారపాలకుడి విగ్రహం వెలుగుచూసింది. దాంతో ఔత్సాహిక చరిత్ర పరిశోధకులు శ్రీరామోజు హరగోపాల్, వేముగంటి మురళి, చంటి, మురళీధర్ రెడ్డి తదితరులు వెల్దుర్తిలోని ఈ నిర్మాణాలను పరిశీలించారు. ఇక్కడి భారీ రాతి తోరణంపై ఇరువైపులా కీర్తి ముఖాలు చెక్కి ఉన్నాయి. పైన రెండు వైపులా శిల్పాల సమూహంతో అర్ధ వృత్తాకారపు నల్లరాతి ఫలకం ఉంది. దానిపై గజలక్ష్మి,, క్షీరసాగర మథనం, శృంగార నారసింహుడు, పాదాల కింద రాక్షసుడి ఆకృతులు కనిపిస్తున్నాయి. తోరణానికి దిగువన ఏడు మొగ్గల ఆకృతులు, వాటికిపైన ఆరు రంధ్రాలు ఉన్నాయి. ఆ రంధ్రాల ద్వారా సూర్య కిరణాలు ప్రధాన ఆలయ దేవతామూర్తిని తాకేలా నిర్మించి ఉంటారని అంచనా వేస్తున్నారు. అయితే తోరణానికి సమీపంలో ప్రస్తుతం ఓ చిన్న దేవాలయం ఉంది. దాని ముందు నంది విగ్రహం ఉన్నా.. లోపల అనంత శయనుడి విగ్రహమూర్తి ఉండడం గమనార్హం.

మెల్లమెల్లగా నల్లబెల్లం

రైలు మార్గం ద్వారా ఏపీ నుంచి తెలంగాణలోకి అక్రమ రవాణా

ఎక్సైజ్ కానిస్టేబుల్ పరిశీలిస్తున్న గోనె సంచుల మూటలు పద్మావతి ఎక్స్‌ప్రెస్ లోనివి. కేసముద్రం వద్ద రైల్లోనే పట్టుబడ్డాయి. వీటిని గుంటూరు జిల్లా బాపట్ల రైల్వే స్టేషన్‌లో రైలెక్కించారు. పక్కా సమాచారంతో ఎక్సైజ్, సివిల్, రైల్వే పోలీసులు సంయుక్తంగా వలపన్ని పట్టుకున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్నవి కేసముద్రం-నెక్కొండ మార్గమధ్యలో కదులుతున్న రైలులోంచి బయటకు విసిరేసిన బస్తాలు. అందులో గుడుంబా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం ముద్దలు ఉన్నాయి. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న కొందరు వ్యక్తులు మెరుపు వేగంతో ఆ బస్తాలను తీసుకుని మాయమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ బెల్లాన్ని నిషేధించింది.



సాక్షి, హైదరాబాద్

100 శాతం గుడుంబా రహిత రాష్ట్రంగా ప్రకటించిన తెలంగాణలోని పల్లెలకు నిత్యం నిషేధిత నల్ల బెల్లం దిగుమతి అవుతోంది. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ వైపు వస్తున్న రైళ్లలో రోజుకు కనీసం 50 నుంచి 75 టన్నుల నల్లబెల్లం అక్రమ రవాణా కొనసాగుతోంది. దీని నుంచే గుడుంబాను కాస్తున్నారు. పక్క రాష్ట్రంలో తక్కువ ధరకే కావాల్సినంత బెల్లం అందుబాటులో ఉండటం, రోడ్డు మార్గంతో పోల్చితే రైలు ద్వారా అక్రమ రవాణా సులువుగా ఉండటంతో మాఫియా ఇటు మళ్లింది. తొలుత ఒక్కో వ్యక్తి గుట్టుచప్పుడు కాకుండా 30 నుంచి 50 కిలోల బెల్లం అక్రమ రవాణా చేయగా.. తాజాగా ముగ్గురు నలుగురు వ్యక్తులు ఒక గ్రూప్‌గా ఏర్పడి ట్రిప్పునకు 4 క్వింటాళ్ల వరకు బెల్లం దిగుమతి చేస్తున్నారు.

మళ్లీ రెచ్చిపోతున్న గుడుంబా మాఫియా

గుడుంబాతో ప్రాణాపాయం ఎక్కువగా ఉండటం, తెలంగాణ పల్లెలు నాటు సారా మత్తులో జోగుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం నాటు సారాను నిర్మూలించాలని సంకల్పించింది. ఈ మేరకు నల్లబెల్లాన్ని నిషేధించి, నాటు సారా కాయటం మానేసిన కుటుంబాలకు పునరావాసం కల్పించింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి అదుపులోకి వచ్చింది. మరోవైపు గుడుంబా తయారీకి వినియోగించే బెల్లం, పట్టిక అమ్మకాలు సాగిస్తే ఎక్సైజ్ అధికారులు పీడీ యాక్టును ప్రయోగించారు. బెల్లం సరఫరా మూలాలను మూసేశారు. బెల్లం అమ్మకాలపై నిఘా పెట్టారు. అయితే పునరావాస ప్యాకేజీ అందరికీ అందకపోవటం, ఏడాదిపాటు గుడుంబా నిర్మూలన కోసం శ్రమ పడ్డ ఎక్సైజ్ అధికారులు విశ్రాంతి ధోరణితో కనిపించడంతో నాటు సారా కాసే కుటుంబాలు మళ్లీ రెచ్చిపోతున్నాయి. గుడుంబా దందా ఇప్పుడు గ్రామాల వైపు చొచ్చుకొని వస్తోంది.

అక్కడ కిలో రూ.35.. ఇక్కడ రూ.90

ఏపీలో కిలో రూ.35 ఉన్న నల్లబెల్లం రాష్ట్రంలో రహస్య మార్కెట్‌లోకి వచ్చే సరికి కిలో రూ.75 నుంచి రూ.90 వరకు పలుకుతోంది. దీంతో బెల్లం అక్రమ రవాణా చేయడానికి గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు ముఠాగా ఏర్పడుతున్నారు. విశాఖపట్నం, విజయవాడ, ఒంగోలు, నాగ్‌పూర్, మన్మాడ్, అకోలా వంటి ప్రాంతాల్లో పెద్ద ఎత్తున బెల్లం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు వస్తోంది. రైలులో ఖమ్మం జిల్లా మీదుగా సికింద్రాబాద్ సమీప గ్రామాల వరకు చేరవేస్తున్నారు. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్య దందా సాగిస్తున్నారు. విశాఖ, తుని, అనకాపల్లి, నెల్లూరు తదితర ప్రాంతాల్లో 50 కిలోల నుంచి క్వింటాల్ వరకు బెల్లం కొనుగోలు చేసి బస్తాల్లో తీసుకుని సాధారణ ప్రయాణికుల్లా రైలు ఎక్కుతున్నారు. జనరల్ బోగీల్లో సీట్ల కింద, టాయిలెట్ల వద్ద దాచి ఉంచుతున్నారు. తమ గమ్యానికి రాగానే బస్తాలను కదులుతున్న రైలు లోంచి విసిరేస్తున్నారు. ముఠా సభ్యులు బస్తాలను సేకరించి ఆటోల ద్వారా రాత్రికి రాత్రే గ్రామాలకు తరలించి విక్రయిస్తున్నారు.



మహబూబాబాద్‌లో ఎక్సైజ్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన బెల్లం

పడిపోతున్న భూగర్భ జలాలు

- సాగునీటి వినియోగం పెరగడంతో క్షీణిస్తున్న భూగర్భ మట్టం
- జనవరితో పోలిస్తే 0.94 మీటర్ల మేర తగ్గిన మట్టాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భూగర్భజల మట్టాలు వేగంగా పడిపోతున్నాయి. ఇప్పటికే ఈ ఏడాది 9 శాతం లోటు వర్షపాతంతో మట్టాలు తగ్గిపోగా ప్రస్తుతం యాసంగి పంటల సాగు పెరగడంతో పాటుగా వేసవి ఉధృతి తోడు కావడంతో భూగర్భ జలాలు మరింత వేగంగా అడుగంటిపోతున్నాయి. ఈ ఏడాది జనవరితో పోలిస్తే ఫిబ్రవరిలో నీటి వినియోగం పెరగడంతో రాష్ట్ర వ్యాప్తంగా సగటున 0.94 మీటర్ల మేర భూగర్భ మట్టం కిందకి దిగజారింది. పూర్తి స్థాయిలో పంటలకు నీటి వినియోగం పెరిగితే అది మరింత తీవ్రంగా ఉంటుందని భూగర్భ జల విభాగం హెచ్చరించింది. రాష్ట్రంలో 70 శాతం ప్రజలు 23 లక్షల బోర్ల ద్వారా భూగర్భ నీటిని వినియోగిస్తున్నారు.

డిసెంబర్ నాటికే పడిపోయిన మట్టాలు

ఈ ఏడాది మెదక్, అసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జగిత్యాల, నిర్మల్, నిజామాబాద్ వంటి జిల్లాల్లో 35 నుంచి 21 శాతం వరకు తక్కువ వర్షపాతం కురిసింది. దీంతో చాలా జిల్లాల్లో డిసెంబర్ నాటికే 0.5 మీటర్ల నుంచి 5.07 మీటర్ల వరకు నీటి మట్టాలు పడిపోయాయి. గత ఏడాది ఫిబ్రవరిలో రాష్ట్ర సగటు భూగర్భమట్టం 10.17 మీటర్లు ఉండగా, ఈ ఏడాది సగటు మట్టం 10.97 మీటర్లుగా ఉంది. అంటే గత ఏడాది ఫిబ్రవరితో పోలిస్తే ఈ ఏడాది 0.80 మీటర్ల మేర మట్టాలు పడిపోయాయి. ఇక గత ఏడాది డిసెంబర్‌లో సగటు మట్టాలు 9.18 మీటర్లు ఉండగా, ప్రస్తుతం ఉన్న మట్టం 10.17తో పోలిస్తే ఏకంగా 0.99 మీటర్లు మేర మట్టాలు తగ్గిపోయాయి. భూగర్భ జల వనరుల శాఖ తాజా నివేదిక ప్రకారం గత ఏడాది ఫిబ్రవరి మట్టాలతో పోలిస్తే అత్యధికంగా సిరిసిల్ల జిల్లాలో 4.09 మీటర్లు దిగువకు పడిపోగా, తర్వాతి స్థానాల్లో పెద్దపల్లి 3.85, నిజామాబాద్ 3.61, మెదక్ 3.61, నిర్మల్ 3.40 మీటర్లు మేర మట్టాలు పడిపోయాయి.

నేటి నుంచి ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు

అవేర్‌నెస్ వాక్‌ను ప్రారంభించనున్న మంత్రి లక్ష్మారెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా ఈనెల 11 నుంచి 17 వరకు ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు జరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అంధత్వ నివారణ సంస్థ, సరోజినీ దేవి కంటి ఆస్పత్రి సంయుక్తంగా వీటిని నిర్వహిస్తున్నాయి. మంత్రి సి.లక్ష్మారెడ్డి ఆదివారం సరోజినీ ఆస్పత్రిలో అవేర్‌నెస్ వాక్‌ని ప్రారంభించనున్నారు. గ్లకోమా (నీటి కాసులు) వ్యాధిపై ప్రజల్లో అవగాహన, చైతన్యం పెంచేందుకు ఈ వాక్‌ని నిర్వహిస్తున్నారు. 40 ఏళ్లు దాటిన వారిలో వారసత్వంగా గ్లకోమా సంక్రమిస్తుంది. త్వరగా గుర్తిస్తే వైద్య చికిత్స అందించవచ్చు. గ్లకోమాతో కనుగుడ్డు చుట్టూ రంగుల వలయాలు ఏర్పడటం, చూపు మందగించడం వంటి లక్షణాలు ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా మూడు శాతం మంది గ్లకోమా వ్యాధి లక్షణాలతో బాధపడుతున్నారు. మన దేశంలో 1.2 కోట్ల మంది ఈ వ్యాధి బాధితులు ఉన్నారు. ఆ మేరకు ప్రపంచంలోని గ్లకోమా వ్యాధిగ్రస్తుల్లో సగం మంది మన దేశంలోనే ఉన్నారు.

సరోజినీలో ఏటా 10 వేల మందికి వైద్యం

సరోజినీ దేవి ఆస్పత్రి ఏటా 10 వేల మందికి వైద్య సేవలు అందిస్తోంది. అందులో సగటున 600 మందికి శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. ప్రజల్లో అవగాహన కలిగించడం, వ్యాధిని ప్రాథమిక స్థాయిలో గుర్తించడం, క్రమం తప్పకుండా చికిత్స చేయించుకుంటే గ్లకోమా నుంచి తప్పించుకోవచ్చు. సరోజినీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రజా చైతన్యం, ర్యాలీలు, సెమినార్లు, విద్యార్థులకు వ్యాస రచన పోటీలు, స్లోగన్స్, పోస్టర్ల పోటీ నిర్వహిస్తున్నారు. ఈ వారం రోజులు గ్లకోమా నిర్ధారణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్ తెలిపారు. ప్రజలు ఈ సదుపాయాల్ని వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆ ఐదూళ్లు తిరిగివ్వండి..!

'మా నుంచి తీసుకున్న ఐదూళ్లు తిరిగి ఇవ్వండి' అంటూ తెలంగాణ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌ను కోరుతోంది. ఈ ప్రతిపాదనతో కూడిన ఓ విన్నపాన్ని ఆ రాష్ట్రానికి పంపింది. పోలవరం ముంపు మండలాలుగా పేర్కొంటూ గతంలో ఏపీ డిమాండ్‌తో తెలంగాణ నుంచి విడిపోయిన భూభాగంలోనే ఈ ఐదూళ్లు ఉన్నాయి. ఈ తాజా ప్రతిపాదనకు, ఆ ఏడు మండలాలు తరలిపోయిన వివాదానికి సంబంధం లేదు. భద్రాచలం శ్రీరామచంద్రస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిన విషయం తెలిసిందే. దేవాలయంతోపాటు భద్రాచలం పట్టణాన్ని అభివృద్ధి చేసే క్రమంలో ఈ గ్రామాల అవసరం వచ్చింది. దీంతో వాటిని తెలంగాణకు తిరిగి కేటాయించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను కోరింది.

- ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ ప్రతిపాదన
- భద్రాచలం అభివృద్ధి కోసం కావాలని విన్నపం
- 27న దేవాలయ అభివృద్ధి పనుల శంకుస్థాపన?



భద్రాద్రిలో నిర్మించనున్న ఆలయ నమూనా

సాక్షి, హైదరాబాద్

భద్రాచలం శ్రీరామచంద్రస్వామి ఆలయం కొత్త రూపు సంతరించుకోనుంది. 17వ శతాబ్దంలో నిర్మించిన ఈ ఆలయం పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా కాలానుగుణంగా మారుతూ వచ్చింది. ఇప్పుడు పూర్తిస్థాయిలో మాడవీధులు, గాలి గోపురాలు.. పూర్తి కొత్త రూపు ఇవ్వనున్నారు. ఇప్పటికే రూ.100 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం యాదాద్రి తరహాలో అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.

27న శంకుస్థాపన..?

ఆలయ పునర్నిర్మాణ పనులను ఈ నెల 27న శ్రీసీతారామచంద్రస్వామి పట్టాభిషేక మహోత్సవం సందర్భంగా ప్రారంభించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సాధారణంగా అష్టమి.. నవమి తిథుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఇష్టపడరు. ఇలాంటి సెంటిమెంట్లకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాధాన్యం ఇస్తున్న దృష్ట్యా శ్రీరామనవమి మరుసటి రోజు శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నారు. 26న జరిగే శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొనేందుకు కేసీఆర్ భద్రాచలం వెళ్లనున్నారు. రాత్రి అక్కడే బస చేసి మరుసటి రోజు ఉదయం పట్టాభిషేక మహోత్సవాలను తిలకించి ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసే అవకాశం ఉంది. దీనిపై స్పష్టత కోసం ఉగాది రోజున సీఎంను కలసి చర్చించాలని మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు నిర్ణయించారు. భద్రాచల శ్రీరామనవమి వేడుకల ఆహ్వాన పత్రిక, పోస్టర్‌ను ఇద్దరు మంత్రులు ఎర్రమంజిల్‌లోని ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. 27న సీఎంతో లేదా ముఖ్యమంత్రి ఆదేశిస్తే చినజీయర్‌స్వామితో శంకుస్థాపన కార్యక్రమం కొనసాగుతుందని మంత్రులు పేర్కొన్నారు.

ఐదు గ్రామాలను కలుపుకుని అభివృద్ధి..

భద్రాచలం పట్టణానికి టెంపుల్ టౌన్ హోదా ఇవ్వాలన్న డిమాండ్ చాలాకాలంగా ఉంది. దీనికి కేంద్రం నుంచి నిధులు వచ్చే అవకాశం ఉంటుందన్న అభిప్రాయముంది. ఇప్పుడు ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నందున పనిలో పనిగా టెంపుల్ టౌన్‌గా మార్చాలన్న ప్రతిపాదన సీఎం పరిశీలనకు వచ్చింది. అయితే భద్రాచలం పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు కొత్తగా స్థలం అవసరమైతే సేకరించటం కష్టంగా మారింది. భద్రాచలానికి ఓవైపు గోదావరి ఉండగా, మిగతా రెండు వైపులా ఆంధ్రప్రదేశ్ భూభాగమే ఉంది. దీంతో ఆ రాష్ట్రం పరిధిలో ఉన్న కొన్ని ఊళ్లను తమకు ఇవ్వాలంటూ ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఏపీని కోరింది. ఎటపాక, లక్ష్మీపురం, పురుషోత్తమపట్నం, పిచుకలపాడు, కన్నాయిగూడెం గ్రామ పంచాయతీలను తెలంగాణ కోరింది. వీటితోపాటు గుండాల అనే ఆవాస ప్రాంతాన్ని కూడా కోరింది.

యాదాద్రి తరహాలో చేపడతాం..



'భద్రాచలం ఆలయ పునర్నిర్మాణానికి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించింది. వీటితో పనులు మొదలవుతాయి. భవిష్యత్తులో ఇతర పనులు జోడిస్తే బడ్జెట్ పెరుగుతుంది. యాదాద్రి తరహాలో ఎంత ఖర్చయినా సరే పనులు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అన్నీ కుదిరితే ఈ నెల 27నే పనులు మొదలవుతాయి'

– మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

నీట్-2018 దరఖాస్తుకు గడువు పొడిగింపు

జాతీయ మెడికల్ ప్రవేశ పరీక్ష-నీట్ 2018 దరఖాస్తు గడువును మార్చి 12 వరకు సీబీఎస్ఈ పొడిగించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆధార్‌తో పాటు ప్రత్యామ్నాయ ఐడీతోనూ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించింది.

దరఖాస్తుకు చివరి తేదీ : మార్చి12, 2018 సాయంత్రం 5.30 గంటల వరకు
ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించడానికి చివరి తేదీ : మార్చి13, 2018 (11.50 గంటల వరకు)
పరీక్ష తేదీ : మే 6, 2018
వెబ్‌సైట్: www.cbseneet.nic.in

నాలెడ్జ్ Bytes
Everyday Vocabulary

మనం ప్రతిరోజూ ఇంగ్లిష్ వార్తా పత్రికలు చదువుతున్నప్పుడు తరచూ కనిపించే ఇంగ్లిష్ పదాలు, వాటికి అర్థాలు తెలుసుకుందాం..




- **HOMICIDE:** killing human being, నరహత్య
- **REGICIDE:** killing of king, రాజు హత్య
- **PATRICIDE:** murder of own father, పితృహత్య
- **FRATRICIDE:** murder of own brother, భాతృహత్య
- **AMICUS CURIAE:** friend of the court/a lawyer who advises the court, కోర్టు ఆదేశం మేరకు సలహాను ఇచ్చే న్యాయనిపుణుడు
- **TRAVAILS:** hardships, కష్టాలు



- **MURKY:** turbid/dark/ unclear, చీకటిగా ఉండే, రోత పుట్టించే, మసకబారిన
- **DEMISE:** death, మరణం
- **VEIL:** a membrane used as covering/concealment, పరదా, దాచిపెట్టడం, దాపరికం
- **ANGST:** anxiety, ఆందోళన, మనోవ్యాకులత, మనోదౌర్బల్యం
- **ADROITLY:** skillfully/adeptly, నేర్పుగా, నైపుణ్యం
- **ARENA:** a particular environment/an area of sports, రంగం, క్షేత్రం
- **JUNCTURE:** a critical point in time where a decision has to be made, కీలక పరిస్థితి, నిర్ణయాత్మకమైన సమయం

Quote of the Day



The weak can never forgive. Forgiveness is the attribute of the strong.

Mahatma Gandhi

స్కూల్ ఎడ్యుకేషన్



సిలబస్ కుదింపు దిశగా.. ఎన్‌సీఈఆర్‌టీ!

ఎన్‌సీఈఆర్‌టీ.. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్! జాతీయ స్థాయిలో..ఒకటో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు.. సీబీఎస్ఈ సిలబస్ రూపకల్పనలో ఎన్‌సీఈఆర్‌టీది కీలకపాత్ర. కరిక్యులం రూపకల్పన,బోధన విధానాల పరంగా.. ఎన్‌సీఈఆర్‌టీ ప్రమాణాల మేరకే సీబీఎస్ఈ నడుచుకుంటుంది. ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ విద్యార్థులకు భారంగా ఉందని.. ముఖ్యంగా పది, పన్నెండు తరగతుల సిలబస్ అత్యంత కఠినంగా ఉందనే అభిప్రాయం చాలాకాలంగా ఉంది. దాంతో విద్యార్థులు పూర్తిగా పుస్తకాలకే పరిమితమవుతూ.. వ్యక్తిగత వికాసం, సామాజిక స్పృహకు దూరమవుతున్నారనే వాదన ఉంది. అందుకే కేంద్ర హెచ్‌ఆర్‌డీ శాఖ ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌ను తగ్గించడంపై కసరత్తు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో.. 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకూ ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌లో మార్పుల ప్రతిపాదనలపై విశ్లేషణ...

ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌కు అనుగుణంగా సీబీఎస్ఈ, రాష్ట్రాల బోర్డ్‌లు తమ సిలబస్‌ను రూపొందిస్తున్నాయి. 'ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించిన సిలబస్ విస్తృతంగా ఉంది. ఆ సిలబస్‌ను పూర్తిచేసే క్రమంలో విద్యార్థులు పూర్తిగా పుస్తకాలకే పరిమితమవుతున్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి సైతం గురవుతున్నారు. ముఖ్యంగా వ్యక్తిత్వవికాసం, ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌కు దూరమై.. తదుపరి ఉన్నత విద్య కోర్సుల్లో విభిన్న నేపథ్యాల విద్యార్థులతో కలవలేక ఇబ్బందిపడుతున్నారు' అన్నది నిపుణులు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలు! ఇలాంటి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న హెచ్‌ఆర్‌డీ శాఖ.. ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌ను తగ్గించే దిశగా చర్యలు చేపట్టింది. హెచ్‌ఆర్‌డీ శాఖ జారీ చేసిన ఆదేశాలను పరిశీలిస్తే.. ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ కుదింపు పరంగా ప్రస్తుత సిలబస్‌ను కనీసం 50శాతానికి తగ్గించాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.



అన్నిటికీ రిఫరెన్స్.. ఎన్‌సీఈఆర్‌టీ

వాస్తవానికి ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌కు ఉన్న ప్రామాణికతకు వేరే సిలబస్ సాటి రాదనే చెప్పొచ్చు. అందుకే సీబీఎస్ఈ, ఇతర బోర్డ్‌ల విద్యార్థులే కాకుండా.. సివిల్స్, ఎస్ఎస్‌సీ, ఐఈఎస్, ఐఎఫ్ఎస్ వంటి అత్యున్నత పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు కూడా తమ ప్రిపరేషన్‌ను ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలతోనే ప్రారంభిస్తారు. దీన్నిబట్టే.. ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ ఎంత లోతుగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

అకడమిక్‌గా భారం

విస్తృత స్థాయిలో, లోతైన అంశాలతో ఉన్న ఎన్‌సీఈ ఆర్‌టీ సిలబస్.. అకడమిక్‌గా స్కూల్ విద్యార్థులపై భారంగా పరిణమిస్తోంది. ముఖ్యంగా పది, పన్నెండు తరగతుల స్థాయిలో సిలబస్‌ను ఆకళింపు చేసుకోవడానికి విద్యార్థులు పూర్తి సమయం పుస్తకాలకే కేటాయించాల్సి వస్తోంది. దాంతో వ్యక్తిత్వ వికాసం, సామాజిక అంశాల పట్ల అవగాహన, స్వీయ ఆలోచన సామర్థ్యం, మానసిక ఉల్లాసం వంటివి పెంపొందించుకునేందుకు సమయం ఉండటంలేదు. ఇది భవిష్యత్తులో ప్రతికూలంగా మారుతోంది. ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌తో బోర్డ్ పరీక్షల్లో రాణించి.. ఆ తర్వాత జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ వంటి పరీక్షల ద్వారా ఐఐటీల్లో అడుగుపెట్టిన విద్యార్థులు.. అక్కడి భిన్న కొత్త వాతావరణంలో ఇమడలేక ఒత్తిడికి గురవుతున్నారు. ఇలాంటి సందర్భాల్లోనే విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, సామాజిక స్పృహ ఎంతగానో తోడ్పడుతుంది.

సైన్స్ సబ్జెక్ట్‌లు భారంగా

ప్రస్తుతం ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌కు అనుగుణంగా అమలవుతున్న సీబీఎస్ఈ కరిక్యులంను పరిగణనలోకి తీసుకుంటే.. సైన్స్ సబ్జెక్ట్‌లు భారంగా ఉన్నట్లు విద్యార్థులు భావిస్తున్నారు. దీంతో వీటిలో ఎలాగైనా రాణించాలని పుస్తకాలకే పరిమితమవుతున్నారు. ఫలితంగానే జాతీయ స్థాయిలో నిర్వహించే పలు ఎంట్రన్స్ టెస్ట్‌లలో సైన్స్ సబ్జెక్ట్‌ల పరంగా సీబీఎస్ఈ విద్యార్థులు ముందుంటున్నారనే వాదన ఉంది. తాజా ప్రతిపాదన ప్రకారం-అన్ని సబ్జెక్ట్‌ల మధ్య సమతుల్యత పాటించే అవకాశముందని విద్యావేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్

ప్రస్తుతం 8ఏళ్ల నుంచి 13ఏళ్ల విద్యార్థులు స్కూల్ బ్యాగు 5నుంచి 10 కిలోల మేర బరువు ఉంటోంది. ప్రతి రోజూ డజన్‌కు పైగా పాఠ్యపుస్తకాలను, నోట్‌పుస్తకాలను విద్యార్థులకు పాఠశాలకు మోసుకెళ్లాల్సిన పరిస్థితి. అందుకే ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌ను యాభై శాతానికి కుదించి విద్యార్థులపై పుస్తకాల భారం, బ్యాగుల మోత తగ్గించాలని హెచ్‌ఆర్‌డీ శాఖ భావిస్తోంది. అంతేకాకుండా కొత్త సిలబస్‌లో విద్యార్థుల ఆల్ రౌండ్ డెవలప్‌మెంట్‌కు అవకాశం కల్పించే అంశాలు ఉండేలా చూడాలని భావిస్తోంది. సీబీఎస్ఈ పన్నెండో తరగతి స్థాయిలో ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ కీలకం. అదేసమయంలో విద్యార్థులు వ్యక్తిగతంగా పదిహేడేళ్ల వయసులో ఉంటారు. వాస్తవానికి ఈ వయసులోనే విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం, ఆలోచన సామర్థ్యాలు వికసించాలి. దీన్ని దృష్టిలో పెట్టుకుని సిలబస్ కుదింపుతోపాటు విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసానికి దోహదంచేసే స్పోర్ట్స్, యోగా, మెడిటేషన్, ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ వంటివి కరిక్యులంలో పొందుపరిచేలా చూడాలని ఎన్‌సీఈఆర్‌టీకి హెచ్‌ఆర్‌డీ శాఖ ఆదేశించింది.

2019 నుంచి అమల్లోకి?

ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ తగ్గించడం, కొత్త పాఠ్యపుస్తకాల రూపకల్పన త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశముందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఎన్‌సీఈఆర్‌టీ కొత్త సిలబస్‌ను 2019-20 విద్యా సంవత్సరం నుంచే అమల్లోకి తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించి నిపుణుల బృందాలను కమిటీలుగా నియమించి.. సిలబస్ కుదింపు ప్రక్రియ పరంగా వేగంగా చర్యలు తీసుకోవాలని ఎన్‌సీఈఆర్‌టీకి సూచించింది. ఒకవేళ 2019 విద్యా సంవత్సరానికి సాధ్యం కాకపోతే.. 2020-21 విద్యా సంవత్సరంలో మాత్రం ఎన్‌సీఈఆర్‌టీ కొత్త సిలబస్ అమల్లోకి రావడం ఖాయమని చెబుతున్నారు.

అభిప్రాయ సేకరణ



ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌ను కుదించే క్రమంలో నిపుణులు, విద్యావేత్తలు, స్వచ్ఛందసంస్థల నుంచి అభిప్రాయ సేకరణకు హెచ్‌ఆర్‌డీ శాఖ శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించి సలహాలు, సూచనలు అందించాలని.. హెచ్‌ఆర్‌డీ, ఎన్‌సీఈఆర్‌టీ వెబ్‌సైట్లలో ప్రకటన సైతం ఇచ్చింది. ఏప్రిల్ 6వ తేదీ వరకూ తమ సూచనలు,సలహాలు అందించాలని పేర్కొంది. ఇలా.. రెండు నెలలపాటు అభిప్రాయాలు స్వీకరించనుంది. ఆ తర్వాత ఆయా అభిప్రాయాలను సంబంధిత సబ్జెక్ట్‌లు-వాటి నిపుణుల బృందాలు పరిశీలించి.. వాస్తవ పరిస్థితులు -సలహాలను బేరీజు వేసి సిలబస్ కుదింపు పరంగా కసరత్తు ప్రారంభించనున్నారు.

రాష్ట్రాల బోర్డ్‌లపైనా ప్రభావం

ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌ను కుదించడం కార్యరూపం దాల్చితే.. అది రాష్ట్రాల స్థాయిలోని బోర్డ్‌ల సిలబస్‌పైనా ప్రభావం చూపనుంది. ప్రస్తుతం ఏడు రాష్ట్రాలు మినహా అన్ని రాష్ట్రాల బోర్డ్‌లు జాతీయస్థాయి పరీక్షలు, వాటికి ప్రామాణికంగా నిలుస్తున్న సీబీఎస్ఈ సిలబస్‌కు అనుగుణంగా మార్పులు చేశాయి. హెచ్‌ఆర్‌డీ శాఖ తాజా నిర్ణయంతో ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ కుదిస్తే.. దానికి అనుగుణంగా మళ్లీ రాష్ట్రాల బోర్డ్‌లు సిలబస్‌లో మార్పుల దిశగా అడుగులు వేయాల్సి ఉంటుంది.

విద్యార్థులకు ఉపశమనం

హెచ్‌ఆర్‌డీ తాజా నిర్ణయం లక్షల మంది విద్యార్థులకు ఉపశమనం కలిగిస్తుందని చెప్పొచ్చు. హెచ్‌ఆర్‌డీ ఆలోచనకు అనుగుణంగా సిలబస్‌లో మార్పులు చేస్తే విద్యార్థుల్లో కచ్చితంగా ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్ కనిపిస్తుంది. వన్ నేషన్, వన్ ఎగ్జామ్ కోణంలో.. అన్ని కోర్సులకు ఒకే పరీక్ష నిర్వహించాలనే ఆలోచనల నేపథ్యంలో అన్ని ప్రాంతాలు, బోర్డ్‌ల మధ్య సమతుల్యత పాటించినట్లు అవుతుంది.

– ప్రొఫెసర్.పి.సందీప్, మెంబర్, ఎన్‌సీఎఫ్

విపత్తు నిర్వహణ

కాంపిటీటివ్ గైడెన్స్
డిజాస్టర్ మేనేజ్‌మెంట్

విపత్తులు.. విశ్వాన్ని అతలాకుతలం చేసి.. మానవజాతి మనుగడనే ప్రశ్నార్థకం చేస్తాయి. నిత్యం ప్రపంచంలో ఎక్కడో ఒక చోట ప్రకృతి వైపరీత్యాల వల్ల తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టం సంభవిస్తోంది. భూకంపాలు, తుపానులు, సునామీలు, వరదలు, అగ్ని ప్రమాదాలు, భూతాపాలు (కొండచరియలు విరిగిపడటం), భవనాలు కూలిపోవడం, రసాయన విస్ఫోటనాలు వంటివి అకస్మాత్తుగా సంభవించి అపార నష్టం కలిగిస్తున్నాయి. ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా విపత్తు నిర్వహణ కీలకంగా మారింది. విపత్తు నిర్వహణ అనేది ప్రజల జీవితాలు, జీవకోటి మనుగడ, నాగరికతలతో ముడిపడిన అంశం. అందుకే ప్రతి పోటీ పరీక్షలో విపత్తు నిర్వహణపై ప్రశ్నలు తప్పనిసరిగా మారాయి. ఈ నేపథ్యంలో సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షల విజయంలో కీలకంగా మారిన 'విపత్తు నిర్వహణ' ప్రిపరేషన్ వ్యూహాలు...



విపత్తు నిర్వహణ యూపీఎస్సీ, టీఎస్‌పీఎస్సీ, ఏపీపీఎస్సీ నిర్వహించే పరీక్షల్లో తప్పనిసరిగా కనిపించే పాఠ్యాంశం. వీఆర్‌ఏ పరీక్ష నుంచి సివిల్స్ వరకు.. విపత్తులు-వాటి నిర్వహణపై ప్రశ్నలు అడుగుతున్నారు. ఈ టాపిక్ అభ్యర్థులను కొంత ఆందోళనకు గురిచేస్తోందని చెప్పకతప్పదు. విపత్తు నిర్వహణకు సంబంధించి ఏయే అంశాలపై దృష్టిసారించాలనే విషయానికి సంబంధించి అభ్యర్థుల్లో అనేక సందేహాలు ఉన్నాయి. అయితే అభ్యర్థులు ముందుగా పరీక్ష స్థాయిని బట్టి ప్రశ్నల తీరు ఉంటుందని గుర్తించాలి.

- పంచాయతీ సెక్రెటరీ, వీఆర్‌ఏ, గ్రూపు-3, 4 వంటి పరీక్షల్లో ప్రాథమిక పరిజ్ఞానాన్ని పరీక్షించేలా ప్రశ్నలు అడుగుతారు. ఉదాహరణకు ప్రపంచ విపత్తు విస్తరణలో భూకంపాలు, సునామీలు, కొండచరియల వాటా ఎంత?; సహజ సిద్ధ వైపరీత్యాలు అంటే ఏమిటి?; అంతర్జాతీయ సునామీ సమాచార కేంద్రం ఎక్కడ ఉంది?; వరద ప్రమాద హెచ్చరికలను జారీ చేసేదెవరు?; జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఎక్కడ ఉంది?; ప్రథమ చికిత్స లక్ష్యం ఏమిటి? వంటి ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. గ్రూప్-1, 2 స్థాయి పరీక్షల్లో ప్రశ్నల క్లిష్టత పెరుగుతుంది. కాబట్టి అభ్యర్థులు ప్రతి అంశాన్ని లోతుగా అధ్యయనం చేయాలి. వైపరీత్యాలు- కారణాలు, పరిణామాలు; విపత్తు నిర్వహణా వ్యూహాలకు సంబంధించి.. విశ్లేషణాత్మక ప్రశ్నలకు సమాధానాలు గుర్తించేలా సన్నద్ధం కావాలి.
- విపత్తులను ప్రధానంగా రెండు రకాలుగా విభజించొచ్చు. అవి..సహజసిద్ధ విపత్తులు; మానవ ప్రమేయ విపత్తులు. విపత్తుల నిర్వచనాలు; విపత్తులకు కారణాలు; విపత్తులు సంభవిస్తే స్పందించాల్సిన తీరు; విపత్తులు-నివారణ; నివారణ సాధ్యం కానప్పుడు..వాటి ప్రభావాన్ని ఎలా తగ్గించాలి?; పునర్నిర్మాణం, పునరావాస కార్యక్రమాలు; ఆస్తి, ప్రాణ నష్టాల నివారణ తదితర అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.
- సహజసిద్ధ విపత్తుల్లో వరదలు, హరికేన్లు, తుపానులు, భూకంపాలు, అగ్నిపర్వతాల విస్ఫోటనం, కరువు, సునామీ తదితరాల గురించి తెలుసుకోవాలి. భూకంపాల గురించి చదివేటప్పుడు..భూకంపాలు సంభవించడానికి గల కారణాలను అధ్యయనం చేయాలి. ఇందులో భాగంగా ఉపరితల కారణాలు, అగ్నిపర్వత సంబంధ కారణాలు, విరూపకారక కారణాలు, పాతాళ సంబంధ కారణాల గురించి తెలుసుకోవాలి. భారత్‌లో సంభవించిన ప్రధాన భూకంపాల వివరాలను అధ్యయనం చేయాలి. భూకంప కదలికలను లెక్కించే సాధనం, తీవ్రతను కొలిచేందుకు ఉపయోగించే స్కేల్స్ గురించి తెలుసుకోవాలి. దేశ, ప్రపంచ వ్యాప్తంగా భూకంప ముప్పు ఎదుర్కొంటున్న ప్రాంతాలు, నష్ట నివారణ చర్యలు, భూకంప నివారణకు చేపట్టిన ప్రాజెక్టులు, అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో భూకంపాలకు సంబంధించి ఏర్పాటు చేసిన సంస్థల గురించి అధ్యయనం చేయాలి. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ(ఎన్‌డీఎంఏ), దాని చైర్మన్, బాధ్యతలు, విధులు; రాష్ట్ర, జిల్లా స్థాయిల్లోని ప్రత్యేక విపత్తు నిర్వహణా యంత్రాంగాలు, వాటి నిర్మాణం, బాధ్యతల గురించి తెలుసుకోవాలి.
- అభ్యర్థులు ప్రధానంగా ఇటీవల కాలంలో సంభవించిన విపత్తులపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. దాదాపు అన్ని ప్రశ్నలను వీటి కేంద్రంగానే అడుగుతున్నారు. ఉదాహరణకు విశాఖపట్నం సమీపంలో తీరం దాటిన హుదూద్ తుపాను గురించి అధ్యయనం చేయాలి. హుదూద్ పేరు నేపథ్యం గురించి తెలుసుకోవాలి. హుదూద్ (ఇజ్రాయిల్ జాతీయ పక్షి) అంటే అర్థం ఏమిటి?; ఏయే జిల్లాల్లో దీని ప్రభావం కనిపించింది? తదితరాలను క్షుణ్నంగా తెలుసుకోవాలి. 2004, డిసెంబర్ 26న హిందూమహాసముద్రంలో సంభవించిన సునామీ, దాని ప్రభావంతో నష్టపోయిన దేశాలు (ఇండోనేషియా, శ్రీలంక, ఇండియా, థాయిలాండ్, మాల్దీవులు..), ప్రాణ నష్టం (2,30,000-2,80,000) వంటి అంశాలపై పట్టు సాధించాలి. 2013లో సంభవించిన ఫైలిన్, హెలెన్, లెహర్ తుపానులు, ఉత్తరాఖండ్ వరదలపై దృష్టిసారించాలి. వివిధ విపత్తుల గురించి చదివేటప్పుడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలను ప్రత్యేక దృష్టితో చూడాలి.

నివారణ చర్యలు/ఉపశమన చర్యలు

విపత్తు నిర్వహణ అనేది వివిధ కార్యక్రమాల సమాహారం. విపత్తుకు ముందు, విపత్తు సమయంలో, విపత్తు అనంతరం చేపట్టే కార్యక్రమాలను కలిపి సంయుక్తంగా విపత్తు నిర్వహణ అంటారు. విపత్తు తీవ్రతను తగ్గించేందుకు తీసుకొనే చర్యలే.. ఉపశమన చర్యలు. వీటిలో ప్రజలు, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలకు భాగస్వామ్యం ఉంటుంది.

- పరీక్షల్లో విపత్తు సంభవించిన తేదీ?; ఎంత మంది మరణించారు? వంటి ప్రశ్నలు సైతం అడుగుతున్నారు. కాబట్టి వివిధ రకాల విపత్తులను అధ్యయనం చేసేటప్పుడు ఆయా అంశాలపైనా దృష్టిపెట్టాలి.

గత ప్రశ్నపత్రాల పరిశీలన

వివిధ ఉద్యోగ నియామకాలకు సంబంధించి గతంలో యూపీఎస్సీ, టీఎస్‌పీఎస్సీ, ఏపీపీఎస్సీ నిర్వహించిన పరీక్షల ప్రశ్నపత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలి. ఎందుకంటే గతంలో వచ్చిన ప్రశ్నలు చాలా వరకు పునరావృతం అవుతున్నాయి. కాబట్టి అభ్యర్థులు పాత ప్రశ్నపత్రాలను సేకరించి, ప్రాక్టీస్ చేయాలి. దీనివల్ల ప్రశ్నల క్లిష్టత, ప్రశ్నలు అడిగే తీరు తదితరాలపై అవగాహన ఏర్పడుతుంది.



రిఫరెన్స్

సీబీఎస్ఈ 8, 9 తరగతుల పాఠ్యపుస్తకాల్లోని విపత్తు నిర్వహణ పాఠ్యాంశాలు; నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ(ఎన్‌డీఎంఏ) అధికారిక వెబ్‌సైట్ **www.ndma.gov.in**, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అధికారిక వెబ్‌సైట్ **www.mha.nic.in**లోని సమాచారం.

విద్య, ఉద్యోగ సమాచారం



పాలిసెట్-2018

2018-19 విద్యా సంవత్సరానికి గాను ఏపీ 'పాలిసెట్' (పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్) ప్రవేశ ప్రకటన విడుదలైంది.

- **అర్హతలు:** పదో తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్, విజయవాడ వారి గుర్తింపు పొందిన అభ్యర్థులు మాత్రమే అర్హులు. కంపార్ట్‌మెంటల్‌గా ఉత్తీర్ణులైన లేదా ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు హాజరుకాబోతున్న అభ్యర్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ప్రవేశానికి ముందు అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులై ఉండాలి.
- **ఆన్‌లైన్ ధరఖాస్తుకు ప్రారంభ తేదీ:** 14.03.2018 (బుధవారం)
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 14.04.2018 (శనివారం)
- **వెబ్‌సైట్:** **https://polycetap.nic.in**
- **దరఖాస్తు ఫీజు:** రూ.350/- (హెల్ప్‌లైన్ సెంటర్లు/ఏపీ ఆన్‌లైన్ సెంటర్ల గేట్‌వే ద్వారా చెల్లించాలి) ❖ **పరీక్ష తేదీ:** 27.04. 2018 (శుక్రవారం) ఉదయం 11:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** **http://sbtetap.gov.in**
- **గమనిక:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలో ఆధార్ నెంబరు తప్పనిసరి.

టీఎస్ సెట్-2018

తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు/ లెక్చరర్లుగా పనిచేయడానికి అర్హత కల్పించే తెలంగాణ సెట్-2018 (టీఎస్- స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్) నోటిఫికేషన్‌ను ఉస్మానియా యూనివర్సిటీ విడుదలచేసింది.

- **ముఖ్యమైన తేదీలు:**
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేదీ:** 14.03.2018
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 14.04.2018
- **ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేదీ:** 24.04.2018 రూ. 1500/-+రిజిస్ట్రేషన్ ఫీజు
- 04.05.2018 రూ.2000/-+ రిజిస్ట్రేషన్ ఫీజు ❖ 15.05.2018 రూ.3000/-+ రిజిస్ట్రేషన్ ఫీజు
- **పరీక్ష తేదీ:** 15.07.2018
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** **www.telanganaset.org, www.osmania.ac.in**

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో 14 ఖాళీలు

విశాఖపట్నంలోని వైజాగ్ స్టీల్ ప్లాంట్(వీఎస్‌పీ)... 14 మేనేజ్‌మెంట్ ట్రైనీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు:** మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఎంటీ).
- **వేతనం:** శిక్షణలో రూ.20,600; ఉద్యోగంలో నియమితులయ్యాక రూ.24,900-రూ.50,500.
- **విభాగాల వారీ ఖాళీలు:** హెచ్‌ఆర్-8, మార్కెటింగ్-6.
- **అర్హతలు:** సంబంధిత విభాగాలను బట్టి కనీసం 60శాతం(ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ-50శాతం) మార్కులతో ఎంబీఏ/పీజీ డిగ్రీ/పీజీ డిప్లొమా. అలాగే యూజీసీ నెట్(జూలై -2018) నిర్ణీత స్కోర్‌తో ఉత్తీర్ణత.
- **వయసు:** 2018, ఫిబ్రవరి 1 నాటికి 27 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **శారీరక ప్రమాణాలు** ఎత్తు-పురుషులు కనీసం 150 సెం.మీ, మహిళలు కనీసం 143 సెం.మీ ఉండాలి. బరువు-పురుషులు కనీసం 43 కిలోలు, మహిళలు కనీసం 35 కిలోలు ఉండాలి. అలాగే తగినంత శారీరక, మానసిక ఆరోగ్యం, దృఢత్వం ఉండాలి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు రుసుం:** జనరల్/ఓబీసీ- రూ.500; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ- రూ.100. రుసుముకు 18శాతం జీఎస్టీ అదనంగా చెల్లించాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
- **దరఖాస్తుల ప్రారంభం:** జూన్ 25, 2018. ❖ **చివరి తేదీ:** జూలై 16, 2018.
- **వెబ్‌సైట్:** **www.vizagsteel.com**

వికలాంగుల కోసం నిర్వహించే పారా ఒలింపిక్స్‌లో రెండు రకాలు.. సమ్మర్ ఒలింపిక్స్, వింటర్ ఒలింపిక్స్



అక్కడ పెళ్లి ఓ మాయ!





మన సమాజంలో పెళ్లి అంటే ఏడడుగులతో.. వేదమంత్రాల సాక్షిగా.. మూడు ముళ్ల బంధంతో ఒక్కటై.. జీవితాంతం కలసి మెలసి తోడూనీడగా ఉండాలని కోరుకుంటారు. బంధుమిత్రుల సమక్షంలో అంగరంగ వైభవంగా వివాహం జరుపుకొంటారు. అయితే ఈ మధ్య కాలంలో పెళ్లి కూడా కమర్షియల్ పుంతలు తొక్కుతోంది. అంటే అన్నీ రెడీమేడ్‌గా దొరికేస్తున్నాయి. అయితే వస్తువుల వరకు సరే కానీ.. పెళ్లి కొడుకు.. బంధువులు.. అందరూ అద్దెకు దొరికితే.. ఏంటీ పెళ్లి కొడుకును కూడా అద్దెకు తీసుకుంటారా అని ఆశ్చర్యపోకండి. ఇదంతా నిజమే కానీ మన దగ్గర కాదులెండి.. వియత్నాంలో! ఇప్పుడు నకిలీ పెళ్లి అక్కడ పెద్ద వ్యాపారంగా వర్ధిల్లుతోంది. ఇలా ఎందుకు చేసుకుంటారంటే అక్కడి యువతులు పెళ్లి కాకముందే గర్భం దాల్చడం సర్వసాధారణం. అందుకే వారు అబార్షన్ చేసుకుంటారు. అలా వియత్నాంలో ఏటా 3 లక్షలకు పైగా అబార్షన్లు జరుగుతాయట. వాటిలో 20 నుంచి 30 శాతం అబార్షన్లు పెళ్లికాని వారే చేయించుకుంటారట. అయితే ఆ బిడ్డను చంపుకోవడం ఇష్టం లేని వారు మాత్రం అబార్షన్ చేయించుకోరు. ఇక్కడే ఉంది ట్విస్ట్. అలా పెళ్లి కాకముందు బిడ్డను కనడం మాత్రం సమాజం ఒప్పుకోదట. దీంతో ఏదో 'పెళ్లి జరిగింది' అనిపించేందుకు ఓ పెళ్లి చేసుకుంటారట. నకిలీ పెళ్లి కొడుకులతోపాటు బంధువులు.. ఏర్పాట్లన్నీ సంబంధిత సంస్థలకు డబ్బులు ముట్టజెపితే చేసిపెడతాయి. అంతేకాదు భవిష్యత్తులో ఏవైనా చుట్టాల పెళ్లిళ్లు, ఫంక్షన్లు ఉంటే ఆ 'భర్త'లను తిరిగి నియమించుకోవచ్చు. దీనివల్ల యువతులకు పెళ్లి అయిందనే ఒకరకమైన సంతృప్తి కలుగుతుందని వారి నమ్మకం.

నిప్పులాంటి ఈటలపై నిందలా?

- ఎమ్మెల్యే రేవంత్ రెడ్డిపై రైస్ మిలర్ల సంఘం ఆగ్రహం
- సంక్షోభంలో ఉన్న మిల్లర్లు లంచాలు ఇస్తారా అని ప్రశ్న?

కరీంనగర్ సిటీ: ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మరాడించి తిరిగి అప్పగించడంలో రూ.కోట్లలో అదనపు భారం పడిందంటూ వచ్చిన ఆరోపణల్లో నిజం లేదని జిల్లా రైస్ మిలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బచ్చు భాస్కర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి ఈటల రాజేందర్‌పై బురదజల్లే ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. శనివారం కరీంనగర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ''ఆర్థిక మంత్రి ఈటల నిప్పులాంటి మనిషి.. ఆయనపై కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి ఉద్దేశపూర్వకంగా నిందలు వేసి దుష్ప్రచారం చేస్తున్నారు''అని మండిపడ్డారు. లక్ష్మణ్ అనే వ్యక్తితో మంత్రి ఈటలకు అవినీతి సంబంధాలు ఉన్నాయని పేర్కొనడం అవాస్తమన్నారు. ఎవరు తప్పు చేసినా పీడీ యాక్టు దిశగా చర్యలు తీసుకుంటున్న మంత్రి నిప్పులాంటివారని పేర్కొన్నారు. ఏడాదిగా జిల్లాలో పీడీఎస్ అక్రమం విషయంలో ఒకే ఒక్క 6ఏ కేసు నమోదవడం అందుకు తార్కాణమని చెప్పారు. మిల్లర్లపై అనవసర ఆరోపణలు మానుకోవాలని, మచ్చలేని మంత్రిపై ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. కస్టమ్ మిల్లింగ్ డెలివరీ, చార్జీల పెంపు విషయంలో మిల్లర్లు లంచాలు ఇచ్చారంటూ ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. అసలే సంక్షోభంలో ఉన్న మిల్లర్లు లంచాలు, చందాలు ఇచ్చే పరిస్థితి ఉందా అని ప్రశ్నించారు.

వడ్డీ బకాయిలపై అసెంబ్లీలో నిలదీస్తా



జీవన్ రెడ్డి

జగిత్యాల రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఆరు లక్షల మహిళా సంఘాలకు ప్రభుత్వం రూ.2 వేల కోట్ల వడ్డీ బకాయి పడిందని, దీనిపై అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తానని సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా టీఆర్‌నగర్‌లో శనివారం మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడితే సమస్యలన్నీ తీరుతాయని ప్రజలు ఆశించారని, కానీ ప్రభుత్వ పాలన అందుకు భిన్నంగా ఉందన్నారు. ఆడబిడ్డల సొమ్ము తిన్న వారు ఎవరూ బాగుపడరని పేర్కొన్నారు.

కేసీఆర్ ఫ్రంట్‌తో బీజేపీకి నష్టం లేదు

రిజర్వేషన్లు రాజ్యాంగం పరిధిలోని అంశం: దత్తాత్రేయ

మంచిర్యాల సిటీ: కేసీఆర్ ఫ్రంట్‌తో బీజేపీకి ఎలాంటి నష్టం లేదని ఆ పార్టీ సీనియర్ నేత బండారు దత్తాత్రేయ వ్యాఖ్యానించారు. శనివారం మంచిర్యాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎన్ని ఫ్రంట్‌లు, టెంట్‌లు వచ్చినా బీజేపీని ఎదుర్కొనే శక్తి వాటికి లేదన్నారు. ప్రధాని మోదీ పరిపాలన అద్భుతం, తనకు మంచి స్నేహితుడు అని ప్రకటించిన కేసీఆర్.., నేడు కించపరిచే విధంగా మాట్లాడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రిజర్వేషన్‌లు రాజ్యాంగం పరిధిలోనివని, విపక్షాలు అనవసరంగా తమపై బురదజల్లడం మానుకోవాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో బీసీలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు.

2019లో కాంగ్రెస్‌దే అధికారం

రాష్ట్రంలో లక్ష ఉద్యోగాలు ఏమాయ్యాయ్?: దేవేందర్ కత్యాల్

ఇల్లెందు: కేంద్రంలో, రాష్ట్రంలో 2019లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి దేవేందర్ కత్యాల్ జోస్యం చెప్పారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్ర రూపం దాల్చిందని, ఈ విషయంలో పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. భద్రాద్రి జిల్లా ఇల్లెందులో శనివారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరుద్యోగ చైతన్య యాత్రలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే లక్ష ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారని, నాలుగేళ్లు గడిచినా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు. సభలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ బి.వి. శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో భారీ చోరీ

57 తులాల బంగారం, రూ. 1.50 లక్షల నగదు అపహరణ

కామారెడ్డి క్రైం: కామారెడ్డిలో శుక్రవారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. తాళం వేసిన ఇంట్లో నుంచి దొంగలు 57 తులాల బంగారం, రూ. 1.50 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. కామారెడ్డి మండలం వడ్లూర్ గ్రామానికి చెందిన జితేందర్‌రెడ్డి ఆర్టీసీలో పనిచేస్తున్నాడు. ఆయన కుటుంబం కామారెడ్డిలోని విద్యానగర్ కాలనీలో నివాసం ఉంటోంది. ఇటీవల గ్రామంలోని భూమిని విక్రయించగా వచ్చిన డబ్బులతో కూతురు పెళ్లికి అవసరం ఉంటుందని 30 తులాల బంగారం కొనుగోలు చేశాడు. మరో 27 తులాల బంగారంతోపాటు రూ. 1.50 లక్షల నగదును బీరువాలో దాచాడు. బుధవారం కుటుంబంతో కలసి తిరుపతి వెళ్లాడు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగలు ఇంటి తాళాన్ని పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు.

10వేల కోట్లతో రహదారుల అభివృద్ధి

జాతీయ రహదారుల రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ గణపతిరెడ్డి

అర్వపల్లి (తుంగతుర్తి): రాష్ట్రంలో రూ.10వేల కోట్లతో 700 కిలోమీటర్ల రహదారులను జాతీయ రహదారులుగా అభివృద్ధి చేస్తున్నట్లు జాతీయ రహదారుల రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ ఐ.గణపతిరెడ్డి వెల్లడించారు. శనివారం సూర్యాపేట ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సూర్యాపేట నుంచి జనగామ వరకు 100 కిలోమీటర్ల రహదారిని వెడల్పు చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే రెండేళ్లలో సిద్దిపేట నుంచి సిరిసిల్ల వరకు కూడా రోడ్డును వెడల్పు చేస్తామన్నారు. అలాగే నకిరేకల్–తానంచర్ల రహదారిని రెండు లేన్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. సూర్యాపేట–జనగామ, నకిరేకల్–తానంచర్ల జాతీయ రహదారుల నిర్మాణ పనులు 2019 నాటికి పూర్తి చేస్తామన్నారు.

మెడికల్ ఇన్‌వాలిడేషన్‌తోనే కారుణ్యం

సర్వీసులో ఉన్న కార్మికుడు చనిపోయినా వర్తింపు

- డిపెండెంట్ ఉద్యోగాలపై సింగరేణి సంస్థ స్పష్టీకరణ
- కారుణ్య నియామకాల సర్క్యులర్ విడుదల
- రోగాలు పెరగలే.. అన్‌ఫిట్ విధానాలు మారలే..
- మెడికల్ ఇన్‌వాలిడేషన్‌కు స్పష్టమైన అర్థాన్నిచ్చిన సంస్థ
- మెడికల్ ఇన్‌వాలిడేషన్ విధివిధానాలపై మాత్రం అస్పష్టత



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కార్మికుడు సర్వీస్‌లో ఉండి చనిపోయినప్పుడు గానీ.. శాశ్వతంగా ఉద్యోగం చేయలేని స్థితికి చేరుకున్నప్పుడు 'కారుణ్య నియామకాల'కింద కుటుంబ సభ్యులకు అవకాశం ఇవ్వాలని సింగరేణి సంస్థ నిర్ణయించింది. ఈ మేరకు సంస్థ డైరెక్టర్ పవిత్రన్‌కుమార్ శనివారం సర్క్యులర్ (నంబర్ 305) విడుదల చేశారు. వారసత్వ ఉద్యోగాలకు సంబంధించి 2017 మార్చి 16న కోర్టు ఇచ్చిన ఆదేశాలను పరిగనలోకి తీసుకొని నేషనల్ కోల్ వేజ్ అగ్రిమెంట్స్ (ఎన్‌సీడబ్ల్యూఏ) నిబంధనలు, గతంలో జారీ అయిన సర్క్యులర్లకు అనుగుణంగా 'కారుణ్య నియామకాలు'జరపనున్నట్లు సంస్థ స్పష్టం చేసింది. దీని ప్రకారం కార్మికుడు సింగరేణి బొగ్గు గనుల్లో పని చేయలేని స్థితికి చేరుకున్నప్పుడు మెడికల్ ఇన్‌వాలిడేషన్ కింద కంపెనీ నిబంధనలకు లోబడి డిపెండెంట్‌కు ఉద్యోగం కల్పించనున్నారు. అలాగే సర్వీస్‌లో ఉన్న సింగరేణి కార్మికుడు చనిపోయినప్పుడు ఆ కుటుంబానికి ఆసరాగా వారసులకు ఉద్యోగం కల్పిస్తారు. ఈ సర్క్యులర్ ద్వారా కార్మికుని కొడుకు, కూతురుతోపాటు దత్తత వారసులను, సోదరులను, అల్లుళ్లు, వితంతువుగా మారిన కూతురు లేదా కోడలు, భార్యను కోల్పోయిన అల్లుళ్లను కూడా డిపెండెంట్‌గా సంస్థ పరిగనలోకి తీసుకొంది. మెడికల్ ఇన్‌వాలిడేషన్‌కు సంబంధించి మెడికల్ బోర్డులో కొత్తగా రోగాలు చేర్చలేదు. ఎన్నేళ్ల సర్వీస్ ఉంటే కారుణ్య నియామకాలకు దరఖాస్తు చేసుకోవచ్చో కూడా స్పష్టత ఇవ్వలేదు.

వారసత్వ ఉద్యోగాలకు ప్రత్యామ్నాయంగా...

1998 నుంచి సింగరేణిలో రద్దయిన వారసత్వ ఉద్యోగాలను పునరుద్ధరిస్తూ 2016 దసరా సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. సింగరేణిలో రెండేళ్ల సర్వీస్ ఉన్న ప్రతి కార్మికుడు తన వారసులకు బొగ్గు గనుల్లో అవకాశం కల్పించేందుకు ఉద్దేశించిన నోటిఫికేషన్ అది. దీంతో సింగరేణిలో కార్మికులు, వారసులు ఆనందోత్సాహాలు జరుపుకున్నారు. అయితే ఈ నోటిఫికేషన్‌పై గోదావరిఖనికి చెందిన ఓ నిరుద్యోగి హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం దాఖలు చేయడంతో హైకోర్టు వారసత్వ ఉద్యోగాల నోటిఫికేషన్‌ను కొట్టేసింది. దీనిపై సింగరేణి సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించినా ఫలితం దక్కలేదు. ఈ నేపథ్యంలో గత అక్టోబర్‌లో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో సీఎం కేసీఆర్ స్వయంగా వారసత్వ ఉద్యోగాలకు బదులు కారుణ్య నియామకాల అంశాన్ని తెరపైకి తెచ్చారు. ఇతర ప్రభుత్వ రంగసంస్థల్లో అమలవుతున్న ఈ విధానాన్ని సింగరేణిలో ఉదారతతో అమలు చేస్తామని చెప్పారు. దీంతో సింగరేణి ఎన్నికల్లో అధికారిక టీబీజీకేఎస్ యూనియన్ ఘన విజయం సాధించింది. ఈ నేపథ్యంలో గత నెల 27వ తేదీన శ్రీరాంపూర్‌లో సింగరేణీయుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరై మార్చి నెలలోనే కారుణ్య నియామకాల ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే శనివారం సర్క్యులర్ విడుదలైంది.

'మెడికల్ అన్‌ఫిట్'కొత్తేం కాదు

సింగరేణిలో కార్మికుడు చనిపోతే డిపెండెంట్ కింద భార్య, కొడుకు, కూతురులలో ఒకరికి ఉద్యోగం కల్పించే ప్రక్రియ ఎప్పటి నుంచో కొనసాగుతోంది. అదే తరహాలో 'మెడికల్ అన్‌ఫిట్'విధానం ద్వారా కార్మికుల వారసులకు ఉద్యోగాలు కల్పించే విధానం కూడా పాతదే. కార్మికుడు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి పనిచేయలేని స్థితికి చేరినప్పుడు గానీ, పక్షవాతం, కుష్టు, క్యాన్సర్, టీబీ, గుండె సంబంధమైన వ్యాధులకు గురై విధుల నిర్వహణకు పనికిరాడని తెలిసినప్పుడు గానీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చే విధానం ఉంది. అయితే కొత్తగూడెంలోని సింగరేణి మెడికల్ బోర్డు కార్మికుడు వైద్యపరంగా నిస్సహాయుడు అని నిర్ధారిస్తూ 'మెడికల్ అన్‌ఫిట్'సర్టిఫికెట్ ఇస్తే డిపెండెంట్‌కు ఉద్యోగం వస్తుంది.

కొత్త రోగాలు.. అన్‌ఫిట్ విధానాలేవీ?

శనివారం సింగరేణి యాజమాన్యం విడుదల చేసిన సర్క్యులర్‌లో కారుణ్య నియామకాలకు సంబంధించి కొత్తగా విధివిధానాలేవీ రూపొందించలేదు. 'మెడికల్ ఇన్‌వాలిడేషన్'ద్వారానే కార్మికుల కుటుంబసభ్యులకు ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్న సంస్థ 'ఇన్‌వాలిడేషన్'కు ఏయే రోగాలను చేరుస్తారనే విషయంలో స్పష్టత ఇవ్వలేదు. ప్రస్తుతం ఆరు రోగాలకు మాత్రమే మెడికల్ ఇన్‌వాలిడేషన్‌కు అవకాశం ఉంది. 'మెడికల్ ఇన్‌వాలిడేషన్'కు అర్థాన్ని వివరిస్తూ.. 'వైద్యపరంగా పూర్తిగా సామర్థ్యరహితమై ఉద్యోగం కోల్పోయి కుటుంబానికి భారంగా మారడం' అని సంస్థ పేర్కొనడం గమనార్హం.

2017 దరఖాస్తుదారులకు అవకాశం లేనట్టే!

గత నెల 27న శ్రీరాంపూర్ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ గతంలో వారసత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వారంతా ఇప్పుడు మళ్లీ కారుణ్య నియామకాలకు దరఖాస్తు చేసుకొని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోమని సలహా ఇచ్చారు. అయితే ఈ కారుణ్య నియామకాలకు దరఖాస్తు చేసుకోవాలంటే గతంలో సంస్థ జారీ చేసిన సర్క్యులర్ల రిఫరెన్స్ ప్రకారం కార్మికునికి కనీసం రెండేళ్ల సర్వీసు మిగిలి ఉండాలి. డిపెండెంట్ వయస్సు 35 దాటకూడదు. కానీ 2017లో దరఖాస్తు చేసుకున్న వారంతా ఏడాది, రెండేళ్లలోపు సర్వీసు మిగిలి ఉన్న వారే. వీరిలో చాలా మంది ఇప్పటికే రిటైర్డ్ అయ్యారు. ఏడాది గడువున్న వారికి కూడా ఇప్పుడు అవకాశం రాదు.



మైక్‌ను విసిరేసి వెళ్లిపోతున్న మంత్రి హరీశ్‌రావు

హరీశ్‌కు కోపమొచ్చింది

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి వైఖరితో అసహనం
- కోపంతో మైక్ విసిరేసి వెళ్లిపోయిన వైనం

సాక్షి, జనగామ: తన ప్రసంగానికి మధ్యమధ్యలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి ఆటంకం కల్పించడంతో భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావుకు కోపం వచ్చింది. దీంతో ఇక తాను మాట్లాడలేనంటూ మైక్‌ను విసిరివేసి మధ్యలోనే వెళ్లిపోయారు. జనగామ జిల్లాలోని నర్మెట మండలం బొమ్మకూరులో నిర్మించిన జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం ఫేజ్–3 ద్వారా నిర్మించిన పంప్‌హౌస్‌ను మంత్రి హరీశ్‌రావు శనివారం సాయంత్రం ప్రారంభించారు. పంప్‌హౌస్ నుంచి కన్నెబోయినగూడెం, లద్నూరు, తపాస్‌పల్లి రిజర్వాయర్లకు నీటిని విడుదల చేశారు. అనంతరం బొమ్మకూరులో జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. హరీశ్ ప్రసంగం మొదలు పెట్టినప్పటి నుంచి ఎమ్మెల్యే చీటికిమాటికి పక్కనున్న వాళ్లను పిలుస్తూ మాట్లాడారు. ముత్తిరెడ్డి సభలో చేస్తున్న హడావుడిని గమనిస్తున్న మంత్రి.. ఒక్కసారిగా అసహనానికి గురయ్యారు. ఆయనవైపు చూస్తూ మాట్లాడవద్దని సైగ చేశారు. అయినప్పటికీ ముత్తిరెడ్డి సభకు దూరంగా ప్రజాప్రతినిధులను, పార్టీ శ్రేణులను పిలుస్తున్నారు. ముత్తిరెడ్డి వ్యవహారంతోపాటు పక్కనే ప్రారంభించిన పంప్‌హౌస్ మోటార్ల శబ్దంతో విసిగిపోయిన మంత్రి చేతిలోని మైక్‌ను విసిరివేశారు. వేదిక నుంచి బయటకు వెళ్తున్న హరీశ్‌రావును ఎమ్మెల్యే ఆపే ప్రయత్నిం చేసినప్పటికి ఆగకుండా వెళ్లిపోయారు.

జనాభా ప్రకారం బీసీలకు టికెట్లు

కాంగ్రెస్ ఓబీసీ సెల్ చైర్మన్ చిత్తరంజన్‌దాస్ డిమాండ్

స్టేషన్ మహబూబ్‌నగర్: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం కాంగ్రెస్ పార్టీ బీసీలకు తగినన్ని సీట్లు కేటాయించాలని, లేనిపక్షంలో నిరాహార దీక్ష చేస్తానని ఆ పార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ చిత్తరంజన్‌దాస్ అన్నారు. శనివారం మహబూబ్‌నగర్‌లో జరిగిన కాంగ్రెస్ ఓబీసీ సెల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి బలహీన వర్గాలు దూరమవుతున్నారన్న విషయాన్ని అధిష్టానం గుర్తించాలని కోరారు. పార్టీలో బీసీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని రాహుల్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

సామాజిక న్యాయమే ఎజెండా

సామాజిక న్యాయమే ఎజెండాగా కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళ్తోందని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఓబీసీ సెల్‌ను గ్రామస్థాయి వరకు పటిష్టం చేయాలని కోరారు. అన్ని జిల్లాల్లో ఓబీసీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. చివరగా రాష్ట్రస్థాయిలో ఓబీసీ సభ నిర్వహించి రాహుల్ గాంధీని ఆహ్వానిద్దామని చెప్పారు. ఏఐసీసీ కార్యదర్శి వి.హన్మంతరావు మాట్లాడుతూ బీసీలు 85 శాతం ఉండగా.. 15 శాతం జనాభా ఉన్న సామాజిక వర్గాల వారి చేతుల్లోనే రాజ్యాధికారం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా చట్టసభల్లో బలహీనవర్గాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

ప్రేమజంట బలవన్మరణం

- రైలు కిందపడి ఆత్మహత్య
- యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘటన



పూజిత



గణేశ్

రామన్నపేట (నకిరేకల్): తమ ప్రేమను పెద్దలు ఒప్పుకోకపోవడంతో కలసి ఉండలేమని భావించిన ఓ ప్రేమజంట రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట శివారులో శుక్రవారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం పల్లెపహాడ్ గ్రామానికి చెందిన చిరబోయిన గణేశ్ (22), అదేగ్రామానికి చెందిన పూజిత (16) ప్రేమించుకున్నారు. పూజిత అమ్మనబోలు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతుండగా, గణేశ్ ఇంటర్ పూర్తిచేసి లారీ డ్రైవర్ అయిన తండ్రి అయిలయ్యకి సహాయంగా ఉంటున్నాడు. ఇటీవలే తండ్రి సాయంతో కొత్తలారీని కొనుగోలు చేసి బాడీ పనులు చేయిస్తున్నాడు. కాగా, గత దసరా పండుగకు కొద్దిరోజుల ముందు గణేశ్, పూజితల ప్రేమ వ్యవహారం కుటుంబసభ్యులకు తెలిసింది. కులాలు వేరుకావడంతో ఇరువురి తల్లిదండ్రులు, కులపెద్దలు మందలించారు. ఈ క్రమంలో శుక్రవారం పూజిత స్కూలుకు వెళ్తానని చెప్పి ఇంటినుంచి బయలుదేరగా, గణేశ్ లారీవద్దకు వెళ్తానని తల్లికి చెప్పి బయటకు వెళ్లాడు. పూజిత స్కూల్‌కు వెళ్లలేదని సాయంత్రం తెలియడంతో బంధువుల ఇళ్లలో వెతికారు. ఎక్కడా ఆచూకీ తెలియకపోవడంతో తన కూతురును కిడ్నాప్ చేశారని తండ్రి బొంత శంకరయ్య అదే రోజు నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చిట్యాల మండలం వట్టిమర్తి శివారులోని సాయి బాబాగుడి సమీపంలో వీరు ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లారు. పోలీసుల రాకను గమనించి వారు అక్కడే బైక్‌తోపాటు బ్యాగును వదిలివెళ్లారు. ఆ రోజు రాత్రంతా వెతికినా దొరకలేదు. తమకోసం వెతుకుతున్నారని తెలుసుకున్న గణేశ్, పూజిత రామన్నపేట శివారులోని జేపీగార్డెన్స్ ఎదురుగా ఉన్న రైల్వేట్రాక్ మీద శుక్రవారం రాత్రి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. స్టేషన్ మాస్టర్ రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వేశాఖ ఎస్‌ఐ అచ్యుతం విలేకరులకు తెలిపారు.

మహిళలకు మరింత రక్షణ

నూతన విధానానికి సంగారెడ్డి పోలీసుల శ్రీకారం

- 'మై వెహికల్ ఈజ్ సేఫ్' పేరుతో ప్రత్యేక కార్యక్రమం
- ఆటోలకు బార్‌కోడ్‌తో కూడిన నంబర్ ప్లేట్లు
- స్మార్ట్ ఫోన్‌తో కోడ్ స్కాన్ చేస్తే డ్రైవర్ పూర్తి వివరాలు
- రాష్ట్రంలోనే మొదటిసారి ప్రయోగం



ప్రత్యేక కోడ్‌తో కూడిన ఆటోలను ప్రారంభిస్తున్న ఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి (ఫైల్)

సంగారెడ్డి క్రైం: ఆటోల్లో ప్రయాణించే వారి భద్రతకు, ముఖ్యంగా రాత్రిపూట ప్రయాణించే మహిళల రక్షణ కోసం సంగారెడ్డి జిల్లా పోలీసులు రాష్ట్రంలోనే మొదటిసారిగా ''మై వెహికల్ ఈజ్ సేఫ్''పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా జిల్లా పరిధిలోని ఆటోలన్నింటికీ ప్రత్యేకంగా ఓ బార్‌కోడ్ కేటాయించారు. స్మార్ట్‌ఫోన్‌తో ఆ బార్‌కోడ్‌ను స్కాన్ చేస్తే క్షణాల్లో డ్రైవర్‌కు సంబంధించిన వివరాలన్నీ ప్రత్యక్షమవుతాయి. ఆటో ఎక్కిన మరుక్షణమే కోడ్‌ను స్కాన్ చేసి ఆ వివరాలను కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు ఇలా ఎవరికైనా ముందు జాగ్రత్తగా పంపించుకోవచ్చు. దీని సాయంతో డ్రైవర్లు ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, నేరాలకు పాల్పడినా పోలీసులు వారిని సులువుగా గుర్తించి అదుపులోకి తీసుకునే వీలుంటుంది.

అక్రమాలు అరికట్టేందుకే..

ఆటోలో ప్రయాణించేటప్పుడు మీ వస్తువులు మర్చిపోయినా, మిమ్మల్ని వేధింపులకు గురిచేసినా, మీ పట్ల అసభ్యంగా ప్రవర్తించినా స్కాన్ చేసిన కోడ్ నుంచి వచ్చిన వివరాలతో పోలీసులకు ఫిర్యాదు చేయొచ్చు. జిల్లాలో మొత్తం 4,000 ఆటోలు ఉండగా పోలీసులు ఇప్పటికే 2,200 ఆటోల వివరాలను సేకరించారు. ఒక్క సంగారెడ్డి పట్టణంలోనే 1,600 ఆటోలను గుర్తించారు. వాటన్నింటికీ కోడ్‌తో కూడిన బోర్డులను అమర్చారు. ప్రయాణికులను చేరవేసే టాటా సుమోలు, తుపాన్‌లాంటి వాహనాలకు సైతం ఇదే విధానాన్ని అమలు చేసేందుకు పోలీసు యంత్రాంగం సన్నద్ధమవుతోంది.

స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు..

డ్రైవర్ సీటు వెనకాల 'మై వెహికల్ ఈజ్ సేఫ్'అనే క్యాప్షన్‌తో యూవీ ప్రింటెడ్ బోర్డు ఉంటుంది, దీనిపై ఆటో సీరియల్ నంబర్, ఆటో నంబర్, ఆటో డ్రైవర్ పేరు, అడ్రస్ ఉంటాయి. ఆటోలో ప్రయాణించే వారి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు. ప్లేస్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ప్రింటెడ్ బోర్డుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఆటో వివరాలతో పాటు, డ్రైవర్, ఓనర్ వివరాలు తెలుసుకోవచ్చు. దీని ద్వారా ఆటోడ్రైవర్ ఏదైనా దుశ్చర్యకు పాల్పడితే పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సౌకర్యంగా ఉంటుంది. దర్యాప్తులో పోలీసులకు ఈ సమాచారం ఉపయోగపడుతుంది.

ఆటోముందు, వెనుక కోడ్‌తో స్టిక్కర్లు

ఆటో ముందు అద్దానికి ఫ్రంట్ మిర్రర్ స్టిక్కర్ అతికిస్తారు. అలాగే ఆటో వెనుకాల సైతం ఓ స్టిక్కర్ ఉంటుంది. వీటిపై ఆటో సీరియల్ నంబర్, ఆటో నంబర్‌తో కూడిన క్యూఆర్ కోడ్ ఉంటాయి. ఆటోను ఎవరైనా నేరం చేయడానికి ఉపయోగిస్తే జిల్లా వ్యాప్తంగా ఉన్న సీసీ కెమెరాల ద్వారా గుర్తించి నేరానికి పాల్పడిన డ్రైవర్ వివరాలను సులువుగా గుర్తించవచ్చు.

సురక్షిత ప్రయాణానికి భరోసా



పోలీసులు చేపట్టిన ఈ చర్య ప్రయాణికులకు ఎంతో భరోసా కల్పిస్తుంది. గతంలో ఒంటరిగా ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వచ్చేది. ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ అందుబాటులో ఉన్న నేపథ్యంలో సురక్షితమైన ప్రయాణానికి ఈ విధానం ఉపయోగకరంగా ఉంటుంది.

–దేవవాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్, సంగారెడ్డి

Dwaraka



రెండో రౌండ్‌కు యూకీ బాంబ్రీ

ఏటీపీ మాస్టర్స్ టోర్నీ ఇండియన్ వెల్స్‌లో భారత ఆటగాడు యూకీ బాంబ్రీ రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. తొలి రౌండ్‌లో అతను నికోలస్ మహుత్ (ఫ్రాన్స్)పై 7–5, 6–3తో విజయం సాధించాడు. ఏటీపీ టూర్‌లో తొలిసారి వీరిద్దరు తలపడిన ఈ మ్యాచ్ గంట 41 నిమిషాల పాటు సాగింది. ఈ పోరులో బాంబ్రీ 3 ఏస్‌లు సంధించాడు. రెండో రౌండ్‌లో అతను ప్రపంచ 12వ ర్యాంకర్ ల్యూకాస్ పౌలీ (ఫ్రాన్స్) తలపడతాడు. తొలి రౌండ్‌లో ల్యూకాస్‌కు 'బై' లభించింది.

భళి భళి బంగ్లా



ముష్ఫికర్

చెలరేగిన ముష్ఫికర్, లిటన్ • శ్రీలంకపై భారీ లక్ష్య ఛేదన • అయిదు వికెట్లతో గెలుపు

బంతిని ఎక్కడ వేయాలో పాలుపోని బౌలర్లు...
వంతులవారీ హిట్టింగ్ అందుకున్న బ్యాట్స్‌మెన్...
అచ్చమైన టి20 మ్యాచ్‌ను తలపించిన ఆటతీరు...
ఓవర్‌కు పదికి తగ్గకుండా పరుగుల ప్రవాహం...
పోటాపోటీగా ఆడి లంకపై బంగ్లా జయభేరి...
మొత్తమ్మీద అభిమానులకు మజామజా...

కొలంబో: సాదాసీదాగా, చప్పగా సాగుతున్న నిదహస్ ముక్కోణపు టి20 టోర్నీలో ఓ మెరుపు మ్యాచ్. బ్యాట్స్‌మెన్ విజృంభణతో ప్రేక్షకులకు కనువిందు. ఫోర్లు, సిక్సర్ల హోరుతో మోతెక్కిన స్టేడియం. శనివారం ఇక్కడ జరిగిన భారీ స్కోర్ల మ్యాచ్‌లో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' ముష్ఫికర్ రహీమ్ (35 బంతుల్లో 72 నాటౌట్; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), లిటన్ దాస్ (19 బంతుల్లో 43; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు)ల వీరోచిత ఆటతో ఆతిథ్య శ్రీలంకపై బంగ్లాదేశ్ తమ జట్టు చరిత్రలో రికార్డు ఛేదన నమోదు చేసింది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక ఇన్నింగ్స్‌ను ఓపెనర్ కుశాల్ మెండిస్ (30 బంతుల్లో 57; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) ధాటిగా మొదలుపెట్టగా, మధ్యలో కుశాల్ పెరీరా (48 బంతుల్లో 74; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుతో నిలబెట్టాడు. చివర్లో తరంగ (15 బంతుల్లో 32; 4 ఫోర్లు, 1 సిక్స్) తనవంతు బాధ్యత పోషించాడు. దీంతో ఆతిథ్య జట్టు 20 ఓవర్లలో 6 వికెట్లకు 214 పరుగులు చేసింది. బంగ్లా బౌలర్లలో ముస్తఫిజుర్ (3/48) వికెట్లు పడగొట్టినా భారీగా పరుగులిచ్చాడు. మహ్ముదుల్లా (2/15) మాత్రమే ప్రత్యర్థిని కొంత కట్టడి చేయగలిగాడు. ఛేదనను బంగ్లా దీటుగా ఆరంభించింది. అనూహ్యంగా ఓపెనర్‌గా వచ్చిన లిటన్ ఆకాశమే హద్దుగా చెలరేగగా, తమీమ్ ఇక్బాల్ (29 బంతుల్లో 47; 6 ఫోర్లు, 1 సిక్స్) అతడికి అండగా నిలిచాడు. ముష్ఫికర్ ఒత్తిడిని చిత్తుచేస్తూ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో 19.4 ఓవర్లలో అయిదు వికెట్లు కోల్పోయి బంగ్లా 215 పరుగులు చేసి విజయాన్నందుకుంది. లంక బౌలర్లలో నువాన్ ప్రదీప్ (2/37) ఫర్వాలేదనిపించాడు. ప్రస్తుతం టోర్నీలో మూడు జట్లు ఒక్కో గెలుపుతో సమంగా ఉన్నాయి. సోమవారం జరిగే మ్యాచ్‌లో భారత్ శ్రీలంకతో తలపడుతుంది.



కుశాల్ పెరీరా

పరుగు'లంక'..

లంకకు ఓపెనర్లు గుణతిలక (19 బంతుల్లో 26; 3 ఫోర్లు, 1 సిక్స్), కుశాల్ మెండిస్ అదిరే ఆరంభాన్నిచ్చారు. వీరి జోరుతో 4వ ఓవర్లోనే జట్టు స్కోరు 50 దాటింది. వెంటనే గుణతిలక అవుటైనా, బంగ్లాకు కుశాల్ పెరీరా రూపంలో పెనుముప్పు ఎదురైంది. మొదట అతడు కుదురుకునేందుకు యత్నించడంతో పవర్ ప్లే అనంతరం మూడు ఓవర్లలో 16 పరుగులే వచ్చాయి. పదో ఓవర్ నుంచి ఇద్దరూ జోరు పెంచారు. ప్రత్యర్థి బౌలర్లు పదేపదే షార్ట్ పిచ్ బంతులేస్తూ గతి తప్పడంతో ఫోర్లు, సిక్స్‌లతో విరుచుకుపడ్డారు. 26 బంతుల్లో అర్ధశతకం పూర్తిచేసుకున్న మెండిస్... మహ్ముదుల్లా బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించి వెనుదిరిగాడు. హిట్టర్‌గా వచ్చిన షనక (0) రెండు బంతుల వ్యవధిలో అవుటయ్యాడు. మరుసటి ఓవర్లో పెరీరా అర్ధ శతకం (34 బంతుల్లో) పూర్తిచేసుకోగా చివరి బంతికి కెప్టెన్ చండిమాల్ (2) క్యాచ్ ఇచ్చాడు. ఈ దశలో తరంగ, పెరీరా బ్యాట్ ఝుళిపించారు. 25 బంతుల్లోనే 55 పరుగులు జత చేశారు. చివరి ఓవర్లో కుశాల్, తిసార (0)లను ముస్తఫిజుర్ పెవిలియన్‌కు పంపినా 16 పరుగులిచ్చాడు. ప్రధాన బౌలర్లు తస్కిన్ అహ్మద్, రూబెల్ హుస్సేన్, మెహదీ హసన్ భారీగా పరుగులివ్వడంతో కెప్టెన్ మహ్ముదుల్లా బౌలింగ్‌కు దిగాల్సి వచ్చింది. బంగ్లా తరపున మొత్తం ఏడుగురు ఆటగాళ్లు బౌలింగ్ చేయడం విశేషం.

లిటన్ చితక్కొట్టెన్... ముష్ఫికర్ ముగించెన్

బంగ్లా ఇన్నింగ్స్‌లో ముష్ఫికర్ టాప్ స్కోరరే అయినా... లిటన్ ఆట కూడా హైలైట్‌గా నిలిచింది. తామెప్పుడూ ఛేదించనంత లక్ష్యాన్ని అందుకోగలమని అతడు జట్టులో ఆత్మవిశ్వాసం నింపాడు. రెగ్యులర్ ఓపెనర్ సౌమ్య సర్కార్‌ను కాదని తనను ముందుగా పంపిన అవకాశాన్ని లిటన్ సద్వినియోగం చేసుకున్నాడు. లంక బౌలర్లపై విరుచుకుపడి పరుగులు సాధించాడు. ఓపెనర్లు ఎక్కడా తగ్గకపోవడంతో తొలి ఓవర్ నుంచే బంగ్లా 10 రన్‌రేట్‌తో పరుగులు చేసింది. లిటన్ వికెట్ కోల్పోయినా పవర్ ప్లే పూర్తయ్యేసరికి 74/1తో నిలిచింది. అప్పటికీ జోరు కొనసాగించిన తమీమ్‌ను తిసార పెరీరా తన బౌలింగ్‌లోనే క్యాచ్ పట్టి పెవిలియన్ చేర్చాడు. సౌమ్య సర్కార్ (22 బంతుల్లో 24; 2 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా ఆడలేకపోయాడు. కెప్టెన్ మహ్ముదుల్లా (20; 1 ఫోర్, 1 సిక్స్), షబ్బీర్ రెహ్మాన్ (0) వెంటవెంటనే అవుటైనా, చేయాల్సిన పరుగుల కంటే బంతులు తక్కువగా ఉన్నా ముష్ఫికర్ బెరుకు లేకుండా ఆడాడు. చివరి ఓవర్‌లో 9 పరుగులు చేయాల్సి ఉండగా... నాలుగు బంతుల్లోనే లాంఛనాన్ని ముగించాడు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: గుణతిలక (బి) ముస్తఫిజుర్ 26; కుశాల్ మెండిస్ (సి) షబ్బీర్ రహమాన్ (బి) మహ్ముదుల్లా 57; కుశాల్ పెరీరా (సి) ముష్ఫికర్ రహీం (బి) ముస్తఫిజుర్ 74; షనక (సి) షబ్బీర్ రహమాన్ (బి) మహ్ముదుల్లా 0; చండిమాల్ (సి) షబ్బీర్ రహమాన్ (బి) తస్కీన్ అహ్మద్ 2; తరంగ నాటౌట్ 32; తిసార పెరీరా (సి) ఇస్లాం (బి) ముస్తఫిజుర్ 0; జీవన్ మెండిస్ నాటౌట్ 6; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 214.**
వికెట్ల పతనం: 1–56, 2–141, 3–142, 4–150, 5–205, 6–206.
బౌలింగ్: తస్కీన్ అహ్మద్ 3–0–40–1, ముస్తఫిజుర్ 4–0–48–3, రూబెల్ 4–0–45–0, మెహదీ హసన్ మిరాజ్ 4–0–31–0, ఇస్లాం 2–0–20–0, సౌమ్య సర్కార్ 1–0–11–0, మహ్ముదుల్లా 2–0–15–2.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తమీమ్ ఇక్బాల్ (సి అండ్ బి) పెరీరా 47; లిటన్ దాస్ ఎల్బీడబ్ల్యూ (బి) నువాన్ ప్రదీప్ 43; సౌమ్య సర్కార్ (సి అండ్ బి) నువాన్ ప్రదీప్ 24; ముష్ఫికర్ రహీం నాటౌట్ 72; మహ్ముదుల్లా (సి) మెండిస్ (బి) చమీర 20; షబ్బీర్ రహమాన్ రనౌట్ 0; మెహదీ హసన్ మిరాజ్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (19.4 ఓవర్లలో 5 వికెట్లకు) 215.**
వికెట్ల పతనం: 1–74, 2–100, 3–151, 4–193, 5–197.
బౌలింగ్: చమీర 4–0–44–1, ధనంజయ 3–0–36–0, నువాన్ ప్రదీప్ 4–0–37–2, గుణతిలక 2–0–22–0, తిసార పెరీరా 3.4–0–36–1, జీవన్ మెండిస్ 2–0–25–0, షనక 1–0–12–0.

డివిలియర్స్ దూకుడు

దక్షిణాఫ్రికాకు ఆధిక్యం ◆ ఆస్ట్రేలియాతో రెండో టెస్టు



పోర్ట్ ఎలిజబెత్: ముగ్గురు ప్రధాన బ్యాట్స్‌మెన్ అర్ధసెంచరీలు సాధించడంతో ఆస్ట్రేలియాతో జరుగుతున్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికా ముందంజ వేసింది. మ్యాచ్ రెండో రోజు శనివారం ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తమ తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 263 పరుగులు చేసింది. ఫలితంగా ఆ జట్టు 20 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ఏబీ డివిలియర్స్ (81 బంతుల్లో 74 బ్యాటింగ్; 14 ఫోర్లు) తనదైన శైలిలో ధాటిని ప్రదర్శించగా... డీన్ ఎల్గర్ (57), హాషీం ఆమ్లా (56) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ప్రస్తుతం డివిలియర్స్‌తో పాటు ఫిలాండర్ (14 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నాడు.

ఓవర్‌నైట్ స్కోరు 39/1తో ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా కొద్ది సేపటికే నైట్‌వాచ్‌మన్ రబడ (29) వికెట్ కోల్పోయింది. ఈ దశలో ఎల్గర్, ఆమ్లా పట్టుదలగా ఆడారు. ఆసీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ 46.3 ఓవర్ల పాటు ఆడారు. వీరిద్దరు మూడో వికెట్‌కు 88 పరుగులు జోడించిన అనంతరం ఆస్ట్రేలియా బౌలర్లు రివర్స్ స్వింగ్‌తో దెబ్బ కొట్టారు. ఒకే స్కోరు వద్ద ఆమ్లా, ఎల్గర్‌లను ఔట్ చేసిన ఆసీస్... వెంటవెంటనే డు ప్లెసిస్ (9), బ్రుయిన్ (1), డి కాక్ (9)లను పెవిలియన్ పంపించి పట్టు బిగించే ప్రయత్నం చేసింది. అయితే ఎదురుదాడికి దిగిన డివిలియర్స్ బౌండరీలతో విరుచుకుపడి తమ జట్టుకు ఆధిక్యం అందించాడు.

రబడపై నిషేధం!

తొలి ఇన్నింగ్స్‌లో అద్భుత బౌలింగ్‌తో ఆస్ట్రేలియాను కట్టడి చేసిన దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబడ సిరీస్‌కు దూరమయ్యే ప్రమాదం కనిపిస్తోంది. మ్యాచ్ తొలి రోజు స్మిత్‌ను అవుట్ చేసిన సమయంలో సంబరంగా ముందుకు దూసుకొచ్చిన రబడ అతని భుజాన్ని బలంగా ఢీకొట్టాడు. దీనిపై ఫీల్డ్ అంపైర్లు క్రిస్ గాఫ్నీ, కుమార ధర్మసేన రిఫరీకి ఫిర్యాదు చేశారు. ప్రత్యర్థి ఆటగాడిని తాకినందుకు రబడపై లెవల్ 2 ఆరోపణ నమోదైంది. ఇది రుజువైతే రబడకు 3 డీమెరిట్ పాయింట్ల శిక్ష పడుతుంది. గత ఏడాది ఫిబ్రవరి నుంచి వేర్వేరు సందర్భాల్లో డిక్‌వెలా, స్టోక్స్, ధావన్‌లతో గొడవపడిన రబడ ఖాతాలో ఇప్పటికే 5 డీమెరిట్ పాయింట్లు ఉన్నాయి. గతంలోనే 4 డీమెరిట్ పాయింట్లకు చేరినప్పుడు రబడ ఒక టెస్టు నిషేధం ఎదుర్కొన్నాడు. ఒకసారి శిక్ష ఎదుర్కొన్న తర్వాత కూడా డీమెరిట్ పాయింట్లు 24 నెలల పాటు ఆటగాడి ఖాతాలోనే ఉంటాయి. ఇప్పుడు పోర్ట్ ఎలిజబెత్ టెస్టులో రబడ తప్పు చేసినట్లు తేలితే మొత్తం పాయింట్లు 8కి చేరుకొని నిబంధనల ప్రకారం రెండు టెస్టుల నిషేధం పడుతుంది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య మరో రెండు టెస్టులు జరగాల్సి ఉన్న నేపథ్యంలో అతను శిక్షకు గురైతే సఫారీ టీమ్ తీవ్రంగా నష్టపోక తప్పదు. ఈ నేపథ్యంలో స్మిత్‌ను కావాలని ఢీకొట్టలేదని, అది పొరపాటున జరిగిన ఘటన మాత్రమే అని చెబుతూ దక్షిణాఫ్రికా మేనేజ్‌మెంట్ రబడపై ఫిర్యాదును సవాల్ చేయాలని నిర్ణయించింది. దీనిపై రబడను ఆదివారం రిఫరీ విచారిస్తారు.

విజయంతో ముగించారు

అజ్లాన్‌షా కప్ హాకీ టోర్నమెంట్



ఇఫో (మలేసియా): సుల్తాన్ అజ్లాన్‌షా కప్ హాకీ టోర్నీలో భారత్ పోరాటం ముగిసింది. గత మ్యాచ్‌లో బలహీన ప్రత్యర్థి ఐర్లాండ్ చేతిలో దిబ్బతిన్న సర్దార్‌సింగ్ సేన శనివారం అదే జట్టును 4–1తో చిత్తుచేసి ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. భారత జట్టు తరపున వరుణ్ కుమార్ (5వ, 32వ నిమిషం) రెండు గోల్స్, శైలానంద్ లక్డా (28వ నిమిషం), గుర్జాంత్ సింగ్ (37వ నిమిషం) చెరో గోల్ చేశారు. ప్రత్యర్థి జట్టులో జూలియన్ డాలె (48వ నిమిషం) ఏకైక గోల్ సాధించాడు. ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన సర్దార్ సింగ్ సేన మ్యాచ్ ఆసాంతం పైచేయి కొనసాగించింది. ఐదో నిమిషంలో వచ్చిన రెండు పెనాల్టీ కార్నర్ అవకాశాల్లో మొదటిది వృథా కాగా... రెండో దాన్ని వరుణ్ కుమార్ గోల్‌గా మలిచి భారత్‌కు శుభారంభం అందించాడు. ఆ తర్వాత కూడా దాడులు కొనసాగించిన మన ఆటగాళ్లు మరో మూడు గోల్స్‌తో తిరుగులేని ఆధిక్యాన్ని సాధించారు. చివరి క్వార్టర్‌లో ప్రత్యర్థి ఓ గోల్ కొట్టినా ఆధిక్యం తగ్గించడం తప్ప అది జట్టుకు ఉపయోగపడలేదు. సర్దార్ సింగ్ సారథ్యంలో ఈ టోర్నీలో భారత్ తొలిసారి రిక్తహస్తాలతో వెనుదిరిగింది. అతడి కెప్టెన్సీలో 2008లో రజతం, 2015, 2016లో కాంస్య, రజతాలు గెలుచుకుంది.

పేస్‌కు అవకాశం!

నేడు భారత డేవిస్ కప్ జట్టు ఎంపిక



న్యూఢిల్లీ: భారత వెటరన్ టెన్నిస్ స్టార్ లియాండర్ పేస్‌కు మళ్లీ డేవిస్ కప్ ఆడే అవకాశం ఇస్తారో లేదో నేడు తేలనుంది. వచ్చే నెల చైనాతో జరిగే పోరు కోసం భారత డేవిస్ జట్టును ఆదివారం ఎంపిక చేయనున్నారు. ఈ సెలక్షన్స్‌లో పేస్ పేరును పరిశీలిస్తామని అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ) వర్గాలు పేర్కొన్నాయి. 'కెనడాతో జరిగిన డేవిస్ పోరులో డబుల్స్‌లో భారత జోడీ గెలిచి ఉంటే వరల్డ్ గ్రూప్‌కు అర్హత సాధించే అవకాశముండేది. అదే లియాండర్ పేస్ ఉండి ఉంటే ఫలితం మరోలా ఉండేది' అని ఏఐటీఏ ఉన్నతాధికారి ఒకరు అన్నారు. అయితే నాన్ ప్లేయింగ్ కెప్టెన్ మహేశ్ భూపతి, డబుల్స్ ఆటగాడు రోహన్ బోపన్నలతో పేస్‌కు సఖ్యత లేనపుడు ఇదెలా సాధ్యమని విలేకర్లు ప్రశ్నించగా... ముందు వ్యక్తిగత విబేధాలు పక్కనబెట్టాలని, దేశ ప్రయోజనాలనే చూడాలని సమాధానమిచ్చారు. గత ఏప్రిల్‌లో ఉజ్బెకిస్తాన్‌తో జరిగిన డేవిస్ కప్ ఆసియా ఓసియానియా గ్రూప్–1 పోరుకు కూడా పేస్‌ను దూరంగా ఉంచారు. దుబాయ్‌లో జరిగిన ఏటీపీ టోర్నీలో రన్నరప్‌గా నిలవడంతో లియాండర్ పేస్ డబుల్స్ ర్యాంకుల్లో మళ్లీ టాప్–50లోకి వచ్చాడు.

అఫ్గాన్ చివరకు గెలిచింది



నబీ

బులవాయో: ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో అఫ్గానిస్తాన్ తమ చివరి లీగ్ మ్యాచ్‌లో నేపాల్‌పై 6 వికెట్లతో గెలిచింది. ఇక ఆ జట్టు సూపర్‌సిక్స్ అవకాశాలు ఇతర జట్ల జయాపజయాలపై ఆధారపడి ఉన్నాయి. హాంకాంగ్‌తో నేడు (ఆదివారం) జరిగే పోరులో నేపాల్ గెలిస్తేనే అఫ్గానిస్తాన్ సూపర్ సిక్స్‌కు చేరుతుంది. ఒక వేళ ఓడితే గెలిచిన హాంకాంగ్ జట్టే ముందంజ వేస్తుంది. శనివారం జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన నేపాల్ 49.5 ఓవర్లలో 194 పరుగుల వద్ద ఆలౌటైంది. పారస్ ఖడ్కా (75; 10 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' మొహమ్మద్ నబీ 4 వికెట్లు పడగొట్టారు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన అఫ్గానిస్తాన్ 38.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగులు చేసి గెలిచింది. నజీబుల్లా జద్రాన్ (52; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధసెంచరీ చేశాడు. నేపాల్ బౌలర్ దీపేంద్ర సింగ్ ఐరి 2 వికెట్లు తీశాడు. మిగతా మ్యాచ్‌ల్లో వెస్టిండీస్ 52 పరుగుల తేడాతో ఐర్లాండ్‌పై గెలుపొందగా, నెదర్లాండ్స్ 57 పరుగుల తేడాతో పపువా న్యూగినియాపై నెగ్గింది. ఆతిథ్య జింబాబ్వే 89 పరుగుల తేడాతో హాంకాంగ్‌పై ఘనవిజయం సాధించింది.

భారత 'ఎ' జట్టులో కల్పన, మేఘన

విజయవాడ స్పోర్ట్స్: ఇంగ్లండ్ జట్టుతో జరిగే రెండు టి20 మ్యాచ్‌ల్లో పాల్గొనే భారత 'ఎ' మహిళల జట్టుకు విజయవాడ అమ్మాయిలు ఆర్. కల్పన, ఎస్. మేఘన ఎంపికయ్యారు. మేఘన ఆంధ్ర జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తుండగా, కల్పన రైల్వేస్ నుంచి ఎంపికైంది. ముంబైలో ఈనెల 19, 20 తేదీల్లో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి. ఇంగ్లండ్ జట్టు భారత్‌లో పర్యటిస్తోన్న నేపథ్యంలో ప్రాక్టీస్ కోసం భారత 'ఎ' జట్టుతో రెండు ప్రాక్టీస్ మ్యాచ్‌లను నిర్వహిస్తున్నారు. బరోడాలో భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ప్రధాన మ్యాచ్‌లు జరుగనున్నాయి.

బెయిర్ స్టో మెరుపు సెంచరీ

- న్యూజిలాండ్‌పై 7 వికెట్లతో ఇంగ్లండ్ విజయం
- 3–2తో సిరీస్ సొంతం

క్రైస్ట్‌చర్చ్: ఓపెనర్ జానీ బెయిర్ స్టో (60 బంతుల్లో 104; 9 ఫోర్లు, 6 సిక్స్‌లు) సూపర్ సెంచరీ సాయంతో న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను ఇంగ్లండ్ 3–2తో చేజిక్కించుకుంది. శనివారం ఇక్కడ జరిగిన నిర్ణాయక ఐదో వన్డేలో ఇంగ్లండ్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట న్యూజిలాండ్ 49.5 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌట్ కాగా... అనంతరం 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' బెయిర్ స్టో చెలరేగడంతో ఇంగ్లండ్ 32.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 229 పరుగులు చేసి గెలుపొందింది.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కివీస్‌కు శుభారంభం దక్కలేదు. గత మ్యాచ్‌లో భారీ శతకంతో కివీస్‌ను గెలిపించిన రాస్ టేలర్ ఫిట్‌నెస్ సమస్యలతో ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. ఓపెనర్ మున్రో (0) ఖాతా తెరవకుండానే వోక్స్ (3/32)కు చిక్కాడు. ఓ వైపు గప్టిల్ (47; 3 ఫోర్లు, 1 సిక్స్) పోరాడినా... కెప్టెన్ విలియమ్సన్ (14), లాథమ్ (10), చాప్‌మన్ (0) నిరాశపరచడంతో కివీస్ 93 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. ఆ దశలో నికోల్స్ (55; 1 ఫోర్, 1 సిక్స్), సాన్‌ట్నర్ (67; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆదుకోవడంతో చివరకు 223 పరుగులు చేయగలిగింది. ప్రత్యర్థి బౌలర్లలో రషీద్ 3, కరన్ 2 వికెట్లు పడగొట్టారు. ఆ తర్వాత సునాయాస లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలో దిగిన ఇంగ్లండ్‌కు బెయిర్ స్టో, హేల్స్ (61; 9 ఫోర్లు) అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 20.2 ఓవర్లలో 155 పరుగులు జోడించారు. ఈ క్రమంలో బెయిర్ స్టో 58 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇంగ్లండ్ తరపున ఇది మూడో వేగవంతమైన శతకం. అనంతరం ఓపెనర్లతో పాటు మోర్గాన్ (8) వెనుదిరిగినా... జో రూట్ (23 నాటౌట్; 1 ఫోర్), స్టోక్స్ (26 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) జట్టును విజయ తీరాలకు చేర్చారు. వోక్స్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' అవార్డు దక్కింది.



ట్రోఫీతో ఇంగ్లండ్ జట్టు


ప్రస్తుతం దక్షిణ కొరియాలో జరుగుతున్న వింటర్ పారా ఒలింపిక్స్ మార్చి 9న ప్రారంభమయ్యాయి.. 18న ముగుస్తాయి.



కళ్ల సమస్యలకు చెక్!



కళ్ల సమస్యలు వచ్చినా... అక్షరాలు లేదా వస్తువులు సరిగా కనిపించకపోయినా డాక్టర్ కళ్ల జోడు వాడాలని సూచిస్తారు. వాటివల్ల కంటి సమస్యలు పూర్తిగా పరిష్కారం అవుతాయని కాదు.. కాస్త ఉపశమనం కలుగుతుంది అంతే. కాటరాక్ట్ శస్త్రచికిత్స కానీ లెన్స్ వాడటం వల్ల, లేజర్ చికిత్స వల్ల కాస్త కంటి సమస్యలను నయం చేసుకోవచ్చు. అయితే వీటన్నింటి సాయం అవసరం లేకుండానే కంటి చుక్కల మందు సాయంతో సమస్యలకు చెక్ పెట్టొచ్చని చెబుతున్నారు ఇజ్రాయెల్‌కు చెందిన శాస్త్రవేత్తలు. అంతేకాదు ఉన్న సమస్యలను కూడా తగ్గించవచ్చని పేర్కొంటున్నారు. ఇందుకోసం తాము ఓ ప్రత్యేకమైన కంటి చుక్కల మందు తయారు చేసినట్లు ఇజ్రాయెల్ టెల్ అవీవ్‌లోని బార్ ఇలాన్ యూనివర్సిటీకి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నానోటెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ శాస్త్రవేత్తలు. తామే తయారు చేసిన చుక్కల మందుతో కంటి చూపును మెరుగుపరుచుకోవచ్చిన స్పష్టం చేస్తున్నారు. 'రిఫ్రాక్టరీ సమస్యలను సరిచేసేందుకు తాము ఓ వినూత్న పద్ధతిని కనుగొన్నాం' అని కంటి వైద్య నిపుణుడు డా.డేవిడ్ స్మద్జ తెలిపారు. ఈ మందు వేసిన పందుల కార్నియా సమస్యలు చాలా వరకు తొలగిపోయాయని తమ పరిశోధనల్లో తేలినట్లు చెప్పారు. దూరదృష్టి, హ్రస్వ దృష్టి సమస్యలు తొలగిపోయాయని వివరించారు. అయితే మానవులపై వచ్చే నెలలో క్లినికల్ ట్రయల్స్ చేయాల్సి ఉందని చెప్పారు. అంటే ఇది ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చేందుకు మరింత సమయం పట్టే అవకాశాలున్నాయి మరి!



యువత 'మెదడు' చిట్లుతోంది

రాష్ట్రంలో పెరుగుతున్న మెదడులో రక్తస్రావం కేసులు

- రోగుల్లో 13 శాతం మంది యువతే
- ఆరోగ్యశ్రీ నివేదికలో వెల్లడి
- అధిక రక్తపోటు, మారుతున్న జీవనశైలే కారణం

సాక్షి, హైదరాబాద్: మారుతున్న జీవనశైలి, పెరుగుతున్న మానసిక ఒత్తిళ్లు కొత్త రోగాలకు కారణమవుతున్నాయి. వయసుతో నిమిత్తం లేకుండా అందరికీ ఆరోగ్య సమస్యలు సృష్టిస్తున్నాయి. ఇప్పటి వరకు 50 ఏళ్లు దాటిన వారిలో కనిపించే మెదడులో రక్తస్రావం సమస్య ఇప్పుడు యువకులనూ బాధిస్తోంది. భరించలేని తలనొప్పితో మొదలయ్యే ఈ సమస్య మనిషిని పూర్తిగా నిశ్చేష్టులుగా మార్చి స్పృహ కోల్పోయేలా చేస్తోంది. సకాలం లో చికిత్స అందిస్తేగానీ మళ్లీ సాధారణ స్థితికి రావడం కష్టంగా మారుతోంది. మెదడులో రక్తస్రావం కేసులు రాష్ట్రవ్యాప్తంగా పెరుగుతున్నట్లు ఆరోగ్యశ్రీ తాజా నివేదికలో వెల్లడైంది. ముఖ్యంగా ఈ సమస్యతో బాధపడుతున్న యువకుల సంఖ్య ప్రమాదకరంగా పెరుగుతున్నట్లు నివేదిక చెబుతోంది. బాధితుల్లో 35 ఏళ్లలోపు వారే 13 శాతం ఉన్నట్లు వెల్లడైంది. ఇవి కేవలం ఆరోగ్యశ్రీ పరిధిలోని చికిత్సల లెక్కలే. రాష్ట్రవ్యాప్తంగా నమోదవుతున్న కేసుల సంఖ్య దీనికి రెండింతలుగా ఉంది.

కారణాలేంటి..?

అధిక రక్తపోటు, నిద్రలేమి, మానసిక ఒత్తిళ్లు, రహదారి ప్రమాదాలు, పుట్టుకతోనే రక్త నాళాల్లో సమస్యలు, మోతాదుకు మించి గర్భనిరోధక మాత్రల వినియోగం మెదడు రక్తస్రావానికి కారణమవుతున్నాయి. రక్తపోటు అదుపుతప్పినప్పుడు మెదడులో నాళాలు చిట్లి మెదడు పైభాగంలో రక్తస్రావం అవుతుంది.

పరిణామాలేంటి..?

మెదడు నుంచి బయటకొచ్చిన రక్తం గడ్డకట్టి మెదడు పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. శరీరం అదుపుతప్పి రోగికి తల తిరిగినట్లు అవుతుంది. శరీరం పట్టు కోల్పోతుంది. భరించలేనంత తలనొప్పితో వాంతులు అవుతాయి. మూర్ఛపోవడం, పక్షవాతం వంటి లక్షణాలతో స్పృహ కోల్పోవడం జరుగుతుంది. ఇలా అన్ని రకాల సమస్యలతో కోమాలోకి జారుకుంటారు.


అధిక రక్తపోటు వల్లే..

అధిక రక్తపోటు కారణంగానే మెదడులో రక్తస్రావం జరుగుతుంది. రక్తస్రావమైన 3 గంటల్లో చికిత్స అందిస్తే ఫలితం ఉంటుంది. రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయమైన సందర్భాల్లో ప్రాణాపాయం ఎక్కువగా ఉంటుంది. రోగి ఎప్పుడు సాధారణ స్థితికి చేరుకుంటారో చెప్పడంకష్టం.

– డాక్టర్ బోడకుంట్ల ప్రభాకర్, న్యూరోసర్జన్, వరంగల్

ఆరోగ్యశ్రీ నివేదిక ప్రకారం మెదడు రక్తస్రావం శస్త్ర చికిత్సలు

ఏడాది	చికిత్సలు
2014-15	1,444
2015-16	1,608
2016-17	1,766
2017-18	1,892



ఏఈ.. అంతా అయోమయమోయీ..

- ట్రాన్స్‌కో పోస్టుల భర్తీలో గందరగోళం
- స్థానికేతరులంటూ పెద్ద సంఖ్యలో దరఖాస్తుల తిరస్కరణ
- రాష్ట్ర అభ్యర్థులకు అందని హాల్‌టికెట్లు
- తెలంగాణవాసులైనా వేర్వేరు ప్రాంతాల్లో చదువులే కారణం
- ఫిర్యాదు చేసిన వారికే ప్రత్యేకంగా హాల్‌టికెట్ల జారీ
- పరీక్ష నేడే.. కొందరికి ఇంకా అందని హాల్‌టికెట్లు



సాక్షి, హైదరాబాద్: నల్లగొండ జిల్లాకు చెందిన ఇ.ఉదయ్‌కుమార్.. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సరఫరా సంస్థ (ట్రాన్స్‌కో)లో అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) పోస్టుకు దరఖాస్తు చేసుకున్నాడు. తండ్రి ఆర్మీలో పని చేయడంతో 1 నుంచి 4వ తరగతి వరకు జైపూర్ (రాజస్తాన్), 5 నుంచి 7వ తరగతి వరకు నాసిక్ (మహారాష్ట్ర), 8, 9 తరగతులను దారంగద్ర(గుజరాత్), 10వ తరగతిని తిన్‌సూకియా (అస్సాం)లో చదువుకున్నాడు. ఇంటర్, ఇంజనీరింగ్‌ను హైదరాబాద్‌లో పూర్తి చేశాడు. స్థానికేతరుడు అన్న కారణంతో ట్రాన్స్‌కో యాజమాన్యం ఇతడికి ఏఈ పోస్టు రాత పరీక్ష కోసం హాల్‌టికెట్ జారీ చేయలేదు. దీంతో ఉదయ్‌కుమార్ ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్ రావును కలిసి మొరపెట్టుకోగా, దరఖాస్తును పునఃపరిశీలన జరిపించి అతడికి ప్రత్యేకంగా హాల్‌టికెట్ ఇప్పించారు. ఇలా అర్హతలున్నా హాల్‌టికెట్ అందుకోని అభ్యర్థులు ట్రాన్స్‌కో యాజమాన్యాన్ని సంప్రదించని కారణంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది.

దరఖాస్తులు తీసుకుని..

ట్రాన్స్‌కోలో 330 ఏఈ పోస్టుల భర్తీకి ఆదివారం రాత పరీక్ష జరగనుండగా.. కొందరు అభ్యర్థులకు హాల్‌టికెట్లు జారీ కాలేదు. స్థానికేతరులనే కారణంతో పెద్ద సంఖ్యలో అభ్యర్థుల దరఖాస్తులను తిరస్కరించిన సంస్థ యాజమాన్యం.. మరికొందరు అభ్యర్థుల విషయంలో ఇటు దరఖాస్తులు తిరస్కరించకుండా అటు హాల్‌టికెట్లు జారీ చేయకుండా అయోమయంలో పడేసింది. 250 ఏఈ (ఎలక్ట్రికల్), 31 ఏఈ (టెలికం), 49 ఏఈ (సివిల్) పోస్టుల భర్తీకి సంస్థ యాజమాన్యం గత డిసెంబర్ 28న నోటిఫికేషన్ జారీ చేయగా, వేలాది మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఉద్యోగ నియామకాల్లో ఓపెన్ కేటగిరీ కింద 20 శాతం పోస్టులకు దేశ పౌరులెవరైనా అర్హులని రిజర్వేషన్ల నిబంధనలు పేర్కొంటుండగా, ట్రాన్స్‌కో ఏఈ పోస్టులకు కేవలం తెలంగాణ స్థానికత ఉన్న అభ్యర్థులే అర్హులని ఉద్యోగ నియామక ప్రకటనలోనే సంస్థ యాజమాన్యం స్పష్టం చేసింది. తెలంగాణ స్థానికత ఉన్న అభ్యర్థుల నుంచే దరఖాస్తులు స్వీకరించింది. తెలంగాణ ప్రాంత అభ్యర్థులమంటూ పేర్కొని దరఖాస్తు చేసుకున్న రాష్ట్రేతర అభ్యర్థుల దరఖాస్తులను తిరస్కరించింది. ఈ క్రమంలో తెలంగాణ ప్రాంతవాసులైనప్పటికీ తల్లిదండ్రుల ఉద్యోగాల రీత్యా దేశంలోని వివిధ ప్రాంతాల్లో చదువుకున్న అభ్యర్థుల దరఖాస్తులు కూడా తిరస్కరణకు గురైనట్లు సమాచారం. మాజీ సైనికోద్యోగుల పిల్లల దరఖాస్తులు వీటిలో ఉన్నాయి. ఇలా హాల్‌టికెట్లు అందని పలువురు అభ్యర్థులు శుక్ర, శనివారాల్లో ట్రాన్స్‌కో అధికారుల వద్ద మొరపెట్టుకున్నారు. వీరి దరఖాస్తులను పునఃపరిశీలించిన సంస్థ యాజమాన్యం అర్హులైన అభ్యర్థులకు అప్పటికప్పుడు ప్రత్యేక హాల్‌టికెట్లు జారీ చేసింది.

ఏపీ అభ్యర్థులకు హాల్‌టికెట్లు ఇవ్వలేదు: శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో జేఎండీ

తెలంగాణ స్థానికత ఉన్న అభ్యర్థులకే హాల్‌టికెట్లు జారీ చేశాం. ఏపీ అభ్యర్థులకు హాల్‌టికెట్లు రావు. తెలంగాణ మాజీ సైనికోద్యోగుల పిల్లలకు శనివారం హాల్‌టికెట్లు ఇచ్చాం. అర్హులందరికీ హాల్‌టికెట్లు వచ్చాయి.

330 పోస్టులకు 68,171 మంది పోటీ

రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగ సమస్యకు తెలంగాణ ట్రాన్స్‌కోలో ఏఈ పోస్టుల భర్తీకి వచ్చిన స్పందన అద్దం పడుతోంది. ట్రాన్స్‌కోలో 330 ఏఈ పోస్టులకు 68,171 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. ఎలక్ట్రికల్ విభాగంలో 250 పోస్టులకు గాను 37,732 మంది, టెలికం విభాగంలో 31 పోస్టులకు 18,616 మంది, సివిల్ విభాగంలో 49 పోస్టులకు గాను 11,823 మంది అభ్యర్థులు ఆదివారం జరిగే రాత పరీక్షకు హాజరు కానున్నారని ట్రాన్స్‌కో వర్గాలు తెలిపాయి.



ఎయిర్‌పోర్టులో మహిళల పరిశుభ్రత గదుల్లో ఏర్పాటు చేసిన శానిటరీ న్యాప్‌కిన్ వెండింగ్ యంత్రాలు

మహిళల కోసం ప్రత్యేక వెండింగ్ యంత్రాలు

శంషాబాద్: ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా శంషాబాద్ విమానాశ్రయంలో మహిళా ప్రయాణికుల సౌకర్యార్థం శానిటరీ న్యాప్‌కిన్ వెండింగ్ యంత్రాలను ఏర్పాటు చేశారు. 'ప్యాసింజర్ ప్రైమ్'అనే విధానంలో వీటిని ఏర్పాటు చేసినట్టు ఎయిర్‌పోర్టు అధికారులు వెల్లడించారు. రుతుస్రావం సమయంలో మహిళా ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కోకుండా మొత్తం 26 పరిశుభ్రత గదుల్లో యంత్రాలను అందుబాటులో ఉంచామన్నారు. వెండింగ్ మిషన్‌లో రూ.5 వేస్తే ఒక న్యాప్‌కిన్ వస్తుందన్నారు. అంతే కాకుండా వినియోగించిన న్యాప్‌కిన్ల డిస్పోజబుల్ యంత్రాలు కూడా ఏర్పాటు చేశామని తెలిపారు.

'సాగునీటి'కి మరో భారీ కార్పొరేషన్!

- తెలంగాణ వాటర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ పేరిట ఏర్పాటుకు సర్కారు నిర్ణయం
- సాగునీటి పథకాలకు వేగంగా నిధుల సమీకరణే లక్ష్యం
- దేవాదుల, తుపాకులగూడెం, సీతారామ, వరద కాల్వల ప్రాజెక్టులకు కలిపి..
- సుమారు రూ.20 వేల కోట్ల రుణాలు తీసుకునేందుకు కార్యాచరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన నిధుల సేకరణ కోసం మరో భారీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దేవాదుల, తుపాకులగూడెం, సీతారామ, వరద కాల్వ ప్రాజెక్టులకు కలిపి సంయుక్తంగా 'తెలంగాణ రాష్ట్ర వాటర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (టీఎస్‌డబ్ల్యుఐసీ)'పేరిట కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం గోదావరి నదిని సద్వినియోగం చేసుకొనేలా చేపట్టిన ప్రాజెక్టులకు భారీగా నిధులు అవసరమవుతున్న విషయం తెలిసిందే. దీంతో నిధుల సమీకరణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తోంది. దీనివల్ల వివిధ రుణ సంస్థలు, బ్యాంకుల నుంచి అవసరమైన మేరకు రుణాలు తెచ్చుకునేందుకు వీలు కలుగుతుంది. ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టు కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయగా... తాజాగా మరో నాలుగు ప్రాజెక్టులకు కలిపి సంయుక్తంగా కార్పొరేషన్ ఏర్పాటుకు నీటి పారుదల శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. బడ్జెట్ సమావేశాలకు ముందు జరిగే కేబినెట్ భేటీలో దీనికి ఆమోదం తెలిపే అవకాశమున్నట్లు ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తోంది.

ఇప్పటికే రూ.25 వేల కోట్లు

కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం 'కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ (కేఐపీసీ)'ను ఏర్పాటు చేసింది. ఆ కార్పొరేషన్ ద్వారా మూడు విడతల్లో రుణ సమీకరణ చేసింది. ఆంధ్రాబ్యాంకు, విజయా బ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంకుల ద్వారా మొత్తంగా రూ.24,780 కోట్ల రుణాలకు ఒప్పందాలు కుదరగా.. ఇప్పటికే రూ.6,299 కోట్ల మేర ఖర్చు చేశారు కూడా. తాజాగా దేవాదుల, తుపాకులగూడెం, సీతారామ, వరద కాల్వ ప్రాజెక్టులను కూడా శరవేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రాజెక్టుల వ్యయాలు పెరగడంతో..

6.21 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వాలనే లక్ష్యంతో రూ.9,423 కోట్లతో దేవాదుల ప్రాజెక్టును చేపట్టారు. అయితే ప్రాజెక్టుకు నీటి కేటాయింపులు పెంచడంతో.. అంచనా వ్యయం రూ. 13,445.44 కోట్లకు పెరిగింది. ఇప్పటివరకు రూ.8,800 కోట్ల వరకు ఖర్చు చేయగా.. మరో రూ.4,700 కోట్ల మేర నిధులు అవసరం కానున్నాయి. దీనికితోడు ఇటీవలే ప్రాజెక్టు పరిధిలో అదనపు నీటి నిల్వ కోసం కొత్త రిజర్వాయర్‌ను ప్రతిపాదించారు. 10.78 టీఎంసీల సామర్థ్యంతో రూ.3,300 కోట్లతో వరంగల్ జిల్లా ఘణపూర్ మండలం లింగంపల్లి వద్ద దాన్ని నిర్మించేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. అంటే దేవాదుల పూర్తికే రూ.8 వేల కోట్ల వరకు అవసరం కానున్నాయి. ఇక దేవాదుల దిగువన తుపాకులగూడెం బ్యారేజీని రూ.2,121 కోట్లతో చేపట్టగా.. మరో రూ.1,900 కోట్లు అవసరం. ఈ రెండు ప్రాజెక్టులకు రూ.10 వేల కోట్ల మేర అవసరంకాగా.. రూ.5 వేల కోట్ల నుంచి రూ.7 వేల కోట్ల వరకు సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

రీఇంజనీరింగ్‌తో..

ఉమ్మడి ఖమ్మం జిల్లా సాగునీటి అవసరాలను తీర్చే సీతారామ ఎత్తిపోతల పథకాన్ని రీఇంజనీరింగ్ చేయడంతో.. అంచనా వ్యయం రూ.7,926 కోట్ల నుంచి రూ.13,384 కోట్లకు పెరుగుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టు పరిధిలో రూ.220 కోట్ల విలువైన పనులు మాత్రమే పూర్తయ్యాయి. వచ్చే రెండేళ్లలో కనీసం రూ.7 వేల కోట్ల మేర పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అంటే ఈ ప్రాజెక్టుకు ఏటా రూ.3,500 కోట్లు అవసరం. దీంతో ఈ ప్రాజెక్టునూ కార్పొరేషన్ పరిధిలోకి తెచ్చి.. రూ.8 వేల కోట్ల మేర రుణం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇక వరద కాల్వ పనులను రూ.9,886 కోట్ల అంచనాతో చేపట్టగా.. ఇప్పటివరకు రూ.5,323 కోట్లు ఖర్చు చేశారు. మరో రూ.4,500 కోట్లు అవసరం కావడంతో దీన్ని కూడా కార్పొరేషన్ పరిధిలోకి చేర్చారు. మొత్తంగా నాలుగు ప్రాజెక్టులకు కలిపి రూ.20 వేల కోట్ల వరకు రుణాలను తీసుకోనున్నారు.

దండయాత్ర.. ఇది దోమల దండయాత్ర!



రాష్ట్ర రాజధానిలో నరకం చూపిస్తున్న దోమలు

- దోమల నివారణకు ఏటా రూ. 700 కోట్లు ఖర్చు
- ఓ కుటుంబం సగటు వ్యయం రూ. 2 వేలకుపైనే
- మార్చిలో విచ్చలవిడిగా దోమల విజృంభణ
- అనుకూల వాతావరణంలో పెరిగిపోయిన దోమలు
- పెరుగుతున్న మలేరియా, డెంగీ కేసులు

సాక్షి, హైదరాబాద్: దోమ.. 20 రోజుల నుంచి నెల రోజుల వరకు బతికే అతి చిన్న కీటకం.. కానీ బతికినన్ని రోజులూ మనిషికి నరకం చూపిస్తుంది. సెలబ్రిటీ అయినా.. సాధారణ వ్యక్తి అయినా.. ఈ దోమకు భయపడాల్సిందే. చప్పట్లు కొట్టేలోపే చచ్చిపోయే ఈ చిన్న ప్రాణి నగర జనాలతో ఏడాదికి ఎంత ఖర్చు పెట్టిస్తుందో తెలుసా? సుమారు రూ.700 కోట్లు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్‌ఎంసీ) పరిధిలో దోమల నివారణకు ప్రజలు చేస్తున్న ఖర్చు ఇదీ. ప్రతి కుటుంబం దోమల నివారణకు నెలకు రూ.100 నుంచి రూ.300 ఖర్చు చేస్తున్నా ఫలితం లేకుండా పోతోందని ఆరోగ్య శాఖతోపాటు పలు స్వచ్ఛంద సంస్థలు చేసిన అధ్యయనంలో వెల్లడైంది.

ఎండాకాలం మరింత వృథే..

మళ్లీ దోమల టార్చర్ మొదలైంది. చలికాలంలో కొంత ఊపిరిపీల్చుకున్న ప్రజలకు.. వేసవి ప్రారంభంలోనే దోమల బాధ పట్టుకుంది. పగలూ, రాత్రీ తేడా లేకుండా దోమలు కుట్టి చంపుతున్నాయి. గతంలో సీజనల్‌గా మాత్రమే కనిపించే దోమలు.. ఇప్పుడు సీజన్‌తో సంబంధం లేకుండా వచ్చేస్తున్నాయి. ఎన్నడూ లేని విధంగా గడిచిన నెలన్నర మొత్తం దోమలకు అనువుగా మారింది. అనుకూల వాతావరణ పరిస్థితుల కారణంగా దోమలు విజృంభిస్తున్నాయి. తక్కువ ఉష్ణోగ్రతల కారణంగా శరవేగంగా వృద్ధి చెందుతున్న దోమలు.. ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ఎనాఫిలిస్, క్యూలెక్స్ వంటి దోమలు పగటి పూట ఇళ్లల్లోనే మకాం వేసి రాత్రులు స్వైరవిహారం చేస్తుండడంతో జనాలు మలేరియా, డెంగీ బారిన పడుతున్నారు.

అన్ని మార్గాల్లోనూ..

దోమలను శాశ్వతంగా వదిలించుకోవడం అంత సులభం కాకపోవడంతో తాత్కాలిక ఉపశమనానికి పెట్టే ఖర్చు తెలియకుండానే కోట్లకు చేరిపోతోంది. అటు దోమలు సైతం ప్రజలు చేస్తున్న నివారణ చర్యలను దీటుగానే ఎదుర్కొంటున్నాయి. దోమల నివారణకు జీహెచ్‌ఎంసీ చేసే ఫాగింగ్ ఓ పథకం ప్రకారం లేకపోవడంతో వాటి విజృంభణ మరింత పెరిగింది. ఇందుకు ప్రజలు కాయిల్స్ ప్రయోగించడం, అవి పనిచేయకపోవడంతో లిక్విడ్, మస్కిటో బ్యాట్స్ వాడకం పెంచారు. ఇలా రాజధానిలోని ఒక్కో కుటుంబం దోమల బెడద నుంచి తప్పించుకునేందుకు ప్రతి నెలా రూ.100 నుంచి రూ.300 ఖర్చు చేస్తున్నట్టు జాతీయ ఆరోగ్య సంస్థ తాజా అధ్యయనంలో వెల్లడించింది. అంటే ప్రతి కుటుంబం ఏటా కనీసం రూ.2 వేల నుంచి రూ.2,500 ఖర్చు చేస్తున్నాయని ఆరోగ్య సంస్థలు స్పష్టం చేశాయి. ఇలా రాజధానిలో నివసించే 35 లక్షల కుటుంబాలు దోమల నివారణకు ఏటా రూ.700 కోట్ల వరకూ ఖర్చు చేస్తున్నాయని జాతీయ ఆరోగ్య సంస్థల అధ్యయనంలో తేలింది.

దోమల జీవితకాలం

దోమల జీవితకాలం చాలా తక్కువే. ఓ దోమ 20 రోజుల నుంచి నెల రోజుల వరకే బతుకుతుంది. కానీ ఒకే సమయంలో వేల సంఖ్యలో గుడ్లు పెడుతుంది. వాటి నుంచి పిల్ల దోమలు బయటకు రావడానికి ఏడు రోజుల సమయం పడుతుంది. ఆ లోపు యాంటీ లార్వా ఆపరేషన్ చేస్తేనే.. దోమల ఉత్పత్తిని నివారించగలం. కానీ సరైన సమయానికి మందులు చల్లకపోవడం వల్ల దోమలు వీరవిహారం చేస్తున్నాయి. జీహెచ్‌ఎంసీ తీసుకుంటున్న దోమల నియంత్రణ చర్యలు పెద్దగా ఫలితం చూపించడం లేదు. యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్ వంటివి విఫలం అవుతున్నాయి.

అక్కడా.. ఇక్కడా అని లేదు..

జీహెచ్‌ఎంసీ పరిధిలోని శివారు ప్రాంతాల నుంచి సెంటర్ సిటీ వరకు అన్నీ చోట్లా దోమలు విజృంభిస్తున్నాయి. మెహిదీపట్నం, ఆసీఫ్‌నగర్, షాలిబండ, మారేడ్‌పల్లి, న్యూబోయిన్‌పల్లి, అల్వాల్, కీసర, కొండాపూర్, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లిలో పరిస్థితి మరీ తీవ్రంగా ఉంది. దోమ పోటుతో ప్రజలు నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారు. గత ఏడాది 296 మలేరియా కేసులు నమోదుకాగా, డెంగ్యూ కేసులు 117 నమోదయినట్టు తెలిసింది. అయితే ప్రభుత్వ విభాగాలతో పాటు ప్రతీ ఒక్కరు పరిశుభ్రత పాటిస్తేనే దోమల నివారణ సాధ్యమవుతుందని జీహెచ్‌ఎంసీ అధికారులు చెప్తున్నారు. నల్లా గుంతలు, నీటి సంపులు ఇంటి పరిసరాల్లోని టైర్లు, పూల కుండీలు, పాత బకెట్లలో ఉండే నీటిలో దోమలు వృద్ధి చెందుతాయని, నీరు నిలవకుండా చర్యలు చేపడితే దోమల నివారణ సగం పూర్తయినట్లే అని వైద్యులు సూచిస్తున్నారు.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792